RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 7 Monthly July 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## రావూరి భరద్వాజ




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 18 - Issue. 7- July 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# డాక్టర్ రావూరి భరద్వాజ

సామాన్య కుటుంబంలో జన్మించి, పెద్దగా చదువుకోకపోయినప్పటికీ తెలుగు సాహిత్యరంగంలో తనదైన శైలిలో రచనలు చేసి, అసమాన్యమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన మహోన్నత సాహితీవేత్త డాక్టర్ రావూరి భరద్వాజ. మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు రాసే భరద్వాజ శైలి సరళసుందరమైనది. పాత్ర చిత్రీకరణలో ఒక సన్నివేశాన్ని పరిచయం చేయడంలోనూ ఆయన ప్రత్యేకత వేరు.

15వ యేటనే రచనా వ్యాసంగం ప్రారంభించిన భరద్వాజ 'విమల' అనే తొలి కథను రాశారు. అయినప్పటికీ అచ్చు అయిన తొలి పుస్తకం మాత్రం రాగిని. దాదాపు 43 కథలు, 6 బాలలకు సంబంధించినవి, 17 నవలలు, 11 సాహిత్య గ్రంథాలు, 33 సైన్స్ కథలు రచించారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రీకరించిన 'పాకుడురాళ్లు' నవల భరద్వాజ ఉత్కృష్ట రచనగా పరిగణిస్తారు. ఈ రచనకే జ్ఞానపీఠ పురస్కారాన్ని 2013లో పొందారు. రావూరి రచనలో 'జీవన సమరం' మరో ప్రముఖ రచన. ఈయన రచనలు అనేకం ఆంగ్ల, హిందీ, తమిళం, కన్నడ, మళయాళ భాషల్లోకి అనువాదమయ్యాయి.

నేలవిడిచి సాముచేయకుండా, వాస్తవిక జీవితాలు ఆధారంగా రచనలు చేయడం ద్వారా పాఠకులకు స్ఫూర్తిని కలిగించే రచనలు ఉత్తమమైనవని ఆయన భావించారు. నిజాన్ని నిజంగా నిజాయితీగా చెబుతున్నప్పుడు ఏ రచనకైనా పేరు వస్తుందని నమ్మి, ఇతరులకు చెప్పారు. నేటి ధనస్వామ్య వ్యవస్థ యొక్క క్షీణ సాంస్కృతిక విలువలు ప్రతిబింబమైన సినీ వ్యవస్థలోని బీభత్సాన్ని పాకుడు రాళ్లు నవలలో బట్టబయలు చేశారు.

"ఆకలి నా రచనలకు ప్రేరణ" అని ప్రకటించుకున్న రావూరి భరద్వాజ తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియలతో తనదైన స్థానాన్ని నిలుపుకున్న సాహితీవేత్త. తొలినాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. పాఠశాల స్థాయి వరకే చదువుకున్న చిన్నతంలో పొలాల్లో గడిపినపుడు వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితుల్ని గమనించేవాడు. అప్పటి పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నాడు. వీరి సాహిత్య జీవితం నుండి నేటితరం రచయితలు నేర్చుకోవలసినది చాలా ఉన్నాయి. పట్టుదలతో స్వయంకృషితో, విస్తృత అధ్యయనంతో బడిచదువుల జ్ఞానం కంటే చాలా ఎక్కువ పరిజ్ఞానాన్ని సంపాదించవచ్చు అని రావూరి రుజువు చేశారు. నేటి తర రచయితలకు, పాఠకులకు, ప్రతిఒక్కరికీ రావూరి జీవితం నిజంగా స్ఫూర్తి దాయకమనే చెప్పవచ్చు.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | విముక్త కథలు - సమకాలీన దృక్కోణం | - డా॥. డి. విజయ కుమారి | 5 |
| 2. | కె.వి.నరేందర్ కథల్లో మానవత్వపు విలువలు | - రాయపూడి శివకుమారి | 16 |
| 3. | సింగిరెడ్డి నారాయణ రెడ్డి - గజళ్ళు | - పెదనారప్ప గారి సురేష్ | 21 |
| 4. | ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఆయుర్వేద అంశాలు | - డా॥. చవ్వా వెంకటరెడ్డి | 25 |
| 5. | మనిషిలోని మనిషిని చూపిన అల్లం రాజయ్య కథ | - మినుకూరి శ్రీనివాస్ రెడ్డి | 30 |
| 6. | దశకంఠుడు | - ఆది ఆంధ్ర రామాంజనేయులు | 32 |
| 7. | శప్తభూమి నవల - ప్రజల విశ్వాసాలు | - పప్పుల శైలజ | 38 |
| 8. | ఆదివాసీ కథకు నిండు నూరేళ్ళు (1921 - 2021) | - నేతల లలిత | 41 |
| 9. | డా॥. పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి కథలు - సామాజిక దృక్పథం | - యం. అనిత | 43 |
| 10. | కవితా మనోహర స్వప్నారామం 'అంతర్లోచనం' | - డా॥. పి. విజయకుమార్ | 47 |
| 11. | హాస్య బ్రహ్మ శంకర నారాయణ సాహిత్య, కళా సేవ | - డా॥. చొప్పరపు శ్రీనివాసరావు | 52 |
| 12. | వడ్డేపల్లి సోదరుల కథా సాహిత్యం | - శనిగరం కిషన్ | 57 |
| 13. | సంస్కృతం - వైజ్ఞానిక శాస్త్రానువాదాలు | - డా॥. బాశెట్టి లత | 60 |
| 14. | పాకుడురాళ్ళు నవల - మంజరి పాత్ర | - నక్కా శ్రీనివాసరావు | 65 |
| 15. | తెలంగాణ కథ ప్రత్యేకత : దావత్ 2017 | - కొత్త అరుణ | 69 |
| 16. | ప్రవహించే ప్రతిఘటనే "నల్ల రక్తకణాలు" | - డా॥. ఎ. రవీంద్రబాబు | 71 |
| 17. | భిన్న కోణాల్లో కాళోజీ | - డా॥. చింతల రాకేశ్ భవాని | 76 |
| 18. | డా॥. పి. కేశవరెడ్డి నవలల్లో సామాజిక జీవన చిత్రణ | - డా॥. జి. పార్వతి | 81 |
| 19. | అడవి బాపిరాజు "నారాయణరావు" నవల పరిశీలన | - డా॥. ఎస్.కె.ఎల్. సునీత | 85 |
| 20. | సంస్కృత విభక్తులు - కారకాలు | - డా॥. వి. పళని | 87 |
| 21. | మధుర బంజారాల సంస్కృతి - కళలు | - మంత్రి శ్రీనివాస్ | 93 |
| 22. | ప్రజాకవి సుంకర సత్యనారాయణ సాహిత్యోద్యమం | - పాత శ్రీనివాసరావు | 100 |
| 23. | రెండో తెలుగు జ్ఞానపీఠ బోధించిన మానవవాదం | - ప్రవీణ్ యజ్జల | 103 |
| 24. | శ్రీశ్రీ, సినారె పాటలు... సామాజిక దృక్పథం | - సాయికృష్ణ రంగ | 108 |
| 25. | తొలి తెలుగు ప్రబంధము స్వారోచిష మనుసంభవము | - డా॥. బూసి వెంకటస్వామి | 111 |
| 26. | జానపద కళారూపాలు - ప్రార్థన గీతాలు | - డా॥. శ్రీమంతుల దామోదర్ | 114 |
| 27. | శ్రీ మహాభాగవతం – సింగన అర్థాలంకార సౌందర్యం | – డా॥. జి. శ్రీనివాసరావు | 118 |
| 28. | Temples in the Social Formation of A Settlement | - Dr Sebastian Joseph & - Nisha Ann Jacob | 122 |
| 29. | Interfaces of Indian Painting with reference to.... | - Dr. K. Mrutyunjaya Rao | 142 |
| 30. | Empire Drink and Beverage Culture : TEA | - Dr. Sebastian Joseph & - Jijo Jayaraj | 147 |
| 31. | Dalit Movement in the Telugu Region ... | - S Swaroop Sirapangi | 154 |
| 32. | Reading *Yagnam* with a viewpoint of Universal Declaration.. | - Dr. Venkata Ramaiah Gampa | 163 |

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విముక్త కథలు – సమకాలీన దృక్కోణం

**– డా॥. డి. విజయ కుమారి,** సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సమకాలీన సాహిత్యంలో వెలువడే రచనలు సమాజం లోని సమస్యలను పరిష్కరించే దిశగా వెలువడు తుంటాయి. రచయితలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ, జాతి, లింగ మొదలైన అంశాలను

ఎంచుకుని వాటిని పరిష్కరించడానికి కవిత్వం, నవలలు, కథలు, కథానికలు మొదలైన రచనలు చేస్తుం టారు.

అదే విధంగా ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి ఓల్గా అనేక సమకాలీన సమస్యలను తీసుకుని, నవలలు, కథలు, కవిత్వం, నాటికలు, మరియు స్త్రీ వాద వ్యాసాలను కూడా రాశారు. ఆమె 'విముక్త' కథలు రామాయణంలోని ప్రధాన స్త్రీ పాత్రలను ఆధారంగా చేసుకుని రాశారు. రామా యణంలోని శూర్పణఖ, అహల్య, ఊర్మిళ, సీత పాత్రలు తమలో తమని చూసుకుంటు, తమతో తాము యుద్ధం చేస్తూ ధృడ సంకల్పంతో, ఏ విధంగా తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నారో తెలియజేశారు. ఈ కథలలో స్త్రీ పాత్రలను రచయిత్రి సమకాలీన స్త్రీ సమస్యలను సమన్వయం చేస్తూ, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేసి సఫలీ కృతులయ్యారు.

## సమాగమం :

సీత వాల్మీకి ఆశ్రమంలో ఉంటున్న సమయమిది. లవకుశులు ప్రతి రోజు పూజకి పూలుకోసుకొచ్చి త ల్లికి ఇస్తుంటారు. ఒకరోజు అంతకు ముందెప్పుడు వెళ్ళని వేరే మార్గానికి వెళ్ళి, రంగురంగుల, మంచి పరిమళంతో కూడిన పూలను తీసుకొస్తారు. సీత ఈ పూలు ఎక్కడివని కుమారులను అడుగుతుంది. అపుడు కుశుడు "అమ్మా ఇవాళ అడవిలో ఒక కొత్త ఉద్యానవనం కనుగొన్నాము అలాంటి ఉద్యానవనం ఎక్కడా చూడలేదు. వాల్మీకి తాతయ్య వర్ణించే నందనవనం కూడా దీని ముందు దిగదుడుపే" అంటాడు. అమ్మా ఆ వనమెంత అందంగా ఉందో దాని యజమాని రూపం అంత వికారంగా ఉంది. ఆమెను చూసి మేము భయపడ్డాం. మేం ముని బాలకులం పూజకు పూలు కోసుకున్నాం అని అన్నయ్య ధైర్యంగా చెప్పాడు. అబ్బా ఆమె రూపం పరమ వికారం, ఒట్టి కురూపి" అంటాడు లవుడు. "ఆమె మనిషంతా బాగానే ఉందమ్మా! కానీ ముక్కు చెవులు లేవు. ఎవరో కోసినట్టు పెద్ద లొట్ట" అంటాడు. అపుడు పద్దెనిమిది సంవత్సరాల క్రితం విషయం గుర్తుకొస్తుంది. రామ లక్ష్మణుల క్రూరమైన పరిహాసానికి ఆమె కురూపిగా మారింది. ఆమె రావణుని చెల్లెలని తెలిసే రామలక్ష్మణులు అతణ్ణి రెచ్చగొట్టడానికి ఆ విధంగా చేశారు. సీత గతాన్నంతా గుర్తు చేసుకుని, మరుసటిరోజు తనను ఆ ఉద్యాన వనానికి తీసికెళ్ళమని లవకుశులకు చెబుతుంది.

మరుసటి రోజు సీత లవకుశులతో కలసి ఆ ఉద్యాన వనానికి వెళుతుంది. అమె ఆ ఉద్యాన వనం చూసి, అశోకవనం దీని ముందు తీసికట్టు అనుకుంటుంది. సీత పిల్లలను అరణ్య విహారం చేసి రమ్మని చెబుతుంది. ఆ తరువాత తనకు దూరంగా ఉన్న స్త్రీ దగ్గరకు వెళ్ళి 'శూర్పణఖా' అంటుంది. కాని శూర్పణఖ సీతను గుర్తించ లేదు. అప్పుడు సీత నేను సీతను అంటుంది. శూర్పఖ ఈమె సీతా! 'శ్రీరాముడి భార్య సీతేనా' అపుడు సీత "నేను జనకుని కుమార్తెను జానకిని, భూపుత్రిని" అంటుంది. శూర్పణఖకు అంతా అయోమయంగా ఉంది. శ్రీరాముడు పరిత్యజించాడు. ప్రస్తుతం వాల్మీకి ఆశ్రమంలో ఉంటు న్నాను అంటుంది. సీతారాముల ప్రేమ గురించి శూర్ప ణఖకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. "శ్రీరాముని ప్రేమించిన స్త్రీలకు వేదన తప్పదా అని శూర్పణఖ అను కుంటుంది. శూర్పణఖకు సీత ముఖం శాంతంగా, గంభీరంగా కనబడుతుంది. సీత చాలా ఎదిగింది అను

కుంటుంది. నిన్న మా పిల్లలు మీ ఉద్యానవనం చూశారు. నిన్నుచూశారు. ఇవ్వాళ వాళ్ళే నన్నిక్కడికి తీసుకొచ్చారు. నీ తోట ఎంతో అందంగా, హాయిగా ఉంది. అని సీత శూర్పణఖతో అంటుంది. అప్పుడు శూర్పణఖ ఆ చిన్నారులు నీ కుమారులా ఎంత ముచ్చటగా ఉన్నారో అంటుంది. ఆ సమయంలో సీత ముఖంలో చిన్న గర్వం కదలాడి మాయమైంది. ఇక్కడ స్త్రీ సహజమైన ఆనందం, గర్వం సీతలో కలుగుతుంది.

ఈ తోటలో మొక్కలూ, లతలూ, తరువులూ అన్నీ నా బిడ్డలే అని శూర్పణఖ సీతతో అంటుంది. అవును అందుకే అంత మనోహరంగా ఉన్నాయి అని సీత అంటుంది. అంతే గాక నీ జీవితం ఎలా ఉంది. అని సీత శూర్పణఖను సీత అడుగుతుంది. అపుడామె ఈ వనమంత అందంగా, ఆనందంగా ఉంది అంటుంది. “నాకు సంతోషంగా ఉంది శూర్పణఖా నీకు జరిగిన అవమానానికి నీవు ఏమైపోతావో'' అనుకున్నాను. నీ సౌందర్య కాంక్ష నాకు తెలుసు. నీ కురూపి తనాన్ని నీవు భరించ గలవా! భరించలేక ఏ అఘాయిత్యం చేసు కున్నావోనని నీవు జ్ఞాపకం వచ్చినపుడల్లా బాధపడేదాన్ని'' నువ్వు ధైర్య సాహసాలు గల దానివి అంటుంది సీత. “నన్నిపుడు ఇలా చూసి ఇదంతా తేలికగా జరిగిందనుకోకు సీతా జీవితాన్ని ఎదుర్కోవడంలోనే ఆనందాన్ని పొంద కలిగాను.'' అని శూర్పణఖ అంటుంది.

ఈ కథలో సీతా శూర్పణఖల సంభాషణ విన్నపుడు శూర్పణఖ మనోధైర్యం వెల్లడి అవుతుంది. రామ లక్ష్మణులు ఆమె ముక్కు చెవులు కోసిన తరువాత, ఆ పరిస్థితులను అధిగమించి ఆ వేదన నుండి బయట పడడానికి ఎంత పరిశ్రమ చేసిందో వ్యక్తమవుతుంది. ఇక్కడ శూర్పణఖకు గల బాహ్య సౌందర్యం కంటే అంతఃసౌందర్యం గురించే విశేషంగా చెప్పబడుతుంది. శూర్పణఖ తన తోటలో మొక్కలూ, లతలూ తరువులను తన బిడ్డలుగా భావిస్తుంది. అందువల్లే ఆమె ప్రకృతిని ఆరాధిస్తుంది. శూర్పణఖ తన అందం గురించి సీతతో ఈ విధంగా చెబుతుంది. ''ఆ ఈశ్వరుడు సృష్టి ప్రారంభంలో ముక్కు ఎలా ఉండాలని తలిచాడో అటు వంటి ముక్కు నాదని నాకెంతో గర్వం, పచ్చని, తెల్లని గడ్డి పూలను నా ముక్కుకి ఆభరణాలుగా ధరించేదాన్ని'' ఆ కసి నుండి బయట పడడానికీ, మళ్ళీ సౌందర్యాన్ని ప్రేమించడానికీ, రూప, అరూపాల అసలు సారాంశాన్ని కనుగొనడానికి నాతో నేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది'' అని కూడా అంటుంది. ఆమె తనతో తను చేసే యుద్ధంలో ప్రకృతి ఆమెకు సహకరించింది అంటుంది. అనేక ప్రాణులను గమనించి, స్తబ్ధత, చలనం గల ఏకరూపతను గమనించింది. రంగుల రహస్యాలను తెలుసుకుందట. ఆమె తనకు తానే గురువుగా సాధన చేసిందట. ఆమె ప్రకృతిలో ప్రతి అణువునీ శోధించిందట. ఆ శోధనలో ఆమె కళ్ళే మారిపోయాయట. ఆ తరువాత ఆమెకు ప్రతిదీ అందంగానే కనిపించిందట.

ఆమెతో సహా ప్రతి దాన్నీ అసహ్యించుకునే ఆమె, ఆమెతో సహా సృష్టిలో ఉన్న అన్నింటినీ ప్రేమించే స్థాయికి చేరుకుందట.

సమాజంలో అన్యాయానికి గురైన స్త్రీ ఎటువంటి సాధన చెయ్యాలో ఆమెకు ఎంత మనోనిబ్బరం కావాలో, తనని తాను నిలదొక్కుకోడానికి, నిరూపించుకోడానికి, తనకితానే గురువై ఏవిధంగా అభ్యాసన చెయ్యాలో శూర్పణఖ పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. మరికొన్ని విషయాలను కూడ శూర్పణఖ పాత్రద్వారా ఈ విధంగా పలికించారు.

“తోటి పక్షులు ఏదో కారణాన పొడిచి పొడిచి ఈకలు పీకిన చిన్ని పక్షి నాలో కలిగించిన స్పందన ఎంత ప్రేమ భరితమో అంత సౌందర్య పూరితమని గ్రహించడానికీ, ఆ స్పందనను పట్టుకుని అర్థం చేసుకోడానికీ నేను చేసిన సాధన అసామాన్యమైనది అంటుంది. అనగా నేటి సమాజంలో అనేక కారణాలవల్ల పురుషాధిక్య భావజాలా నికి గురై, వారుచేసే అఘాయిత్యాలకి, అకృత్యాలకి, అంగవైకల్యం పొందుతున్న స్త్రీల జీవితాలకి, అద్దం పట్టే

విధంగా రచయిత్రి ఈ పాత్రను చిత్రించారని చెప్పవచ్చు. ఈ కథలో శూర్పణఖ తన చేతులను ప్రేమించడం నేర్చుకుందట. ఆవిధంగా పది సంవత్సరాలు కఠోర దీక్ష చేసి, శ్రమ ఫలించాక ఆ తోటను పెంచిందట.

ఇక్కడ శూర్పణఖ తన ముఖ సౌందర్యాన్ని ఆరాధించడం మానుకుని, శ్రమచేసి, సృష్టించడం సేవించడం, చేయాలి అనగా ప్రతి స్త్రీ తనదైన మార్గాన్ని ఎంచుకుని, తనని తాను నిరూపించుకోవాలని శూర్పణఖ పాత్రద్వారా రచయిత్రి నేటి సమాజానికి తెలియజేశారు.

ఆ తరువాత సీత "నువ్వెంత అందంగా ఉన్నావు శూర్పణఖా నీ అందాన్ని ఏ పురుషుడూ గ్రహించలేక పోవచ్చు అంటుంది. అపుడు శూర్పణఖ పురుషులకు మాత్రం కళ్ళుండవా! మనసుండదా! కురూపులను చేయడం, వారిని అసహ్యించుకునే పురుషులు గాక వారిని ఆదరించేవారు కూడా ఉంటారని, అలాంటి పురుషుడి తోడు శూర్పణఖకు దొరికిందని అతని పేరు సుధీర అని చెబుతుంది.

సమాజంలో పురుషులందరు ఒకే విధంగా ఉండరని, వారిలో మంచి వారు కూడ ఉంటారనే విషయాన్ని రచయిత్రి శూర్పణఖ పాత్రద్వారా పలికించారు. సమకాలీన సమాజంలో మంచి, చెడు రెండూ ఉంటాయనే విషయాన్ని కూడా రచయిత్రి ఈ పాత్రద్వారా తెలియజేశారు. ఈ కథలో రడయిత్రి సీత పాత్రను పరిస్థితులకు లోబడి జీవించే ఒక సామాన్య స్త్రీగా చిత్రించారు. సీతా శూర్పణఖ సంభాషణలో లవకుశుల ప్రస్తావన వస్తుంది. వారికి శ్రీరాముని కుమారులని తెలియదని సీత అంటుంది. 'తెలిశాక వారు అరణ్యంలో ఉంటారా' అని శూర్పణఖ అంటుంది. వారికి "అరణ్య వాసం ఇష్టమే" అని సీత అంటుంది. వారికి ఇష్టం కావచ్చు, కానీ రాజ్యానికి అరణమంటే ఏం ప్రేమ నగరాల అభివృద్ధి కోసం, నాగరీకుల రక్షణ కోసం అరణ్య పుత్రులు తరలిపోక తప్పదేమో అని సీత అంటుంది.

పై వాక్యాలను రచయిత్రి రెండు అర్థాలు స్ఫురించేలా రాశారని చెప్పవచ్చు. ఒకటి రాజ్యాన్ని రక్షించే రాకుమారులు అరణ్యంలో ఎందుకుంటారు. రాజ్యాన్ని అభివృద్ధి పరచడానికి ప్రజల రక్షణకోసం, లవకుశులు అయోధ్యకు తరలి వెళతారు. రెండవది నగరాలను అభివృద్ధి చేయడానికి అరణ్యాలను మట్టు పెడుతున్నారని నాగరికుల రక్షణ కోసం అరణ్యంలో నివసించే గిరిజనులు, అరణ్యాన్ని వదిలి పోవలసిందే అనే భావన కూడ రచయిత్రి వ్యక్తపరిచారని చెప్పవచ్చు. ఏవిధంగా పరిస్థితులను ఎదుర్కొని జీవితాన్ని సార్థకం చేసుకోవాలో రచయిత్రి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. శూర్పణఖ పాత్రద్వారా నేటి మహిళలకు అనగా నేటి సమాజంలో యాసిడ్ దాడులవంటి అఘాయిత్యాలకు గురైన స్త్రీలు ఆత్మ న్యూనతకు లోనై, ఆత్మహత్యలు చేసుకోకుండ, ఆత్మస్థైర్యంతో తమదైన గమ్యాన్ని ఎంచుకుని, అభివృద్ధిని సాధించాలని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు. సమాజంలో సీత భర్త అడుగుజాడల్లో నడిచే సీత వంటి స్త్రీలు కూడా ఉంటారని, సమయం వచ్చినపుడు అన్ని విషయాలపై అవగాహన ఏర్పరచుకుని తమ జీవితాన్ని సరైన మార్గంలో నడిపించు కుంటారనే ఆశాభావాన్ని రచయిత్రి వ్యక్తం చేశారు.

### మృణ్మయనాదం :

సీతారాముల కల్యాణమవుతుంది. అయోధ్య అంతా కోలాహలంగా ఉంది. రాముడు అహల్యను చూసినట్లు సీతతో చెబుతాడు. ఆమె సౌందర్యం మాటున సౌశీల్యం లేదని చాలా బాధకలిగిందని, కానీ ఆమెను మర్చిపోలేను అంటాడు. అప్పటి నుండి సీతలో ఉత్కంఠ నెలకొంది. కౌసల్య సామంతుల రాణులకు మా సీత భూపుత్రి అని పరిచయం చేస్తుంది. వారిలో ఒకామె "ఔనంట జనక మహారాజు అదృష్టం." అందుకే అందంలో అహల్యను మించి పోయింది అంటుంది. అపుడు సీత "అహల్య ఎవరత్తయ్యా" అని అడుగుతుంది. అపుడు కౌసల్య "గౌతమ మహర్షి భార్య తల్లీ, అపురూపమైన అందం

అందానికి తగిన సౌశీల్యం, అయినా పాపం శాపగ్రస్త అయింది. అంటుంది. సీత కౌసల్య ద్వారా జరిగినదంతా తెలుసుకుని కన్నీటి పర్యంతమవుతుంది. కౌసల్య సీత మనస్సు మరల్చడానికి మాట్లాడే చిలుక దగ్గరకు తీసికెళు తుంది. అది సీతను చూడగానే "సీత-వ్రాత, సీత-గీత, సీత- గీత అని విచిత్రంగా నవ్వుతుంది. సీతకు అహల్య గుర్తొచ్చి బాధపడుతుంది. సీతారాములు అరణ్యవాసానికి వెళ్ళిన తరువాత అహల్యను కలుస్తుంది. సీత అహల్య మధ్య జరిగిన సంభాషణలో రచయిత్రి ఒక కొత్త కోణంలో ఆవిష్కరింప జేసింది. సీత సత్యమేంటని అహల్యను అడుగుతుంది. అప్పుడు అహల్య ఈ విధంగా చెబుతుంది. ఇంద్రుడు నన్ను వాంఛించాడు. స్త్రీ - పురుషుల భోగ్య వస్తువు, అందరూ అనుకున్నట్లే అతనూ అనుకున్నాడు. నేను అతనికి లోబడనని చీకటిలో నా భర్త వేషంలో వచ్చాడు. అతను నా భర్త కాదని నేను గుర్తించానా లేదా! లోకంలో అనేక మందిని వేధించే ప్రశ్న. ఆమె భర్తకు మాత్రం అవేవి అవసరంలేదు. ఆయన వస్తువు తాత్కాలికంగా పరుల హస్తగతమైంది. మైలపడింది. అనుకుంటాడు.

ఇక్కడ అహల్య ప్రమేయం లేకుండ జరిగిన తప్పుకు ఆమె శిక్షింపబడినట్లు రచయిత్రి చిత్రించారు. సమాజంలో భిన్న మనస్తత్వాలు గల వ్యక్తులుంటారు. వారందరిని ఈ కథలో చిత్రించే ప్రయత్నం రచయిత్రి చేశారు. బ్రహ్మవర్గంలో ఉండే మైల, శౌచం, పవిత్రం, అపవిత్రం, సీలం, పతనం, మొదలైన పదాలను, ఆవర్గంలో పురుష సమాజం సత్యా సత్య విచక్షణ లేకుండా ఆచరిస్తారని రచయిత్రి అహల్య పాత్ర ద్వారా పలికించారు. అంతేగాక సీత అడవులకు ఎందుకొచ్చిందో అహల్య అడిగి "మగవాళ్లందరూ ఒకటే సీతా ముఖ్యంగా భార్యల విషయంలో అంటుంది. అపుడు "సీత నా భర్త అలాంటివాడు కాదు. సత్యా సత్యాలు విచారిస్తాడు." అఉటుంది. "విచారిస్తాడు కదా" అని అహల్య వ్యంగ్యంగా అంటుంది. ఆ సమయంలో సీతకు ఆ మాటలు నచ్చలేదు. తన భర్త విచారణ జరిపిస్తాడని అహల్యతో సీత అంటుంది. అపనమ్మకమున్న వాళ్ళే విచారణ జరిపిస్తారు అని అహల్య అంటుంది. ఆ విషయంలో సీతముఖం వివర్ణమవుతుంది. సీతతో రాముడు అహల్య శీలవతి కాదు అంటాడు. సీతకు ఆ మాటలు గుర్తుకు వస్తాయి. అపుడు అహల్య సీతతో ఈ విధంగా అంటుంది.

"నాలా మాట్లాడే స్త్రీలను భరించడం కష్టం సీతా నేను తప్పుచేశానని, ఒప్పుకుంటే భరిస్తారు. పాపానికో ప్రాయశ్చిత్తం ఉంటుంది. తప్పు చేయలేదని వాదిస్తే నా మీద జాలిపడతారు. అన్యాయంగా దోషం ఆరోపించారని నా పక్షం వహిస్తారు. కానీ నా తప్పొప్పులతో నీకేమిటి సంబంధం. అది విచారించే హక్కు అధికారం మీకెవరిచ్చారంటే మాత్రం ఎవరు సహించరు."

ఇక్కడ రచయిత్రి సమకాలీన సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలను అహల్య పాత్రద్వారా పలికించారు. మనుషులు ఏయే సందర్భాలలో ఏవిధంగా ప్రవర్తిస్తారో ప్రస్ఫుటంగా వివరించారు. అహల్య తన మీద హక్కుని గౌతమ మహర్షికి లోకమిచ్చింది గానీ నేనివ్వలేదు. నేనివ్వనంత వరకు నామీద అధికారాన్ని ఎవరు పొందలేరు అంటుంది. సీత కూడ తన ఉనికిని కోల్పోయేంత అధికారాన్ని భర్తకు ఇవ్వ వద్దు అని అహల్య సూచిస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రచయిత్రి సమాజంలోని స్త్రీలందరూ తమ ఉనికిని కోల్పోయేటంత అధికారాన్ని భర్తకు ఇవ్వరాదనే సూచన అహల్య పాత్ర ద్వారా చేశారు. అంతేగాక సీత అహల్య శిలలా నిర్జీవంగా బ్రతకడాన్ని ప్రశ్నిస్తుంది. అప్పుడు అహల్య ఇన్నేళ్ళూ విశ్వంలో తన అస్తిత్వాన్ని గురించి ఆలోచిస్తున్నానని, ప్రపంచం ఏ నీతులమీద, ధర్మాలమీద నడుస్తుందో వాటికి మూలమేమిటో తెలుసుకుని, తాను జ్ఞానాన్ని సంపాదించానంటుంది. సీత లోకంలో సత్యా సత్యాలు లేవనడం అజ్ఞానమని వ్యంగ్యంగా అంటుంది. అపుడు సత్యం ఎప్పుడూ ఒక్కలాగే ఉండదని నిరంతరం మారుతూ

ఉంటుందనీ తెలుసుకోవడమే నేను సంపాదించిన జ్ఞానం. అని అహల్య అంటుంది.

పై వాక్యాలలో రచయిత్రి సమకాలీన పరిణామ క్రమాన్ని తెలియజేశారు. సత్యమనేది ఎపుడూ ఒకలా ఉండదని కాల గమనాన్నిబట్టి జరిగిన సంఘటన, వ్యక్తుల స్వభావం సామాజిక పరిస్థితులు మొదలైన విషయాలను బట్టి సత్యం మారుతుంటుందని ఈకథలో అహల్య పాత్ర ద్వారా రచయిత్రి వ్యక్తపరిచారు.

రాముడు రావణుని సంహరించి లంకా పట్టణాన్ని జయించిన తరువాత లక్ష్మణుడు సీత వద్దకు వచ్చి "శ్రీరాముడు నీ శీలపరీక్ష కోరుతున్నాడమ్మా" ఆమె ఆ మాటలు వింటూనే నేల మీద కూలబడుతుంది. అంతే గాక "శ్రీరామచంద్రుని కేమీ సందేహం లేదు వదినా కేవలం ప్రజలకోసమే ఈ ఆలోచన. విచారణలో న్యాయమే గెలుస్తుంది. సత్యమే జయిస్తుంది. పరీక్షలో నిలిచి గెలిచిన మీ సౌశీల్యాన్ని అందరూ కొనియాడు తారు. రామచంద్రుడు మీతో ఈ మాటలు చెప్పమన్నా డమ్మా" అంటాడు లక్ష్మణుడు. ఆ సమయంలో సీతకు అహల్య మాటలు గుర్తుకు వస్తాయు.. అహల్య మగవాళ్ళందరూ ఒకటే అన్నపుడు సీత అంగీకరించలేదు. రాముడుకి తన మీద అపనమ్మకమా! అలా అయితే తనను పరత్యజించవచ్చు కదా! అని సీత అనుకుంటుంది. సీత మనసు అగ్నిపర్వతంలా రగులుతుంది."అన్నగారిని అపార్థం చేసుకోకమ్మా. రేపు మీ గురించి ఎవరూ ఏమీ అనకుండా జాగ్రత్త తల్లీ. అయోధ్యా నగరానికి మీరు నిప్పులా నడిచి వెళ్లాలమ్మా. అన్నగారెంత బాధపడు తున్నారో, విలపిస్తున్నారో, మీరూహించ లేరమ్మా ఆయన నిస్సహాయుడమ్మా" ఈ విధంగా లక్ష్మణుడు రాముడి బాధ గురించి చెబుతున్న కొద్దీ సీత మనసులో బాధ తగ్గుతుంది. "శౌచం, మైల, పవిత్రం, అపవిత్రం, శీలం, పతనం మొదలైన పదాల ముందు రామాయణం, బ్రహ్మాస్త్రం కూడా బలహీనపడ్డాయని సీత అనుకుం టుంది. "ఎవరి సత్యం వారిది సత్యా సత్యాలను నిర్ణ యించగల శక్తి ఈ లోకంలో ఎవరికైనా ఉందా! ఎన్నడూ విచారణకు అంగీకరించకు సీతా అన్న అహల్య మాటలు అయోధ్యకు వచ్చిన తరువాత కూడా సీతకు గుర్తుకొస్తు న్నాయి. కౌసల్య సీతను హృదయానికి హత్తుకుని "నా కోడలు శీలవతి" అంటుంది. అంటే అత్తగారు తన శీల పరీక్షను కోరుకుందా! అన్న సందేహం సీతకు కలుగు తుంది.

సమాజంలో ఏదో ఒక అపవాదు మోస్తున్న స్త్రీలందరికి ఒక సూచనచేసి వారిలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేశారు ఓల్గా. సమకాలీన సామాజిక జీవనం గడిపే వారికి అహల్య పాత్రతో రచయిత్రి పలికించిన వాక్యాలు జీవన గమ్యాలు. సమాజంలో ఎవరు ఏమనుకున్నా సరే యదార్థమేమిటనేది గాయపడిన వారికి మాత్రమే తెలుసు. కాబట్టి ఎన్నడూ విచారణకు అంగీకరించ వద్దని రచయిత్రి సూచించారు. పురుషాధిక్య భావజాలం గల సమాజంలో పురుషుడుకి లేని శీల పరీక్షను స్త్రీ ఎదుర్కొం టుంది. అటువంటి పరిస్థితులను ఎదిరించే ధైర్యం స్త్రీలో కలిగేలా రచయిత్రి ఈ కథను తీర్చిదిద్దారు.

సీత గర్భవతి అయిన తరువాత అహల్యను కలవాలని అనుకుంటుంది. ఆమె తనకు అరణ్య విహారం చేయాలని ఉందని రామునితో చెబుతుంది. ఆ తరువాత సీత వాల్మీకి ఆశ్రమంలో విడువబడుతుంది. వాల్మీకి ఆశ్రమంలో సీతను అందరూ కంటికి రెప్పలా కాపాడు తున్నారు. వాల్మీకి నీకేమైనా కావాలంటే చెప్పమని సీతను అడుగుతాడు. ఆమెకు అహల్యను చూడాలని ఉందని సీత వాల్మీకి తో చెబుతుంది. అహల్య వాల్మీకి ఆశ్రమానికి వస్తుంది. అప్పుడు సీత అహల్య ఒడిలో తలపెట్టుకుని వెక్కి,వెక్కి ఏడుస్తుంది. అహల్య సీతను ఓదారుస్తుంది. రావణ సంహారం తరువాత సీత మనస్సు గడ్డ కట్టిందని, అది అహల్య స్నేహ స్పర్శతో కరికి పోయిందని, ఆమె మనస్సు పూర్వం వలె మెత్తగా మారిందని సీత అంటుంది. ఆమెకు సత్యా సత్యాలకు అర్థం తెలిసిందని, అంతే గాక

అమె రాముడి కోసమే విచారణకు సిద్ధపడినట్లు చెబుతుంది.

ఆ సమయంలో అహల్య ఈ విధంగా చెబుతుంది. పురుషుల అహం ఆస్తులలో, ప్రతాపాలలో, విద్యలో, కులగోత్రాలలో ఉంటే, స్త్రీల అహం పాతివ్రత్యంలో, మాతృత్వంలో ఉంటుంది. ఆ అహంకారాన్ని దాటాలని వారికెవరు చెప్పరు. విశాల ప్రపంచంలో తాము భాగమని వారు గుర్తించరు. ఒక వ్యక్తికి, ఒక ఇంటికి, ఒక వంశానికి పరిమిత మవుతారు. అహాన్ని జయించడం, పురులకు ఆధ్యాత్మిక గమ్యమవుతుంది. అహాన్ని పెంచుకోవడం, ఆ అహంలోనే కాలి బూడిదై పోవడం, స్త్రీల గమ్య మవుతుంది. సీతా నువ్వెవరో, నీ జీవిత గమ్యమేమిటో, తెలుసుకోవడానికి ప్రయత్నించు. అది అంత తేలికకాదు. ప్రయత్నం ఆపకు చివరకు తెలుసుకుంటావు. నీకా శక్తి ఉంది. శ్రీరామచంద్రుడిని కాపాడ గలిగిన దానివి నిన్ను నువ్వు కాపాడుకోలేవా! ఇదంతా ఎందుకు జరిగిందని విచారించకు ఇది నీ మంచి కోసమే నిన్ను తెలుకునే క్రమంలో భాగంగానే జరిగంది. ఆనందంగా ఉండు. ఈ ప్రకృతిని, సకల జీవరాశి పరిణామ క్రమాన్ని పరిశీలించు. అందులో నిరంతరం జరిగే మార్పుని గమనించు. అరణ్యంలో ఆశ్రమాలే కాదు. అనేక జాతుల ప్రజలున్నారు. వాళ్ళ జీవితాలు గమనించు. ఈ మొత్తం ప్రపంచంలో నువ్వున్నావు. ఒక్క రామునికే కాదు.

సమాజంలో స్త్రీ పురుషులు ఏ విధమైన జీవనం సాగిస్తున్నారో రచయిత్రి తెలియజేశారు. పురుషులు పై వర్గం, ఆస్తి, ప్రతాపం, విద్య మొదలై విషయాలలో అహంభావం పలికి ఉంటారు. వారు ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంభించి, దాని నుండి బయట పడతారు. స్త్రీలు పతివ్రతల మని, సంతానవతుల మని అహం కలిగి దానినుండి బయటపడే ప్రయత్నం చేయరు. ఇక్కడ ఓల్గా స్త్రీ వాది అయినప్పటికి, స్త్రీలలో ఉండే లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేశారు. అంతేగాక ప్రకృతిలో ఉండే జీవరాశుల పరిణామ క్రమం, అరణ్యంలో నివసించే, అనేక మంది జీవన పరిణామ క్రమం, గమనించి స్త్రీలు తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో తమ ఉనికిని చాటుకుంటూ, ప్రకృతిలో మమేకమై, స్వతంత్రంగా జీవించమని సూచిస్తుంది.

ఈ కథలో అహల్య మాటలు సీతకు మృణ్మయ నాదంలా వినబడతాయి. ఆ తరువాత సీత అహల్య తన విషయంలో జరిగిన సత్యాన్ని చెబుతానన్నా వద్దంటుంది. ఇక్కడ సీత ఏ తప్పు చేయక పోయినా అగ్నిపరీక్షకు గురైంది. అదే ఆమెకు కనువిప్పు కలిగించింది. సీత మొదట్లో అహల్యను కలిసి నపుడు, ఆమె తప్పు చేసిందేమో అని సందేహపడేది. రాముడు ఆమెను అగ్ని పరీక్షకు గురిచేసి, మరల వాల్మీకి ఆశ్రమంలో వదిలిన తరువాత సందేహ పడడంలేదు.

సమకాలీన సమాజంలోని వ్యక్తుల స్వభావం ఈ కథలో వ్యక్తమవుతుంది. తమపై నింద పడినపుడు వ్యక్తులు ఏవిధంగా ఆలోచిస్తారు. అంతకు ముందు వారి ఆలోచనా విధానం, ఏ విధంగా ఉంటుంది అనే విషయం, ఈ కథలోని సీత పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు. ముగింపులో సీత తన పుత్రులను రామునికి అప్పగించి, రాముని ఆహ్వానాన్ని తిరస్కరించి ఈ విశ్వమంతా తనదే అంటుంది. ఈ కథలో రచయిత్రి సీత వంటి స్త్రీలందరిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఎటువంటి పరిస్థితులలోను తమ వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదని, ఒక గమ్యం ఏర్పరచుకుని దాన్ని చేరే ప్రయత్నం చేయాలని, చేరుకోవాలని సూచించారు.

## సైకత కుంభం :

సైకత కుంభం అనగా ఇసుకతో చేసిన కుండ. ఈ కథలో సీత రేణుకను కలుస్తుంది. సీత రామునితో కలిసి ఉన్నపుడు, ఆమెకు రేణుక మాటలు నచ్చవు. “ఆర్య ధర్మాలను అరణ్యాలలో కూడా విస్తరించడానికి బయలుదేరిన రాముడి భార్యవా” అంటుంది రేణుక. “పితృవాక్య పరిపాలన కోసం ఆయన అరణ్యాలకు వచ్చారు.” అంటుంది సీత. అదికూడా ఆర్య సంస్కృతిలో

భాగమేలే, తండ్రి చెప్పింది న్యాయమా అన్యాయమా అని ఆలోచించకుండా గుడ్డిగా పాలించడమే ఆర్య ధర్మం. నా కుమారుడు అదే ఛేశాడు. ఆ పనే తాను చేస్తానని, దేశంలోని ఇతర జాతులలో కూడా అదే ఆర్య ధర్మం స్థాపిస్తాననీ నీ భర్త నా కుమారుడికి వాగ్దానం చేశాడు అని రేణుక అంటుంది. అప్పుడు రేణుక సీతాదేవిని గుర్తిస్తుంది. ఆమెను తన ఆశ్రమానికి రమ్మని ఆహ్వా నిస్తుంది. అపుడు సీత ఆమె ఆహ్వానాన్ని తిరస్కరిస్తుంది. వేరొకసారి రాముని అనుమతి తీసుకుని వస్తానని చెబుతుంది. ఆశ్రమానికి రావడానికి నీ భర్త అంగీకరించ డని రేణుక సీతతో అంటుంది. మీ భర్త, మీ కుమారుడు మీకు అన్యాయం చేసి ఉండవచ్చు. అంత మాత్రాన అందరూ అలాంటి వారేనని అనుకోవడం న్యాయం కాదు. నేనింకోసారి మీ ఆశ్రమానికి వస్తాను. అని సీత రేణుకకు నమస్కరించి వెళ్ళిపోతుంది. ఆ తరువాత సీత రాముని అనుమతి తీసుకుని రేణుకాదేవి శిల్పాలయానికి వెళు తుంది. అపుడు రేణుకాదేవి సీతకు సైకత కుంభాన్ని ఇస్తుంది. అది ఇసుకతో చేసిందని ఆ విద్య తనకొక్క దానికే వస్తుందని, ఆ కుండ ప్రతి స్త్రీ దగ్గర ఉండాలని, తమ పాతివ్రత్యాలు సైకత కుంభాల వంటివేనని తెలుసుకుంటే వాళ్ళు నిశ్చింతగా బతకగలుగుతారు, అని రేణుక అంటుంది. ఆ మాటలు సీతకు అర్థం కాలేదు.

‘‘ఈ కుండ చేయడానికి ఎంతో ఏకాగ్రత కావాలి. నా ఏకాగ్రత గురించి తెలియని వాళ్ళంతా నా పాతివ్రత్యంతో యిసుక కుండ తయారు చేస్తున్నాను అనుకున్నారు. నా పాతివ్రత్యానికేమి లోపం లేదు. గనుక అనుకోనివ్వమని నేను ఊరుకున్నాను. ఏకాగ్రత ఎప్పుడైనా భగ్నం కావచ్చు. నా విషయంలో ఒక పురుషుడు కారణమయ్యాడు. ఆ పురుషుని చూసినంత మాత్రానే నా పాతివ్రత్యం భంగ పడిందని ఆ భర్త ఆగ్రహించాడు. కుండ చక్కగా చేయడానికి సాధన, ఏకాగ్రత, ఇసుక దానిలో కలిసిన నీటిపాళ్ళు, ఇంకా ఎన్నో కారణాలుంటాయి. అది గ్రహించలేని, మహాజ్ఞాని జమదగ్ని మహర్షి, తపస్సు ద్వారా ఎంత జ్ఞానం సంపాదించినా భార్య పాతివ్రత్యం పట్టు వదలని ముముక్షువులు’’ ఈ విధంగా రేణుక సీతకు తన కథను చెబుతుంది. ఆమె దృష్టిలో ‘‘పాతివ్రత్యం, మాతృత్వం, ఏకాగ్రతతో నేర్చిన ఆమె విద్య మూడు ఒక్కటే అంటుంది. సృష్టిలోని అనేక జీవరాశులు కొన్నితెగల ప్రజల ఆచారాల గురించి రేణుక సీతతో చెబుతుంది. అపుడు సీత ఏ మాటలు నాకు అర్థం కావడం లేదు. అవి స్త్రీలకు హాని చేస్తాయని అనిపిస్తుంది., అంటుంది.

అప్పుడు రేణుకాదేవి ‘‘హాని మాత్రం చేయవు సీతా, బిడ్డ తల్లికి చెందడంలో వాళ్ళకి హానేమీ ఉండదు. బిడ్డలు తమ తండ్రి ఎవరని ప్రశ్నించే సందర్భం, భర్త నీ పిల్లకు తండ్రెవరని ప్రశ్నించే సందర్భం కొందరి స్త్రీల జీవితాలలో వస్తుంది సీతా. అప్పటి వాళ్ళ స్థితి తలుచుకో’’ నా మాటలు నీకు అర్థమవుతాయి, అంటుంది. వారిద్దరి మధ్య చర్చ జరుగుతుండగా సీత కాలు తగిలి ఇసుక కుండ పగిలి పోతుంది. ఆ సంఘటనతో సీత భయపడుతుంది. ‘‘నీకెంతో బలముంది సీతా నా మాట మర్చిపోకు, నీ బలమే నీకు రక్ష అలాగని నేను ఆశీర్వదిస్తున్నాను.’’ సీతకు ఇదంతా ఆమె వాల్మీకి ఆశ్రమానికి నెళ్ళిన తరువాత గుర్తొస్తుంది. లవకుశులు తల్లిని తమ తండ్రి గురించి అడుగుతారు. సీత కుమారులకు విలువిద్య నేర్పుతుంది. నీవు నేర్పాల్సినది నేర్పని తరువాత తండ్రి వచ్చి మిగిలి నది నేర్పుతాడా అని తల్లిని కుమారులు అడుగుతారు. అపుడు సీత ‘‘నేను నేర్పాల్సిందంతా నేర్పితే మీ తండ్రి నేర్పడానికి ఏమీ ఉండదు’’ అంటుంది. అంతేగాక శివధనుస్సు సీతారాములిద్దరూ సంధించగలరన్న విషయం కూడా చెబుతుంది. సీత తన కుమారులను ప్రకృతి ప్రసాదించిన లేడి పిల్లలుగానే పెంచింది. పెరిగి పెద్దయిన లేడిపిల్లలు కొన్నాళ్ళకు అడవిలోకి వెళ్ళి మళ్ళీరావు అనుకుంటుంది. ఆమె వాల్మీకి మహర్షితో లవకుశులను అయోధ్యకు పంపిస్తుంది. అపుడు ఆమెకు రేణుక గుర్తొస్తుంది. అహల్య, రేణుక, ఆమె అందరూ అనుమానితులే, అవమానితులే అనుకుంటుంది. వాల్మీకి

ఆశ్రమానికి వస్తాడు. రాముడు తన కుమారులను స్వీకరించిన సంగతి చెబుతాడు. ఆ తరువాత "అమ్మా రాముడు నిన్ను సభకు వచ్చి సభికులందరి ముందూ సత్యం పలకమన్నాడు. ఆ పై నీవిక పట్టమహిషివి, తర్వాత వీరమాతవు" అంటాడు. సీతకు నవ్వొస్తుంది. కాని వాల్మీకి మీద గౌరవంతో నవ్వదు. "నాకంత అవసర ముందంటారా" అంటుంది. ఆశ్రమం నుండి నిష్క్రమిస్తుంది. లవకుశలు వచ్చి తల్లి లేకపోవడం చూసి ఆశ్చర్యపోతారు. వారు వాల్మీకి ద్వారా జరిగింది తెలుసుకుంటారు. వారికి తల్లి మీద కోపం వస్తుంది. తండ్రి చెప్పినట్టు ఒక్కసారి నిండు సభలో మాట్లాడి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవచ్చు కదా! అనుకుంటారు. ఎందుకంటే ఇప్పుడు వారు ఆర్యపుత్రులు.

ఈ కథలో రేణుక, సీతల పాతివ్రత్యం గురించి, ఆర్యపుత్రుల ప్రవర్తన గురించి చర్చించబడింది. స్త్రీల పాతివ్రత్యం సైకత కుంభం వంటిదని రచయిత్రి తెలియజేశారు. స్త్రీకి భర్త తప్ప వేరే ప్రపంచం ఉండదని సీత భావిస్తుంది. ఈ కథలో సీత అబలగాను, రేణుక పాత్ర సబలగాను చిత్రించింది. రేణుక పాత్ర ద్వారా రచయిత్రి సమకాలీన సామాజంలో కొంత మంది స్త్రీలు భర్తే ప్రపంచం అనుకుంటారు. ఏదో ఒకరోజు భర్త ప్రపంచంలో ఆమెకు చోటులేదని తెలుస్తుంది. అపుడు సంతానానికి జన్మనివ్వడమే జీవిత గమ్యంగా భావిస్తారు. ఆ తరువాత వారు తండ్రి ఆధీనంలోకి వెళ్ళి, అతని ఆజ్ఞను అనుసరిస్తారు. ఈ కథలో లవకుశులకు సీత వారి తండ్రి మహావీరుడని, మహాకార్యంలో నిమగ్నమై ఉన్నాడని అసత్యం చెబుతుంది. ప్రతి స్త్రీ తన భర్త గురించి తన సంతానానికి గొప్పగా చెబుతుంది. భర్త భార్యను ఎంత వివక్షకు గురిచేసిన, ఆమె, అతణ్ణి తన సంతానం ముందు ఉన్నతంగా ఆవిష్కరింప జేస్తుంది.

ఈ కథలో సీతని రాముడు సభలో తనని తాను నిరూపించుకోమంటాడు. లవకుశులు కూడా అది కోరుకుంటారు. సమాజంలో ఉన్న పురుషాధిక్య భావజాలం ఈ కథలోని పురుష పాత్రలవల్ల వ్యక్తమవుతుంది. సమ సమాజంలో స్త్రీ తనని తాను నిరూపించు కోవాలని అపుడే ఆమెకు, సమాజంలో గౌరవం దక్కుతుందని రచయిత్రి రాశారు. ఇక్కడ సమకాలీన సామాజిక పరిస్థితులు ప్రతిబింభించేలా రచయిత్రి ఈ కథను తీర్చిదిద్దారు. అంతేగాక ఈ కథలోని సీత పాత్ర వలె, సమాజంలో ఉన్న ప్రతి స్త్రీ స్వతంత్రంగా ఆలోచించి, తనదైనా మార్గాన్ని ఎంచుకోవాలని పురుషాధిక్య భావజాలానికి లొంగి పోకుండ, ధైర్యంగా జీవించాలని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు.

**విముక్త :**

సీతారాములు పద్నాలుగేళ్లు వనవాసం పూర్తి చేసుకుని అయోధ్యకు వస్తారు. సీత తన చెల్లెలు ఊర్మిళ కోసం వెతుకుతుంది. ఆమె ఊర్మిళ గురించి శ్రుతకీర్తిని అడుగుతుంది. అపుడామె " మీరు వెళ్ళాక ఊర్మిళ ఎవరికీ కన్పించలేదు. తన మందిరం లోంచి బైటికి రాలేదు. ఎవరినీ లోపలకు రానివ్వలేదు" అంటుంది. ఊర్మిళ పద్నాలుగేళ్లు ఎవరినీ చూడకుండా ఎలా ఉండ కలిగింది. ఆమె రామలక్ష్మణులను, తననూ క్షమిస్తుందా! అని సీత అనుకుంటుంది. చారుమతితో కలసి సీత ఊర్మిళ మందిరానికి వెళుతుంది.

అరణ్య వాసంలో లక్ష్మణుడితో పాటు ఊర్మిళ కూడా ఉంటే బాగుండునని సీత అనుకుంటుంది. వారి కోసం లక్ష్మణుడు ఊర్మిళను ఒంటరిగా వదిలి రావడం సమంజసమా అని సీత తనను తాను ప్రశ్నించు కుంటుంది. అదే విషయాన్ని రాముడి దగ్గర ప్రస్తావిస్తుంది. అంతఃపుర వ్యవహారాలను చక్కదిద్దే సామర్థ్యం సీత కంటే ఊర్మిళకే ఉందని, అందువల్ల ఊర్మిళ అరణ్యానికి రాలేదని రాముడు సీతతో చెబుతాడు.

భర్త వియోగం అన్నింటి కంటే కష్టమని రావణుని చెర తరువాత సీతకు అర్థమైంది. ఆ సమయంలో సీత ప్రతి క్షణం సీతను గుర్తుచేసుకుంటుంది. అయోధ్యకు చేరిన తరువాత సీత ఊర్మిళ ఆనందాన్ని ఊహించు

కుంటూ ఉంటుంది. ఆ ఆనందంలో రాముడు కూడా పాలు పంచుకుంటాడు. రాముడి కోసం భార్య వియోగం సహించిన తమ్ముణ్ణి చూసి, రాముని హృదయం ఉప్పొంగి పోతుంది. వెంటనే రాముడు లక్ష్మణుని హృదయానికి హత్తుకుంటాడు.

ఊర్మిళ ఎదురు వస్తుందని, హృదయానికి హత్తు కోవాలని సీత భావిస్తుంది. కాని ఊర్మిళ ఎదురుపడలేదు. సీత నిరాశకు గురవుతుంది. సీత ఊర్మిళ వద్దకు వెళ్ళి నపుడు, ఆమె ముఖంలో తేజస్సును గమనిస్తుంది. "మా మీద కోపం వచ్చిందా! అని అంటుంది. అసలేం జరిగింది. ఈ విధంగా గదిలో బందీవయావు అంటుంది. ఊర్మిళ తన ఒంటరి తనం సీతకు తప్ప ఎవరికీ అర్థంకాదని భావిస్తుంది. నా భర్త నాతో ఒక్క మాట చెప్పకుండా, నా నిర్ణయంతో ప్రమేయం లేకుండా, నేననేదాన్ని ఒకదానిని ఉన్నాననే ఆలోచన లేకుండా, అన్నగారే సర్వస్వమని వెళ్ళిపోయాడు. ఆనాడు కోపంతో దహించుకుపోయాను. ఈ అంతఃపురాన్ని నా తిరుగుబాటుతో తల్లక్రిందులు చేయాలని అనుకున్నాను. అని ఊర్మిళ సీతతో అంటుంది.

ఆ సమయంలో సీత మనస్సు ఊర్మిళను పట్టుకునే ప్రయత్నం చేస్తుంది. అప్పుడు ఊర్మిళ సీతతో అంటుంది. ఊర్మిళ మొదట్లో ఆగ్రహంతో ఉన్నానని, క్రమంగా ఆ కోపం సత్యం కోసం నాతో నేను చేసే అన్వేషణ గా మారిందని, కోపం, దుఃఖం, ఆనందం ఎందుకు? ఆమె శరీరానికి, ఆమెలో కలిగే ఈ ఆవేశాలకు, ఉద్వేగాలకు, మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ప్రశ్నలు తనలో లీనమయ్యాయి. అమె తన శరీరాన్ని గమనించడం, తనలో ఆలోచనలు, అవి తనలో రేకెత్తించే ఉద్రేకాన్ని గమనింటడం తో మొదలు పెడుతుంది. ఈ గమనికకు ఎలాంటి అంతరాయం కలిగినా ఆమెకు అశాంతిగా ఉండేదని, అందుకే ఆమె తనతో తాను సంభాషించు కునేది.

ఇది ప్రతి మనిషి జీవితానికి సంబంధించిన అన్వేషణ. ఊర్మిళ తన అక్క అయిన సీతను ప్రేమిస్తుంది. ఆమె తనను వదిలి అరణ్యానికి వెళ్ళిపోతుంది. అలాగే ప్రతి మనిషితో తనకున్న సంబంధాన్ని చర్చించుకుంటుంది. ఆమెకు ఆమే వేసుకున్న ప్రశ్నలతో, ఆమె చేసిన యుద్ధం వల్ల ఒక గొప్ప శాంతిని, ఆనందాన్ని పొంద కలిగింది. రామ లక్ష్మణులు రాక్షసులతో యుద్ధం చేయడం వల్ల శాంతి లభించిందో లేదో తెలియదు గాని, ఊర్మిళ తనతో తాను చేసిన యుద్ధంలో మాత్రం శాంతిని పొంద గలిగా నని సీతతో చెబుతుంది.

లక్ష్మణునికి ఊర్మిళ మీద ప్రేమ ఉందని చెప్పి నపుడు, ఊర్మిళ తాను చాలా మారానని చెబుతుంది. తనలో వచ్చిన మార్పుకు లక్ష్మణుడు ఇచ్చే విలువను బట్టే వారిద్దరి జీవిత గమనం సాగుతుందని అంటుంది. ఆమె ద్వేషంతో కాకుండా న్యాయం గురించి ప్రశ్నించ గల విజ్ఞతను సంపాదించుకున్నట్లు, లక్ష్మణుడు ఆ విజ్ఞతను, ఎలా అర్థం చేసుకుంటాడు, ఏ విధంగా గౌర విస్తాడు, అనే దానిపై ఆధారపడి ఉంటుందని, ఊర్మిళ సీతతో అంటుంది. ఆమె పద్నాలుగేళ్ల సత్య శోధనలోనే చేసిన గొప్ప తపస్సును నిద్ర అనుకున్న వాళ్ళకు ఆమె మాటలు అర్థం కావంటుంది. ఊర్మిళ నిద్రపోయిందని భావించే వారికి నిద్రకు మెలకువకూ అర్థం తెలియ దంటుంది. ఆవిధంగా భావించేవారు, శాంతిగా నిద్రపోరు, చైతన్యంగా మేలుకోరు అంటుంది. ఆమె మాటలను అర్థం చేసుకోగల సామర్థ్యం సీతకు మాత్రమే ఉంది అంటుంది. సీత జీవితంలో ఊర్మిళకు ఎదురైన పరీక్ష సమయం ఎదురైతే, ద్వేషంతో, ఆగ్రహంతో దహించుకు పోకుండా, ఆమెను ఆమె కాపాడు కోమంటుంది. సీత మీద అధికారాన్ని సీతను తీసుకోమంటుంది. ఇతరులపై అధికారాన్ని ఒదులు కోమంటుంది. అప్పుడే నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు అని చెబుతుంది. ఎవరికి వారు మిగలడమంటే మాటలు కాదంటుంది. తన మాటను నమ్మమని కూడా ఊర్మిళ సీతతో అంటుంది.

రాముడు అశ్వమేధ యాగం చేస్తున్న సమయంలో కూడా సీతకు ఊర్మిళ మాటలు గుర్తుకు వస్తాయి." అధికారాన్ని తీసుకో, అధికారాన్ని ఒదులుకో అపుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలాలి."

పై వాక్యాలు సమాజంలో ప్రతి స్త్రీ గుర్తుబెట్టు కోవలసినవి. సహజంగా కుటుంబంలో స్త్రీలు ఇతరుల మీద అధికారాన్ని చలాయిస్తూ ఉంటారు. వారి గురించి వారు తెలుసుకునే ప్రయత్నం చేయరు, అటువంటి వారు ఎవరి మీద వారు అధికారాన్ని సంపాదించుకుని, నిగ్రహాన్ని కలిగి ఉండాలి. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కో గల సామర్థ్యం కలిగి ఉండాలి. అనే విషయాన్ని సమకాలీన సమాజంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న స్త్రీలకు ఓల్గా తెలియజేసింది.

రాముడు యాగం చేస్తున్న సమయంలో ఊర్మిళ, సీత వద్దకు వస్తుంది. నేను లేకుండా రాముడు యాగం ఎలా చేస్తున్నాడని ఊర్మిళ తో సీత అంటుంది. అపుడు ఊర్మిళ "ఆ ప్రశ్న నీకెందుకు రావాలి, వస్తే రాముడికి రావాలి. యాగం చేయించే వారికి రావాలి. అనవసరమైన ప్రశ్నలతో అశాంతి పడడం అవివేకం కాదా!" అంటుంది.

"నేను నీకు సమాధానం చెప్పి నీ అగ్నిని తాత్కాలికంగా చల్లార్చడానికో మరింత ప్రజ్వలింప చేయడానికో రాలేదు. అనవసరమైన ప్రశ్నలతో నిన్ను, నువ్వు హింసించుకో వద్దని చెప్పడానికి వచ్చాను." అని ఊర్మిళ సీతకు చెబుతుంది.

కానీ నేను మింగలేక పోతున్నానని సీత అంటుంది. మింగవద్దు, అసలది నీ మనస్సులో ప్రవేశించనే వద్దు, నువ్వు రాముడి నుండి విముక్త కావాలి అని ఊర్మిళ సీతకు హితబోధ చేస్తుంది.

"ప్రతి పరీక్ష నిన్ను రాముడి నుండి విముక్త చెయ్యడానికే, నిన్ను నీకు దక్కించడానికే, యుద్ధం చెయ్యి, తపస్సు చెయ్యి, లోపలికి చూడు, నీవనే యదార్థం కనబడేదాకా చూడు." అని ఊర్మిళ సీతతో చెబుతుంది. ఆ విధంగా చేయడం కష్టంగా ఉందని సీత అంటుంది. చాలా హాయిగా ఉంటుంది ప్రయత్నించమని ఊర్మిళ అంటుంది. ఊర్మిళ మాటలు విన్న సీత తపస్సు చేస్తుంది. క్రమంగా సీత మనస్సు శాంత పడింది. వాల్మీకి అశ్వమేధ యాగం చుసి వచ్చే నాటికి సీత మనస్సు పూర్తిగా తేట పడుతుంది. సీతకు వాల్మీకిని యాగం గురించి అడగాలని కూడా అనిపించలేదు. రాముడు లవకుశులను స్వీకరిస్తాడు. సీతను కూడా స్వీకరిస్తాడు. కానీ ఆమె నిండు సభలో తన పవిత్రతను నిరూపించు కోవాలని రాముడు అన్నట్లు వాల్మీకి చెబుతాడు. సీత శాంత చిత్తంతో తాను ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికి ప్రయాణమవుతుంది.

ఈ కథలో ఊర్మిళ తనలో కలిగే ఆగ్రహావేశాలను, ఉద్వేగాలను, దుఃఖాన్ని అదుపు చేసుకుని, ఏ భావాలకు లొంగి పోకుండ, అన్నింటికి అతీతమైన శాంతిని పొందు తుంది. అదే శాంతిని సీత కూడా పొందే విధంగా ఊర్మిళ చేస్తుంది. ఇక్కడ సమకాలీన సమాజానికి రచయిత్రి ఒక సందేశాన్ని అందజేసింది. పురుషాధిక్య భావజాలం గల సమాజంలో స్త్రీలు ఏ విధంగా నలిగి పోతూ తమ ఉనికిని కోల్పోతున్నారో వివరించింది. రామాయణ కాలం నుంచి నేటి వరకు సమాజంలో మార్పు లేదని చెప్పవచ్చు. అందువల్లే సాహిత్యంలో కూడా మార్పు సంభవించలేదు. ఊర్మిళ, సీత వంటి స్త్రీలు, రాముడు, లక్ష్మణుడు వంటి పురుషులు నేటి సమాజంలో ఇంకా ఉన్నారు. సమకాలీన సమాజంలో స్త్రీలు దుఃఖానికి, ఆగ్రహావేశాలకు గురి కాకుండ, ఊర్మిళ, సీతవలే శాంతి మార్గాన్ని అవలంభించి, స్వార్థపూరిత పురుష భావజాలం నుండి విముక్తులు కావాలని సూచించింది. తమ జీవిత గమ్యాన్ని ఏర్పరచుకుని, ఆ గమ్యాన్ని చేరుకోవాలని, తమ జీవితాలను బలి చేసుకోవద్దని ఒక ఉద్బోధ చేసి కృత కృత్యురాలయింది రచయిత్రి.

రామాయణంలోని పాత్రలను నాగరిక, ఆధునిక జీవనం గడుపుతున్నామని చెప్పుకుంటున్న నేటి సమాజానికి అన్వయించి సాహిత్యాన్ని రూపొందించుకుంటున్నామంటే ఆనాటికి, ఈనాటికి సమాజంలోను,

మనుషుల ఆలోచనా విధానంలోను, వారి మనస్తత్వాలలోను, కౌటుంబిక జీవనంలోను ఎటువంటి మార్పును ఆధునికతను సాధించ లేదని చెప్పవచ్చు.

**ముగింపు :**

విముక్తలో ఉన్న స్త్రీ పాత్రలు సీత, అహల్య, శూర్పణఖ, రేణుక, ఊర్మిళ రామాయణంలో చిత్రించి నంత పరాధీన పాత్రలు కావు. సీత శివధనుస్సును ఎత్త గలిగినంత శక్తి గల స్త్రీ. ఆ శక్తిని ఉపయోగించ లేని సామాజిక పరిస్థితులలో ఆమె చిక్కు కొంటుంది. రామాయణంలో అవసరమై నపుడు తమ శక్తిని ఉ పయాగించిన స్త్రీలు కూడా ఉన్నారు. కైక దశరధుణ్ణి యుద్ధరంగంలో రక్షించింది.

రచయితలు కొన్ని విలువల కోసం పురాణాలను రాశారని చెప్పవచ్చు. ఆ స్త్రీలు విలువలను ప్రశ్నించు కుంటూ, వాటిని దాటే ప్రయత్నం చేసి, ఆ పాత్రల అంతరంగ శోధన చేస్తే వారి బలం, శక్తి సమాజానికి అర్థమవుతుంది. నేటి ఆధునిక స్త్రీలు కూడా కొన్ని పరిస్థితులలో తమ శక్తిని మరచిపోయి, ఒక్కొక్క సారి పరాధీనలుగా ఉండి పోతున్నారు. ఒక్కొక్కసారి శక్తిని ప్రదర్శిస్తున్నారు. సూక్ష్మ పరిశీలన చేసినట్లైతే, ఆపురాణ పాత్రలు ఎదుర్కొన్న సందర్భాలకు, సంఘర్షణలకూ, ఆధునిక స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలకు, సంఘర్షణకూ చాలా పోలికలున్నాయి. సమకాలీన సమాజంలో స్త్రీల అణచివేత, వారిపై పురుషుల ఆధిపత్యం మారలేదు. అందువల్లే రచయిత్రి ఈ కథలలో పురాణ పాత్రల ద్వారా వర్తమాన స్త్రీల జీవనాన్ని సమన్వయ పరుస్తూ, ఆధునిక స్త్రీలలో ఉన్న శక్తి, సామర్థ్యాలను, వెలిక తీసే ప్రయత్నం చేశారు. వారిలో ఉన్న పరాధీనతను రూపుమాపి, నేడు స్త్రీలపై జరుగుతున్న, శారీరక, మానసిక దాడులనుండి బయటపడి, వారు ఆత్మస్థైర్యంతో, ఆత్మసౌందర్యం కలిగి తనదైన గమ్యాన్ని ఎంచుకుని, ఆ గమ్యం దిశగా పయనించి, స్వతంత్రంగా జీవించాలనే ఈ కథలను ఓల్గా రాశారని చెప్పవచ్చు. ఎంతో పరిశ్రమ చేసి రచయిత్రి ఈ విముక్త కథా సంపుటిని సమకాలీన సమాజానికి అందజేశారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఓల్గా. 2016. విముక్త కథలు. కర్షక్ ఆర్ట్ ఫింటర్స్, హైదరాబాదు.
2. కృష్ణకుమారి, నాయని. 2000. తెలుగు జానపద విజ్ఞానం, సమాజం-సంస్కృతి, సాహిత్యం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.
3. భుజంగరెడ్డి, బాణాల.2020. తెలుగు సాహిత్యంలో స్త్రీ వాదం. తెలుగు అకాడమి. హైదరాబాదు.
4. లక్ష్మి,పి. 1993. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు. పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
5. వసంత, కన్నాభిరన్.1990.పర్ స్పెక్టివ్స్, హైదరాబాదు.

# కె.వి.నరేందర్ కథల్లో మానవత్వపు విలువలు

**- రాయపూడి శివకుమారి,** పరిశోధక విద్యార్థిని, ఓరియంటల్ విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నేటి మన తెలుగు కథానికకు సంబంధించిన బీజాలు ప్రాచీన సాహిత్యంలో అక్కడక్కడా కనిపించిన ఊపిరి పోసి, రూపురేఖలు దిద్దిందీ పాశ్చాత్య సాహిత్యమే. ఇంగ్లీషులో ఉన్న షార్ట్ స్టోరీ తెలుగులోకి చిన్నకథగా దిగుమతి అయింది. కాబట్టి ఇది పూర్తిగా విదేశీయమైనదని చెప్పవచ్చు. ఇంగ్లీషు Short Story ప్రభావంతో, స్ఫూర్తితో జనించిందే తెలుగు కథానిక.

కె.వి.నరేందర్ కథా జీవితంలో బాధ్యతలు, సమస్యలు, సుఖం, దుఃఖం అన్నీ చోటు చేసుకున్నాయి. వీటిని పాఠకుడు అన్ని కోణాలనుండి చూసి వివిధ అనుభూతులు పొంది ఆనందపడతాడు. ఆ కథల్లో పాత్రలను నేర్చుకోగోరే పాఠకుడు తన నిజ జీవితంలో పోల్చుకుంటాడు. అలాంటి పోలిక కుదిరినప్పుడు రచయితను జీవితాంతం గుర్తుపెట్టుకుంటాడు. కథలు కేవలం

ఊహా విహారానికి, కాలక్షేపానికి కాదన్న నిజాన్ని అనుభవపూర్వకంగా గ్రహిస్తాడు. సాహిత్య ప్రక్రియల్లో కథా ప్రక్రియ ఉత్తమమైనది. పాఠకుడి అంతరంగాన్ని నిలవేసి చేష్టల్ని శాసించే శక్తి కథానికకు ఉంది. సామాన్య మానవుణ్ణి, సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని మానవత్వపు విలువలకోసం రచయిత శ్రమించినప్పుడే సాహిత్య ప్రయోజనం సార్థకమౌతుంది. దీన్ని తన కథల ద్వారా సాధించారు.

ఇతివృత్త వైవిధ్యం, పాత్ర చిత్రణలో పటుత్వం, అద్భుతమైన కథాశిల్పం, గంగా ప్రవాహంతో సాగే రచనా పాటవం తన కథల్లో మలచిన కథా శిల్పి, సీనియర్ కథా రచయిత కె.వి.నరేందర్.

జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథారూపంలో దాని తత్వాన్ని అన్వయించే ప్రయత్నంలో భాషలో కొత్తదనాన్ని, శిల్ప నైపుణ్యాన్ని, సంఘ అభ్యుదయాన్ని నిలబెట్టి చివరి వరకు చదివించే శైలిని, వస్తు శిల్పాల సమన్వయాన్ని కె.వి.నరేందర్ తన కథల్లో సమర్ధవంతంగా నిర్వహించారు. 'ఇతివృత్తం కావ్యానికి శరీరం' అని భరతుడు చెప్పాడు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు లేదా ఇతివృత్తం అంటారు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "కథకు ఇతివృత్తమంటూ ఒకటి ఉండడం తప్పని సరి. ఇతివృత్తం కోసం ప్రత్యేకంగా వెదనవసరం లేదు. ప్రతి మనిషికి కదలికలోనూ కథకు కావలసిన ఇతివృత్తం ఉంటుంది. తనను, తన చుట్టూ వున్న సమాజాన్ని, మనుషులనూ పరికించి చూడగలిగితే ప్రతి కన్నీటి బొట్టూలోనూ, కంటిపాప మెరుపులోనూ, కథకు కావలసిన ముడి సరుకు దొరుకుతుంది. అయితే, రచయిత తనకు గల అభిరుచులను బట్టి, ఆలోచనాధోరణిని బట్టి, తనకు కావలసిన వస్తువును ఎంచుకుంటాడు. తన సామర్థ్యాన్ని బట్టి కథగా మలచుకోగలుగుతాడు. తల్లి, తండ్రి, పిల్లలు, ఇల్లాలు ఇలా ఏ కాన్సెప్ట్‌తో రాసినా... ధ్వంసమైపోతున్న కుటుంబ విలువల కథలే ఇవన్నీ. ఒకే కాన్సెప్ట్ కథా పుస్తకాలు వేయటం బెంగాళీ సాహిత్యంలో ఎక్కువ. అవి కూడా ఒకే కాన్సెప్ట్ పై అనేకమంది రచయితలు రాసిన కథలవి. కానీ తెలుగు సాహిత్యంలో ఒకే కాన్సెప్ట్ పై ఒకే రచయిత కథలు రాయటం... నరేందర్ తోనే మొదలు ! నరేందర్ఒక ట్రెండ్ సెట్టర్ ! ప్రయోగం...ప్రయోజనం కలగలిపి అందించటం ఒక సాహసమే.

కిరాయి గర్భవతి కావలెను. గర్భధారణ, ప్రసవాలలోని కష్టసుఖాలు తెలిసిన స్త్రీ అయివుండాలి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి, విశాల హృదయం కలిగిన వ్యక్తిగా ఉండాలి. వయసు ముప్పయి ఎనిమిదేళ్లకు మించి ఉండకూడదు. ఇప్పటికే ఒకరిద్దరు బిడ్డలకు తల్లి అయిన స్త్రీకి ప్రాముఖ్యం... బిడ్డ భారాన్ని మోయడానికి అయ్యే

ఖర్చులు, వైద్య ఖర్చులు తొమ్మిది నెలలపాటు పూర్తిగా భరిస్తాం. ఇందుకుగాను అయిదు లక్షల రూపాయల పారితోషికం అందజేస్తాం. పై అర్హతలు కలిగి ఇష్టమైన వారు ఈ కింది ఫోన్ నంబర్లని సంప్రదించండి.

**నోట్** : కిరాయి గర్భవతిగా వ్యవహరించిన స్త్రీకి, బిడ్డపై తల్లిగా ఎలాంటి హక్కులు ఉండవు.

"అమ్మా... నాకు చచ్చిపోవాలనుంది... వివాహ వ్యవస్థను వెక్కిరిస్తూ పుట్టుకొచ్చే మేమంతా పెరిగి పెద్దయ్యాక అనుభవించే క్షోభ గుర్తిస్తే చచ్చిపోవాలనుంది... కానీ నీకు నష్టం కదూ... నా రాక కోసం రహస్య డాక్యుమెంట్లని లాకర్లలో దాచారేమోగాని... నీ గర్భాన్ని దాచలేవు కదా! నన్ను కని, ఎవరి చేతుల్లోనే పెట్టేసి నువ్వంటికెళ్తే అందరూ అడిగితే ఏం చెప్తావ్ ? అస్పత్రిలోనే బిడ్డ చచ్చిపోయిందనా... అందుకే నాకు చచ్చిపోవాలనుంది.. కానీ నీకు నాలుగు లక్షలు నష్టం కదూ..." సువర్చల గుండె చిట్లిపోయింది.

"మాతృదేవోభవ అని మొక్కాల్సిన నా మట్టివేళ్లు ముడుచుకుపోతున్నాయి. నీ జోలపాట వినాలని ఆరాట పడే నా చిన్ని మనసు మూగవోతోంది... నేనెక్కడ పెరుగుతానో... అన్న ఊహే భయంకరమై, పాలకోసం నీ స్తన్యాన్ని తాకకముందే అస్తమించాలని ఉంది... కానీ నీకెంత నష్టం?

రాజేష్ ఆందోళనగా తన చేతిలోని నాలుగులక్షలు డాక్టర్ చేతిలో పెట్టాడు.

"డాక్టర్... నాకు నా భార్య కావాలి... నాకు నా సువర్చల కావాలి..." డాక్టర్ ఆ డబ్బుని తిరిగి రాజేష్ చేతిలో పెట్టాడు.

"వెరీ సారీ... అయాం వెరీ సారీ.." అని వెళ్లిపోయాడు. సువర్చల శవం మార్చురీకి తరలిపోతుంటే, కంఠనాళాలు తెగిపోయేలా బంటీని పట్టుకొని బావురుమన్న రాజేష్ దు:ఖం హాస్పిటల్ గోడల్ని తాకి పగిలిపోతోంది. నరేందర్ ఎంతో హృద్యంగా పరిహారం కథలో వివరించారు.

ఇప్పుడు తెలంగాణే ఓ కథా వస్తువైంది... నిలువెల్ల గాయాలైన గ్రామాల్లో యంత్రీకరణ గ్లోబలీకరణలు జెనిగెల్లెక్కనే రక్తాన్ని పీలుస్తున్నాయి. ఇప్పుడు పల్లెల్లో జరిగే బహుముఖమైన పరిణామాలకు తోడు స్థానికత ను బలంగా ప్రతిపాదిస్తూ వస్తున్న కథల్లో నరేందర్ 'ఊరు' కథలు తెలంగాణా కథా సాహిత్యానికి మరింత గుర్తింపుని, ప్రతిష్టని పెంచుతాయి.

యంత్రీకరణ చర్య తెలిసినంతగా అది రూపొందే క్రమమెక్కడో తెలియక మనిషి పడుతున్న వ్యథలెన్నో మట్టి దీపాలు, పాకి, మట్టిమనసు లాంటి కథల్లో కన్పిస్తాయి. పుట్టెడు దుఃఖంతో కథ నడుస్తూనే తెలంగాణాలోని మానవ సంబంధాల్ని, సాంస్కృతిక విశేషాల్ని, చమత్కారాలని ఈ కథల్లో చూస్తాం. ఉసుల్ల వెనుక పుట్టిన కథ, చాకలమ్మ వేసిన తేలుమంత్రం, ఎరుకలి బాలవ్వ మందు పెట్టుడు.. కట్టె పుల్ల నిరిగి ఇడుపు కాయిదం చేసుడు... ఇలాంటివెన్నెన్నో 'కూరాడు పుదిచ్చినట్టు' కథా పరంగా నరేందర్ పొందుపరిచాడు. తెలంగాణా బాల్యం కూడా బతుకు దెరువు కోసం పడే వేదనని పిండం, పాకి, నెమలి కన్ను కథల్లో చెప్తాడు. అన్నీ చదివాక... ఊరు ఒక మౌనవికల స్వప్నమై మనముందుంటుంది. ఆ మనాది మనల్ని వెంటాడుతది. ముఖ్యంగా యంత్రాలు సమాజ పరిస్థితిని నిర్ణయిస్తున్న తీరుని... ఆ తీరులో పల్లె తనాన్ని పోగొట్టుకొని ఊరు ఉనికినే కోల్పోతున్న దృశ్యాలు ఈ కథల్లో గుండెని తడి చేస్తాయి. ఇప్పుడు నరేందర్ వెలువరిస్తున్న ఈ కొత్త కథానికా సంకలనానికి 'సిటీ' అని పేరు పెట్టాడు. ఈ సంపుటిలో 13 కథలు చోటు చేసుకున్నాయి. ఈ కథల్లో ప్రధానంగా రోజు రోజుకు విస్తరించి పోతున్న నగరాల్లో ప్రజలెదురుకుంటున్న సమస్యల్ని చిత్రించడం కనిపిస్తుంది. ఈ కథలకు నరేందర్ అర్బనైజేషన్ కథలు అన్న పేరు పెట్టాడు.

'సిటీ' పేరుతో వెలువడ్డున్న ఈ కథానికా సంకలనంలో చోటు చేసుకున్న కథలన్నీ నగరీకరణ (అర్బనైజేషన్) పెరిగిపోతున్న కారణంగా ఉత్పన్నమౌతున్న సమస్యల్ని చిత్రిస్తాయి. ఈ కథలన్నింటిలోనూ సామాజిక, వాస్తవికతను హృద్యమైన కథలుగా మలచగల్గిన నరేందర్ ప్రతిభ మనల్ని ఆకట్టుకుంటుంది.

ఈ సంకలనంలోని 'సొంత ఇల్లు' అన్న కథలో ఒక మహానగరంలో ఇల్లు (కట్టుకోవాలన్న తాపత్రయంలో పడిపోయిన ఓ మధ్యతరగతి కుటుంబీకులు ఎదురుకునే సమస్యల్ని రచయిత చిత్రించాడు. ఇళ్ళ ప్లాట్లు కొనుక్కోవ డానికీ, ఇల్లు కట్టుకోవడానికి చాలా తక్కువ వడ్డీతో రుణాలిస్తామని, వాటిని అనేక వాయిదాల్లో తీర్చవచ్చుననీ బ్యాంకుల వాళ్లు మధ్యతరగతి కుంటుంబీకుల్ని ప్రలోభ పెడ్తున్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) లాంటి విధానాల వల్ల భారతదేశపు ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు సంభవిస్తున్నాయి. బ్యాంకు రుణాలతో స్వంత ఇంటిని నిర్మించుకోవాలన్న ప్రలోభానికి లోనైన ఓ మధ్య తరగతి దంపతులు ఓ ఇల్లు నిర్మించు కొని పడే కష్టాల్ని ఈ 'ఇల్లు' కథ చిత్రిస్తుంది.

రకరకాల టి.వి.ఛానెల్స్ ను చూడటానికి అలవాటు పడిన ఈనాటి మధ్య తరగతి కుటుంబీకులు పుస్తకాలు చదవడానికి పూర్తిగా దూరమై పోతున్నారు. ఈ కారణంగా చాలా కాలంగా ఆ నగరంలో చదువరులందరికీ కేంద్రంగా ఉండే "షఫీ బుక్ స్టాల్' మూతబడే పరిస్థితి ఏర్పడు తుంది. ఆ బుక్‌స్టాల్ నడుపుతున్న మొయినొద్దీన్ బాబాకు ఆ బుక్‌స్టాల్ మూసివేయడం ఇష్టం ఉండదు. అతనికి పుస్తకాలంటే విపరీతమైన ప్రేమ. కానీ అతని కొడుక్కి యేమాత్రం కూడా గిరాకీ లేని ఆ బుక్‌స్టాల్ నడపడం అవివేకంగా కనిపిస్తుంది. అతడు ఆ బుక్‌స్టాల్ స్థానంలో జ్యూస్ సెంటర్ ను ప్రారంభిస్తాడు. ఎంతో కాలంగా ఆ నగరంలోని ఎంతోమంది పౌరులకు జ్ఞానాన్ని అందజేస్తున్న ఆ బుక్‌స్టాల్ మూతపడిన విషాద సంఘటనను 'షఫీ బుక్‌స్టాల్' అన్న ఈ కథలో రచయిత చిత్రించాడు.

వృద్ధులైన తల్లిదండ్రుల్ని వాళ్ల పిల్లలు 'ఓల్డేజ్ హోమ్స్'కు పంపించే సంఘటనలు మన నగరాల్లో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఈ సమస్యను చిత్రిస్తూ నరేందర్ 'గాయాలచెట్లు' అన్న కథను రచించాడు. ఈ కథలో వృద్ధాశ్రమాలకు చేర్చబడిన అనేకమంది వృద్ధుల కథల్ని చదువుతోంటే మన కళ్ళు చెమ్మగిల్లుతాయి.

నగరాల్లో జరిగే సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు గానీ, లేదా ఇతర కార్యక్రమాలకు గానీ బ్యానర్స్ రాసే కళాకారులుంటారు. ఈ బ్యానర్స్ రాయడమే వాళ్లకు వృత్తిగా ఉంటుంది. ఈ మధ్యనే కంప్యూటర్స్ ద్వారా ఈ బ్యానర్స్ ని అత్యంత ఆకర్షణీయంగా రాయిస్తున్నారు. వీటిని ఫ్లెక్సీ బోర్డు అంటున్నారు. ఈ ఫ్లెక్సీబోర్డులను కంప్యూటర్స్ ద్వారా రాసేవాళ్లు రావడంతో ఇదివరకు చేతితో బ్యానర్స్ రాసే కళాకారులెందరో నిరాశ్రయులై పోతున్నారు. ఈ సమస్యను చిత్రిస్తూ నరేందర్ 'చిన్ని ఆర్ట్' అనే మంచి కథ రాశాడు. నగర జీవితం ఉద్యోగాలు చేసే భార్యాభర్తల్ని దూరం చేసినా... వీకెండ్స్‌లో కల్సుకొని సుఖవంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్న వైనాన్ని 'వీకెండ్' కథలో చెప్పాడు. నగరాల్లో మాంసం దుకాణాలు నడుపు కుంటూ పొట్ట పోషించుకునే కటికవాళ్ల సమస్యల్ని 'చీకటికోల్లు' కథ చిత్రిస్తుంది. మాంసం అమ్ముకొని బతికే రాజలింగంను నగరంలోని సానిటరీ ఇన్ స్పెక్టర్, పోలీసు ఇన్ స్పెక్టర్ మొదలైన వాళ్లు ఎలా దోచుకుంటారో ఈ కథలో రచయిత చిత్రించాడు.

సమకాలీన నగర సమస్యల్ని అలవోకగా కథలుగా మలచే నేర్పు నరేందర్ కుంది. ప్రతి కథలోనూ మన హృదయాన్ని కదిలించే ఓ వాస్తవాన్ని మన కళ్లకు కట్టిస్తాడు. చాలా కథల్ని సంభాషణల రూపంలో నడిపిస్తూ చక్కని నాటకీయ శిల్పాన్ని ఈ రచయిత తన స్వంతం చేసు కున్నాడు. ఈ కారణం వల్ల ఈ కథలకు పఠనీయతా గుణం పుష్కలంగా అబ్బింది. కథా వస్తువుని దొరక బట్టడంలో నరేందర్ మొదటి స్థానంలో వుంటాడు. అంతే కాదు అద్భుతమైన కథనంతో పాటు కథాంశంకి చెందిన ఇన్ఫర్మేషన్ ని కూడా సందర్భోచితంగా అంతర్లీనంగా అందిస్తాడు. కె.వి.నరేందర్ రచిస్తున్న ఈ కథా మాలికల్లో ప్రయోగాత్మకతతో పాటు ప్రయోజకత్వం కూడా సమ పాళ్లలో సమకూరింది. నరేందర్‌ది శిల్పం, రూపం కంటే వస్తువునే ప్రధానంగా తీసుకుని అతి సరళమైన భాషలో కథను నడిపంచే పద్ధతి. చెప్పదలుచుకున్న విషయాన్ని

సూటిగా, నిజాయితీగా, ఎటువంటి అలంకారాలూ లేకుండా చెప్పడంతో ఈ కథలు ఇసుకలో నీటిలాగా పాఠకుని హృదయంలోకి ఇంకి నిక్షిప్తమైపోతాయి. సరళత కూడా ఒక అందమై భాసిస్తుంది. ఈ సిటీ సంపుటి పైన చెప్పినట్లే 'నగరీకరణ' ఉమ్మడి అంశంతో మాలికగా ఏర్పడిన గుచ్ఛం. దీంట్లో మొత్తం పదమూడు కథలు న్నాయి. వివిధ సందర్భాల్లో ప్రముఖ తెలుగు వార్త, మాస పత్రికల్లో వెలువడి పాఠకులకు పరిచయమైనవే. ఈ కథలను చదువుతున్నప్పుడు వివిధ సందర్భాల్లో ఎవరో గుండెల్లో కెలుకుతున్నట్లుగా, కడుపులో చేయి పెట్టి దేవుతున్నట్టుగా ఒక చిత్రమైన నిశ్శబ్ద క్షోభకు గురవుతాము.

హిజ్రా కథ కూడా ఒక గొప్ప సృజన. విధి కృతమైన హార్మోన్ల లోపంతో మనింట్లోని ఒక బాలుడు 'షండుడు'గా ప్రవర్తిస్తున్నప్పుడు తల్లీ, తండ్రి, కుటుంబ సభ్యులూ పొందే దుఃఖపూరిత ఘర్షణ, భౌతికంగా ఒక మనిషి సంఘంతో చీత్కరించబడే తృతీయ జీవిగా మారి ఒక అనివార్యతలో వికృతమైన పరిస్థితుల్లో సమసిపోవడం చూసి 'అయ్యో పాపం' అనిపిస్తుంది. గాయాల చెట్టు కూడా ఒక మంచి కథ. రోజురోజుకూ దేశంలో పెరిగి పోతున్న వృద్ధుల సంఖ్య, వారు కుటుంబ సభ్యుల నిరాధ రణకు గురై ఎలా మౌన హింసకు బలవుతున్నదీ, ఎంత విస్మరణకు గురవుతున్నదీ హృదయ విదారకంగా ఎంతో పరమ సత్యంగా చెప్పడం జరిగింది. సైనికుల జీవితాల మీద తెలుగు సాహిత్యంలో ఇది మొదటిసారి ఇచ్చిన కథా సంకలనం. కె.వి. నరేందర్ సీరియస్ విషయాల్ని తనదైన పద్ధతిలో ఉదాత్తమైన రీతిలో కథనం సాగిస్తాడు. 'యుద్ధం' కథల సంపుటిలో ఐదు ఆణిముత్యాల్లాంటి కథలున్నాయి. ఇందులోని 'పృథ్వీ' కథ సైనికుల ఆత్మా ర్పణతో దేశాన్ని రక్షించే ఈ సన్నివేశం ఉంది. 'సైనికుని ఉత్తరం' కథ కన్నీళ్లు తెప్పిస్తుంది. దేశ విభజన తర్వాత పాక్‌జైల్లో మగ్గిన వీరజవాన్ కథ చాలా హృద్యంగా చిత్రీకరించారు. కథల సంపుటి టైటిల్ కథ 'యుద్ధం'లో యుద్ధం లేదు కాని సైనికుని ఎంపికకు వెళ్లే ముందు ఓ నిరుద్యోగికి ఎదురవుతున్న వ్యతిరేకతను సహజంగా వ్యక్తీకరించారు. 'బోన్సాయ్ మొక్కను తప్ప బాయెనెట్ ను ఆదరించరు. వారి నరాల్లో నెత్తురుండదు 'థమ్స్ అప్ నీళ్లు తప్ప' అంటూ కొత్తగా సైన్యంలోకి ప్రవేశించే నిరు ద్యోగి వరకు ప్రియురాలు సాగనంపే సన్నివేశం చూపిం చారు. కథలన్నింటిలో సైనికుల వీరత్వం, మాతృభూమి పట్ల ప్రేమ, తల్లిప్రేమ, ప్రియురాలి ప్రేమతో కథలన్ని నడుస్తాయి. ఊరు కథా సంకలనంలో 14 కథలు ఉన్నాయి. ఇవన్నీ వివిధ పత్రికల్లో అచ్చయినవే. అప్పుడే ఇవి చాలామంది పాఠకులను చేరి ఉంటాయి. తెలంగాణ పల్లెలు శిథిలమవుతున్న తీరును గ్రామాల్లో మారుతున్న మానవ సంబంధాలను, గ్రామీణ జీవితాల్లో వచ్చిన పరి ణామాలను, సామాజిక సంబంధాలు తలకిందులవుతున్న వైనాలను, మారిన దోపిడీ రూపాలను ఈ కథల్లో నరేందర్ చిత్రించారు. ఈ కథలు చదువుతుంటే తెలంగాణ పల్లెల్లోని వివిధ కోణాలు తెలుస్తాయి. కంటికి కనిపించే దృశ్యాల వెనుకే అంతరార్థాలు అవగతమవుతాయి.

సమాజంలో తలకిందుల విలువలు చలామణిలో ఉన్నాయి. సంపద సృష్టికి ఉపయోగపడుతున్న శ్రామిక విలువలకు కాకుండా ఇతరాత్రా విలువలకు గౌరవ స్థానం దక్కడం చూస్తూనే ఉన్నాం. బర్రె కథ ఇటువంటి సామాజిక విలువల పట్ల విమర్శనాత్మక దృష్టి కోణం నుంచి రాసింది. ఉసుల్లు కథ సమాజంలో విలువలు తారుమారై కింద కులాలవాళ్ళు గౌరవస్థానంలోకి రావడాన్ని చూస్తాం. వృత్తులు లాభసాటి వ్యాపారంగా మారేసరికి వాటి రూపం మారి, అగ్రకులాల చేతుల్లోకి మారిన విషయాన్ని కూడా ఈ ఉసుల్లు కథ తెలియ జేస్తుంది. తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలు తెచ్చిన మార్పును చాలా కథలు వివరిస్తాయి.

'వెన్నెల' కథ బాహ్య వస్తువుల్లోని భిన్న మనస్తత్వాల్ని తెలియజేస్తుంది. కొడుకు స్థానం నుంచి తల్లిని పిచ్చిది, రాక్షసి, దేవతగా చూపి వస్తువు పట్ల సమాజంలోని భిన్నాభిప్రాయాల్ని హేతువులుగా చూపారు. డెలివరీ

కథలో తల్లీబిడ్డల మధ్య ప్రేమతో పాటు సమాజపరమైన వైవిధ్యం కనిపిస్తుంది. 'నానమ్మ' కథలో కొడుకుల దౌష్ట్యానికి వాడిపోయిన పూవులా 'నానమ్మ'ను మనవడి కోణం నుంచి చిత్రీకరించారు.

గర్భగుడి, ప్రస్థానం, అమ్మ రాసిన ఉత్తరం... మదర్ 2000లలో తల్లి కోణం నుంచి అమ్మ పాత్రను చిత్రించారు. ఇందులో మొదటి మూడింటిలో బిడ్డ కోసం తపనపడే తల్లి మనసు సమాంతరంగా కనిపిస్తుంది. ఆడపిల్ల పుడుతుందనుకుని ఆహారాన్ని సరిగా ఇవ్వని కుటుంబ సభ్యుల మధ్య బిడ్డ కోసం తపించే తల్లి మనసును నే హృద్యంగా చూపారు. అలాగే కొడుకులపై కోపాన్ని చూపి తిరిగి తనకు తాను ఒక ఉనికిని కల్పించుకొని వ్యక్తిత్వంతో నిలబడిన అమ్మను చిత్రించారు. తన బిడ్డ ఉనికి కోసం లోకాన్ని ఎదిరించిన తల్లిని మొదటి మూడు కథల్లో చిత్రించి,

అమ్మకు పిల్లలపై గల ప్రేమను విలక్షణంగా చూపారు. ప్రేమాభిమానాల వ్యక్తీకరణలో తల్లి హృదయ స్పందనల్ని, వ్యవహారసరళిని, దోబూచు లాటను సహజ సిద్ధంగా వ్యక్తం చేయడంలో, వాటి తాలూకు అనుభూతుల్ని పాఠకులకు అందుకునేలా చేయడంలో రచయిత సక్సెస్ అయ్యారు.

కేవలం విషాదపార్శ్వాన్నే ఎత్తి పెట్టక వాటితో పాటు సాంస్కృతిక పరమైన విశేషాలు చమత్కారాలతో పాటు అన్ని ప్రాంతాల మాండలికంపై కథలు వ్రాస్తూ తెలంగాణ కథా సాహిత్యంలో కథకుడిగా పెరుపొందిన వారు నరేందర్. అటు వస్తువులలోనే, ఇటు శిల్పంలోనూ నూత్న ప్రయోగాలు చేపట్టి చదువరుల ఆలోచన పరిధిని చైతన్యవంతంగా విస్తృతపరుస్తూ కథల ప్రయోగశీలి కె.వి.నరేందర్ నాతిచెరామి, ఊరు, సిటీ, కాలుతున్న పూలతోట విభిన్న కథలు, చీపురు, యుద్ధం, బురదలో జాబిల్లి, నాన్న, అమ్మ, పోరు - ఇలా విభిన్న ఇతివృత్తాలతో వైవిధ్యమైన కథలను మన ముందుంచారు. ఈ కథా సంపుటాలన్నీ దేనికది ఒక విలక్షణతనీ, విశిష్టతను కలిగివున్నాయి. ఈ కవి ప్రయోగశీలం, ప్రతిభ అతని సింగల్ కాన్సెప్ట్ కథల్లో పుష్పించి ఫలించాయి. అలాంటి క్రియాశీల రచయితల్లో ముందు వరుసలో నిలిచిన కథకుడు కె.వి.నరేందర్.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సింగిరెడ్డి నారాయణ రెడ్డి – గజళ్ళు

– పెదనారప్ప గారి సురేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

## కవి పరిచయం :

చదువు లేని సామాన్య రైతు కుటుంబంలో జన్మిం చినా హలాన్ని వదిలి కలాన్నే హలంగా మలచి అక్షర సేద్యం చేసిన మహాకవి సింగిరెడ్డి సత్యనారాయణ రెడ్డిగారు. ఈయన కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజీ పేట గ్రామంలో ప్రజోత్పత్తి నామ సంవత్సరం నిజాషాడ పౌర్ణమి (గురుపౌర్ణిమ) నాడు అనగా 29-07-1931 నాడు ఉదయం 4-5 గంటల మధ్య జన్మించాడు. తల్లి శ్రీమతి సింగిరెడ్డి బుచ్చమ్మ గారు, తండ్రి శ్రీ సింగిరెడ్డి మల్లారెడ్డి గారు. మల్లారెడ్డి గారు అరక పట్టిన రైతు 'పదుగురు పాలేర్లున్నా పదరా' అని స్వయంగా రేగడిని దున్నే కృషివలుడు నల్లని రేగళ్ళు దున్ని నారాయణ రెడ్డి బ్రతుకున రవ్వలు పండించిన కర్షక మణి మల్లారెడ్డి. నారాయణ రెడ్డిభార్య పేరు సుశీల వీరికి నలుగురు కూతుళ్ళు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి.

సినారె గారిలో సహజంగా సృజనాత్మక శక్తి, లయాత్మ కత, అశుగుణం, గానశీలం ఉన్నాయి. చిన్నప్పటి నుండి మట్టిలో పుట్టిన జానపద గేయాలను ఆలపించేవారు. హరికథలు, బుర్రకథలు, అంటే చెవి కొసుకునేవారు హరికథ కథనాన్ని అనుకరించేవారు వేములవాడ వాస్తవ్యులు " శ్రీచౌటి నరసయ్య" గారి హరికథాగానం. సినారె గారికి చంధస్సు పట్ల అభిరుచిని కలగడానికి ప్రేరకమైనది సినారె అధికార భాషా సంఘం అధ్యక్షులుగా (1981), సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా (1985) తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా (1989) భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, రాజ్యసభ సభ్యులుగా (1997), సిని గీతా రచయితగా, కవిగా, విద్యారంగంలోను, పాలనా పరంగాను ఆధునిక తెలుగు సాహిత్యానికి ఎనలేని తన సేవలను అంధించారు. ఈయన కలం నుంచి ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. అందులో ముఖ్యమైనవి 1.ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు 2.విశ్వంభర, 3.కర్పూర వసంత రాయలు 4. ప్రపంప పదులు 5.మంటలూ - మానవుడూ 6.మట్టి మనిషి ఆకాశం 7.నాగార్జున సాగరం 8.తెలుగు గజళ్ళు ఇందులో 'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ పురష్కారం 1988లో వచ్చింది. ఈ పురష్కారం అందుకొన్న ద్వితీయకవి. మొదట విశ్వనాథ సత్యనారాయణ 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం (1970) తృతీయ కవి రావూరి భరద్వాజ రాసిన పాకుడు రాళ్ళు(2012) తెలుగులో వీరికి మాత్రమే ఈ పురష్కారం లభించింది.

సినారె కవి గురించి కుందుర్తి గారు ఈ విధంగా పొగిడారు. "నారాయణ రెడ్డి తిలక్‌లాగా రెండంచుల పదును గల కత్తి కవిత్వంలో అగ్ని చల్లగలడు, అమృతం కురిపించగలడు".

'ఎన్ని తెన్నుల కైత కన్నె విహరించినను పాటలలోనే నాదు ప్రాణాలు గలవందు' అని సినారె ఒక సందర్భంలో చెప్పడం అలాగే 'నేను నగరానికి రాకుండా ఆధునిక కవిగా కాకుండా ఉంటే గద్దర్ లాగా భుజాన చద్దర్ (దుప్పటి) వేసుకొని పూర్తిగా పాటగాడిగా మారిపోయి ఉండేవాణ్ణి అని చెప్పారు.

## గజళ్ పరిచయం :

రాసేవారిని, చదివేవారిని, పాడేవారిని, వినేవారిని ఆనంద డోలికలలో తుల తూగించే సంపూర్ణ కవితా ప్రక్రియ గజల్. పూర్వం అరేబియాలో కార్మికులు రాత్రివేళల్లో సరదాగా తమ నాయకులను కీర్తిస్తూ

'ఖసీదాలను' పాడేవారు వాటి నుంచి పరిణామం చెంది నదే గజల్. ఈ గజల్ అనే పదం పర్షియా భాషలోని 'ఖసీదా' అనే పదం నుండి పుట్టింది. గజల్ అనగా "స్త్రీల సంభాషణ, స్త్రీల సౌందర్యాన్ని వర్ణించడాని"కి వాడేవారు. గజల్‌ను ప్రేమకు, తత్వానికి వాడుతారు. 10వ శతాబ్దంలో ఇరాన్‌లో గజల్ ఆవిర్భావం జరిగింది. 12వ శతాబ్ధంలో ముస్లీం రాజుల ప్రాబల్యంలో మొగలులు ఇరానీయుల ఆచార్య వ్యవహారాలతో పాటు గజల్‌ను ఇరాన్ నుండి భారతదేశానికి దిగుమతి చేశారు. 'అమీర్ ఖుస్రో' ఉత్తర భారత దేశంలో గజల్‌ను ప్రారంభిచాడని చెబుతారు కానీ నిజానికి దక్కనులోనే మొదలైంది.

గజల్ మాత్ర ఛందస్సులో ఉంటుంది. పల్లవిని 'మత్లా' అని చివరి చరణాన్ని 'మఖ్తా' అని అంటారు. పల్లవి చివర ఉన్న పదం ప్రతి చరణం చివర అంత్య ప్రాసగా రావడాన్ని 'రథీప్ కాఫీయ' అంటారు. చివరి చరణంలో కవి నామ ముద్రను 'తఖల్లున్' అంటారు. మక్తా అనగా జాగీరు అని అర్థం గజల్ ద్విపదలో ఉంటుంది.

తెలుగులో గజల్‌కు దాశరథి కృష్ణమా చార్యులు శ్రీకారం చుట్టారు. దీనికి ఈయన "మంజరి" అని పేరు పెట్టారు. తొలి గజల్ వాగ్గేయ కారులు పి.బి.శ్రీనివాస్ గారు గజల్‌ను 'వల్లరి' అని పిలిచారు.

కాని గజళ్ళను తెలుగులో భాగా ప్రాచుర్యంలోకి తెచ్చి సొంతంగా రాసి ఆలపించిన కవి సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు "తెలుగు గజళ్ళు" అనే రచన చేశాడు. దీనిని తన పెద్ద కుమార్తె అయిన 'గంగ'కు అంకితమిస్తూ ఇలా అన్నాడు.

"నన్నే కన్నయ్యగ తన కన్నుల ఒడిలో పొదిగిన గంగకు అర్పింతును నా గజళ్ళు ఎదలొన ముడిచి ఋణ విముక్తికై చేసిన కృతి సమర్పణం కాదిది తల్లి నొట ముద్దులిడే పిల్లవాని చాపల్యం"

తన తల్లి బుచ్చమ్మగారే తన పెద్ద కూతురుగా పుట్టిందా అన్నట్లుగా పెద్దకూతురు అందరిని కంటికి రెప్పలా చూసుకొనేది సినారె గజళ్ళలో వృత్త పరిశీలన, మానవీయ విలువలు, ప్రగతిశీల దృక్పథం ప్రధానంగా కనిపిస్తాయి. సినారె గారు స్వయంగా తానే రచించి, ఆలపించి ఆడియో క్యాసెట్లుగా రూపొందించాడు. బహుశా అందుకేనేమో దాశరథి గారి గజళ్ళ కంటే సినారె గారి గజళ్ళు బాగా ప్రాచుర్యంలోకి రావడం జరిగింది. దాశరథికి ఆలపించే సామర్థ్యం లేదు కనుక "తెలుగులో గజల్ వ్యాప్తికి ప్రధాన కారకుడు సినారె". అని కవి విమర్శకుడు పెన్నా శివరామకృష్ణ అన్నారు.

**గజల్స్ :**

సినారె గారు చాలా అందంగా రాసి తన గాన మాధుర్యంతో పాడిన తనకు చాలా ఇష్టమైన గజల్ ఇది.

**మత్లా :**

జనముంటే తరగని ఉత్సాహం పుడుతుంది
ధనముంటే ఖరీదైన దాహం పుడుతుంది!
నేడు ముదురుతున్న రాజనీతి రంగుపడితే
మునులకైన పదవి వ్యామోహం పుడుతుంది.
॥జన॥

పరిస్థితుల పంజా తన పైకి దూసుకొస్తే
ఉత్త బుర్రలోనైన వ్యూహం పుడుతుంది!
॥జన॥

అలా అలా తేలిపోతే అంతట దేవుళ్ళే చూపు
ఆత్మలోకి దిగితే శోహం పుడుతుంది!
॥జన॥

సర్వం సౌజన్య మయం సమదర్శన ముంటే
ఊహలు నలుపెక్కితేనే ద్రోహం పుడుతుంది!
॥జన॥

వీను చూసి గతిమార్చే విలువలదే విలువచెదరని
మనసుంటేనే స్నేహం పుడుతుంది!
॥జన॥

**మక్తా :**

వేకువలో కలిగేది వివకమే సినారె
ముసిరిన చీకటిలోనే మోహం పుడుతుంది!

ఈ గజల్ లో సామాజిక వికాసం కనిపిస్తోంది. ఒక్కో చరణంలో ఒకదాని గురించి చెప్పాడు.

ఇందులో దాహం, మోహం, వ్యూహం, శోహం, ద్రోహం, స్నేహం గురించి చెప్పారు. మనిషికి కోరికలు అనంతం ఒకటి తీరిన తరువాత ఒకటి పుడుతునే ఉంటాయి అనంతమైనది. ధనముంటే విలాసవంతమైన జీవితం కావాలి అనుకుంటాడు. అలాగే రాజకీయం అనే రంగు తగిలితే ఎవరికైన అధికారం కావలి అనుకుంటారు. ఇది ఒక రాజకీయ వ్యాపరంలా ఉంది ఇప్పుడు అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చు. బాగా డబ్బు సంపాదించ వచ్చు అనే భ్రమ ఉంది. నేటి కాలంలో ఈ ప్రపంచం అతి సుందరమైనది అందరు సమానమే అంటుంది కాని మనిషి యొక్క ఆలోచనలు బాగుండాలి. లేకుంటే మోసం చేయాలి అని అనుకుంటారు. మనిషి ఉన్నప్పుడు ఒకలా లేనప్పుడు ఒకలా నటించే లోకం ఇది అలా కాకుండా ఎన్ని ఆటంకాలు వచ్చిన చెదరని మనసుంటే స్నేహం బాగుంటుంది అన్నారు సినారె.

ప్రపంచంలో అందరకీ ఆది గురువు అమ్మ సృష్టికి మూలం అమ్మ. తల్లిని మించిన దైవం లేదు. తల్లి ప్రేమకు ఏదీ సాటిరాదు. అలాంటి తల్లి ప్రేమ గురించి చక్కగా ఈ గజల్‌లో చూపించారు.

**మత్లా :**

అమ్మ ఒక వైపు దేవతలంతా ఒకవైపు
సరితూచమంటే నేను ఒరిగేను అమ్మ వైపు!

ఈ బండి చూడరా నాన్న ఈ గుర్రమింక నీదన్న
తెగ మంకు తోచిన నాడు దిగలేదు అమ్మవైపు!

రోదలలో మౌనపాటంలా ఎదలలో ద్యాన పీఠంలా
నా భాల్యమంతా తానే నడిపించింది అమ్మ చూపు!

చీకటికి చంద్రబింబంలా ఆకలికి పూర్ణ కుంబంలా
నిలువెల్లా మమతల వెలుగై నిలిచింది అమ్మ రూపు!

మెరిసే ప్రభాత కిరణంలా విరిసే వసంత కుసుమంలా
పేరిగే సినారె బ్రతుకులా దొరికింది అమ్మ ప్రాపు!

ముక్కోటి దేవతలంతా కలిసినా తన తల్లికి సమానం కారు అని నేను అమ్మ వైపే ఉంటాను అంటే తల్లి మీద ప్రేమను చూపించారు. సినారే తల్లి బొమ్మను చూపి ఆశ చూపిన తల్లిని వదలలేదు మంచి చెడ్డలను చెప్పి బాల్యం అంతా పెంచి పోషించింది. పిల్లవానికి ప్రపంచమంతా తానై ఉంటుంది. బిడ్డ ఆకలి తెలుసుకొని ఆకలిని తీర్చే అన్నపూర్ణాదేవి తల్లి. ఇలా బాల్యమంతా కంటికి రెప్పలా చూసుకొని పెంచి పెద్దవాన్ని చేస్తుంది తల్లి.

అవసరానికి ఉపయోపడని వాటిని గురించి సినారె ప్రశ్నించడం జరిగింది. సామాజిక వికాసం ఈ గజల్ లో స్పష్టంగా కనిపిస్తుంది.

**మత్లా :**

పరులకోసం పాటుపడని - నరుని బ్రతుకు దేనికని
మూగ నేలకు నీరందివ్వని - వాగు పరుగు దేనికని!

తాతలు తాగిన నేతుల సంగతి - నీతులుగా పలికెను మన సంస్కృతి
జల్లుకు నిలవని ఎండకు ఆగని - చిల్లుల గొడుగు దేనికని!

ఆదర్శాలకు నొళ్ళు చాలవు - ఆశయాలకు పైళ్ళు చాలవు
పద పద మంటూ పలుకులేగాని - కదలని అడుగు దేనికని!

జల విద్యుత్తుకు కరువే లేదు - జన సంపత్తికి కొదవే లేదు
అవసరానికి మీట నొక్కితే - అందని వెలుగు దేనికని

**మక్తా :**

శిశు హృదయానికి కల్లలు లేవు - రస రాజ్యానికి ఎల్లలు లేవు
లోపలి నలుపు సినారేకు తెలుసు - పైపై తొడుగు దేనికని

ఇతరులకు ఏదైనా సహాయం అందించని మనిషషి యొక్క బతుకు వ్యర్థం అన్నారు. సినారె వర్షాలు లేని బాగా ఎండిపోయిన చేనులకు నీరు ఇవ్వకపోతే ఎన్ని వాగులు వచ్చినా ఫలితం ఉండదు అంటారు. అలాగే తాతాలు చరిత్రలు చెప్పకొని బ్రతికే కాలం నేటి సమాజంలో ఉంది. గత చరిత్రను చెప్పుకొని గొప్పలు

చెప్పుకొంటున్నారు. మన తెలుగు రాష్ట్రంలో జలవిద్యుత్ తయారు ఎక్కువగా చేస్తున్నారు. జనాభా కూడా ఎక్కువగా ఉంది కాని అవసరానికి కావాలి అంటే రాకుంటే ఎంత తయారు చేసిన వ్యర్థం అన్నారు. సినారె మనుషులు బయట ఒకలా లోపల ఒకలా ఉంటారు పైకి కనిపించేది అంతా నిజం కాదు. పిల్లలు మనసుకి అపద్దం అనేది తెలియదు. పిల్లలు దేవుళ్ళతో సమానం. కొందరు పైకి మంచి వాళ్ళుగా నటిస్తారు. అది సినారెకి తెలుసు అది చేద్దాం, ఇది చేద్దాం అని అనుకుంటారే కాని అడుగు ముందుకేసి ప్రయత్నించరు. అనుకున్నది సాధించాలి అంటే గట్టి ప్రయత్నం అవసరం.

**ముగింపు :**

సినారె దాదాపు 120 తెలుగు గజళ్ళు రాశారు. ఈ గజళ్ళలో వృత్త పరిశీలన, మానవీయ విలువలు, ప్రగతి శీల దృక్పథం, సామాజిక వికాసం ప్రధానంగా కనిపిస్తాయి. తన గజల్స్ ద్వారా లోకానికి చురకత్తులు సంధించారు. తన సాహిత్యం ద్వారా లోకానికి మంచి చేయాలని చూశారు. మనిషి యొక్క ఆలోచన తీరును, నడవడికను ఈ గజల్స్‌లో చూపించారు. అలాగే దేవతలందరికంటే గొప్పదని తల్లిని గురించి మరో గజల్‌లో పేర్కొన్నారు. ఇలా గజల్స్ మొత్తం వ్యక్తిత్వ వికాసం సామాజిక వికాసం కలిగించారు సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఆయుర్వేద అంశాలు

- డా॥. చవ్వా వెంకటరెడ్డి , తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాద్.

పుణ్యభూమి, కర్మభూమి అయిన భారతదేశం వేద సంస్కృతికి నిలయం. చతుర్వేదాలు, పురాణ ఇతిహాసాలు ముఖ్యంగా భారత, రామాయణ, భాగవతాలు మన సంపదలు. ఆధర్వణవేదంలో ఉపవేదంగా ఆయుర్వేదం చెప్పబడింది. ఆయుర్ అంటే జీవితం. వేదమంటే విజ్ఞానం. ఈ విధంగా ఆయుర్వేదం ఆయుష్షును పెంపొందించే శాస్త్రంగా వివరించబడింది. ఇది ప్రకృతి నుంచి పుట్టిన సహజసిద్ధమైన చికిత్సా విధానం. మానవునికి సంపూర్ణమైన ఆయుష్షు కలిగి జీవన చైతన్యంతో సాగిపోవడానికి ఆయుర్వేదం అమృతంలా పనిచేస్తుంది. కాలక్రమంలో ఆయుర్వేదం దాదాపు 5000 సంవత్సరాల చరిత్రతో పురాతనమైన సనాతన ధర్మంలో ఒక భాగంగా విస్తరిల్లింది. ఋగ్వేదంలో కూడ దీన్ని గురించి ప్రస్తావన కనిపిస్తుంది. వైదిక ఋషులు అధర్వణవేదంలోని వైద్యాంశాలను విడదీసి ఆయుర్వేద వైద్య గ్రంథాలుగా వెలువరించారు.

వైదిక సాహిత్యానుసారం ఆయుర్వేదాన్ని మొదట బ్రహ్మదేవుడు ధన్వంతరికి బోధించాడు. ధన్వంతరి భరద్వాజునికి, అతడు పునర్వసు, ఆత్రేయునితో సహా పలువురు ఋషులకు బోధించాడు. వీరితో పాటు చరకుడు, శుశ్రుత, హారితుడు, అగ్నివేశుడు, భేలుడు, జాతుకరణుడు, పరాశరుడు, క్షరపాణి అనేవారు ఆయుర్వేద రంగంలో విఖ్యాతిని పొందారు.

భారతీయ వైద్య శాస్త్ర చరిత్రలో బహువిఖ్యాతి గాంచిన గ్రంథం చరక సంహిత. దీనిని అష్టాంగ స్థానాలుగా చరకుడు విభజించాడు . ఈ గ్రంథం కేవలం ఆరోగ్య సూత్రాలనే కాకుండా వాటి వెనుక ఉన్న తత్త్వాన్ని తార్కికంగా చర్చించింది. ఇంకా పిండాభివృద్ధి, శరీర నిర్మాణం, కఫ, వాత, పిత్తాల అసమతౌల్యం వలన కలిగే రుగ్మతల వంటి విషయాలను చాలా విస్తారంగా చర్చించింది. ఈ గ్రంథం ముఖ్యంగా కన్నులు, వివిధ రకాల గర్భసమస్యలను, వివిధ రకాల ప్రసవాలను, బాలరోగాలను గురించి పేర్కొన్నది. వీటికి ప్రధానంగా శాకాహార ప్రధానమైన ఔషధాలను చరకుడు వివరించాడు. ఈ ఔషధాలు 50 రకాలుగా వర్గీకరించబడ్డాయి.

శస్త్రచికిత్స చేసిన తరువాత కుట్లు వేయడానికి గండు చీమలను ప్రయోగించడం గురించి శుశ్రుత సంహిత అనే ఆయుర్వేద గ్రంథంలో చర్చింపబడింది. అంతేకాక బొడ్డు ద్వారా ప్రేవులను బయటకు తీసి, చికిత్స చేసి, మళ్ళీ బొడ్డు ద్వారా ప్రేవులను లోపలికి పంపే శస్త్ర చికిత్స కూడా ఇందులో వర్ణింపబడింది. మూత్రాశయంలో రాళ్లను తొలగించడం, నాభిలో చేరిన ద్రవాలను తొలగించడం, గర్భంలో చనిపోయిన శిశువును తొలగించడం, కంటిలోని శుక్లాలను తొలగించడం వంటి శస్త్ర చికిత్సలు కూడా వివరింపబడ్డాయి. ఈ ఆయుర్వేద గ్రంథాలు లాటిన్, పర్షియన్ భాషల్లోకి అనువదింపబడ్డాయి.

సంస్కృత సాహిత్యంలో భారవి, మాఘుడు మొదల్కెన సంస్కృత మహాకవులెందరో తమ కావ్యాలలో సందర్భానుసారం ఎన్నో ఆయుర్వేదాంశాలను తెలిపారు. అలాగే తెలుగు కవులు కూడా తమ కావ్యాలలో సందర్భానుసారంగా వారి వారి అనుభవములోని దేశీయ వైద్య విషయాలను వర్ణించారు.

అతిశయ రూపయౌవనగుణాధిక సుందరమైన యా సతీ
ద్వితయమునందు సంతత రతిన్ వివశుండయి రాజకృతముల్
మతి నొకనాడు జేయక హిమద్యుతితేజుడు రాజయక్ష్మబా
ధితుడయి దేవలోక సుదతీప్రియుడయ్యె విచిత్రవీర్యుడున్

అంటూ ఆదికవి నన్నయ విచిత్రవీర్యునికి అంబిక, అంబాలిక అను నవోఢలతో అతి సంపర్కం వల్ల రాజ

యక్ష్మ వ్యాధి (కాన్సర్ వంటిది) కలిగిందని రచించాడు. రస, రక్త, మాంస, మేధస్సు, అస్థి, మజ్జ, శుక్రము క్షీణించడం వల్ల ధాతుక్షీణత ఏర్పడి, రాజయక్ష్మ కలుగుతుందని అష్టాంగ హృదయం అనే ఆయుర్వేద గ్రంథం చెబుతోంది. ఈ రోగవిధానాన్నే నన్నయ పై పద్యంలో రచించాడు. తిక్కన మహాభారతంలో శ్లేష్మాది రోగ వికారాలను తెలియజేస్తూ ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన అనేక విషయాలు తెలియజేశాడు. భాగవతంలో, భారతంలో పిండోత్పత్తి క్రమం ఉంది. మొదటిరోజు నుండి పది నెలలు నిండి ప్రసవం జరిగేవరకు రోజువారీగా పిండం అభివృద్ధిచెంది శిశువుగా మారే దశలన్నీ ఎంతో వివరంగా సాధికారికంగా భాగవతం వివరిస్తుంది. నేటి అల్లోపతి వైద్య విద్యార్థుల పాఠ్య గ్రంథాల్లోనూ ఇవే దశలు అదే క్రమంలో వివరించబడ్డాయి.

ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో తిన్నడి వృత్తాంతంలో నేత్రవైద్యం ప్రస్తావన ఉంది. ప్రత్యేకించి నేత్రవ్యాధుల్లో భారతీయులు కనుగొన్న వ్యాధులు వందకు పైగా అల్లోపతి విధానంలో చోటు చేసుకోవడం విశేషం.

ఆరోగ్యరీత్యా పాటించవలసిన ఆహార నియమాలు, వివిధ ఋతువుల్లో తీసుకోవలసిన ఆహారాల వివరాలు, రైతుల శాకాహార మాంసాహార భోజనాలు, వైష్ణవుల అపక్వాహార భోజనం, రాజభోజనం, విందు భోజనం వీటిల్లో అంతర్లీనంగా ఉన్న ఆరోగ్య నియమాలు, విస్తరాకులు, భోజన పాత్రలు వాటి లోహాల విశిష్టతలు వంటివి ఆముక్తమాల్యద వంటి అనేక కావ్యాలలో వర్ణించబడ్డాయి. హంసవింశతిలో కూరగాయలు, ఆకుకూరల వివరాలు కోకొల్లలు. ఆముక్తమాల్యద, శుకసప్తతి, వాల్మీకి రామాయణం మొదలైన కావ్యాల్లో ఆహారం, ఆరోగ్యం కలగలసిన సందర్భాలనేకం ఉన్నాయి.

మహాభారతం ఆదిపర్వంలోనే పలు ఆయుర్వేదాంశాలు కనిపిస్తాయి. తల్లి ఆజ్ఞ మేరకు వ్యాసుడు కురు వంశాన్ని నిలపడానికి వస్తాడు. అంబిక, అంబాలికలను కలుస్తాడు. వారికి ధృతరాష్ట్రుడు, పాండు రోగగ్రస్తుడైన పాండురాజు జన్మించారు. ఆపై దాసికి విదురుడు జన్మించాడు. ఇది అందరికీ తెల్సిన భారతకథ. ఇక్కడ ముగ్గురికీ మగపిల్లలే పుట్టడం సంభవమా అనేది కీలక ప్రశ్న. ఈ అనుమానం భారతీయులనే కాక, పరిశీలనా దృష్టిగల విదేశీయులను కూడా ఆకర్షించింది. 1974లో అమెరికాలోని అయోవా విశ్వవిద్యాలయంలో దొనాల్డ్, లాకే స్కూటర్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు ఈ అంశంపై పరిశోధనలు చేశారు. "మానసిక స్థితిగతులు - లింగ నిర్ణయం" అనే అంశం ప్రాతిపదికగా వారీ మానవ ప్రయోగాలు చేశారు.

"స్త్రీపురుష సంభోగ సమయంలో, అండ వీర్యకణాల ఫలదీకరణ సమయంలో వారి మానసిక ఆవేశాలు బిడ్డ లింగ నిర్ణయంలో కీలకపాత్ర వహిస్తాయని ఈ ప్రయోగాలలో తేలింది. అంబిక, అంబాలిక, దాసి వీరి మానసిక స్థితి గల స్త్రీలకు మగపిల్లలే పుట్టినట్లు ఈ ప్రయోగాలు ఋజువు చేశాయి. మానసిక సంక్షోభం విపరీతంగా ఉన్న లేదా మరీ ప్రశాంతంగా ఉన్న స్త్రీలో వీర్యం స్ఖలించబడగానే దానిలోని క్రోమోజోమ్ గల వీర్యకణం ప్రేరేపితమై అండాన్ని ఫలదీకరించి మగబిడ్డ పుడతాడు. దాసీకన్య ప్రశాంతంగా ఉంది కనుక ఆమెకూ మగపిల్లవాడే పుట్టాడు. భారతంలో వ్యాసుడు నాటిన భావబీజానికి ఆధునిక జీవవిజ్ఞాన శోధకులు శాస్త్రీయ ప్రతిపత్తిని సాధించారు. అలాగే రేప్ జరిగిన సందర్భాలలో ఆయా స్త్రీలకు ఎక్కువగా మగబిడ్డలే జన్మించినట్లు పరిశీలకులు వెల్లడించారు. సకల శాస్త్ర పారంగతుడైన వ్యాసుడు లైంగిక విజ్ఞానపరమైన ఈ చిన్ని సూత్రాన్నీ కథారూపంగా భారతంలో చెప్పాడని మేధావులు అంగీకరించారు."

మహాభారతంలో కౌరవుల జననఘట్టం అద్భుతమైన వైద్యాంశ ప్రతిపత్తి కల్గి ఉంది. గాంధారి సంవత్సరం గడిచినా ప్రసవం కానందుకు ఆవేదన భరించలేక తన గర్భాన్ని విచ్ఛిన్నం చేసుకుంది. వ్యాసుడు హస్తినాపురానికి వచ్చి మాంసఖండంగా ఉన్న ఆమె గర్భభాగాన్ని నూటొక్క

ముక్కలుగా చేసి, ఆవునేయి నింపిన పాత్రలలో భద్రపరిచాడు. ప్రతిరోజూ నిర్ణీత సమయాలలో గాంధారి వెళ్ళి ఆ భాండాలను వాత్సల్యంతో స్పృశించి ఆ పిండాలకు మాతృత్వ వాత్సల్య స్పర్శను అందించాలని ఆదేశించాడు. గాంధారి అలాగే చేసింది. నెలలు నిండాక ఆ భాండాల నుండి కౌరవులు, దుస్సల జన్మించారు. దీన్నుంచి పరిశోధకులైన శాస్త్రవేత్తలు మూడు విజ్ఞాన సూత్రాలను రాబట్టారు."

ఈ కథాభాగంలో పిండాల్ని ముక్కలుగా చేయడం, తల్లి గర్భాన్ని పోలిన కృత్రిమ వాతావరణంలో (ఘృత భాండం) పిండాల్ని పెంచడం, మాతృస్పర్శ కల్గించడం అనే ప్రక్రియల ద్వారా గర్భకోశానికి బయట పిండాల అభివృద్ధి జరిగింది. శాస్త్రజ్ఞులు ఈనాటి వరకు తల్లి గర్భాశయాన్ని పోలిన కృత్రిమ గర్భాశయాన్ని నిర్మించలేక పోయారు. అటువంటి కల్పనను ఘృతభాండం ద్వారా వ్యాసుడు భారతంలో సూచించాడనుకోవాలి. మాతృ స్పర్శలేని సంతానంలో ఎదుగుదల లోపభూయిష్టంగా ఉంటుందని ఆధునిక విజ్ఞానం హెచ్చరిస్తోంది. దీని సూచికగానే వ్యాసుడు కౌరవ జనన వేళ గాంధారి చేత మాతృస్పర్శ చేయించినట్లు వ్రాశాడు. ఇంతవరకు ఈ భారత కథకు వైజ్ఞానిక ఉపపత్తి లభించింది.

భారత విరాటపర్వంలో సంవత్సరకాలం అర్జునుడు బృహన్నలగా అవతారం ఎత్తడం కన్పిస్తుంది. ఇటువంటి స్థితిని జీవవిజ్ఞానం "హెర్మాఫ్రాడైటిజమ్" అంటుంది. కొంతకాలం స్త్రీగా కొంతకాలం పురుషుడిగా ఉండే లక్షణం ఇది. కొన్ని జంతుతెగలలో ఈ లక్షణం కన్పిస్తుంది. ఊర్వశి శాపం వలన అర్జునుడికి ఇటువంటి స్థితి కలిగింది. అది అజ్ఞాతవాస కాలంలో అక్కరకు వచ్చింది. కథ కోసం ఇది కల్పన అన్పించినా దీని వెనుక జీవవిజ్ఞాన శాస్త్ర సూత్రం అంతర్లీనంగా ఉంది.

ఘృతాచి అనే అప్సరసను చూసి భరద్వాజుడు వీర్య స్ఖలనం చేసుకున్నాడు. ఆ ఓజస్సును ప్రత్యేక మందసంలో భద్రపరచగా పుట్టిన మగబిడ్డకు ద్రోణుడు అని పేరు పెట్టారు. "ఇక్కడ సమస్య శుక్రకణం నుంచి పూర్తిబిడ్డ పెరిగే అవకాశం ఉందా అని. సాధారణ పరిస్థితులలో అటువంటి అవకాశం లేదు. కానీ ప్రత్యేక పరిస్థితులలో ఏకశుక్రకణం తన్ను తాను విభజించుకుని మరల రెండూ ఏకమై పిండం ఏర్పడి బిడ్డగా పెరిగే అవకాశం ఉందని నేటి పరిశోధనలు రుజువు చేశాయి. ఇటువంటి ఒక అసాధారణ కల్పనను ద్రోణజననం వేళ వ్యాసుడు చేసినట్లు అంగీకరించాలి. అలాగే కృపి, కృపాచార్యుల జననం గురించి, గాంధారికి కౌరవ జననం గాథ గుర్తు చేసుకోవాలి."

కవిత్రయం రాసిన మహాభారతమే కాక ఎర్రన రచించిన హరివంశం, నృసింహపురాణం, తిక్కన నిర్వచనోత్తర రామాయణం వైద్యరంగానికి సంబంధించిన అంశాలకు స్థానం కల్పించాయి. "మూగవారిచేత మాట్లాడించడం, కురూపులను సుందరులుగా మార్చడం, అంధులకు దృష్టి ప్రసాదించడం, కుబ్జను సుందరిగా మార్చడం, ధృతరాష్ట్రునికి చూపు ప్రసాదించడంలాంటి వాటిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సగం జంతువు సగం మానవ ఆకారాన్ని కలిగిన ప్రాణుల కథలు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తాయి. నృసింహ అవతారం ఇందుకు నిదర్శనం. పురాణ కథలు, జానపద కథలు పరస్పరం ప్రభావం చూపుకొంటాయనడానికి నృసింహస్వామి చెంచులక్ష్మిని పెళ్ళాడడం, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సవతుల కయ్యాలను జానపదులు పాడుకోవడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు."

గిరిజనుల ఆయుర్వేద విధానం బసవ పురాణం, శ్రీకాళహస్తి మాహాత్మ్యం గ్రంథాల్లోనూ కన్పిస్తుంది. ఈ రెండింటిలోని సన్నివేశాలు తిన్నని కథకు సంబంధించినవే కావడం విశేషం. రెండింటిలోను కంటి వ్యాధి చికిత్సను గూర్చి ప్రస్తావించబడింది. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలోని ఉడుమూరి కన్నప్ప కథలో కంటి వ్యాధికి చేసే చికిత్సను వర్ణించాడు. శివుని కంటి నుండి నీరు కారగా తిన్నడు కనుగ్రుడ్డుపై ఊదాడట. నాలుక కొనతో గ్రుడ్డుపై అటూ ఇటూ త్రిప్పాడట. గుడ్డుకు

ఆవిరిపట్టి కంటిపై వత్తాడట. కడకంటిని తన చేతితో వత్తాడట. సోమన కన్నప్ప శివునికి చేసిన అనేక చికిత్సలను పేర్కొన్నాడు. అలాగే వాపులకు వాము, తైలము ఉప యోగించినట్లు తెలిపాడు. వాటి తయారీకి వావిల చిగుళ్ళు, ఉమ్మెత్త, ఆముదపు చిగుళ్ళు, జిల్లెడాకులు నీటితో కాపడం మొదలైన వైద్యాంశాలను తెలియజేశాడు. తిన్నడు శివునికి వైద్యం చేసే సందర్భంలో తెలియజేసిన ద్విపదలో వైద్య విధానం ఈ విధంగా ఉంది.

గరళలాంగుళముల గనురెప్పలెత్తి
నెరసున్నదని సారనిష్టించి యూదు
బరగ నాలుక గ్రుడ్డుపై త్రిప్పి త్రిప్పి
యొరయుచు నొరయుచు నొయ్యనజూచు
జీరనిగొని కంటె జేర్చి హత్తించి
చీరెల్ల డరసిన జక్కు వెండియును
నీకడకంట వ్రేలిడి యొత్త నొత్త"

బసవపురాణంలోనే వాపులకు వాయు తైలాలు, వావిలచిగుళ్ళు, ఉమ్మెత్త, ఆముదపుచివుళ్ళు జిల్లే డాకులు, వీటితో కాచడం మొదలైనవి చేసేవారని చెప్ప బడింది.

సాంఘిక ఆచారంగా, సంప్రదాయంగా, నమ్మకం ప్రధానంగా తరతరాల నుంచి వస్తున్న అనుభవ గృహ వైద్యమే జానపద వైద్యం. అందువల్లనే ఇది సాంఘికా చారాలలో భాగమయింది. ఇదే శాస్త్రరూపంలో ఆయుర్వేదమైంది. దీన్ని శ్రీనాథ యుగంలో అనేక మంది కవులు వివరించారు. శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రలో మూర్ఛ నుండి తేరుకోవడానికి చేసే చికిత్సను వర్ణించాడు. బాలచంద్రుని బొంగరం తాకి అన్నమ్మ అనే మహిళ స్పృహ తప్పి పడిపోగా, ఆమెకు తెలివి తెప్పించడానికి కర్పూరం పొడిని బాగా నూరి కస్తూరి గంధం కలిపి కాళ్ళకు చేతులకు పూయగానే ఆమెకు తెలివి వచ్చింది. అలాగే శ్రీకృష్ణ దేవరాయలు తన ఆముక్తమాల్యదలో వైద్యానికి సంబం ధించిన అనేక అంశాలను తెలియజేశాడు. వేసవికాలంలో శరీరానికి చల్లదనాన్ని కల్గించే ఆహార పానీయాలు గూర్చి తెలియజేశాడు.

అప్పట్లో గోవులను కాచే గోపబాలురకు కూడా కొంత కొంత పశువైద్యం తెలిసి ఉండేది. దూడ చచ్చిన ఆవు లను సేపునట్లు చేయడం. కడుపులోవలనే దూడ వచ్చిన ఆవులకు మందులివ్వడం వాళ్లకు తెలుసు. ఆవులకువచ్చే రోగాలపట్టీ ఒకదాన్ని నవనాథ చరిత్రలో చూడవచ్చు.

"నరుదు కన్నును నీరు నాలిక చేర్లు
గురు దెవులును గంటికురుమ కట్టూర్పు
........ ....
మందుల బెట్టరు, మంత్రింప తెవులు
కందువుగని చూడగా నేర్తునొప్ప"

గిరిజనుల్లో, ఆదిమజాతులకు చెందిన అనేకుల్లో సులభవైద్యం బాగా ప్రచారంలో ఉంది. సర్పగంధి, సుగంధపాల వంటి వాటిని రోగాలకు తగ్గట్టుగా ఉప యోగించడం వీరికి అనుభవం వల్ల సిద్ధించింది. అటవీజనం నడిచేటప్పుడు వారి దృష్టి మూలికల మీదనే ఉంటుంది. గాయాలకు, రక్తపోటుకు, గర్భస్రావానికి, గర్భనిరోధానికి గిరిజనుల వద్ద శక్తివంతమైన ఔషధాలు న్నాయి. యానాదులు మొదలైన గిరిజనులు భార్యకు నవమాసాలు నిండగానే పది పన్నెండు రకాల మూలిక లను తెచ్చి సిద్ధంగా ఉంచుకుంటారు. నొప్పులు వచ్చి నప్పటి నుంచి పదవరోజువరకు మంచినీటికి బదులు ఈ మూలికల కషాయాన్నే తాగడానికి ఇస్తారు. దీనివల్ల ఏ జబ్బులూ రావని వారి నమ్మకం. "పెద్దమాను, ఆకు చెముడు, ఎర్రవాలుడు, నల్లమునుకుడు, పొరము మొక్క, నారగోగు, తెల్లబులుగుడు, నల్లబులుగుడు, సోమి, విషబుద్ధి, నేలవేము, చేదుపుల్ల, నేలగుమ్మడి, చిల్ల, బాలింత, సందుమిచెక్కలు" అనేవి వీరు మందులుగా వాడే మూలికలు.

గౌరన తన 'నవనాథ చరిత్ర'లో పశువులకు వచ్చే వ్యాధులు, వాని నివారణా విధానం చెప్పాడు.

మసలక వెడలంగ మందులువెట్టి
పసరంబు ప్రాణంబు పసనుగా గాతు'

...... .....

బనులపాల జ్వరభారపీడితుల
కెసరు రోగంబులు నిష్టింకులింక
వారికి గానని వారికి నాడు"

కరివేపాకు చెట్టులో అన్ని భాగాలకు ఔషధపరమైన ఉపయోగాలున్నాయి. కరివేపాకు ఆకులు, కరివేపాకు కాయలు, వేరుపై బెరడు, కాండంపై బెరడు ఇలా అన్నిటినీ ఔషధ రూపంలో వాడతారు. కరివేపాకు ఒక ప్రధాన ద్రవ్యంగా తయారయ్యే ఆయుర్వేద ఔషధాలు - జాత్యాది తైలం, జాత్యాది ఘృతం. కరివేపాకు ముదురు ఆకుల్లో ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. లేత ఆకుల్లో సుగంధిత తైలం ఎక్కువ మొత్తాల్లో ఉంటుంది.

తెనాలి రామలింగడు తన 'పాండురంగ మహాత్మ్యం'లో గృహవైద్యానికి సంబంధించిన అంశాల్ని పేర్కొన్నాడు. 'గోర్వెచ్చ చమురంటు కొనిరి మస్తకముల జలకమాడిరి నిశామిళితవారి" అనే పాదాల్లో తలంటు స్నానం వేడిని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడే వైద్యసూత్రం ఇమిడి ఉంది. "కుంకుందాని ............ ఆహారం బిడు నిచ్చుటనే" అనే ఆముక్తమాల్యదలోని పద్యంలో విష్ణు చిత్తుడు శీతాకాలంలో వచ్చిన అతిథులకు ఆయా కాలాలకి అనువైన ఆహార పదార్థాలను వడ్డించేవాడట. మిరియాల పొడి కషాయం, ఊరగాయలు, పచ్చళ్ళు, కారం పదార్థాలు శరీర ఆరోగ్యానికి కొంతవరకు దోహదపడతాయి. పళ్లను తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో వరూధిని పుత్రుడైన స్వారోచి బ్రహ్మమిత్రుని వద్ద ఆయుర్వేద విద్యలు నేర్చుకున్నట్లు వర్ణించాడు. ఆ ఆయుర్వేద విద్య ఎంత గొప్పదో వివరిస్తూ 5వ ఆశ్వాసంలోని "కావబాల గ్రహా .............. సర్వమున్ నేర్చి" అనే పద్యంలో స్వరోచి 8 నెలల కాలంలో బ్రహ్మమిత్రుని వద్ద ఏఏ రోగాలకు చికిత్స విద్య నేర్చుకున్నాడని వర్ణించాడు. పాలవేకరి కదిరీపతి తన శుకసప్తతిలో పచ్చబొట్ల గురించి, అయ్యలరాజు నారాయణకవి హంస వింశతి కావ్యంలో వైద్యంలోని అనేక అంశాలను వర్ణించారు.

ఈ విధంగా ప్రాచీన తెలుగు కవులు తమ తమ కావ్యాలలో సందర్భానుసారం పాత్రల లక్షణాల పరంగానో, కథాకథనంలో భాగంగానో ఆయుర్వేదాంశాలను ప్రస్తావించారు.

# మనిషిలోని మనిషిని చూపిన అల్లం రాజయ్య కథ

- మినుకూరి శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్.

అల్లం రాజయ్య వాస్తవ దృక్పథానికి హేతువగా నిలుస్తుంది వారి సాహిత్యం, ప్రక్రియలు ఏది వ్రాసినా దానిలో నిర్దిష్టత, నిబద్ధత, నిర్భీతి కన్పిస్తుంది వారి రచనలో. రాజయ్య సమాజాన్ని పూర్తిగా అనేక కోణాల్లో దర్శించిన అనుభవం అంతా వారి రచనల్లో అంతటా కన్పిస్తుంది. రాజయ్యలో పరిశీలన, అవగాహన అనే రెండు కోణాలు ప్రబలంగా ప్రభావం చూపిన కారణంగా రచనా వ్యాసంగాన్ని జీవితంలో భాగంగానే నిర్వహించారనడానికి వారి సాహిత్యం ద్వారా ఎన్నో ఉదాహరణలను దర్శించవచ్చు. తెలుగు సాహిత్యంలో రాజయ్యపై సాహిత్యంపై ఇతరుల ప్రభావాల కన్నా వారి స్వీయ భావాలు ఎంతగానో ప్రాధాన్య ప్రభావాన్ని చూపాయి.

తెలంగాణ గడ్డపై ఎలాంటి వివాదాలకు తావు లేకుండా తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకున్న రచయిత అల్లం రాజయ్య. కష్ట సుఖాలు ం సమాజంో అనుభవంగా మలచుకున్న నేపథ్యంలో రాజయ్య కలం పట్టారు. తండ్రి ద్వారా బీదవారి జీవితాలను దగ్గరగా పరిశీలించే అవకాశం రాజయ్యకి కలిగింది. అల్లం రాజయ్య జీవితంలో ఉద్యోగానికి ముందటి జీవితం, ఉద్యోగ జీవితం అనే రెండు పార్శ్వాలు ప్రాధాన్యత వహించాయి. ఈ రెండింటి అనుభవాల ఫలితంగా వారిలోని రచయిత ప్రబల రచనకు దోహదపడ్డాడు. తెలంగాణ సమాజాన్ని అతి దగ్గరగా పరిశీలించిన అనుభవం దాని తాలూకు ప్రతిఫలనాలు అన్నీ రాజయ్యలో స్థిర ఆలోచనలకు, రచనామూర్తిత్వానికి అద్దం పట్టాయి.

1977 కథా రచయితగా ఎత్తిన అవతారం నేటి వరకూ వారిని తెలంగాణ సామాజిక కోణంలో ఆలోచించే మార్గాలకు దగ్గర చేయడమే కాక వారి కథా మార్గం జనాదరణ మెండుగా పొందగల్గింది. 1977 లో వారు వ్రాసిన తొలికథ "ఎదురు తిరిగితే" కథా తెలంగాణ వ్యవసాయ విప్లవోద్యమ కథలకు నమూనా అయింది. ఈ కథ వ్యవసాయ విప్లవోద్యమంలోని వివిధ దశలను, కోణాలను చిత్రిస్తూ మౌఖిక ధోరణిలో సాగుతుంది. కారణంగా ఈ కథ సజీవంగా ప్రజలను చేరగలిగింది. వంద కథలను వారి కలం బలం ద్వారా అందించేందుకు సాయపడింది.

రాజయ్య దృష్టి అంతా బాధితుల పక్షానే నిల్చింది. భూస్వాముల భూదాహ పరిణామాలు బీదవారిని విధి లేక కార్మికులుగా మారేలా చేసిన వైనాలు, భూమి నుండి, భుక్తికోసం బొగ్గుగనికి దగ్గర చేసిన వైనాలు, అన్నీ రాజయ్య కథలకు వస్తువులయ్యాయి.

రాజయ్య కథలనే కాక నవలలు వ్రాశారు. కొలిమంటుకున్నది, ఊరు, అగ్నిగుండం, ఊరేగింపు, అగ్నికణం నవలలు భూమి, భుక్తి కోసం ప్రజలు సాగించిన జీవన్మరణ పోరాటాలు, ఉద్యమాల నేపథ్యంలో వ్రాసినవే. ఈ నవలల్లో 'అగ్నికణం' నవలను ప్రధానంగా స్త్రీ సమస్యలను తీసుకొని రచించారు రాజయ్య. సమస్యల నేపథ్యంలో కుటుంబంలో, జీవితాల్లో వచ్చిన మార్పులు, విలువల్లో వచ్చిన విషపరిణామాలను చిత్రిస్తూ, దానికి కారణంగా ఉన్న దోపిడీ విధానాలను సూచించే కథ 'మనిషి లోపలి విధ్వసం'.

ఈ కథ ద్వారా మనిషిలోని మనిషికి తెలియని ఎన్నో అంశాలు అతనికి తెలియని దారిలో అతడ్ని నడిపిస్తున్నాయని మనోవైజ్ఞానికుడు, డాక్టర్ అయిన ఫ్రాయిడ్ చెప్పిన విషయాన్ని ఈ కథలో పాత్రల ప్రవర్తనల ద్వారా రాజయ్య తెలియజేశారు.

కథా పరంగా పరిశీలిస్తే రాజారాం ఎల్లమ్మల కొడుకు రైలు క్రిందపడి చనిపోవడం, ఆ విషయం తెలిసి రాజారాం రావడం విగత జీవిగా కొడుకుని చూసి ఏడ

వడంతో ముగుస్తుంది. అయితే ఈ కథలో రాజారాం బాధ్యతారాహిత్యం అతని విపరీత ప్రవర్తన అతడిని భార్యకు దూరం చేసింది. అతడి కొడుకు అజమాయిషీ లేక, తల్లి పెంపకం ద్వారా బాధపడతాడు. చిన్నప్పటి నుండి అతడు పడ్డ కష్టాలు అతనిలో నిర్వేదాన్ని నింపాయి. దాని ఫలితంగా తనలో తాను మాట్లాడు కుంటూ సర్వం పోయినవాడిలాగా ఉంటూ, పిచ్చిగా తిరగడం ఇవన్నీ అతని మానసిక స్థితిని దెబ్బ తీశాయి. తండ్రి ఉండి కూడా పట్టించుకోక పోవడం ఆ పిల్లవాడ్ని చావుకు దగ్గర చేశాయి. ఈ తప్పిదాలకు కారణం తానని తెల్సినా కొడుకు శవం చూసినప్పుడైనా నోరు విప్పలేదు రాజారాం. కొడుకును తన దగ్గర ఉంచుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదనుకుంటాడే కానీ, తన బాధ్యతా రాహిత్యం, విచ్చలితనం దాని తాలూకు ప్రవర్తన కారణం అని తెలుసుకోవడు. తన జీవితం దాని తాలూకు కలలు అన్నీ విధ్వంసం కావడానికి కారణం ఎవరని ఆలోచిస్తాడు. బిగ్గరగా ఏడ్వాలనుకున్నా, ఏడ్వలేక పోతాడు. తనను నిందించి కొడుకు శవంతో వెళ్ళిపోయిన భార్యే అదృష్ట వంతురాలనే నిర్ణయానికొస్తాడు. తండ్రిగా తన కొడుకు అంత్యక్రియలకు వెళ్లలేని స్థితిని తట్టుకోలేక పోతాడు. నిజంగా తాను ఆ మరణించిన కొడుక్కు తండ్రేనా? అని లోపల ప్రశ్నించుకొని ఘర్షణకు లోనౌతాడు రాజారాం.

చివరకు ఆలోచనలు ఇంకిపోయిన రాజారాంకు ఏడుపొస్తుంది. తనకు తానుగా అంతరంగంలో పూర్తిగా విధ్వంసానికి గురైన ఒక నాటి రైతుబిడ్డ రాజారాం, కూలిగా తన బతుకు అదుపు తప్పిన స్థితిలో ఏడుస్తున్నాడు. గతం కళ్ళముందు కదిలి, వర్తమానం విధ్వంసంలోకి తనను నెట్టేసిన క్షణాలను అతడు జీర్ణించుకోలేకపోతున్నాడు. తనని, తనకు జరిగిన విధ్వంసాన్ని అర్థం చేసుకుని హత్తుకోగల మనిషికోసం చూస్తున్నాడు. ఆ మర్రిచెట్టు దగ్గర చీకట్లో మరెవరైనా వస్తారా? అన్నది ప్రశ్నార్థకమై కథను ముగింపుకు చేరుస్తుంది.

కథ చిన్న ఊళ్ళో రైల్వే స్టేషన్ దగ్గర ప్రారంభ మౌతుంది. ప్రధానంగా ఇతివృత్తకోణంలో పరిశీలిస్తే, పల్లెలు, వృత్తుల విధ్వంసం, రైతు కూలీగా మారే స్థితి, బొగ్గు గనులలో మనుషుల కష్టాలు, వీటికి పరిష్కార దశలో వచ్చిన విప్లవోద్యమం అన్నీ ఈ కథలో కలిసి భాగస్వాములయ్యాయి.

యువకుడు రైలు కిందపడి చనిపోవడం ఒక అకాల అసహన మరణంగా రచయిత తెలియచేస్తారు. ఆ రైల్వేస్టేషన్ పెద్దపల్లికి దగ్గర్లో నైజాం కాలంలో కట్టిన పాతస్టేషన్ ఇక్కడే కథ ప్రారంభమౌతుంది. మర్రిచెట్టు దగ్గర ముగుస్తుంది.

ఆ కుర్రవాడు రైలు కిందపడి చనిపోతే పేగుబంధం కానివాళ్ళంతా బాదకు లోనయ్యారు, సంఘర్షణ పడ్డారు. వారి అంతరంగం రణరంగం అయింది. ఈ నేపథ్యంలో రాజయ్య శ్రీ శ్రీ భావజాలమైన 'రణ రంగం కానీ చోటు భూస్థలమంతా వెదికినా దొరకదు' అన్న వాక్యాల్ని కథలో ప్రవేశ పెట్టారు. నిజానికి శ్రీ శ్రీ చెప్పిన పై భావం ఉత్తర తెలంగాణలో శ్రమదోపిడీకి, భూస్వామ్య పీడనకు, మార్కెట్ మాయకు బలైన ప్రజల అంతరంగాలన్నీ రణక్షేత్రాలే అన్న సత్యం స్పష్టం అవుతుంది.

ఈ కథలో రాజయ్య కథాంశంలోని బరువును విషా దాన్ని వ్యక్తీకరించే విధంగా కథా వాతావరణాన్ని సృష్టించి దానికి తగిన విధంగా వర్ణనలు చేశారు. ఈ వర్ణనలు చేయడం వారి కథా శిల్పంలోని భాగంగా చెప్పుకోవచ్చు. తెలంగాణలోని పల్లెల విధ్వంసాన్ని దానితో ముడిపడ్డ మనుసులోపలి విధ్వంసాన్ని తమ ప్రతిభకు అద్దం పట్టే విధంగా తీర్చి దిద్దారు.

ఈ విధంగా మనిషిలోని మనిషిని ప్రవర్తన, ప్రకృతుల పరంగా ఈ కథను విషాద కోణంలో నడిపి తమ ప్రతిభను కథకులుగా హృదయ వాదిగా కనపరిచారు అన్న సత్య నిరూపణే ఈ నాలుగు మాటలు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# దశకంఠుడు

- **ఆది ఆంధ్ర రామాంజనేయులు,** పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే గ్రంథాలు మహాభారతం, రామాయణం. ఆదికవి వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణం సుప్రసిద్ధం. ఈ కావ్యమును భారతీయ భాషలలో అనువాదం చేశారు. దీనిని భక్తి వేదంగా పఠించి, పారాయణం చేసి, పరవసించి తరించినవారు చాలా మంది ఉన్నారు. వారిలో గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం ప్రత్యేకమైనది. ఈ కావ్యంలో దేవదానవ, మానవపాత్రలు ఉన్నాయి. ఇందులో ప్రసిద్ధిమైన పాత్ర ప్రతినాయకుడు రావణుని గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాము.

శ్రీమద్రామాయణ మహాకావ్యంలో ప్రతినాయకుడు రావణుడు. శ్రీ మహావిష్ణువు భూలోకంలో శ్రీరాముడిగా అవతారం ఎత్తడానికి కారణమైనవాడు రావణుడు. విశ్రవసువు కైకసితో "ప్రేయసీ నీవు ఎన్నిసార్లు ఋతి మతివైతివి చెప్పు, నీకు కందరపుత్రులను విచ్చెదనెను"' అనగా ఆమె పదకొండుసార్లు అయితినని చెప్పి నాకు అంతమంది అవసరం లేదు. ఒక కుమారుడు, ఒక కూతురు చాలు అని కోరుకున్నది. ఆమె కోరిక ప్రకారం పది తలలు గల రావణున్ని, కుమార్తె శూర్పనఖను ప్రసాదించాడు. రావణుడు పూర్వజన్మలో హిరణ్యకశపుడు.

రావణుడు జన్మించినప్పుడు రక్తవర్షం కురుసెను. గ్రద్దలు అరిచాయి. దేవతలు కూడా భయపడ్డారు. రావణుడు పదితలలతో జన్మించాడు. అందవల్లనే ఇతనికి దశకంతుడు, దశగ్రీవుడు అనే పేర్లున్నాయి. రావణుని భార్య మండోదరి. వీరి కుమారుడు ఇంద్రజిత్తు. ఇంకా అతని తమ్ములు కుంభకర్ణుడు, విభీషణుడు. అతని చెల్లెలు శూర్పనఖ.

రావణుడు వేదవేదాంగాలను చదివినవాడు, గొప్ప శివభక్తుడు, మహాయోధుడు, శత్రుజనభయంకరుడు, మిత్రజన రక్షకుడు, లంకాదీపానికి రాజు, రాజనీతితత్వం కలవాడు, యుద్ధతంత్రనిపుణుడు, తపస్సు సంపన్నుడు, పరమమూర్ఖుడు, పరమనైష్ఠికుడు.

రావణునికి మంచి గుణాలతోపాటు చెడ్డగుణాలు న్నాయి. అయితే అతని వ్యక్తిత్వంలో రెండు బలహీనతలు అవి. స్వార్థంతో కూడిన అతిశయం, కామం ఈ రెండు కారణాల వల్ల అతన్ని దుష్టులు కోవలోకి చేర్చారు. అయితే ఈ రెండు గుణాలు జన్మతహ వచ్చాయి. తల్లిదండ్రుల స్వభావం వల్ల సంక్రమించాయి. తండ్రి వైపు నుండి బ్రాహ్మణ లక్షణాలు, తల్లి వైపు నుండి అసుర లక్షణాలు వచ్చాయి. అందువల్ల స్వాతిశయం కామంతో విజృంభించాడు.

స్వాతిశయం చాలా విచిత్రమైన గుణము. ఇది అహంకారానికి ప్రతిరూపం. ఇది ఇతరులు తమ కంటె గొప్పవారు అంటే ఏ మాత్రము సహించదు. అందరి కంటె తానే గొప్పగా ఉండాలని కోరుకుంటారు. అనుకున్నది ఏదైనా సరే సాధించేవరకు నిద్రపోరు, వీరు నిలకడగా ఉండరు. కామ, క్రోధ, మద, మాత్సర్యాలు స్వాతిశయార్థకి సంబంధించిన లక్షణాలు.

ఇక రెండవ గుణం కామం. ఇది ఒక పెద్ద వ్యసనం లాంటిది. దీనికి వాయి-వరుస, హద్దు-పద్దులు ఉండవు. మంచి - చెడులు తెలియవు. ఇది ఒక విచిత్రమైన దప్పిక త్రాగే కొలదీ ఎక్కువ అయ్యే దప్పిక ఇది మనస్సులో ఏర్పడుతుంది. అంటే వ్యక్తి మరణంతోగాని ఆ కోరిక తీరదు. ముసలితనం వల్లన రక్తంలో శక్తి నశించిన కామం మాత్రం చావదు.

దశగ్రీవుని స్వార్థమును తల్లి బాల్యదశ నుండి ప్రోత్సహించింది. "రావణా! నీవు కుబేరుణి కంటే గొప్ప

వాడివి కావాలి'' చెప్పగానే బ్రహ్మ గురించి ఘోరంగా తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చుకోని బ్రహ్మ ప్రత్యక్షమై నీకు ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు. స్వామీ నాకు మరణం రాకుండా వరం ఇవ్వండి అని కోరుకున్నాడు. దశగ్రీవా! అది సాధ్యం కాదు. ఏ ప్రాణికైనా మరణం తప్పదు. కావున మరొక వరం కోరుకోమన్నాడు. రావణుడు ఒక క్షణం ఆలోచించి, దేవ, ధానవుల నుండి మరణం లేకుండా చేయి అన్నాడు. ఇక మిగిలిన మానవులు నా దృష్టిలో గడ్డిపోచలు లాంటివారు అని అన్నాడు. వెంటనే బ్రహ్మ వరం ఇచ్చాడు. ఈ వరం కారణంగా అతనికి ఎదురు వెళ్ళడం ఎవరి వల్ల సాధ్యం కాదు. దశగ్రీవునిలో ఉండే స్వాతిశయం, కామతత్వలను అతని తాత కూడా రెచ్చగొట్టాడు. వరాలు పొందిన మను మడిని చూసి సుమాలి అభినందించాడు.

తరువాత కొంత కాలానికి ప్రహస్తుడు రావణుని వద్దకు వచ్చి అతని స్వాతిశయాన్ని రెచ్చగొట్టాడు. విష్ణుమూర్తి సహాయంతో అథితి కుమారులు రాక్షసులును పారద్రోలి లంకానగరం ఆక్రమించాడు. వారి నుండి అసురులను కాపాడి, కుబేరునితో యుద్ధం చేసి లంకా నగరం ఆక్రమించాడు. రావణుని పట్టాభిషేకం జరిగిన తరువాత చెల్లెలు శూర్పణఖను విద్యజ్జిహ్యానికిచ్చి వివాహం చేశాడు. రావణుడు మయుని కూతురు మండో దరిని వివాహం చేసుకున్నాడు. వజ్రజ్వాలకు కుంభ కర్ణునికి, వివాహం చేశాడు. సరమకు విభీషణునికి వివాహం జరిపించాడు. రావణుని పరిపాలన మూడు పువ్వులు ఆరు కాయలుగా లంకా రాజ్యాన్ని పరిపాలిం చాడు.

దశకంఠుడు దేవతలను, మహర్షులను పీడించడం, నందనవనాన్ని నాశనం చేయడం ఆ సమయంలో కుబేరుడి వచ్చి రావణా! నీవు అధర్మం కార్యాలపై మనస్సును మల్లించకు. దేవతలు, మహర్షులు నిన్ను చంపడానికి ఉపాయం ఆలోచిస్తున్నారు అని హితువు పలికాడు. కాని అతని మాటలను పెడచెవిన పెట్టి, ముల్లోకాలను జయించాలనే కోరికతో కుబేరుని పుష్పక విమానాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

రావణుడు విజయగర్వంతో పుష్పక విమానం ఎక్కి సుంధరమైన ప్రదేశాలున్న పర్వతాల మీదికి వెళ్ళాడు. అనుకోకుండా పుష్పకవిమానం ఆగిపోయింది. అంతలోనే నందీశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. రావణా! ఈ పర్వతం మీద పార్వతీ పరమేశ్వరులు విహరిస్తున్నారు. దేవ దానవ యక్షగంధర్వాదులు ఎవరు కూడా ఇక్కడకు రాకూడదు. నీవు వెనుకకు తిరిగివెళ్ళు అన్నాడు. ఆ మాటలను వినగానే దశగ్రీవుడుకి కోపం వచ్చింది. కళ్ళు ఎర్ర చేసి పుష్పక విమానం దిగాడు. గంభీర, ధీర, గర్వమదంతో ముందుకు వచ్చి నందీశ్వరున్ని ముఖంలోకి చూసి పకపకమని నవ్వాడు. ఓరే కోతిమూతివాడా! ఎవడురా? ఆ పరమేశ్వరుడు? అని ఎగతాళి చేశాడు! నందీశ్వరుడికి కోపం వచ్చింది. దశగ్రీవా! నిన్ను ఇప్పుడే చంపగలను. నీ పాపం పండుతున్నది. నీ చావు నీవే కోరి తెచ్చుకుంటు న్నావు. నన్ను కోతిముఖం వాడు అని ఎగతాళి చేస్తావా? ఈ కోతులే నీ వంశాన్ని నాశనం చేస్తాయి అని శపించాడు.

''వనచరు చే చేటు వచ్చు బొమ్మనుచు
గొనగొని నందిదా కోపించి నీకు'' - (1270)

రావణుడు అహంకారంతో ''ఓరే పశుపతి! నీ పర్వతం నా విమానాన్ని అడ్డుకుంది. దాన్ని పెకలించి వేస్తాను'' అని ఆ పర్వతాన్ని పట్టుకొని కదిలించగా ఆ పర్వతం కదిలింది. పార్వతి భయపడింది. పరమేశ్వరుని మెడను కౌగలించుకున్నది. పరమేశ్వరుడు నవ్వుతూ కదిలే పర్వతాన్ని కాలిబొటని వ్రేలితో గట్టిగా నొక్కినాడు. దశ గ్రీవుని చేతులు పర్వతం క్రిందపడి నలిగాయి. ఆ నొప్పికి అతడు భయంకరంగా కేక పెట్టాడు. ఆ అరుపుకు ముల్లోకాలు అదిరిపడ్డాయి. అతని ప్రక్కనున్న ప్రహస్తా దులు రావణుని బాధను చూశారు. ఆ బాధ పోవాలి అంటే పరమేశ్వరుని వేడుకోవడం తప్ప మనకు వేరే మార్గం లేదు అన్నారు. వారి సలహా మేరకు పరమేశ్వరున్ని ప్రార్థించగా, ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. 'రావణా' అని

పిలిచాడు. స్వామీ అని దశకంఠుడు తన రెండు చేతులను జోడించినాడు. నీ కంఠస్వరం ముల్లోకాలను కంపింపచేసింది. ఈ రోజు నుండి నీవు "రావణుడు" అనే పేరుతో ఈ లోకంలో పిలువబడతావు. నీవు ఇక్కడ నుండి లంకానగరానికి వెళ్ళు అని పరమేశ్వరుడు అన్నాడు.

రావణుడు హిమాలయాలలో తపోదీక్షలో ఉన్న వేదవతిని చూడగానే కామంతో ఆమెను బలత్కరించాడు. రావణా! నీవు నన్ను తాకడం వల్ల నా శరీరం అపవిత్ర మైనది. నిన్ను అంతం చేయడానికి మరల జన్మిస్తానని వేదవతి అగ్ని ప్రవేశం చేసింది. ఈ వేదవతే సీతగా మరొకసారి జన్మించి రావణునిపై పగతీర్చుకోవడం, తన మరణానికి కారణం. శూర్పనఖ భర్త విద్యుజ్జిహ్వుణ్ణి కూడా చంపాడు. తరువాత వరుణినితో యుద్ధంచేసి విజయం సాధించాడు. చివరికి సూర్య, చంద్రుల మీదకు వెళ్ళగానే బ్రహ్మ ప్రత్యక్ష్యమై నీకు ఎవరి వలన భయం ఉండదని రావణుడికి ఒక మంత్రం ఉపదేశించి, తిరిగి లంకకు వెళ్ళమన్నాడు.

రావణుడు అహంకారంతో, కామంతో లంకానగరంకు పోయేదారిలో అందమైన వనితలను దేవ, గాంధర్వ కాంతలను బలత్కరించి, వారిని విమానం ద్వారా లంకా నగరానికి తీసుకుపోయాడు. ఆ స్త్రీలందరు అతనిని శపించారు. రావణుడు పకపకమని నవ్వాడు కాని అతడు ఏ రోజు చింతించలేదు. అతని కామాన్ని కాటువేసి మొదటి స్త్రీ వేదవతి. రెండవది పతివ్రతల శాపం. ముల్లోకాలను జయించిన రావణుని చూసి మండోదరి ఒక వైపు ఆనందం, మరొకవైపు విచారాన్ని వ్యక్తపరిచింది. ఆ సమయంలోనే నా భర్తను ఎందుకు చంపావని శూర్పణఖ అడుగుతుంది. వీరావేశంతో ఇంటి అల్లుడని చూడ కుండా విజయం సాధించాలనే కోరికతో యుద్ధం మత్తులో అనుకోకుండా విద్యుజ్జహ్యణ్ణి చంపాను. నిన్ను భర్తలేని విధవను చేశాను అని బాధపడతాడు. చనిపోయిన వారు తిరిగిరారు కావున నీవు ఖరదుషాణులతో దండ కారణ్యంలో రాణిలాగా జీవించమని రావణుడు ఇలా ఆమెకు ఒక మార్గం చూపిస్తాడు.

రావణుడు కొన్ని రోజులకు ఇంద్రుని మీదకు యుద్ధానికి వెళ్తుండగా మార్గం మధ్యలో కైలాసపర్వతంపై కుబేరుని చూశాడు. ఆ రాత్రి చంద్రోదయం, పండు వెన్నెలలో సౌందర్యరాశి, శృంగారవతిని! రంభను చూసి మోహంతో కౌగిలించుకున్నాడు. నలకూబరుడు నీకు కుమారుడు, నేను నీ కోడలు అని చెప్పింది. కూతురు లాంటి దాన్ని ఇలా చేయడం అధర్మం, న్యాయం కాదు అని ఎంత ఏడ్చిన వినకుండా ఆమెను చిరిగిన విస్తరిలాగా నలిపేశాడు. జరిగిన విషయం నలకూబరునికి చెప్పగా రావణా! పరకాంతను వారి అనుమతి లేకుండా బల వంతం చేస్తే నీ తల వేయి ముక్కలౌతుందని శపించాడు. తరువాత కార్త్యవీరుడుతో యుద్ధం చేయగా పరాజయం పొందుతాడు. ఇది రావణుని మొట్టమొదటి పరాజయం. అయినా కూడా అతనికి బుద్ధి రాలేదు. ఎక్కడ బల వంతులు ఉంటే అక్కడకు వెళ్ళి యుద్ధం చేసేదాక అతనికి నిద్రపట్టదు. నిలకడ ఉండదు. వాలితో యుద్ధం చేసి పరాజయం పొంది అతనితో స్నేహం చేసి చివరకు లంకానగరం చేరుకుంటాడు. "ఆ సమయంలోనే శూర్ప ణఖ ముక్కు చెవులు తెగి రక్తం కారుతున్న శరీరంతో గట్టిగా కేకలు వేస్తూ, ఏడుస్తూ రావణుని దగ్గరకు వచ్చింది.

"మదిగొంత దలపక మన శూర్పణఖయు
ఆయన పరమాత్మడనక కామించి
పోయి ముక్కును చెవుల్పో కార్చుకొనియె
బరసతియన కాసపడి పట్టి తెచ్చి
కరకరి గులమెల్ల గాల్చెదవీవు"! (1322)

శూర్పణఖ ఆమెకు జరిగిన అవమానం, ఖర దూషణుల మరణం, రాముని మహాత్మ్యాన్ని, సీతాదేవి సౌందర్యాన్ని పూర్తిగా వివరించింది. ఆమె మాటలు విన గానే తోకత్రొక్కిన పాములాగా ఆవేశంతో పైకి లేచి రావణుడు ఆ సభలోనే సీతను అపహరించడానికి వ్యూహం సిద్ధం చేయండి అని మంత్రులకు ఆదేశించాడు.

మరునాడు ఉదయమే మారీచుని దగ్గరకు పోయి మాయమృగం రూపం ధరించి సీతను తీసుకొచ్చేందుకు సాయం చేయమన్నాడు. పరస్త్రీ వ్యామోహం మహాపాపం అని రావణునికి ఎంత చెప్పినా వినలేదు. మారీచుడు మాయమృగరూపం ధరించి సీతను ఆకర్షించి రామలక్ష్మణులను ఆమెకు దూరం చేశాడు.

అంతలోనే రావణుడు కాషాయవస్త్రాలు, కమండలం, యోగదండం, జడలు గట్టిన జుట్టు, చేతిలో ఛత్రం పాదుకాలు అన్నింటిని ధరించి సన్యాసి వేషంలో రావణుడు పర్ణశాల వాకిట్లో నిలబడి సీతను చూసి ఆమె అతిథ్యాన్ని స్వీకరించి సన్యాసినని నమ్మించి సీత బయటకి వచ్చిన వెంటనే ఆమె ఉన్న భూమి చేతితో పెల్లగించి సీతాదేవిని ఎత్తుకొని పోతుండగా, జటాయువు అనే పక్షి ఆమె శోకాన్ని విని రావణున్ని ఎదిరించి పోరాడి చివరికి అతని కత్తి దెబ్బకు రెక్కలు విరిగి తెగి క్రిందకు పడింది. సీతను అపహరించి లంకానగరం అంత:పురంలో ఉంచి, తర్వాత అశోకవనంలోకి పంపాడు. ఆమెకు కాపలాగా రాక్షసస్త్రీలను నియమించాడు. ఆమెను లొంగతీసుకోవడానికి చాలా ప్రయత్నం చేశాడు. రాక్షస స్త్రీలతో కూడా చెప్పించి ఆమెను బెదిరించినా కూడా లొంగలేదు. పతివ్రతల మనసు ఎటువంటి ప్రలోభాలకు లొంగదు. బెదిరింపులకు భయపడదు. పాపం రావణునికి తెలియదు. ఎంతోమంది అందగత్తెలతో భోగాలను అనుభవించాడు. మండోదరి వంటి భార్యను పొంది ఆనందంగా జీవితం సాగుతున్న సమయంలో రావణుని కామవాంఛ జానకిపై పడింది. ఆమెను అపహరించడం "ఆమె ఒక విధి వైపరిత్యం, వినాశకాలె విపరీతబుద్ధి" హనుంతుడు సముద్రాన్ని దాటి రావడం అశోకవనం నాశనం చేయడం. జంబుమాలి, విరుపాక్ష, మహావీరులను చంపడం, సమస్థ సంపదలతో శోభాయమానంగా వెలుగుతున్న లంకా నగరాన్ని కాల్చివేయడం, నలుడు సేతువు నిర్మించడం, రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, వానరవీరులతో భల్లూకసేనలతో కలసి సముద్రం ఒడ్డున యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు. అయినా రావణుని మనస్సు మారలేదు అతనికి మైథిలిపై వ్యామోహం తగ్గలేదు.

శుకషారణ గూఢాచారులను వానర సైన్యాన్ని ఎంత ఉందో తెలుసుకొని రమ్మన్నాడు రావణుడు. వారు రాముని మహాత్యమును పరాక్రమాలను రావణుడికి చెప్పారు. అతనితో యుద్ధం చేయడం కంటే శాంతి యుతంగా సీతను రామునికి అప్పగించడం మంచిది. తల్లి కైకసి కూడా రాముడు మానవుడు కాదు. అనేక మంది రాక్షసులను చంపినవాడు. నా పినతండ్రి మాల్యవంతుడు, బ్రహ్మ ఇచ్చి వరం తెలిసి, శ్రీహరి దేవతల కోరిక మేరకు నిన్ను చంపడానికి రాముడుగా అవతరించాడని కైకసి రావణునికి చెప్పింది. రామునికి ఎదురుపడక సీతను అపహరించడం జరిగిన రోజే రావణుడు ఓడిపోయాడని వివరించింది. బ్రహ్మవరం కోరినప్పుడు నరులను, వానరులు గురించి ప్రస్తావన చేయనందుకే నీకు ఈ పరిస్థితి దాపరించిందని అంటుంది.

రామరావణయుద్ధం ప్రారంభమైనది. ఇరుపక్షాలకు ఘోరయుద్ధం జరుగుతూ ఉంది. యుద్ధభూమి రక్తపు మడుగై పారుతోంది. రావణుడు తన కుమారుడు ఇంద్రజిత్తుని యుద్ధానికి పంపెను. అనేక మాయలు తెలిసిన వాడు కనుక అదృశ్యమై ఆకాశం నుంచి బాణాల వర్షం కురిపించెను.

"దనుగానరా కుండ దర్పంబు మెరపి
వినువీధి గడు బెక్కు విధములు దిగిరి (2401)

రామలక్ష్మణులను నాగపాశబద్ధులను చేశాడు. వారు ప్రాణాలు విడిచారు అని భ్రమించి తండ్రికి ఆ శుభవార్త చెప్పాడు. రావణుని ఆనందానికి అవధులు లేవు ఇక మైథిలి నాదే అనుకున్నాడు. సంతోషంలో మునిగి పోయాడు. అయితే అతని సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. రామలక్ష్మణులు మూర్చిల్లారే కాని, మరణించలేదు. వారిని నాగపాశాలనుంచి గరుత్మంతుడు తొలగించాడు. ఈ విషయాన్ని తన గూఢాచారులైన శుకషారణులను పంపించి జరిగిన విషయం తెలుసుకొని, రావణుడు

జీవితంలో మొదటిసారిగా భయపడ్డాడు. మరుసటి రోజు యుద్ధభేరి మోగింది. ఇంద్రజిత్తుడు సైన్యంతో రాగా ఎదురుగా లక్ష్మణుని చూసి ఆశ్చర్యపోయాడు. ఇద్దరికి భయంకర యుద్ధం జరిగింది. చివరిగా లక్ష్మణుడు దివ్యాస్త్రాలు ప్రయోగించగా ఇంద్రజిత్తు తల తెగి నేలపై పడింది. ఇంద్రజిత్తు మరణం రావణుని మనసు కలచి వేసింది. రాముని మీద పగ పెంచుకొని ధూమ్రాక్షున్ని రామలక్ష్మణులపైకి యుద్ధానికి పంపినాడు. హనుమంతుడు ధూమ్రాక్షుని పైకి ఒక గిరి శిఖరాన్ని విసిరినాడు, వాడి తలపగిలి మరణించాడు. తరువాత రావణుడు వజ్రదంష్ట్రున్ని పంపగా అంగదుడు ఎదిరించగా పారిపోయెను. ఆ తరువాత వరుసగా అకంపనుడు, నరాంతకుడు, దేవాంతకుడు మొదలైన వారు యుద్ధ రంగంలో మరణించారు.

మరునాడు ఉదయం రావణుడు తన సోదరుడు కుంభకర్ణునికి కబురంపినాడు. అన్న ఆజ్ఞానుసారం కుంభకర్ణుడు యుద్ధానికి బయలుదేరినాడు. అతని ఆకారం చూసి వానరసైన్యం భయపడింది. వానరసైన్యం నిరుత్సాహపడక ముందే వాడిని చంపాలని రాముడు వానిపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. కుంభకర్ణుడు పర్వతంలాగ నేలపై కూలిపోయినాడు. తరువాత ప్రహస్తుడు యుద్ధరంగంలో పోరాడి చివరికి నీలుడి చేతిలో మరణించాడు. ప్రహస్తుని మరణవార్త వినగానే రావణాసురుడు నిలువెల్ల క్రుంగిపోయాడు. చివరకు రాముడే దశకంఠుని మీదకి రాక తప్పలేదు. రావణుడికి హనుమంతుని మధ్య ఘోరంగా యుద్ధం జరిగింది. దశముఖుడు తన బాణాలతో మారుతిని గాయపరిచాడు. అందువల్ల రామునికి కోపం వచ్చి రావణుని రథచక్రాలను ముక్కలు ముక్కలుగా చేసి, రథసారథున్ని కూడా చంపాడు. రామబాణం రావణుని వక్షస్థలం మీద పడగానే సొమ్మసిల్లాడు. అతని కిరీటాన్ని కూడా పడకొట్టాడు. రాక్షసేశ్వరా! చాలా అలసిపోయావు. కావున నీవు విశ్రాంతి తీసుకొనిరా. అప్పుడు నా బలం ఏమిటో చూపిస్తాను అనే సరికి రావణుడు తల దించుకొని వెళ్ళాడు. అతని మనస్సు చాలా బాధపడింది.

రావణుడు తిన్నది సామాన్యమైన దెబ్బకాదు. ఆ అవమానం మరచిపోలేనిది. ఆదెబ్బకు గత విషయాలన్ని గుర్తుకువచ్చాయి. రావణుడు బ్రహ్మవరాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. మానవుల వల్ల చావు లేకుండా వరం అడిగి ఉంటే బాగా ఉండేదని అనుకున్నాడు. అనరణ్యుని శాపం గుర్తుకు వచ్చింది. వేదవతి, నందీశ్వరుడు, రంభాదుల శాపాలు గుర్తుకు వచ్చాయి. మనస్సులో కూడా కలవరపడ్డాడు. తన తమ్ముళ్ళు కుంభకర్ణుడు, విభీషణుడు పలికిన హితపలుకులు గుర్తుకొచ్చాయి. ఇంకా తన భార్య మండోదరి సమయం వచ్చినప్పుడు రామునితో యుద్ధం మానుకోమని, సీతాదేవిని అప్పగించండి అని చాలాసార్లు ప్రాధేయపడిన సందర్భాలు గుర్తుకొచ్చాయి.

రావణుడు రెండవసారి యుద్ధభూమికి అతి భయంకర అస్త్రాలను ధరించి, అగ్నిగోలం వంటి అష్టాశ్వరథంపై వచ్చి రామలక్ష్మణులను ఎదిరించాడు. ఘోరాతిఘోరంగా బాణాల వర్షం కురిపించాడు. రామరావణ యుద్ధం పగలు, రాత్రి అని తేడా లేకుండా జరుగుతూంది. రావణునికి ప్రాణం పోయినప్పటికీ తన కర్మఫలం చేత మరల పుట్టేటట్లు రావణుని మెడపై కొత్త తలలు మొలుస్తుంటాయి. అది చూసిన రాముడు ఆశ్చర్యపోతాడు. ఇదంతా అతని తపస్సు ఫలమనుకొంటాడు. దశముఖుడు దశముఖాలతో హూంకరించి రామున్ని ఎదురిస్తాడు. అయితే ఇదంతా పూర్వం తనకున్న వరమని గుర్తు చేస్తాడు విభీషణుడు.

రావణునికి బ్రహ్మవర ప్రభావంతో ఇలా తిరిగి తిరిగి తలలు మొలుస్తున్నాయంటాడు. తన సోదరుడైన విభీషణుడు, అతని శరీరంలోని నాభియందు ''అమృత భాండం'' ఉందని దానిని నిర్వీర్యం చేస్తేనే రావణుడు మరణిస్తాడని వివరించాడు. అయితే అమృతభాండాన్ని నిర్వీర్యం చేసేందుకు ఆగ్నేయాస్త్రాన్ని ఉపయోగించమని

రామునుతో చెబుతాడు. బహుశా దీన్ని దృష్టిలో ఉంచుకొనే - జానపదుల సామెతైన "ఇంటిగుట్టు - లంకకు చేటు" అని పుట్టుకొచ్చినట్లు చెప్పవచ్చు.

రావణుడు రణరంగంలో పిరికివాడిలా మరణించ లేదు. యుద్ధంలో మహోత్సాహాన్ని ప్రచండపరాక్రమాన్ని ప్రదర్శించి నిర్భయంగా పోరాడి ప్రాణాలు వదిలాడు. ముల్లోకాలను గడగడలాడించిన రావణుడు యుద్ధంలో క్షత్రియపద్ధతులను పాటించి వీరమరణం పొందాడు. వీరుడు యుద్ధంలో చంపడానికి, శత్రువు చేతిలో చావడానికి రెండింటికి సిద్ధంగా ఉంటాడు. ఎప్పుడూ గెలుస్తూనే ఉండడం ఎవరికి సాధ్యం కాదు. అందుకే యుద్ధంలో మరణించిన వారి గురించి బాధపడకూడదని పెద్దలు చెబుతుంటారు.

**ముగింపు :**

మన హిందూ సంప్రదాయం ప్రకారం భారతీయులు పరమపవిత్రంగా భావించే దాంపత్య జీవితాన్ని, పాతివ్రత ధర్మాన్ని భగ్నం చేయడానికి పూనుకున్నవాడు రావణుడు. ఎంతటి ప్రజ్ఞావంతుడైనా, గొప్ప పదవిలో ఉన్నా, ఎంత అంగబలం, అర్థబలమున్నా ఆ వ్యక్తికి స్త్రీలోలత. జూదం, మధ్యపానం, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థ దూషణం అనే సప్తవ్యసనాలలో ఏ ఒక్కటి ఉన్నా ఈ భూమి మీద ఏ వ్యక్తికైనా అతని జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. కావున దశకంఠుడి పతనానికి ప్రధాన కారణం స్త్రీలపై వ్యామోహం. తన భార్య మండోదరి అందచంద గుణాలలో జానకిని మించినది. అయినా అతడు పరమ పతివ్రత శిరోమణి మైథిలిని అపహరించడం, సొంత తమ్ముడైన విభీషుడిని పరుషంగా మాట్లాడి కాలితో తన్ని లంకానగరం నుంచి వెళ్ళకొట్టాడు. ఏ వ్యక్తికైనా విజయం ముంగిట నిలుపగలిగేవి నీతి, న్యాయం, ధర్మం అని గ్రహిస్తాము. నీతి, న్యాయం, ధర్మాలను తప్పిన ఎంతటి వాడైనా అపకీర్తిని మూటకట్టుకొని లోకంచేత చీత్కారానికి గురౌతాడన్న విషయాన్ని గ్రహించ గలుగుతాము. విభీషుణుడు ధర్మాన్ని రక్షించే నిమిత్తం రామునిపక్షం చేరాడు, అందుకే లంకానగరానికి రాజయ్యాడు. రావణుడు అధర్మం వైపు నడిచినందువల్లనే రాముని చేతిలో ఘోరమైన చావు చచ్చాడన్న విషయం తెలుస్తుంది. భారతంలోని ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి చెప్పిన మాటలలో కూడా ఇవే ప్రతిబింబిస్తాయి. రామాయణ కాలమైనా, భారతకాలమైనా నేటికైనా, మరేనాటికైనా ధర్మం, నీతి, న్యాయం శాశ్వతం.

**ఆధారగ్రంథాలు :**

1. పూర్వగాథాలహరి (1986) : శ్రీ వేమూరి శ్రీనివాసరావు, వెంకట్రామ్ & కో
2. రంగనాథ రామాయణం : గోనబుద్ధారెడ్డి, రాయల్ అండ్ కో పబ్లిషర్స్ & బుక్ సెల్లర్స్ - కడప
3. వాల్మీకి రామాయణం : శ్రీనివాస శిరోమణి(యుద్ధకాండం) (వచనానువాదం)

# శప్తభూమి నవల – ప్రజల విశ్వాసాలు

**– పప్పుల శైలజ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల (అటానమస్), సిద్ధిపేట.

బండి నారాయణ స్వామి గారు రచించిన 'శప్తభూమి' దళిత బహుజన చారిత్రక నవల, ఈ నవల తానా అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను సొంతం చేసుకుంది.

శప్తభూమి నవల కథాకాలం 1775 నుండి 1788 వరకు. ఇందులో చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందిన కల్పిత పాత్రలు అనేకం. పాత్రలతో పాటు తనను తాను ఉదాత్తీకరించుకొని ప్రభువు క్షేమం కోసం సంస్థాన క్షేమం కోసం, ఆత్మార్పణగావించుకున్న బిల్లే ఎల్లప్పజెట్టి, తనను తాను దిగజార్చుకున్న కోడెనీలడు, ప్రేమను దక్కించుకోలేక, దక్కిన ప్రేమను అర్థం చేసుకోలేక సతమతమై చివరకు ఒంటరిగా మిగిలిన ఇమ్మడమ్మ, తననుతాను తెలుసుకుంటూ పది మందికీ సహాయం చేసిన పద్మసాని, మాదిగలలో చైతన్యం కల్గించడానికి పాటుపడిన గురవడు (నిడుమామిడి స్వామి), అగ్రవర్ణాల అన్యాయానికి బలై చివరకు థగ్గులలో చేరిన శరభడు, స్వార్థానికి ప్రతీకగా నిలిచిన నాగప్ప ప్రగఢ, ఇంకా...విలయతాండవం చేసిన కరువు, స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, అస్పృశ్యత, మూఢ నమ్మకాలు, సాంఘికదురాచాలు వీటి చుట్టూ నవలా కథ నడుస్తుంది.

రాయసీమకు చెందిన అనేక చారిత్రక సంఘటనలతో పాటు, గులిగానప్ప పరస, వీరమంటపం, దేవదాసీ వ్యవస్థ, సతీసహగమనం, బసివిని, వంటి చారిత్రక వాస్తవికత ఆధారంగా కల్పిత పాత్రల సృష్టితో ఈ నవల ముందుకు సాగింది. ఈ నవలకు ముందు మాట రాస్తూ "ఈ రచనకు పూనుకోవటానికి ముందు స్వామి (రచయిత) కైఫీయత్తులను, శిలాశాసనాలను, గెజిటియర్లను, వీరగల్లులను మాత్రమే కాక ఆయా కాలఘట్టాలను, సామాజిక నమ్మకాలను, ఆచార వ్యవహారాలను కూలంకషంగా అధ్యయనం చేశారు" అంటారు ప్రఖ్యాత కన్నడ రచయిత వీరభద్రప్ప గారు.

భారతీయ సమాజంలో కొన్ని నమ్మకాలు, కొన్ని మూఢనమ్మకాలు తమవంతు పాత్రను నిర్వహించాయి. అవిద్య వల్ల అజ్ఞానం అలముకోగా వాటికి పేదరికం, కులం, అధికారం తోడై మూఢనమ్మకాలనే విష వృక్షాన్ని పెంచి పోషించాయి. ఈ నవల ఆధారంగా నవలాకాలం నాటి నమ్మకాలను గురించి తెలియజేయడమే నా పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## శుభ సూచకం :

18వ శతాబ్దంలో కన్యలను, బ్రాహ్మణులను, కపిల గోవును దర్శించడం శుభ సూచకంగా భావించేవారు. హండే సిద్ధ రామప్పనాయుడు స్నానానంతరం కన్యలను, బ్రాహ్మణులను, కపిల గోవును దర్శించుకొని, ఆరాధ్య నామావళులను విని సభకు వెళ్ళేవాడు.

## బ్రాహ్మణ హత్య :

బ్రహ్మ హత్య మహాపాతకం అన్న విశ్వాసం ప్రజలలో బలంగా ఉండేది. బ్రాహ్మణులు సమాజంలో ఉన్నత స్థానంలో ఉండే వారు. వీరికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. తప్పుచేస్తే శిక్షించడానికి కూడా భయపడేవారు.

కుట్ర చేసిన బ్రాహ్మణుడైన రామోజి ప్రగడకు కారాగార శిక్ష విధించి, అతనికి సహకరించిన బ్రాహ్మణేతరులకు మాత్రం మరణ శిక్ష విధిస్తాడు పవాడప్ప నాయుడు. కారాగార జీవితాన్ని భరించలేక రామోజి ప్రగడ ఆత్మహత్య చేసుకోగా అది తనని బ్రహ్మహత్యగా వెంటాడుతున్నట్టు భావించి భయపడతాడు పవాడప్ప నాయుడు. బ్రహ్మ హత్య మహాపాతకం దానికి తిరుగులేదని, గోదాన, భూదాన, సువర్ణ దానాలతో పాపం శమించ వచ్చని

బ్రాహ్మణులు సలహా ఇస్తారు. గోదాన, భూదాన, సువర్ణ దానాలతో పాటు అగ్రహార దానం కూడా చేస్తాడు. అయినా పవాడప్ప నాయుడిలో భయం పోలేదు. బ్రహ్మ రాక్షసే తనను వెంటాడుతున్నట్టుగా మీది మీదికి వస్తున్నట్లుగా భ్రమించి తన గొంతు తానే పిసుక్కొని చనిపోతాడు.

### ఆకు పూజ :

భోగేశ్వరీ మాతకు ఐదు రోజుల పాటు ఆకు పూజ చేస్తే కన్నె పిల్లలకు మంచి వరుడు దొరుకుతాడని, సంతానం లేని ఇల్లాండ్రు సంతాన వంతులౌతారని నమ్మేవారు. ఐదు రాత్రులూ గర్భగుడిలోనే నిద్రించాలి. తోడుగా వచ్చిన వారు బయటే పడుకోవాలి. ఆ ఐదు రాత్రులూ (సంతానం కాగోరేవారు) ఐదుగురు గంధర్వులు తమ అంశలతో స్త్రీ గర్భంలోనికి ప్రవేశిస్తారని చెప్పుకునేవారు.

కానీ గుడిలోని పూజారులు భక్తుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారికి మూలికనిచ్చి స్పృహతప్పేట్టు చేసి లైంగిక దోపిడీకి పాల్పడే వారు.

### గులిగానప్ప పరస:

ఈ పరసలో కొత్తగా పెళ్ళి చేసుకున్న మాదిగ జంట గుండ్లు కొట్టించుకొని, గుండు చుట్టూ సున్నపు బొట్లు పెట్టించుకొని, అగ్రహారం స్వామికి అపరాధ సుంకం చెల్లించాలి. నూతన జంట అలా చేయకపోతే తమ ఇంటికి అరిష్టమని, వంశం నిర్వంశం అవుతుందని నమ్మేవారు.

ఒకప్పుడు అగ్రహారంలోని అందగాడైన మాదిగ యువకుడు ఆంగ్ల అధికారి క్రాపును చూసి ఆవిధంగా చేయించుకుంటాడు. దాంతో ఆ యువకుడు మరింత అందంగా కనిపిస్తాడు. అతడిని చూసి అన్ని కులాల పడుచులు అతనిపై మనసు పారేసుకుంటారు. అది అగ్రహారీకులకు కంటగింపవుతుంది. అతడిని ఏ విధంగానైనా శిక్షించాలని ఆలోచించి క్రాపు చేయించుకోవడం నేరమని అతడికి బోడి గుండు కొట్టించి, గుండు చుట్టూ సున్నపు బొట్టు పెట్టించి, గ్రామ బహిష్కరణ చేసి, అగ్రహారంలోని మాదిగలకు కూడా ఒక నియమం పెట్టారు. కొత్తగా పెళ్ళైన మాదిగ జంట గులిగానప్ప పరస రోజు గుండ్లు కొట్టించుకొని, గుండు చుట్టూ సున్నపు బొట్లు పెట్టించుకొని తమకు రెండు కాసులు నేర సుంకం చెల్లించాలని శాసనం చేసారు. ఈ విధంగా గ్రామాధికారులు వేసిన శిక్ష రానురాను విశ్వాసంగా మారిపోయి దానిని వ్యతిరేకిస్తే తమకు కీడు కలుగుతుందన్న నమ్మకం బలపడింది.

### గాలిదేవర జాతర :

గాలిదేవర జాతర జరిపితే వర్షాలు పడతాయని ప్రజలు నమ్మేవారు. ఆ జాతర జరపడం ఎంతో ఖర్చుతో కూడుకున్నదీ, తమ తాహతుకు మించినదీ అయినప్పటికీ ప్రజలు వర్షాలకోసం జరిపేవారు. గ్రామ దేవతల నైవేద్యంగా దేవరపోతును బలిచ్చి పొలిమేరలో పొలి అన్నంచల్లి వాన రానీ గాలి దేవుడా ! చెరువు నిండనీ గాలి దేవుడా ! మమ్మల్ని సల్లంగ సూడు గాలి దేవుడా! అంటూ పూజించి తమ ఇళ్ళలో ఏటలు కోసేవారు.

చెరువులో పల్లె గ్రామస్తులు కూడా వర్షాలు లేక పోవడంతో గాలిదేవర జాతర జరుపుతారు. కానీ ఆ ప్రాంతంలో వర్షమనేదే పడదు.

### అగ్ని దివ్వె పరీక్ష :

పాప పుణ్యాలకు సాక్షిగా అగ్ని దేవున్ని నమ్మేవారు ప్రజలు, ఎర్రగా కాల్చిన ఇనుప గుండును నేరం ఆరోపింపబడిన వ్యక్తి చేతులలో ఉంచి, చేతులు కాలితే ఆ వ్యక్తి దోషిగా కాలకపోతే నిర్దోషిగా ప్రకటించెడివారు.

కంబళి శరభడు ఎర్రకొండాపురంలో నల్ల నాగిరెడ్డి వద్ద పనిచేస్తున్న దళితుడు. అతడిని అందరూ బాలభీముడు అనేవారు. ఆ ఊళ్ళో చిన్న గుండు, నల్ల గుండు, గండ శిల అని మూడు ఎత్తుగుండ్లున్నాయి. ఎవరికీ తెలియని కాలంలో నల్ల గుండు ఎత్తిన మొన

గాళ్ళు ఉండేవారని చెప్పుకునేవారు. దసరా పండగ సందర్భంగా నల్ల నాగిరెడ్డి నల్ల గుండును ఎత్తి ఊరి వారి ప్రశంసలు పొందుతాడు. అది చూసిన కంబళి శరభడిలో నల్ల గుండును ఎత్తాలన్న కోరిక పుడుతుంది. అర్ధరాత్రి ఎవరూ చూడకుండా నల్ల గుండును ఎత్తడానికి వెళ్ళి దాని పక్కనే ఉన్న గండశిలపై దృష్టి పడి దానినే ఎత్తుతాడు. ఇంత వరకూ గండ శిలను ఎత్తిన మొనగాడే లేడు. దానిని చూసిన తలారి ఊరి పెద్దలతో చెప్పి పంచాయతి పెట్టిస్తాడు. ఆ పంచాయితీలో తాను గండ శిలను ఎత్తానని కావాలంటే మళ్ళీ అందరి ముందు ఎత్తుతానని అంటాడు శరభడు. కానీ ఆ గండ శిలను అందరి ముందు ఎత్తితే నల్ల నాగిరెడ్డి కంటే బల వంతుడిగా దళితుడైన శరభడు గుర్తించ బడతాడని, ఒక్కసారి ముట్టుకుంటే మైలపడిన శిల రెండవసారి ముట్టుకుంటే ఇంకెంత మైలపడుతుందో అంటూ దానిని నిరూపించుకునేందుకు అగ్ని దివ్వె పరీక్ష పెడతారు. ఎర్రగా కాల్చిన ఇనుప గుండును శరభడి చేతులలో ఉంచగా అతడి చేతులు కాలి బొబ్బలు వస్తాయి. దాంతో నేరం ఋజువైందని శరభుడిని శిక్షిస్తారు.

## మరుల మందు :

ఎవరికైనా మరుల మందు పెడితే వారు తమను విడిచిపోరని నమ్మేవారు.

హరియక్క కోడెనీలడిని వివాహం చేసుకొని, అతడు తనను విడిచి పెట్టకుండా ఉండడానికి తాంత్రిక క్రతువు నిర్వహించి మరులమందు పెడుతుంది. అయినప్పటికీ కోడెనీలడు హరియక్కను విడిచి వెళ్ళిపోతాడు.

## అస్పృశ్యత :

శూద్రులు చూడడం వల్ల తమ విద్యలు మైల పడతాయని విప్రవినోదులు భావించేవారు. ఒకవేళ ఎప్పుడైనా వారు చూడడం జరిగితే శుద్ధి కార్యక్రమంతో ఆ దోషం నుంచి బయట పడతామని వారు భావించే వారు.

మాదిగలు దేవాలయం ఉన్న కొండ ఎక్కితే వారికి పక్షవాతం వచ్చి కాళ్ళు చేతులు పడిపోతాయని, వారు కోనేటిలో మునిగితే మళ్ళీ పైకి రారని, అసలు సత్రాలలోకి వారు పోనే పోకూడదని, ధ్వజస్తంభం ముట్టగూడదని, దేవాలయంలోకి అడుగు పెడితే తల వేయి వక్కలుగా పగిలి పోతుందని నమ్మేవారు. బ్రాహ్మణులపై మాల మాదిగల నీడ పడితే బ్రాహ్మణులు మైల పడి నరకానికి పోతారని బ్రాహ్మణులు విశ్వసించేవారు.

ఇవన్నీ వట్టి మూఢనమ్మకాలేనని మాదిగలలో చైతన్యం కలిగించడానికి గురవడు (నిడు మామిడి స్వామి) విశ్వ ప్రయత్నం చేస్తాడు.

## వీరమంటపం :

వీర మంటపం ఎక్కి ఆత్మ బలిదానంతో మల్లి కార్జునుని మెప్పిస్తే కోరిన కోర్కెలు తీరతాయన్న విశ్వాసం ప్రజలలో ఉండేది.

వర్షాలు పడక బుక్కరాయ సముద్రం పూర్తిగా ఎండి పోతుంది. కరువుతో ప్రజలు అల్లాడుతుంటారు. దాంతో టిప్పూసుల్తాన్‌కి చెల్లించాల్సిన రూకలు చెల్లించలేక పోతాడు హండే సంస్థానాధీశుడు సిద్ధరామప్ప నాయుడు, సిద్ధరామప్ప నాయకుని వద్ద అమర నాయకునిగా ఉన్న ఎల్లప్ప జెట్టి ప్రభు భక్తితో అనంతపురంలో వర్షం కురిసి బుక్కరాయ సముద్రం నిండాలని, హండే సంస్థానం బాగుపడాలని శ్రీశైలం వెళ్లి వీర శిరో మంటపం ఎక్కి ఆత్మ బలిదానం చేసుకుంటాడు.

అయినప్పటికీ అనంతపురంలో వానలు పడక, చెరువులు నిండక, రూకలు చెల్లించలేక పోవడంతో గుత్తి సుబేదారు సిద్ధరామప్పను బందీగా చేసి తీసుక వెళతాడు. పట్టపు రాణి అతడి కొడుకులూ మరణించడంతో హండే సంస్థానం అంతరించి పోతుంది.

ఇలా ఈ నవల అనేక మూఢనమ్మకాలతో ఆనాటి సమాజానికి ప్రతిబింబంగా నిలిచింది.

**ఉపయుక్త గ్రంథసూచి :** నారాయణ స్వామి బండి : శప్తభూమి

# ఆదివాసీ కథకు నిండు నూరేళ్ళు (1921 – 2021)

- **నేతల లలిత,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

చింతా దీక్షితులు 1891లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా దంగేరు గ్రామంలో జన్మించారు. బి.ఎ., ఎల్.టి. చదివి తొలుత ఉపాధ్యాయులుగా, ఆ తర్వాత డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పని చేశారు. వీరు బాలల కోసం గేయాలు, కథలు విస్తారంగా రాసి బాల వాఙ్మయ బ్రహ్మగా ఖ్యాతిగాంచారు. పౌరాణిక, చారిత్రక రూపకాల్ని, అలాగే ఆదర్శ కథలు, హాస్య కథలు, అధిక్షేపాత్మక కథలు రాసి 'కథక చక్రవర్తి'గా ప్రాచుర్యం పొందారు. ఇంకా అనేక వ్యాసాలతో పాటు భావకవిత్వాన్ని కూడా రాశారు.

సమాజంలో నెలకొన్న విభిన్న అంశాలకు ప్రతి స్పందనగా సాహిత్య సృష్టి చేసినవారిలో దీక్షితులు అగ్రగన్యులు. సామాజిక వ్యవస్థలో అట్టడుగు వర్గాలుగా ఉన్న ఆదివాసీల వెతల్ని 'సుగాలి కుటుంబం' అనే పేరుతో 1921 సంవత్సరంలో కథరాశారు. తెలుగు సాహిత్యంలో ఇదే తొలి తెలుగు ఆదివాసీ కథ. 1922 సం॥లో 'చెంచు దంపతులు' అనే రెండో ఆదివాసీ కథ కూడా వీరే రాయటం విశేషం. అందుకే ఆదివాసీ కథ ఆరంభకుడిగా చింతాదీక్షితులు చరిత్ర సృష్టించారు.

సుగాలీలకు లంబాడీలు, బంజారాలు అనే నామాంతరాలున్నాయి. నిజానికి వీరు ఆదివాసీ తెగల్లో నాగరికతను, సంపదను సంతరించుకున్నవారు. అడవి ఉత్పత్తుల్ని సేకరించి విక్రయించడం, అక్కడ దొరికే ఫలసాయాల్ని ఆహారంగా స్వీకరిస్తారు. అంతేకాకుండా ఈ సుగాలీలు దారి దోపిడీ చేయడం ద్వారా జీవనం సాగిస్తారని, ఆ స్త్రీలు మిక్కిలి అలంకార ప్రియులని, స్త్రీలు పురుషులు కంటే శరీర దారుఢ్యం కల్గి వుంటారని పేర్కొన్నారు.

ఈ కథలో నాయకుడు రూపల్ నాయక్. అతని భార్య చంద్రి. వీళ్ళకి పాలు తాగే పిల్ల మొదల్కొని పదిహేనేళ్ళ వయసు్సు వరకున్న పిల్లలు ఏడుగురు ఉంటారు. వారందరినీ పోషించడం తలకు మించిన భారమౌతుంది. పైగా వర్షాభావంతో కరువు రక్కసి ప్రళయతాండవం చేయడం వల్ల అడవుల మీద జీవించే వారి పరిస్థితి మరీ దుర్భరమౌతుంది.

కనీసం తినడానికి కూడా ఆహారం లభించక పచ్చి ఈతకాయల్ని నానబెట్టి వాటిని దంచి, గింజల్ని పారేసి పొట్టుతో రొట్టెల్ని చేసుకు తినేవారు. అలాగే చింతగింజల పొడితో కూడా రొట్టెలు చేసుకునేవారు. రాక్షసనామ సంవత్సరంలో వచ్చిన ఈ కరువు ఆదివాసీలకే కాదు ఇతర పేదలకు కూడా జీవన వెతల్ని మిగిల్చిందని రచయిత వివరించారు. అలాగే దేవదారు ఆకుల్ని కూరగా చేసుకొని కడుపు నింపుకునే వారికి ఆ ఆకు సేకరణపై కూడా అధికారులు నిషేధం విధిస్తారు. అయినా పిల్లల ఆకలి తీర్చడం కోసం గోప్యంగా దేవదారు ఆకుల్ని కోస్తుండగా కాపలాదారులు పట్టుకొని అటవీ అధికారి అయిన మునిస్వామి దగ్గరకు తీసుకెళ్తారు. కొమ్మలు విరిచాడనే నెపం మోపి మెజిస్ట్రేట్ ద్వారా రూపల్ నాయక్‌కు నాల్గు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు.

అధికారులు పేదలపై తమ ప్రతాపం చూపుతారని, అల్పమైన తప్పులకు శిక్షలు అనల్పంగా విధిస్తారని, రచయిత సర్వసాధారణంగా సమాజంలో నెలకొన్న పాలనా లోపాల్ని ఎత్తి చూపారు. ఈ కథలో అడవి బిడ్డలు జీవించే విధానానికి ఊతనిచ్చే విధంగా "కష్టములో ఉన్నవారికి భయము తక్కువ. ఏమన్నా భయముండదు. అధికారులంటే భయమా! మృగములంటే భయమా! తోడివారంటే భయమా! విపత్తులు సంభవిస్తవని భయమా! భయము లేకుంటే నేమవుతుంది? కష్టములు వచ్చును.

ఉన్న కష్టములలో అవి కలిసిపోతవి ఇక భయమెందుకు?” అని వివరించటం వల్ల రచయితకు వారిపట్ల ఉన్న మమకారం ప్రస్ఫుటమౌతుంది.

తన భర్త రూపల్ నాయక్‌ను జైల్లో పెట్టిన సంగతి తెలియక తన కోసం కొన్ని రోజులు నిరీక్షించి చివరకు వీళ్ళను పోషించలేక ఎడపిల్లల్ని పెద్ద పిల్లకు అప్పగించి చంటి పిల్లను చంకన పెట్టుకుని తెల్లకొండల్లో తన బంధువులున్నారని వెల్తుంది. నాల్గు సంవత్సరాల తర్వాత విడుదలై వచ్చిన రూపల్ నాయక్‌కు కుటుంబ సభ్యులెవరూ కనపడరు. చుట్టుపక్కల వారిని విచారించగా జరిగిన విషయం చెప్తారు. దాంతో మిక్కిలి వ్యధ చెందుతాడు. భార్య పిల్లలు ఎక్కడన్నారో, ఎలా ఉన్నారో, అసలు ఉన్నారో లేరో తెలియని సంకట స్థితిలో నాయక్ ఉంటాడు. ఈ సందర్భంగా రచయిత “వారేమయిరో ఎక్కడుండిరో ఎవరికి తెలియదు. భూదేవి వారిని కన్నది. భూదేవి వారిని మళ్ళీ స్వీకరించింది” అంటూ ఆదివాసీలు అనుభవించే దైన్యస్థితిని వర్ణిస్తూ సానుభూతిని కనబరుస్తారు రచయిత.

కొంతకాలానికి మునిస్వామి భార్యాపిల్లలే కాక బంధువులు, మిత్రులు కూడా అంటువ్యాధితో మరణిస్తారు. ఆ విధంగా మునిస్వామి కూడా ఏకాకి అవుతాడు. ఇతరులకు కీడు చేసిన వారెవరికైనా ప్రతికీడు సంభవిస్తుందనే భావాన్ని రచయిత వ్యక్తపరిచారు. దేవదారు ఆకులు కోసినందుకే కేసుపెట్టి జైలుకు పంపిన వ్యక్తి, ఖరీదైన పెద్ద దుంగల్ని అక్రమంగా తరలింపచేసి లంచాలు తీసుకుంటాడు. అతను అవినీతి పరుడనే వాస్తవాన్ని గ్రహించిన పై అధికారులు అతన్ని ఉద్యోగం నుండి తీసేస్తారు. రూరల్ నాయక్ విషయంలో ఎక్కువ సంతానాన్ని కనడం వల్ల వచ్చే ఉపద్రవాల్ని, మునిస్వామి విషయంలో అవినీతికి పాల్పడటం వల్ల వచ్చే అనర్థాల్ని రచయిత సమాజానికి సందేశాత్మకంగా వెల్లడించారు.

ఏదిఏమైనా తెలుగు కథా సాహిత్యంలో ఆదివాసీలపై కథ రాసిన మొదటి వ్యక్తిగా చింతాదీక్షితులు చిరస్మరణీయులు. ఆ కథ ఈ ఏడాదికి నూరేళ్ళు పూర్తి చేసుకున్న తరుణంలో వారిని స్మరించుకోవడం మిక్కిలి ఆవశ్యకం. ఆయన ప్రేరణతో అనంతర రచయితలు దళితాంశాలను ఇతివృత్తంగా తీసుకొని సాహిత్యాన్ని సృష్టించారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# డా॥. పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి కథలు – సామాజిక దృక్పథం

– **యం. అనిత,** పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక కాలంలో అత్యంత ప్రముఖమైన, ప్రభావ వంతమైన ప్రక్రియ కథ. వచన రూపం గల కథ తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి దాదాపు 108 సంవత్సరాల యింది. ఎందరో రచయితలు, రచయిత్రులు తమ కథా కథన కౌశలంతో సామాజిక జీవన చిత్రణ చేస్తూ, తమ ఉనికిని సుస్థిరం చేసుకుంటూ, భావితరాల వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. అలాంటి వారిలో ముందుగా చెప్పుగోదగ్గ రచయిత్రి డా॥పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి.

నెల్లూరు జిల్లాకు చెందిన డా॥పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి 1945 సం॥ బొడ్డువారిపాళెం అనే గ్రామం నందు పెళ్ళకూరు సుందర రామిరెడ్డి, యశోదమ్మ గార్లకు జన్మించారు. ప్రాథమిక విద్య బొడ్డువారిపాళెంలోను, పి.యు.సి. తిరుపతిలో, మెడిసన్ ఆంధ్రా మెడికల్ కాలేజ్, విశాఖపట్నం నందు పూర్తి చేశారు. వృత్తిరీత్యా వైద్యులు, ప్రవృత్తి సాహితీ రచనలుచేయడం. ఊపిరి సలుపని వైద్య వృత్తిని ఈదుతూనే ఎన్నో సృజనాత్మక రచనలైన కథలు, నవలలు, కవితలు, వ్యాసాలు, నానీలు రాస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. ఈమె 14వ యేటనే "శ్రీరాముడి పెళ్ళి" అనే కథతో తన సాహితీ రచనను ఆరంభించి ఇప్పటికి వెనుదిగిరి చూడకుండా 11 కథాసంపుటాలు, 8 నవలలు, 3 దీర్ఘ కవితా సంపుటాలు, మెడికల్, జనరల్ వ్యాసాలు, 300 పైగా కథలు, 1 నానీల పుస్తకం ఇలా బొలెడన్ని సాహితీ ప్రక్రియలను రచించారు. ఈమె చేసిన సాహితీ సేవకు హరివల్లు, ఉగాది, కళాంజలి, నెరసం పురస్కారాలు, అవార్డులు, రివార్డులు పొందారు. అంతేకాకుండా ఎన్నో పదవులను చేపట్టారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించి సమాజసేవ చేస్తున్నారు. వర్ధమాన రచయితలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో తన చెల్లెలు "స్వర్గీయ శ్రీమతి సోమిరెడ్డి జమున" గారి పేరున ఉత్తమ నానీల పుస్తకానికి అవార్డును ప్రతి సంవత్సరం ఒక కవికి ఇస్తున్నారు.

మానవీయతకు అద్దం పట్టేవి, వాస్తవికతకు హారతి పట్టేవి జయప్రద గారి కథలు. ఈమె కథల్లో ఇతివృత్తాలు, స్వీయానుభవం నుండి, జీవితాధ్యయనం నుండి జనించినవి. రోగుల గుండె చప్పుడు పసిగట్టగల వైద్యురాలే కాదు. సామాజిక రోగుల గుండె చప్పుడును కూడా పసిగట్టగలదు. జయప్రద గారి రచనలన్నింటిలో స్పష్టంగా కనిపించేది సామాజిక అభ్యుదయ ఆకాంక్ష. ఈ లక్ష్య సాధనలో భాగంగా ఆమె మూఢ విశ్వాసాల మీద అక్షరాయుధం ఝుళిపిస్తారు. సామాజిక దృక్పథంతో ఈమె కలం నుండి జాలు వారిన కథాసంపుటాల్లో "నక్షత్రం కథా సంపుటి" ఒకటి. ప్రస్తుతం ఈ నక్షత్రం కథాసంపుటిలోని "నక్షత్రం", "గ్రహణం", "విజేత" అనే మూడు కథలలోని మానవీయ విలువలను, సామాజిక దృక్పథాన్ని, సామాజిక సమస్యలను చర్చించడం ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

నక్షత్రం అనే కథలో ఆర్థిక దౌర్బల్యం ఎంత కటువుగా ఉంటుందో అటువంటి స్థితిలో వున్న వారికి సాయం చేయడంలో ఎంత ఆనందం ఉంటుందో రచయిత్రి కళ్ళకు కట్టినట్లుగా చూపించింది. ఈ కథలో ప్రధాన పాత్రలు కన్నడు, తిరుపతి, యశోద. నిరుపేద అయిన తిరుపతి నాయుడయ్య దగ్గర చేసిన అప్పు, సంపాదించ లేని రోగిష్టి, భార్య, పెళ్ళి కాని పెద్ద కూతురి పరిస్థితి, ఇవన్నీ ఆలోచించి తను ఒక్కడే కష్టపడి సంపాదిస్తే జరగదు అని తన కొడుకు కన్నడిని నాయుడయ్య రొయ్యల గుంటల కాడ నాలుగెళ్ళు పనిలో పెట్టాలనుకుంటాడు. కన్నడికెమో చదువుకొవాలని బలమైన కోరిక. ఇదే ఓ రోజు వాళ్ళ గుడిసె ముందు ఘర్షణ మొదలవుతుంది. కన్నడు తండ్రి తిరుపతిని చదువుకుంటానని

పరిపరి విధాలుగా బ్రతిమిలాడుకుంటువుంటాడు. తనను బడిలో చేర్పించమని, మనం బి.సి.లం కదా మన చదువు ఖర్చంతా గవర్నమెంటు వాళ్ళే చూసుకుంటారని, తండ్రిని ఒప్పించాలనుకుంటాడు. ఈ సదువులు మనకు అక్కర లేదని, నాయుడయ్య దగ్గర పనిలో చేరాలి అయినా నువు సదువుకుంటే నీ పోషణ భారం నా మీద పడుతుందని, నానా మాటలు అని కన్నడిని కర్ర విరిగేట్లుగా కొడుతూ వుంటాడు. ఇదంతా చుట్టూ చేరిన జనం చూస్తూవుంటారే గాని ఎవరు తిరుపతిని ఆపరు. కన్నడి బలమైన కోరిక ముందు ఆ దెబ్బలన్నింటిని భరిస్తూనే ఉంటాడు. ఇదంతా హృదయ విదారకంగా ఉంటుంది. జానెడు పొట్టకు లొంగి అకాశమంత బిడ్డ భవిష్యత్తును నాశనం చేస్తున్నానని తిరుపతికి తెలిసిన, తన పరిస్థితిని, బిడ్డ కోరికను తీర్చలేని నిస్సహాయతకు ఏమి చేయలేక వాడిని దెబ్బ మీద దెబ్బ కొడుతూ వుంటాడు. ఇదంతా ఎదురింటి మేడపైన ఉన్న యశోద గమనిస్తుంటుంది. చదువుకుంటానని తండ్రిని ఎదిరించి ధైర్యంగా నిలబడిన బిడ్డను చూడటం ఇదే ప్రథమం ఆమెకు. అన్ని వసతులు కల్పించి, చదువుకోమని చెప్పిన, చదువుకోనని మొండికేసే తన పిల్లల్ని, బడిలోకి తీసుకెళ్లే పిల్లలు చదవకుండా ఆకతాయిగా మారే వారిని, ఆటల్లో పడి చదువు మానేసే వారిని ఇలా చాలా మందిని చూసింది యశోద. కన్నడు ఉన్న పరిస్థితిని చూసి, ఒక నిర్ణయం తీసుకొని గబగబా అక్కడికి వెళ్ళి, "కన్నడిని ప్రేమగా దగ్గరికి తీసుకొని కన్నా నిన్ను నేను చదివిస్తాను", నువ్వు చదువుకుంటావా? అని అడుగగా వాడు సంబరంగా ఒప్పుకొంటాడు. అమ్మా, మీరు చదివిస్తానంటున్నారు కాని మా అప్పులు తీరేది ఎట్లా అని అడుగగా, ఆమె నిట్టూర్చి, వీడు నీకు ఎంత సంపాదించి పెట్టాడో, నేను నీకు ప్రతి సంవత్సరం వీడి చదుడు అయ్యేంత వరకు ఇస్తాను అని, వీడిని చదువుకొనియి అని అంటుంది. కన్నడికి ఆకాశాన్ని గెలిచినంత సంతోషంగా వుంటుంది. ఆనందం అనే పదానికి నిజమైన అర్థం వాడి కళ్ళల్లో స్పష్టంగా చూసింది యశోద.

ఈ కథ ద్వారా మరొకరి జీవితం కోసం ఖర్చు పెట్టే రూపాయిలు వారి జీవితానికే గాక, మనకి ఆనందపు రుచిని అందిస్తాయని రచయిత్రి హృద్యంగా చెప్పింది. పేదరికం కారణంగా చదువుకు దూరమైన వాళ్లకి ఆర్థిక సాయం అందిస్తే, కన్నడి లాంటి పిల్లల జీవితాలు బాగుపడతాయని ఈ కథ ద్వారా జయప్రద సోమిరెడ్డి తెలియచేసారు.

సామాజిక దురాచారాలను ఖండిస్తూ రాసిన మరో కథ "గ్రహణం". ఈ కథలో ప్రధాన పాత్రలు వేదవతి, బాల సుబ్రమణ్యం, శ్రీవల్లి, భువన, ఝాన్సీ. మూడు తరాల వారిని చూసిన అనుభవజ్ఞురాలు వేదవతి. ఆమె పెద్ద కుమారుడు బాలసుబ్రమణ్యం. ఆయనకు ముగ్గురు కూతుర్లు. వాళ్ళు శ్రీవల్లి, భువన, ఝాన్సీ. నేటికి ప్రస్తుత సమాజంలో కూడా బాలసుబ్రమణ్యం లాంటి వారు మూఢనమ్మకాలు, చాందసాల పిచ్చితో రెండో కుమార్తె భువనకు వచ్చిన సంబంధాలు అన్నింటిని, నియోగులు కారని, వయస్సు తేడా ఎక్కువ లేదని, జాతకాలు కలవలేదని, గోత్రాలు మంచివి కావని పలురకాల అర్థం లేని కారణాలతో అన్నింటిని వదలుకుంటాడు. ఆమెకు ఇప్పుడు 35 సంవత్సరాలు వచ్చినా, పెళ్ళి కాకుండానే వుంటుంది. ఇప్పుడు సంబంధాలు రావటమే ఆగిపోయాయి. మూడో కూతురు ఝాన్సీకి 30 ఏళ్ళు వచ్చినా, ఆమె పెళ్ళి కాకుండా వుంటుంది. ఇదిలా వుండగా శ్రీవల్లి తన కూతురి సంబంధం కోసం పుట్టింటికి రావటం, ఆ సంబంధాన్ని భువన నానా రభస చేసి చెడగొట్టడం జరుగుతుంది. ఎంతో సాత్వికమయిన భువనలో కచ్చి, కోపమూ, ఈర్ష్య, అసూయ, పుల్ల విరుపు మాటలతో ఎవరు బాగుపడకూడదనే తత్వం అలవుతుంది. ఇంటికి గుది బండలా అవుతుంది. భువన చేయని తప్పుకు జరిగిన దానికి శ్రీవల్లి తన చెల్లెలిని నిందిస్తూ బాధపడుతుండగా, ఆమె నానమ్మ, వేదవతి నీ చెల్లెలి జీవితం నాశనం అయినప్పుడు,ఆమె మోడులా పెళ్ళి కాకుండా ఉన్నందుకు లేని బాధ నీ కూతురికి

ఒక్క సంబంధం తప్పిపోయినందుకు బాధ వస్తుందా? అని నిలదీస్తుంది. అప్పుడు శ్రీవల్లి జాతకాలు కలిసాయని, నియోగులు అని అంటుండగా, వేదవతి పెళ్ళికి చూడవలసింది జాతకాలు, అటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలు కావని, ఇద్దరి అభిప్రాయాలు భావాలు కలవాలని, నీ తండ్రి చేసిన తప్పునే నువ్వు చెయ్యొద్దని మందలిస్తుంది. అదే సమయంలో ఝాన్సీ అక్కడికి రాగా వేదవతి, ఝాన్సీ ఇద్దరూ ఇంట్లో జరుగుతున్న దానికి బాధపడుతూ, ఇంట్లో వారిని మార్చడమెలా అని తన నాన్నమ్మని అడుగుతుంది. అప్పుడు వేదవతి ఇంట్లో వారిని మార్చలేం, పరిస్థితులు మార్చవచ్చని, ముందు నువ్వు మంచి అబ్బాయిని, నీ మనసుకు నచ్చిన వాడిని చూసి పెళ్ళి చేసుకొని, నీ తండ్రిని ఈ ఇంటిని అతని చాంధసాల నుండి రక్షించు అంటుంది. నీ కొడుకుపై అంత ప్రేమ! రక్షించమని అంటున్నావు అని అడుగగా, లేదు ఝాన్సీ మీ నాన్న చాంధసాలు, మూఢనమ్మకాలు అని మీ అక్క భువన జీవితం నాశనం చేశాడు. మార్పు నీతోనే మొదలు కావాలని చెబుతుంది. మీ అక్కలాంటి ఏ తప్పు చేయని ఆడపిల్లల్ని పెళ్ళికాకుండా మిగిల్చి రక్షణ లేని ఈ సమాజంలోకి విసిరి వేయడం నాకు నచ్చలేదు. అందుకే నిన్ను నీ జీవితాన్ని తీర్చిదిద్దుకోమన్నానని చెబుతుంది. మూడు తరాల జీవితాలు నుండి నేర్చుకొన్న అనుభవ పాఠాలతో ఎంతో అభ్యుదయంగా నిర్ణయం తీసు కోవడంతో ఈ కథ ముగుస్తుంది.

ఈ కథలో సామాజిక దృక్పథంతో రచయిత్రి చక్కని సందేశాన్ని అందించారు. ప్రస్తుత కాలంలో కూడా చాంధసాలు, మూఢనమ్మకాలు పాటించి, వాటితో ఆడపిల్లల జీవితాన్ని ప్రశ్నార్థకం చేసే బాలసుబ్ర మణ్యంలాంటి వారు మారాలని, రక్షణ లేని సమాజంలోకి ఆడపిల్లల్ని ఒంటరిగా వదిలిపెట్టకూడదని, దానివల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని కాబట్టి వాటిని రూపు మాపాలని ఈ కథ ద్వారా తెలియచేసారు.

మూడో కథ "విజేత". ఈ కథలో ప్రధానపాత్రలు జగతీ, విజేత. నిరంతరం బిడ్డల బాగుకోసం, వారిని చదివించటం కోసం అహర్నిశలు కృషి చేసి, వారిని ప్రయో జకుల్ని చేస్తుంది జగతీ. ఇప్పుడెమో వారు విదేశాల్లో స్థిరపడి, తల్లిని పట్టించుకోక ఒంటరిగా వదిలేస్తారు. ఆ బాధతో మానసికంగా కుంగి పోయివుంటుంది జగతీ. తనకంటూ జీవితం లేకుండా వారి కోసమే బ్రతుకుతుంది. చిన్ననాటి స్నేహితురాలిని, భర్తని పట్టించుకోదు. ఆ కర్తవ్యంలో పడి, ఇప్పుడు బాగా చూసుకుందామన్న భర్త మరణించి, ఒంటరి దానిలా వుంటుంది. ఇలా మదన పడుతున్న సమయంలో ఎప్పుడో దూరమైన తన స్నేహితురాలు విజేత కలవడం, ఆమెకు తన బాధనంత చెప్పుకోవడం జరుగుతుంది. విజేత ఏమో ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఉంటుంది. స్నేహితురాలి బాధని అర్థం చేసుకొని ఈ విధంగా చెప్తుంది. మనం బిడ్డల్ని చదివించి, ప్రయోజకుల్ని చేయడమన్నది కన్నందుకు మన బాధ్యత. నువ్వు నీ విధిని సక్రమంగా నిర్వర్తించావు. వాళ్ళు ప్రయోజకులయ్యారనే నిజం చాలు. నువ్వు సంతోషంగా, గర్వంగా బ్రతకడానికి అని చెప్తుంది. మరి నా సంగతేమిటని జగతీ అడగ్గా, అదే నువ్వు చేసిన తప్పు.... నీకంటూ నీకొక జీవితాన్ని ఏర్పరచుకోకుండా, వాళ్ళనే నీ జీవితం అనుకున్నావు. వాళ్ళకు రెక్కలొచ్చి ఎగిరిపోవడం అన్నది ఈ సృష్టిలో పునరావృతమవుతున్న సహజమైన సంగతి. ఈ సత్యాన్ని నీ మనస్సు అంగీకరిం చడం లేదు. అందుకే నీ జీవితం చప్పగా వుంది. వదిలి వెళ్ళిన వారి కోసం బాధపడకుండా, నువ్వు సంతోషంగా వుండి నీ చుట్టూ వున్న ప్రపంచంలో కలిసిపో, నీ బిడ్డలు దగ్గరికి వచ్చినప్పుడు వారికి ప్రేమ ఇవ్వు, నువ్వు ప్రేమ పొందు. అంతేకాని వారు మన సొంతం అనే హక్కుతో ఉంటామని, కానీ వాళ్ల ప్రపంచం వేరు అని అర్థం చేసుకొని, మన బాధ్యత మాత్రమే నిర్వర్తించామని, హక్కులకై ఆరాటపడటం మానేయాలి. అప్పుడే నువ్వు సంతోషంగా వుంటావు అని విజేత, జగతీకి చెప్పగా కథ సుఖాంతమవుతుంది.

ఈ కథ ద్వారా రచయిత్రి బిడ్డలు దూరమై బాధపడే తల్లిదండ్రులకు విజేత పాత్ర ద్వారా చక్కని సందేశాన్ని ఇచ్చారు. పిల్లలకు తల్లిదండ్రులు పడే బాధను అర్థం చేసుకొని, వారిని బాగా చూసుకోవాలి అనే బాధ్యతలను తెలియజేశారు. ప్రస్తుత సమాజానికి ఈ కథ చక్కని పరిష్కారం అవుతుంది.

**ముగింపు :**

డా॥. పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి కథల్లో మానవీయ విలువలు, సామాజిక అభ్యుదయం స్పష్టంగా కనిపిస్తుంది. వారి కథలు ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపెడతాయి. ప్రతి కథలో కొసమెరుపు వుంటుంది. ప్రతి పాత్ర పరిచయమైనదిగానే ఉంటుంది. ఈమె కథలు చదువుతుంటే మంచి రచనను చదివానన్న ఆనందం పాఠకునిలో కలుగుతుంది. మనిషిని ఉన్నత పథాల వైపు నడిపించే ఆలోచనాత్మక రచనలు మరికొన్ని వీరి లేఖిని నుండి రావాలని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. నక్షత్రం - కథల సంపుటి. డా॥ పి.జయప్రద సోమిరెడ్డి
2. సాహితీ స్వర్ణోత్సవ సంచిక - డా॥ పి.జయప్రద సోమిరెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి.
4. నెల్లూరు జిల్లా సాహజతీ సర్వస్వం.

# కవితా మనోహర స్వప్నారామం 'అంతర్లోచనం'

- డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

కవి కలల కొలిమిలోకి దూకగలిగిన స్వప్న సహవాసి, కళ్ళలోకి చూడగలిగిన ప్రశ్న సహపాఠి. స్వప్న వేణువేదో సంగీతమాలపించినట్లుగా రామమనోహర గారి కలం సామాజిక బాధ్యతగా కవిత్వాన్ని సృజించింది. పారేనది, వీచేగాలి, ఊగేచెట్టు, ఉదయించే సూర్యుడు, సృష్టిలో ఏదైనా ప్రతిదానికీ ఒక పరమార్థం ఉంటుంది. ప్రతి జన్మకి ఒక ప్రత్యేకత ఉంటుంది. దానికొక సార్థకత ఉండాలనే భావం ప్రతి అక్షరంలో స్పష్టమవుతుంది. చల్లని వెన్నెల్లో మెరిసిన నక్షత్రాలు, మండే ఎండల్లో భగ్గున మండిన నిప్పుకణాలు వీరి కవిత్వంలో దర్శనమిస్తాయి. బాధకి పర్యాయపదం కవిత్వం అన్నాడొక మహాకవి.

"జారిపడ్డ కన్నీటి బొట్టులాంటిదే / కవిత కూడా / రెంటికీ అర్థం లేదు / తడి లేకపోతే తడవకపోతే / మనుగడలేదు / బతుకుని పట్టి చూపకపోతే" అన్న కవి వాక్కులలో ఎంతో అంతశ్చేతన దాగి ఉంది. సామాన్యుడి బతుకు తడిని చిత్రించేది కవిత్వం అంటారు. కాళ్ళు తడవకుండా సముద్రాన్ని దాటగలిగిన మేధావి అయినా కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేని పరిస్థితులు సమాజంలో తారసపడుతూనే ఉన్నాయి.

జీవితమంటే మొదట గౌరవం ఉండాలి. ప్రతి ఒక్కరికి తనదైన నిబద్ధత, దృక్కోణం ఉండాలి. సమాజంలో ఉత్పన్నమయ్యే పరిస్థితులను ప్రశ్నించాలన్నా, ఒక స్వప్నం దర్శించాలన్న తలపుండాలి. అంతకు మించిన తపనుండాలంటారు. "ప్రశ్న ఎవడైనా వేస్తాడు / స్వప్నమెవడైనా చూస్తాడు / ఎంచుకునే తెలివుండాలి / ఎదురెళ్ళే తెగువుండాలి" అంటారు. సమస్త సంక్షోభాల మధ్య, విధ్వంసాల మధ్య జీవిస్తున్నాం; యాంత్రికమైపోతున్న బతుకులో ఆవిరైపోతున్న అనుభూతులను అక్షరాలతో స్పృశించారు. జ్ఞాపకాలన్నింటిని ఆర్ద్రంగా దోసిళ్లతో పట్టి దాహం తీరుస్తారు. ప్రతి ఒక్కరికి లక్ష్యం ఉండాలి. లక్ష్యసాధనకై పరితపించాలి. లక్ష్యం ఉంటే కాదు నీ స్వప్నం సాకారమవ్వాలంటే నిన్ను నువ్వే ప్రశ్నించుకోవాలి. కార్యాచరణతోనే జీవిత స్వప్నం సాకారమవుతుందంటారు.

"నేల తడపని వానెందుకు
నిన్ను తొలచని ప్రశ్నెందుకు
కవిత ఇంకని బతుకెందుకు
ఓడిగెలవని పోరెందుకు
రేపు మలచని కలలెందుకు
ఊపిరివ్వని గురి ఎందుకు"

సృష్టిలో ప్రతిదానికి పరమార్థం ఉంటుంది. ఉండాలి కూడా. సృష్టిలో ప్రతి వ్యక్తికి వ్యక్తిత్వం ఉంటుంది. వ్యక్తిత్వం వికాసం చెందితేనే సమాజానికి పురోగమనం. సాధనమున పనులు సమకూరు ధరలోన అంటారు. ప్రశ్న నువ్వే, సమాధానం నువ్వే కావాలి. సమస్యకి సొల్యూషన్ నువ్వే కావాలి. 'నా అక్షరాలు భవితకు మార్గదర్శి'గా ఉండాలన్న పంథా ఈ కవిలో కన్పిస్తుంది. రోజూ ప్రశ్నించమని, స్వప్నించమని, శ్వాసించమని, చిగురించమని నిన్ను నువ్వు దీవించుకోమంటారు. ఎన్నాళ్ళిలా జీవితంలో నిరుత్సాహంగా, నిర్వీర్యంగా ఉంటావు. నీలో శక్తి ఉంది. 'లే' లేచి సమాజాన్ని దర్శించు. నీలో ఉత్సాహాన్ని నింపుకో, నిన్ను నీవు దర్శించుకొంటే అద్భుతాలు సృష్టించగలవంటూ ఉత్సాహాన్ని పెంపొందిస్తూ మీలో మీకే తెలియని అంతులేని శక్తి ఉంది. ముందు నిన్ను నీవు తెలుసుకోమంటారు.

"ఎన్నాళ్ళని ఇలా కూలిపోయిన కలలా / ఎన్నాళ్ళని ఇలా పూర్తికాని గీతంలా / ఎవరికోసం ఇలా కురవని మేఘంలా / ఎవరి కోసం ఇలా పగలని నిశ్శబ్దంలా /

ఇంకా ఎన్నాళ్ళని ఇలా శిరసులేని శిల్పంలా / అదేమిటి నీ కళ్ళల్లో చెరసాలలు / అదేమిటి నీ నిశ్వాసంలో మృత్యు ఘోషలు" అంటూ ప్రశ్నిస్తాడు, నినదిస్తాడు, నివేదిస్తాడు, ప్రబోధిస్తాడు. అంతలోనే నీ సహజశక్తిని గూర్చి కూడా ఇలా "నీవు మట్టిని ముద్దుపెట్టుకోగలవు/ నీవు చెట్టుని గుండెకి హత్తుకోగలవు, నీవు ఎడారులెంట ప్రవహించ గలవు, నీవు హృదయాలలో ప్రతిధ్వనించగలవు" అంటారు. "నీ వీక్షణలో చీకటి కరుగుతుంది. నీ ఉచ్ఛ్వాసతో సముద్రం అలలెత్తుతుంది" అంటూ ఉత్సాహాన్ని ఉరకలెత్తిస్తారు. "నీ హృదయం రగులుకుంటే విద్యుత్ కొలిమి అవుతుంది. నీవు నీ ముఖాన్ని చెక్కుకుంటే ప్రపంచమౌతుంది. నిన్ను నీవు దర్శించుకుంటే ప్రకృతి పులకలెత్తుతుంది" అంటూ ప్రశ్న కళ్ళలోకి చూడగలిగే విధంగా నిన్ను నీవు సమాయత్త పరచుకోమంటారు. కవిగారి అక్షరాలు అంతశ్చేతన పైకి ఎక్కుపెట్టిన అక్షరశస్త్రాల్లా మూర్తీభవిస్తాయి. కవిగారు స్వప్నంతో చేసే సంవాదం కొత్త అనుభూతిని మిగులు స్తుంది.

"కళ్ళ మీద మొలిచిన / లేత స్వప్నాన్ని / గాఢనిద్రలోనే చేతుల్లోకి తీసుకుని హత్తుకున్నా / ఇన్నాళ్ళూ స్వప్నస్రావాల్ని / కళ్ళ కాల్వల్లో మౌనంగా భరించి భరించి / తడియారిన నయనాలు / కలని పొదవుకునే / తాబేటి చిప్పల్ని చూసి / నిశ్చింతగా రెప్పలు వాల్చాయి" అంటారు 'స్వప్న సంవాదం' కవితలో. "ప్రపంచం స్వప్నమంత విశాలం. స్వప్నం హృదయమంతా విశాలం" అంటూ స్వాప్నికుడైన కవి ప్రపంచాన్ని, స్వప్నాన్ని, విశాల స్వభావంతో సమన్వయం చేసారు. స్వప్నరూప శిల్పిగా తనను భావించుకొని వాస్తవ కోణంలోనే తనలోకి చూసుకొంటే స్వప్న సహవాసిగా స్వప్న సహపాఠిగా సహజంగా అభివర్ణించుకున్నారు. "కళ్ళు కలల్నికనాలి / చేతులు చేతల్ని కనాలి / కలలు రాజ్యాలేలాలి" అంటూ కనుల, కలల పరమార్థాన్ని, అక్షరాలలో తారాజువ్వలా వెలిగించారు, మెరిపించారు. వీరి కవితల్లో చక్కని ఉపమానాలు, మెటఫర్స్, మెటానమీలు కొత్త పంథాలో సాక్షాత్కరిస్తాయి. కవిత చివరి వాక్యం చాలా విలక్షణంగా అమరుస్తారు. బరువైన భారాన్ని మనకు మిగులుస్తారు. సరికొత్త అన్వేషణలో వినూత్నదారుల్లో ప్రయాణం చేయగల సాహసి మన కవి.

"స్కూలు నుండి రాగానే / ఇంట్లో నిండుకున్న ఫెర్ఫ్యూమ్ / నాన్న వచ్చాడని చెబుతోంది / అమ్మ సంతకం చేస్తున్న 'పత్రం' నాన్న వెళ్ళాడనీ చెబుతోంది" అన్న రెండు వాక్యాల మధ్య కవి అక్షరాలవంతెన ప్రతీకాత్మకంగా చిత్రించారు.

"కిటికీ బయట
ఈ రోజేందుకు గాలి బరువుగా ఉంది
విమానం వదిలెల్లిన పొగ
ఆకాశం నవ్వకుండా
దాని మూతికి వేసిన కుట్లలాగా ఉంది
మనుషులు లేరు మనసులు లేవు
ప్రపంచానికి ఎవ్వరిపై దిగులులేదు
రేపు నా స్కూల్‌కి సెలవూ లేదు" అని అమ్మానాన్నలు విడిపోయిన రోజుని వంతెన పేరుతో అక్షర నిర్మాణం చేపట్టి పాఠకుల హృదయాలు బరువెక్కించారు. మంచి గంధంలాగా పరిమళించే మానవత్వం కవిగారికి సహజమైన అలంకారంగా చెప్పాలి. మానవీయ కోణంలోనే వారి కవితా స్రవంతి జాలువారింది. దిశ సంఘటన జరిగిన రాత్రి కవిగారి గుండె గబుక్కున చీలిపోయి హృదయం తల్లడిల్లి, నరనరం చిదికి చిట్లి, నెత్తురుడికి, ఉబికిపోయి స్పందించి నిట్టనిలువునా మానవత్వం ఒణికి కూలిపోయింది; కాలి బూడిదైపోయిందంటారు.

"ఎంత హీనం ఎంత హేయం / ఎంత క్షోభం ఎంత క్షామం / ఎందుకీ దౌర్భాగ్యం / తల్లీ నీకెందుకింత కష్టం / నీకెందుకింత శాపం / లేతచిగురును చింపి / తిన్న కుక్కల క్రౌర్యం"గా అభివర్ణిస్తారు. ఎంతగా కవి హృదయం ఆవేదన చెందిందంటే "ఈ చెదిరిపోయిన సమాజంలో బతకాలంటే / ఈ చెదలుతిన్న సమూహంలో / నడవాలంటే సిగ్గని చెప్పడానికి సిగ్గేస్తుంది / బతికున్నందుకు

చావాలనిపిస్తోంది" అంటారు. మనసు చచ్చిన మనిషిగా అసలు చచ్చిపోయిన మేము నీ నవ్వు ముందు వేలసార్లు మోకరిల్లినా మాకు శాపవిముక్తి లేదు పసిపాప అని భోరున విలపించిన వైనం కనిపిస్తుంది. "కల్లలేని నీ మల్లెనవ్వు నవ్వు / నీ నవ్వు మసి అవ్వనివ్వకు / నుసి అవనివ్వకు / మరొక్కసారి నవ్వు పాపా" అంటూ "దయ్యపు పిల్లలున్న చోట కానరాని దేవుడెందుకు; మనిషితనం లేక వేలాడేసుకు తిరిగే మొగతనమెందుకు" అని నిలదీస్తాడు. తల్లీ నీ నవ్వుని తాకిన / పశువుల అంగాలకు తాడుకట్టి నట్టనడి వీధిలో / తియ్యడమే ఉరి. ఇది ఒక్కటే ప్రాయశ్చిత్తం అంటూ కవిత్వపు తీర్పునిచ్చారు. బాట వెంట జీవించిన క్షణాలు జ్ఞాపకాలై వేలాడుతున్నాయంటారు. జ్ఞాపకాలు అందమైన అనుభవానికి అనుభూతికి ఆనవాళ్ళు. అందుకే కవి ఇలా వ్యక్తం చేశారు.

"జ్ఞాపకమెపుడూ అందంగానే ఉంటుంది
అద్దమంటినది ఒడ్డు పలకమీద
రాసుకున్న పేర్లల్లే
అందనంత ఎత్తులోనే ఉంటుంది
ఎప్పుడో ఎగరేసిన గాలిపటాలల్లే
ఎప్పుడు పచ్చిగానే ఉంటుంది
ఆటలో తగిలిన తీయని గాయమల్లే
వెన్నంటే ఉంటుంది
అమ్మ నవ్వు అభయమల్లే"

చేయితిరిగిన అక్షర శిల్పి కాబట్టే అక్షరాలకు ఆత్మీయతను అనుభూతిని అద్ది స్వీయానుభవాలతో ఆ జ్ఞాపకాల ప్రవాహం తాలూకు భావోద్వేగాలను గుండె లోతుల్లోకి చొచ్చుకుపోయేలా కవిత్వీకరించడం ఈ కవి ప్రత్యేకత. జీవితానికి తెగింపు ఉండాలి. జీవితగమనంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించి లక్ష్యసాధనకై తెగింపు ఉండాలి, నువు బతకాలి, ఎదుటివారిని బ్రతికించాలి, నవ్వాలి, నవ్వించాలి, సాటి మనిషిని ప్రేమించాలి అనే భావన ఆకులందున అణగిమణగి కవితాకోకిల ప్రబోధం చేసినట్లుగా ఉంటుంది వీరి కవిత్వం.

"ఒకింత తెగింపు / ఒకింత కనుల చెమరింపు చాలదా / మనిషిగా బతకాలంటే / మారథాన్ నడవాలంటే / మరల మరల నవ్వాలంటే" మాటల్లో మానవత్వం, ఆలోచనల్లో అభ్యుదయం వారి కవిత్వంలో మరల మరలా పల్లవిస్తూనే ఉంది. ప్రతి సంఘటనలో ఒక అనుభవాన్ని, తాననుభవించి దాని పరమార్థాన్ని పాఠకులకు అందజేయడంలో కవిగారు అందెవేసిన చెయ్యి. తన కుమారుడు తన బొమ్మ గీస్తానన్నప్పుడు సరే అన్న వాత్సల్యం అక్షరాలై చిగురించింది.

"గీతగీయడం మొదలైంది
ఒక యాగం మొదలైంది
మనోయోగం మొదలైంది
నాకు తెలీదు
పునర్నిర్మాణం మొదలైంది"

గీత గీయడంలోనే పునర్నిర్మాణం ప్రారంభమైందన్న లోతైన ఆలోచన, జీవితాన్వేషణ కవిగారిలో స్పష్టంగా గోచరిస్తుంది. జీవితంలో ఒక్కసారైనా "నీ పిల్లలతో నీ బొమ్మ గీయించుకో, నిన్ను దిద్దే వసంతానికి ఎదురెళ్లి నిల్చుకో" అంటారు. కవిగారి కవిత్వంలో చివరి వాక్యం గుండెలకు హత్తుకుంటుంది. వెతికి చూసిన కొద్దీ ఆలోచనలు ఉత్పన్నమయ్యే కవితాభాండాగారాన్ని కవి మనకందించారు. ఆ రోజుల్ని తలచుకున్నప్పుడల్లా అందమైన జ్ఞాపకాలు తలపునకు వస్తాయి. "జ్ఞాపకమెపుడూ అందంగానే ఉంటుంది / అద్దమంటినది ఒడ్డు పలక మీద / రాసుకున్న పేర్లల్లే / అందనంత ఎత్తులోనే ఉంటుంది / ఎప్పుడో ఎగరేసిన గాలిపటాలల్లే / ఎప్పుడూ పచ్చిగానే ఉంటుంది / ఆటలో తగిలిన తీయని గాయమల్లే / వెన్నంటే ఉంటుంది / అమ్మ నవ్వు అభయమల్లే" జ్ఞాపకాలన్నీ ఆవేశమై కమ్మి తనలో కురుస్తాయని, జ్ఞాపకాలను ప్రవాహాలు వదిలెళ్లిన పొందికైన రాళ్లేనని, తిరిగి మనల పోల్చుకునే లోతైన ఆనవాళ్లే అని దరిచేరలేని ఊహాశిల్పాలను మనకందించిన పదశిల్పి మన కవి.

"ఆగిన కాలాన్ని, ఎండిన నదినీ / ఊహించడం ఎంత దుర్భరం / పలకరింపు పంచలేని / కరుణరహిత కాఠిన్యం లాగా / కరువు కాలాన ఉసురు తీసుకున్న రైతులాగా / తరం మారి తరుగుతున్న / తెలుగు సొంపునవ్వులాగ" అంటారు. ఒక భావాన్ని మనస్సులో ఊహించుకొని కలం కదిలిస్తే అక్షరాలు ఊహకు తగ్గట్టుగా కవితా పందిరిలో ఎక్కడ అమరాలో వాటికి తెలుసు. కాని వాస్తవికతా కోణంలో ఆలోచించే కవికి జీవనధర్మాన్ని అన్వయించి ఉపమానాలను ఎన్నుకోవడంలో రామమనోహర గారి వైచిత్రి అనూహ్యం.

"ఈ యానం నిశ్శబ్ద దేహగానం / నిదురే దేహానికి పుట్టుకతో వరం / నిదురే దేహానికి చివరకు శాశ్వతం / బాధలు కవితలైనట్లే / నిదుట మునిగిన దేహం కలలౌతుంది / కలలకోసం దేహం అమరమౌతుంది" అంటారు. ఇలా నిశ్శబ్ద దేహగానాన్ని శబ్దాలతో అమరత్వం కల్పించిన కవిత్వ లయబ్రహ్మ మన కవి. కవిత్వమంటే జీవితమని, జీవిత పరమార్థాన్ని కవిత్వీకరించిన కవి రామమనోహర.

పయనమంటేనే ఒంటరితనం పంచుకోవటమే గుంపుతనం అంటారు. ఒంటరితనమంటేనే భయంలేని తనం అని భాష్యం చెబుతారు. "గుంపులోన కలిసేందుకు ఒంటరిగా ఉండి చూడు / వరదలై పారేందుకు చినుకుగా కురిసి చూడు / మనిషిలో కలిసేందుకు బుద్ధుడిగా మారిచూడు / నినాదమై పెగలేందుకు గొంతు విప్పి అరచి చూడు / ఒక్క అడుగు వేసేందుకు సాహసమై రగిలిచూడు / నిన్ను నీవు తెలిసిచూడు / గుండె కిటికి తెరచి చూడు / నిన్ను విడిచి నడిచిచూడు" అని జీవిత ధర్మాన్ని పయనమార్గాన్ని సృష్టి కోణానికి అన్వయించడంలో వినూత్న పంథా అవలంభించారు. "నాన్నా / చిన్నప్పుడు నే కాళ్ళతో తన్నిన / నీ గుండెలపై కర్పూరం వెలిగించి / నీ చక్కని దేహదహనం చేసిన తాపం / నాకెప్పటికి చల్లారదు" అంటారు.

ఈ రాత్రి వెన్నెల ఎంత కురిసినా నా చీకటి తీరని కాలం అంటారు. ఎండిన గుండెలెంత అవిసినా గాయం మానని గానం; ఆగని కాలం ఇదంటారు. 'అయ్యా రాజగోపాలరావు గారు' అన్న కవితలో తన నాన్న గురించి ఎన్నో ఆత్మసాక్షాత్కార వాక్యాలకు రూపునిచ్చి జీవిత పయనంలో తిరిగి అడుగు పడాలంటారు. "ఎక్కడి పాటో ఇటు వచ్చి ఎటో పోయింది / బడుపు జారిన త్రాచులా / లోయదూకి మాయమైన వాగులా / పోల్చలేని పరిచయంలా / పరవశంలా / చిరుస్వప్న వీచికలా / రేపటి సూచికలా / ఆకు సందులనేల రాలిన వెలుగు అక్షతల్లా" అంటూ అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేశారు. తలపుల జల్లులు ఆలోచిస్తే కవిగారిలో తవ్వుకున్నంత జల కనిపిస్తుంది.

"చివర ఆకురాల్చే వరకూ / అనునిత్యం చిగురించి చదువంత చేవగా జీవించి / మేథాసారమై ప్రవహించి / ఒక చెట్టు ప్రయాణం కట్టింది" అని మొదలెట్టి తరగని నీడనిచ్చి, తనదైన శ్వాసనిచ్చి, ఊతమై నిలిచి, జీవించ నేర్పించి, ఎగరడం నేర్పించి, జ్వలించడం నేర్పించి, చెట్టు ప్రయాణం కట్టింది; అక్కున చేర్చుకున్న పక్షుల్ని ఏడ్పించి అని గురువుగారిని స్మరించారు. మెదడు పొరలు వెదికి చూస్తే ఆ చెట్టు గింజలే దొరుకుతాయి. ఎడద తడిమి చూస్తే ఆ చెట్టు ఊడలే సాక్షాత్కరిస్తాయని గురువు ఔన్నత్యాన్ని కీర్తించారు. ఓ రైతు తర్వాత వేసే పంట గురించి ఆలోచిస్తాడు. రాజకీయనేత వచ్చే ఎలక్షన్ల కోసం ఆలోచిస్తాడు. వచ్చే తరం గురించి ఆలోచించేది ఒక్క గురువు మాత్రమే. "చెట్టు ప్రయాణం కట్టింది / మనసు లోతుల్లోకి వేళ్ళుదన్ని / నింగి నిండి / తన నీడ పంచడానికై / తన నీడ పెంచడానికై" అంటారు.

"ఏ కాయమూ గాయరహితం కాదు / శోభారహితమూ కాదు / గాయాలైన చోటే దేహం దేవాలయమౌతుంది / వరద పారిన చోటే నేల పదును దేలుతుంది / కలిసి ప్రయాణం చేసినచోటే భయం బంధువౌతుంది" అంటారు. ప్రతిభావన స్టేట్‌మెంట్ లాగా జీవితానికి చక్కగా అన్వయించి భాష్యం చెప్పినట్లుంటుంది వీరి కవిత్వం. ప్రతి భావన సుందరంగా పరంపరాగత నిర్మితంగా,

నిత్యమనన మనోహరంగా రూపుదిద్దారు. జ్ఞాపకాలను తనకు పునరాస్వాదనీయాలుగా పునరనుభవనీయాలుగా పునరాహ్వాన యోగ్యాలుగా జీవనగమనంలో సేదతీర్చే మజిలీలుగా వేలజీవితాలని అభివర్ణించడంలోనే జ్ఞాపకాలను శాశ్వత అనుభవాలుగా కవిత్వీకరించడం తెలుస్తుంది.

కథ చెప్పడము ఒక ఉద్యమమే; వినేవాడి గుండెల్లో నిజాన్ని పునర్నిర్మించే సాహసమే అంటారు. కథను ఎలా చెప్పాలో కూడా చెప్పారు. "కథను రమ్యంగా చెప్పు, తనివితారా చెప్పు / మనసు తొలిచేట్టు చెప్పు / కలకాలం తలచేట్టు చెప్పు / మబ్బుకరిగి కురిసేట్టు చెప్పు నలుగురినీ నడిపించేట్టు చెప్పు" అంటారు. కథను భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా, చిరంజీవిగా నిలిచిపోవాలంటారు.

"అమ్మల్లారా నాన్నల్లారా / ఇకపై / మీ అబ్బాయిల అమ్మాయిల మార్క్‌షీట్స్ గోడకి తగిలించండి / రానున్న అదృశ్యహత్యల సునామీల సూచికగా / మీ కలల సాకారంగా / వారు ఆత్మహత్య చేసుకుంటే / వారి మార్కులు సగౌరవంగా సమాధిపై ముద్రించండి / భావితరానికి బతుకు పాఠంగా" అంటారు. సమాజంలో నిత్యం తరుగుతున్న సంఘటనలకు చలించి సామాజిక బాధ్యతగా కవిత్వం ప్రవచించిన సామాజిక స్రష్ఠ రామమనోహర గారు. "వెచ్చని సిరాతో ఒక్క వాక్యం రాసినా చాలు చదివినా వాడి మనసు ఎండాకాలపు మల్లె తోట" అంటారు. అక్షరం, ఆహ్లాదాన్నిస్తుంది, పరవశింపచేస్తుంది. మనల్ని కదిలిస్తుంది. ప్రేరణ ప్రగతి పథాల్లోకి పయనింపజేసే విధంగా కవిత్వీకరించడం ఈ కవి ప్రత్యేకత.

నిశ్శబ్దాన్ని ఒక భాషగా అర్థవంత అనుభవంగా అభివర్ణించారు. నిశ్శబ్దమంటే నిత్యచైతన్యం, నిన్ను నీవు తలచుకొనే అపురూపక్షణం, అరుదైన దర్శనం, అహంకార హననం, అర్థవంత ఆవాహనం అంటారు. భావతీవ్రతను అంత్యప్రాసలో చక్కగా ఒదిగించడం కవికి వెన్నతో పెట్టిన విద్యగా కనిపిస్తుంది. 'మదర్ ఆఫ్ కల్నల్ సంతోష్ కవిత' కన్నీళ్ళు పెట్టిస్తోంది. ఆ తల్లి కొడుకు సంతోష్ వీరమరణం చెందాక 'నా గుండెలపై నువు రెపరెపలాడిన ఈ జాతి సంతోష పతాకంగా' అభివర్ణించి వీరమాత లక్షణాన్ని తెలియజేశారు.

వీరమరణం పొందిన ఒక జవాన్ భార్య స్వగతంలో నీవొదిలిన పేజీ నుండి పుస్తకం మరల తెరచి... అనడంలో అతని కోసం పరితపించే పున్నమిలా ప్రస్థానం ప్రారంభించడంలో వీరనారీమణిగా అభివర్ణించిన తీరు అద్వితీయం. కాలానికీ, మనసుకీ మలినం, మరణం రెండూ లేవు; వేరు దారి లేదంటారు. నిష్కల్మషమైన మనసే గెలిచి తీరుతుంటారు. మా అమ్మే కవిత్వం అని తన తలపులన్నిటా కవిత్వం ఆవరించిన తీరు వినూత్న కోణంలో ఆవిష్కరించారు.

కవిత్వపు జలనిధి తాగిన అంతెరుగని అక్షరసిరి మన కవి. వినూత్న దారుల్లో ప్రయాణం చేస్తున్న కవితా మనోహరుడు మన కవి. కవి గారి అక్షరాలు క్రాంతికణిలుగా, ఆలోచనలు తేజోస్పటికలుగా, అనుభూతులు కాంతి దీపికలుగా, స్వప్నాలు అనంతవర్ణాలుగా దీపిస్తూ భావ వీచికలు కవితాపరిమళాలై, వినూత్న కవితా ఒరవడిని తన 'అంతర్లోచనం'తో సమాజానికి అందించారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# హాస్య బ్రహ్మ శంకర నారాయణ సాహిత్య, కళా సేవ

- డా॥. చొప్పరపు శ్రీనివాసరావు, అడ్వకేట్, గుంటూరు.

**అగ్ని సంగీత నిధి - శంకర నారాయణ కవి :**

మానవ హృదయాలలోని ముళ్ళ పొదలను దగ్ధంచేసే "అగ్ని సంగీతం" మా శంకరనారాయణ రావులో ఉంది. అది కవితా రూపంలో సాక్షాత్కరించింది అదే అగ్ని సంగీతం. చైతన్యానల జ్వాలల చెలరేగే ఈ కవిలేఖిని అభ్యుదయ విద్యుద్వాహిని. --- మహాకవి దాశరథి (కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత), దివంగత ఆంధ్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవీంద్రులు అగ్ని సంగీతం నా దాకా ఏనాడో వచ్చింది. దాని వేడి, అసివాడి ఎప్పుడో నాకు నచ్చింది. కవిత్వానికి కావలసిన ప్రాథమిక గుణాలన్నీ నీలో ఉన్నాయి. ఇక గట్టి కట్టడాలు కట్టాలి. కానియ్...! --- మహాకవి ఆచార్య సి. నారాయణ రెడ్డి (జ్ఞాన పీఠం అవార్డు గ్రహీత, రాజ్యసభ సభ్యులు, అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, హైదరాబాద్.)

మీ పద్యములు చదివి సంతసించితిని. మీరు సాహిత్య సేవ చేయుచు కీర్తిగడించవలెనని కోరుచున్నాను. --- డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి (దివంగత ఉత్తర ప్రదేశ్ గవర్నర్, రాష్ట్ర ముఖ్య మంత్రి, కేంద్రమంత్రి.)

అధునాతన కవితలో 'అగ్నివీణ' యున్నది కాని అగ్ని సంగీతం లేదేమి అనుకున్నాను. ఆ లోపము మీ అగ్ని సంగీతము తీర్చినది. నవత మానవత ప్రతిఫలించిన మీకృతి అంగార శృంగారములను సమ్మేళనం చేసినది. అభ్యుదయ పథమున పురోగమించినది.--- విద్యారత్న, పరిశోధనా పరమేశ్వర, కళా ప్రపూర్ణ నిడుదవోలు వెంకటరావు. (దివంగత మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి, చెన్నై.)

అగ్ని సంగీతము తెలుగుసాహిత్యములోని క్రొత్త మైలురాయి. (ఇప్పుడు కిలోమీటరు రాయి అనిపించినది.) ఈ కవి శ్రీశ్రీ ప్రభృతులకు చాలా సమీపమున శోభింపగల సరస్వతీ పుత్రుడు. అగ్ని సంగీతం అభ్యుదయ భావాల లావాల సంగీతము ప్రగతి వాద వేదము. అత్యధునాతన కావ్య ప్రక్రియనవగీతము. --- డాక్టర్ సరగు రంగప్ప కృష్ణమూర్తి (దివంగత హిందీ శాఖాధ్యక్షులు, జ్ఞానభారతి విశ్వవిద్యాలయం, బెంగుళూరు.)

తన హాస్య చతురాత్మతతో హాస్య సంభాషణలతో జడివాన కురిపించి అందులో ప్రేక్షకులను ముంచెత్తి మనసులను దోచుకునే హాస్య మాంత్రికుడు, హాస్యరత్న డాక్టర్ శంకర నారాయణ. --- జింకా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి (కడప జిల్లా రచయితల సంఘం, పుట్టపర్తి సాహితీ పీఠం, పొద్దుటూరు.)

ఫన్‌గన్, ఫన్ దేహాలు, టెలిఫన్ వగైరా ఫన్ బాణాల్ని తన అక్షయ, అక్షర, హాస్య తూణీరంలోంచి గత నాలుగు దశాబ్దాలుగా సంధిస్తూనే శంకరనారాయణుడు తన దంటూ ఒక కొత్త సాహితీస్థానాన్ని సంపాదించుకున్నారు. --- జి. వల్లీశ్వర్ (ప్రముఖ జర్నలిస్టు, ఆంధ్రప్రదేశ్ పత్రిక మాజీ ఎడిటర్, భారత్ టుడే టి.వి. ఛానల్ డైరెక్టర్, హైదరాబాద్.)

అవధాని ప్రక్రియలో అప్రస్తుత ప్రసంగాన్ని అలౌకిక హాస్య ప్రక్రియగా మార్చుకుని హాస్యావధానాన్ని సృష్టించిన శంకర నారాయణ గారికి హాస్యబ్రహ్మ అని బిరుదు ఇవ్వడం హాస్యాన్ని గౌరవించినట్లయింది. --- రావులపాటి సీతారాంరావు (ఆంధ్రప్రదేశ్ మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, అమరావతి.)

నేను శంకర నారాయణ అభిమానిని ఆయన రియల్ హీరో. హీరోకు ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. --- దివంగత నట సమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు (దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, హైదరాబాద్.)

ఆయనో జర్నలిస్ట్, తనకలంతోనూ, గళంతోనూ హాస్యాన్ని పండించగల హ్యూమరిస్ట్. అందరినీ ప్రేమించ గల హ్యూమనిస్ట్. నవ్వుల కొరడాలతో బాధల వీపుల బద్దలు చేసే ఆయనే హాస్య బ్రహ్మ శంకర నారాయణ. --- మేజిక్ చాప్లిన్, చొక్కాపు వెంకట రమణ (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, హైదరాబాద్.)

కాళిదాసు ఉపమ, దండిపదలాలిత్యం, భారవి అర్థ గౌరవం - ఈ మూడూ పుణికి పుచ్చుకున్న 'అపర మాఘుడు' శంకరనారాయణ. --- ఆచార్య మసన చెన్నప్ప (విశ్రాంత తెలుగు శాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.)

"హాస్యావధానం అనే పేరు నేనే పెట్టాను. ఆరంభంలో అది చిన్న మొక్క. ఇప్పుడది వేయి ఊడల వటవృక్షం. దాని క్రింద శంకర నారాయణ మేధా దక్షిణామూర్తి. మండుటెండల్లో వడగళ్ళ వాన శంకరనారాయణ గారి చతురోక్తులు. మల్లెల బంతుల్లాగా దెబ్బతగిలీ తగల కుండా శోభనపు రాత్రులను గుర్తుకు తెస్తాయి. కాఫీలో తరకవస్తే నాకు గిట్టదు. అన్నంతింటుంటే రాయి వస్తే నాకు చిరాకు. కవిత్వం రాస్తుంటే ఫోన్ వస్తే నాకు ఒళ్ళుమంట. కానీ ఉప్మాలో వచ్చే జీడిపప్పుముక్క అన్నా, పులిహోరలో వచ్చే పచ్చి మిరపకాయ ముక్క అన్నా, అవధానంలో వచ్చే శంకర నారాయణ అప్రస్తుతమన్నా ఇష్టం. --- తనికెళ్ళ భరణి, (ప్రముఖ రచయిత, సినీనటుడు.)

అప్రస్తుత ప్రసంగాల్లో సిద్ధహస్తులు శ్రీ శంకర నారాయణ గారు. ఎక్కడైనా సహస్రావధానం జరుగు తున్నప్పుడు అవధాని ప్రవేశానికి ఎంత కరతాళ ధ్వనులతో ఆనందాన్ని ప్రకటిస్తారో, అంతే హర్షాన్ని అప్రస్తుత ప్రశంసకుడు శంకరనారాయణ గారికి కూడా ప్రకటించడం హర్షణీయం, హాస్యం గర్వించదగ్గ విషయం --- పద్మశ్రీ బ్రహ్మానందం (ప్రముఖ సినీ హాసనటుడు.)

ఇంతమంది మహానుభావులు ప్రశంసలు వెల్లువెత్తడం హాస్యబ్రహ్మ శంకరనారాయణ మీద నేను పరిశోధన చేయడానికి స్ఫూర్తి నిచ్చింది. హాస్యబ్రహ్మ శంకర నారాయణ జీవితం - రచనా విన్యాసాలు అనే అంశం మీద నేను ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరులో పి.హెచ్.డి. చేశాను. ఈ పరిశోధన శంకరనారాయణ రచనలైన ఫన్‌గన్, పన్‌పరాగ్, అప్రస్తుత ప్రసంగాలు గ్రంథాలకు పరిమితమయింది. అయితే శంకరనారాయణ రచనలు ఇంకా ఎన్నో మిగిలి ఉన్నాయి. ఆయన మొత్తం 32 గ్రంథాలు ప్రచురించారు. అందులో 30 రచనలు హాస్యం చుట్టూ తిరిగినవే.

శంకర నారాయణలో సాహిత్యవేత్తగా రచనా వైవిధ్యం ఉంది. ప్రక్రియా వైవిధ్యం ఉంది. అలాగే కళాకారుడుగా కూడా ఆయన వైవిధ్యం చూపించారు. ఇది శంకర నారాయణ సాహితీస్వర్ణోత్సవం. విశ్వ విఖ్యాత హాస్య రస సార్వభౌముడు. నునూగుమీసాల నూత్నయవ్వనంలోనే కవిగా గజ్జకట్టాడు. శంకర నారాయణ ప్రస్థానం గురించి ఆయనే ఇలా అన్నారు. 17వ సంవత్సరంలోనే 1974లో అగ్ని సంగీతం అనే కవితా సంపుటిని అచ్చువేశారు. కవిగా పేరు తెచ్చుకున్నారు. అదే సంవత్సరం అష్టావధానం కూడా ప్రారంభించారు. ఇది చాలా గొప్ప విషయం. ఒకవైపు విప్లవకవిత్వం, అంటే అంగార కవిత్వం రాస్తూనే మరోవైపు శృంగార కవిత్వం, హాస్య కవిత్వం రాశాడు. అలాగే ఒకవైపు వచన కవిత్వం రాస్తూ, ఇంకోవైపు పద్యకవిత్వం రాయడం అందులోనూ అష్టావధానం చేసి పలువురి మెప్పు పొందటం సామాన్యమైన విషయం కాదు. ఇది లోతుగా పరిశీలించి, పరిశోధించాల్సిన విషయం.

## ఛందోవైవిధ్యం :

శంకర నారాయణలో ఛందో వైవిధ్యం కూడా ప్రస్ఫుటంగా కనిపించే విషయం. అగ్నిసంగీతం కవితా సంపుటిలో ఎక్కువ మాత్రాఛందస్సులో ఉంటాయి. మార్గ ఛందస్సులో పద్యాలు వ్రాయటమే కాకుండా మూడు శతకాలు కూడా వ్రాయడం పరిశోధనాంశంగా పని కొస్తుంది. నిండు యవ్వనంలో నాస్తికుడుగా ఉన్న శంకర నారాయణ తరువాత కాలంలో ఆస్తికుడుగా మారడం,

అంతేకాకుండా కనకదుర్గ శతకం, సంతోషీమాత శతకం, సత్యభామ శతకం అను మూడు శతకాలు వ్రాయడం విశేషం. కనకదుర్గ శతకం ఆటవెలదిలో వ్రాసినా ఇందరు మహానుబావుల ఆశీస్సులు ఉన్న తర్వాత, నా యిచ్ఛయే గాక, నాకేటి వెరవు నవ్విపోదురు గాక, నాకేటి సిగ్గు అని మహాకవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి మాటలనే నేనూ అనుకున్నాను.

1974వ సంవత్సరం నా జీవితాన్ని ఇంకో రకమైన మలుపు తిప్పింది. ఆ సంవత్సరం నేను చదివిన కాలేజీలో బులుసు రామమూర్తి గారి అష్టావధానంలో పృచ్ఛకుడిగా పాల్గొని గొడ్రాలికి కొడుకు బుట్టి గోపుర మెక్కెన్'' అనే సమస్య ఇచ్చి దుష్కరప్రాసతో అవధానిని ఇబ్బంది పెట్టాను. ఆ తర్వాత నెలరోజులకు మార్కాపురంలో నరాల రామారెడ్డి గారి అవధానం చూసి ఆకళింపు చేసుకొని, నేనూ చేయాలనుకొన్నాను. 1994 నవంబర్ 16వ తేదీన మార్కాపురం లోని చెన్న కేశవ స్వామి ఆలయంలో తొలి అష్టావధానం చేశాను. పృచ్ఛకులందరూ నా గురువులే. అప్పటి నుంచి 15 అష్టావధానాలు చేసి, పద్య కవిత్వానికి స్వస్తిపలికి, అభ్యుదయ కవిత్వానికే పరిమితమయ్యాను. అభ్యుదయ రచయితల సమాఖ్య అనే సంస్థను కూడా స్థాపించాను. వారంరోజులకో కవిత ఏదో ఒక పత్రికలో అచ్చుకాకపోతే, నాకు ఏదోలా అదోలా ఉండేదని. సి.నారాయణ రెడ్డి గారికి కూడా ఇటువంటి ఫీలింగే ఉండేదని నాకు తెలిసింది.

యతిలో కొంత మార్పు చేసి ఆటవెలది కాదు మాట వెలది అనడం శంకర నారాయణ సాహసం.

## క్రొత్త ప్రక్రియలు :

క్రొత్త ప్రక్రియలు సాంప్రదాయకమైన ప్రక్రియలో ఒక ఎత్తు అయితే, ప్రత్యేకమైన ప్రక్రియను సృష్టించి అందులో సాహితీ వ్యవసాయం చేయడం విశిష్టం. శంకరనారాయణ తన పద్ధతిలో శంకరాలు ప్రక్రియను సృష్టించాడు. శంకరాలు -1 & శంకరాలు - 2 అనే రెండు మినీ కవితా సంపుటాలను ప్రచురించి పాఠకుల అభిమానం చూరగొన్నారు.

## మహాకవుల ప్రభావం :

శంకరనారాయణ ఫన్‌గన్ గానీ ఇతర రచనలు గానీ పేరడీల పుట్టలు. శంకర నారాయణ మీద శ్రీశ్రీ పఠాభి, ఆరుద్ర, సి.నారాయణ రెడ్డి, గజ్జెల మల్లారెడ్డి వంటి మహాకవుల ప్రభావం పుష్కలంగా ఉంది. శంకర నారాయణ శ్రీశ్రీ మహా ప్రస్థానం ప్రభావంతో అగ్ని సంగీతం, పఠాభి పంచాంగం ప్రభావంతో పన్ పరాగ్, గజ్జెల మల్లారెడ్డి ప్రభావంతో మాత్రాఛందో గీతాలు రాశాడు. జవనాశ్వంలా పరిగెత్తించాడు. ఆరుద్ర ప్రభావంతో శంకరన్న పదాలు అని రాశారు.

## విషయ వైవిధ్యం :

శంకర నారాయణ తెలుగు భాష సాహిత్యం, రాజకీయ, సామాజిక వాణిజ్య, వాస్తు, క్రీడా సంబంధ అంశాల మీద రచనలు చేశారు. వాస్తు, క్రీడా సంబంధమైన అంశాల మీద వాస్యాలు రాసి, హాస్య, వ్యంగ్య చమత్కారాలు గుప్పించారు.

## సంకర పేరడీలు :

శంకర నారాయణ రచనల్లో ఒక పేరడీ, ఒక ఆరడి, గారడీ ఉంటాయి. సినిమా పాటలకు రాజకీయ విషయాలతో పేరడీలు రాసి పాఠక లోకాన్ని విశేషంగా ఆకట్టుకున్నారు. పేరడీలతో శబ్దసృష్టి చేశారు. ఇప్పటి వరకు 12వేల పదాలను పేరడీలతో సృష్టించి అభినవ శబ్దశాసనుడు అనే బిరుదును ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా బద్వేలు సమీపంలోని మొల్ల సాహిత్య పీఠం నుంచి అందుకున్నారు. ప్రముఖ తెలుగు పండితుడు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత అయిన గానుగపెంట హనుమంతరావు ఈ బిరుదుతో కూడా అవార్డును శంకర నారాయణకు ప్రధానం చేశారు.

శంకర నారాయణ రాసిన పన్‌పరాగ్ ప్రభావంతో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకట రమణ 'విక్రమూర్ఖుని విస్కీ కథలు' పుస్తకం రాసి ప్రచురించారు. అంతేకాదు తన అభిమాన రచయితలు

అయిదుగురు అందులో శంకర నారాయణ ఒకరని చొక్కాపు వెంకట రమణ ప్రకటించడం విశేషం. పేరడీ ప్రక్రియకు ప్రసిద్ధి తెచ్చిన రచయితల్లో శంకరనారాయణ ఒకరు. ఒక ప్రసిద్ధమైన పదంలో ఒక అక్షరాన్ని అటూ ఇటూ మార్చి కొత్త పదాన్ని సృష్టించడం సంకర పదాలను, పేరడీలను సృష్టించడం, పరిశోధనార్హం. ఇందుకు ఆంగ్ల, సంస్కృత, హిందీ, ఉర్దూ పదాలను కూడా ఉప యోగించుకొని భాషా సాంకర్యం చేయటం కూడా విశేషం. ఇది ఒకరమైన మణిప్రవాళ శైలి. కవులు నిరంకుశులు (కవయః నిరంకుశాహః) కవిగా శంకర నారాయణ కూడా నిరంకుశుడే.

## హాస్య సాహితీ విమర్శకుడు శంకర నారాయణ :

తెలుగునాట సాహితీ విమర్శకులుగా సుప్రసిద్ధు లయిన వారు ఎందరో ఉన్నారు. కానీ హాస్యంతో మేళవించి సాహితీ విమర్శచేయడం అదీ పరిశోధ నాత్మకంగా చేయడం శంకర నారాయణ చిత్ర విచిత్ర విన్యాసం. ఇందులో 'ఇంగ్లీషుకు తల్లి తెలుగు' అనే పుస్తకం ఒకటి. ఎవరైనా తెలుగుకు తల్లి సంస్కృతమనీ (జనని సంస్కృతంబు సకల భాషలకును) అంటారు... మూలద్రావిడ భాష అనీ అంటారు గానీ ఏకంగా ఇంగ్లీషు భాషే తెలుగు నుంచి పుట్టిందనేది శంకరనారాయణ హాస్య విమర్శ. నిజమే అనిపించేంత పరిశోధన. అలాగే 'కవులున్నారు జాగ్రత్త', 'సరస్వతీ పుత్రులు పొట్టాభిషేకం', 'సర్వేశ్వరా గెలిపించరా', 'సోదర సోదరీమణులారా!' అలాగే 'తీగలాగే భార్య', 'చెలియో చెల్లకో' లాంటి గ్రంథాలు ఉన్నాయి. ఇది కొత్తరకం సాహితీ విమర్శ.

## కవిత్వంలా అనిపించే వచనం :

'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం' అన్నారు. ఇది జగన్నాథ పండితరాయల సిద్ధాంతం. దీనిని ప్రమాణంగా తీసుకుంటే శంకర నారాయణ రచించిన వ్యాసాలు అన్నీ కావ్యాలే. 'గద్యం కవీనాం నికషం వదన్తి' (వచనం రాయడం కవులకు గీటురాయి) అన్నారు. ఈ లెక్కన శంకరనారాయణ అటు గద్యం (వచన గేయమైనా) అయినా పద్యం అయినా సవ్యసాచిలా నడిపించిన వాడు శంకరనారాయణ. వాస్తు విశేషాలను సైతం సరస వచనంలో తెలియజేశారు.

## జర్నలిస్టు రచయిత :

రచయితలందరూ జర్నలిస్టులు కాలేరు. జర్నలిస్టు లందరూ కాలమిస్టులు కాలేరు. కాలమిస్టులందరూ హాస్య రచయితలు కాలేరు. కానీ శంకరనారాయణ రచ యిత, జర్నలిస్టు, కాలమిస్టు, హాస్యరచయిత, ఈ కోవలో శంకరనారాయణ రచనలను నిగ్గు తేల్చాల్సి ఉంది. సునిశితమైన హాస్య దృష్టిని మేళవించి 'భగవద్గీత'కు 'శంకరగీత' అనే పేరుతో వ్యాఖ్యానం రాయడం శంకర నారాయణకే సాధ్యం. అలాగే ప్రశ్నోత్తరాల్లో కూడా చెణుకులు, పేరడీలుగా భాగాలు చేసి ఫన్ దేహాలు, విట్‌బిట్స్ కాలమ్స్‌ను సంధించారు. ఇందులో ఫన్ దేహాలు విస్తృత పాఠక జనాదరణని సంపాదించుకుంది. 'ఫన్ దేహాలు' అనేది 'సందేహాలు' అనే మాటకు పేరడీ. ఇది ఆంధ్రప్రభ వార పత్రికలో కాలమ్‌గా వచ్చింది. ఫన్‌దేహాలు అనే పేరు పెట్టింది ప్రముఖ సినీరచయిత, మిధునం ఫేమ్ శ్రీరమణ.

## ఆత్మకథలు :

శంకరనారాయణ తన జీవితంలోని విశేషాలతో మూడు ఆత్మకథలు రాసుకున్నారు. వినోదాత్మక సంఘ టనలతో తీపిగుర్తులు, తాను చేసిన 50 ఉద్యోగాల విశేషాలతో ఉద్యోగ విజయాలు, సినిమా వాళ్ళతో తన పరిచయాల గురించి 'సినిమా వాళ్ళతో నేను' అనే గ్రంథాలు ప్రచురించారు.

## పరిశోధన గ్రంథాలు :

శంకరనారాయణ గురించి హాస్యబ్రహ్మ శంకర నారాయణ జీవితం రచనా విన్యాసాలు అనే అంశం మీద ఒక పి.హెచ్.డి. పరిశోధనా గ్రంథం వెలువడగా, హాస్యా వధాన స్రష్ట శ్రీ శంకరనారాయణ అనే గ్రంథాన్ని జె.సావిత్రి సాయి మరో గ్రంథం రచించారు. అలాగే 'నేనెరిగిన శంకరనారాయణ' అనే పేరుతో వెనిశెట్టి రవికుమార్ మరో

పుస్తకం రాశారు. అనేక మంది ప్రముఖ సాహితీవేత్తలు పత్రికలలో ఎన్నో వ్యాసాలు రాశారు. శంకరనారాయణ గురించి ఎన్నో అభినందన సంచికలు వచ్చాయి. ఇందులో 'మూడు పదుల ముచ్చట' ఒకటి, 'అభినవ తెనాలి రామకృష్ణ' అనేది రెండోది.

### కవిత్వపు విలువలు :

శంకరనారాయణ కవిత్వంలో అమూర్త భావాల మూర్తీకరణ, ఉపమా నవ్యత, ప్రతీక నవ్యత, శైలీ విలక్షణత వంటి విశేషాలన్నీ తవ్వి తీసి, తెలుగు సాహితీ ప్రియులకు, పరిశోధనాభిలాషులకు తెలియజేయట మైంది. శంకర నారాయణ రాసింది కవిత్వమైనా, వచన మైనా అద్భుతమైన ఆలోచనామృతం.

### జోగ్దేవి ఉపాసన :

పండితులందరూ తాము వాగ్దేవీ ఉపాసన చేయడం వల్ల ఇంత పాండిత్యం సంపాదించు కున్నామని చెబు తారు. కానీ శంకరనారాయణ మాత్రం తాను జోగ్దేవి (జోక్ + దేవి) ఉపాసనం చేస్తున్నానంటాడు. అనితరసాధ్యం ఈ మార్గం. శంకరనారాయణ నవ్వులగని. ఎంత హాస్యాన్ని అయినా తవ్వుకోవచ్చు. అందుకే ఆయన్ను హాస్య బ్రహ్మ అన్నారు.

### హాస్య సంపాదకీయాలు :

అన్ని ప్రతికల్లో సంపాదకీయాలు ఉంటాయి. కానీ ఆంధ్రప్రభ దిన పత్రికలో ఏడాదిన్నరపాటు రోజూ ఒక హాస్య సంపాదకీయం రాయడం శంకరనారాయణకే చెల్లు. ఇది విలక్షణత, ఇవి చమక్కులు, నవ్వేనజరానా, మీ నవ్వు మీ ఇష్టం పుస్తకాలుగా వెలువడ్డాయి.

### జోకుల పుస్తకం :

శంకరనారాయణ జోకులన్నీ కలిపి 'నవ్వులనయాగరా' అనే పుస్తకం వెలువడింది. శంకరనారాయణ నిజంగా నవ్వుల నయాగారానే, హాస్యామృత జలపాతమే.

### విశిష్ట కళారూపం హాస్యావధానం :

మనకు 64 కళలున్నాయి. వాటిని చతుష్షష్టి కళలు అంటారు. హాస్యానికి అవధాన స్థాయికి తీసుకువెళ్ళి 'హాస్వావధానం' అనే కళా రూపాన్ని సృష్టించడం శంకర నారాయణ విశిష్టత. హాస్యాన్ని పట్టం కట్టడం చారి త్రాత్మకం. ఈ ఘనకార్యం చేసినవాడు శంకరనారాయణ. హాస్యావధానంలో రెండు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్ సాధిం చాడు. కువైట్‌లో శంకరనారాయణ హాస్వావధానానికి ముగ్ధులై అక్కడి, కరెన్సీ దీనారాలతో దీనారాభిషేకం చేశారు. దేశవిదేశాల్లో 430 హాస్యావధానాలు చేసిన శంకరనారాయణ రజత కిరీటం, రెండు స్వర్ణ కంకణాలు, ఒక స్వర్ణ పతకంతో సాహిత్య కళాసంస్థలు సత్కరించారు. 91 అవార్డులు వచ్చి, 40 బిరుదులు వరించాయి.

### అప్రస్తుత ప్రసంగభేరి :

అవధానులను యుద్ధక్షేత్రంగా భావించి అప్రస్తుత ప్రసంగ భేరి మోగించడం శంకర నారాయణకేసాటి. మాడుగుల నాగఫణి శర్మ, మేడసాని మోహన్, నరాల రామారెడ్డి, గరికటపాటి నరసింహారావు, వనపర్తి పద్మాకర్, రాళ్ళబండి కవితా ప్రసాద్, గండ్లూరి దత్తాత్రేయ శర్మ వంటి ప్రముఖ అవధానులందరి అవధానాల్లో శంకర ణారాయణ అప్రస్తుత ప్రసంగం ఒక వెలుగు వెలిగింది.

ఇటు కవితారంగంలోనూ అటు కళారంగంలోనూ అద్వితీయమైన విజయాలు సాధించిన శంకరనారాయణ విలక్షణతపై ఉన్నత పరిశోధనలు చేయడంవల్ల తెలుగు వాడి గొప్పతనాన్ని యావత్ ప్రపంచానికి చాటి చెప్పినట్టు అవుతుంది. అది చేయాలన్నదే నా సంకల్పం.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వడ్డేపల్లి సోదరుల కథా సాహిత్యం

- శనిగరం కిషన్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణలో కవులు లేరన్నారు. అదేవిధంగా కథకులు లేరన్నారు. తెలంగాణ సాహిత్యాన్ని గుర్తించలేక పోవడం బాధాకరం. అందువలన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ముమ్మరం అయింది. తెలంగాణ రాష్ట్ర సాధన జరిగేంత వరకు ఈ ప్రాంతపు ఉద్యమకారులు విశ్రమించ లేదు. భౌగోళికంగా, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సంస్కృతి పరంగా అనేక రంగాలలో తెలంగాణ ప్రాంతపు వారిని చిన్న చూపు చూడటం జరిగింది. సాహిత్యరంగంలో అదే విధంగా జరిగింది. ఎందరో కవులు రచయితలు ఈ ప్రాంతంలో ఉన్నారని ఆనాడే సురవరం ప్రతాపరెడ్డి గారు గోల్కొండ కవుల సంచిక ప్రచురించారు. అదేవిధంగా ఆనాడు తెనుగు పత్రిక, దేశబంధు పత్రిక, సుజాత పత్రిక వంటివి ఎన్నో పత్రికలు ప్రజలలో ఉండేవి. అటువంటి పత్రికలు ఈ ప్రాంతపు ఎందరినో కవులను, రచయితలను పత్రిక ద్వారా పరిచయం చేశాయి. ఆనాటికే గొప్ప రచనలు చేసిన ఎందరో తెలంగాణ మహనీయుల గురించి మనం తెలుసుకోవచ్చు. వడ్డేపల్లి సోదరులు దేశబంధు పత్రిక ద్వారా ఎందరినో కథకులను ప్రోత్సహించారు. అటువంటివారిలో యజ్ఞకృష్ణ దాసు, వెంకోబా రావు, ఆనందము మొదలైనవారు ఎందరో ఉన్నారు.

దేశబంధు పత్రికలలో వడ్డేపల్లి సోదరులు తెలంగాణ ప్రాంతపు కథలను విశేషంగా ప్రచురించి ప్రోత్సహించారు. అదేవిధంగా వడ్డేపల్లి సోదరులైన బెల్లంకొండ నరసింహా చార్యులు, బెల్లంకొండ వెంకటాచార్యులు మరియు సోదరులు ఇద్దరూ కలిసి రాసిన కథలు ఉన్నాయి. వారు పౌరాణిక కథలు, వర్తమాన పరిస్థితుల ప్రభావంగా రాసిన కథలు, సనాతన ధర్మము ఆర్య సమాజ ప్రభావము గల కథలను రాశారు. వారు రాసిన కథలలో ఆనాటి సమకాల పరిస్థితులను తెలియజెప్పే కథలు విశేషమైనవి. అటు వంటి కథలు "మెతుకు కథలు" కథా సంకలనంలో ప్రచురితనామైయి. జిల్లా కథా సంకలనాలు వెలువడడం, 2000 సంవత్సరం నుండి ప్రారంభమైంది. కరీంనగర్ జిల్లా కథలు, నల్లగొండ జిల్లా కథలు మొదలుగా ఒక్కొక్క జిల్లా తమ సాహిత్య అస్తిత్వాన్ని ఒక చోట రికార్డ్ చేయడం ప్రారంభించింది. ఇది తెలంగాణ ఉద్యమ ప్రేరణగా సాధ్యమైన అస్తిత్వ చైతన్యం.

మెదక్ జిల్లా వెనుకబడిన జిల్లాగా పేరు పెట్టబడింది. అయినా ఈ ప్రాంతంలో పరిశోధకులు మేధావులు స్వతంత్రంగా ఎన్నో కష్టాలకు ఓర్చి మరుగున పడ్డ తెలంగాణ కవులను రచయితలను వెలికితీశారు. ఆ కృషిలో భాగంగానే 'మెతుకు కథలు' కథా సంకలనం వెలువడింది. ఈ కథా సంకలనం 2016 లో వచ్చింది .

మెతుకు కథలు కథా సంకలనానికి వేముగంటి మురళీకృష్ణ గారు, బెల్లంకొండ సంపత్ కుమార్ గారు సంపాదకత్వం వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ సాహిత్య నిర్మాణంలో భాగంగా ఈ కథా సంకలనం రావడం శుభపరిణామం. ఈ కథా సంకలనాన్ని మంజీరా రచయితల సంఘం ప్రచురించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఆరంభమైన ఈ కృషి బహుముఖ ప్రజ్ఞాశాలురు అయిన మరియు మెదక్ జిల్లా మారుమూల గ్రామం వడ్డేపల్లి నుండి దేశబంధు పత్రిక నడిపించి సామాజిక చైతన్యంతో రచనలు చేసిన వడ్డేపల్లి సోదరులైన బెల్లంకొండ నరసింహా చార్యులు మరియు బెల్లంకొండ వెంకటాచారి లకు అంకితం ఇవ్వడం గొప్ప విషయం. ఆ కథా సంకలనం ద్వారా వెలుగుచూసిన వడ్డేపల్లి సోదరుల కథలు నా పరిశోధన పరిధిలోనివి.

వడ్డేపల్లి సోదరులు 'సంఘ సంస్కార సభ' అనే కథను రాశారు. (మెతుకు కతలు; సంఘ సంస్కార సభ, పేజి

నెంబర్ 10) ఈ కథలో సంఘ ఇందులో తఖ్తీ సాహెబ్ దురాగతం వర్ణితమయినది. ఈ కథలో మౌల్వీ రఫీ యుద్దీన్ ఆదర్శవంతమైన పాత్ర. భూస్వామ్య విధానం, యెట్టి చాకిరి ఈ కథలో ఉన్నాయి. నవాబుల దుర్మార్గం వర్ణించబడింది. బాలింత అని కూడా చూడకుండా సత్తి కొట్టడం ద్వారా ఆనాటి దుశ్చర్యలు అర్థం అవుతాయి. ఇల్లు సోదా చేస్తున్నప్పుడు ఒక ఇంటిలో గ్రంథాలు దొరకడం వలన తఖ్తీ సాహెబ్ ఉగ్రుడైనాడు.

రఫీ యుద్దీన్ గ్రంథాలయ ఉద్యమ కకార్యకర్తగా ఒక చైతన్యశీలిగా ఈ కథలో తీర్చిదిద్దబడినాడు. మెదక్, జోగిపేట, నార్సింగి, తూప్రాన్, ఎల్లారెడ్డి, గజ్వేల్ మొద లైన పరిసర ప్రాంతాల ప్రస్తావన ఉన్నది. ఈ ప్రస్తావన ఆధారంగా ఆయా ప్రాంతాలు గ్రంథాలయ ఉద్యమానికి బాసటగా ఉన్నాయని అర్థమవుతుంది.

కథలో నవాబు గ్రంథాలు దొరికినందుకు ఎంతో ఆగ్రహపొంది, గ్రంథాలయోద్యమంపై ఉక్కుపాదం మోపడానికి ప్రయత్నించాడు. సంఘ సంస్కార సభకు గ్రంథాలయోద్యమం పునాదిగా ఉండటం నవాబుకు నచ్చలేదు. అక్కడ మల్ల యుద్ధవీరులు ఉండడం వలన జవాన్ వెంట ఉన్న ఒకరిద్దరిని భటులను వారు వ్యతి రేకించారు. నవాబు పైకి తిరుగుబాటు జరిగే సమయానికి పెద్ద జంగ్ జరిగే సూచనలు ఉన్నాయని తెలుసుకుని, గ్రామస్తులందరూ ఏకమయ్యే సూచనలు ఉన్నాయని తెలుసుకుని, పట్టుబడిన రఫీయుద్దీన్ని వదిలేసి తత్తీ సాహెబ్ పెన్ను తిరిగిపోవడం చైతన్యంగా రచయితలు చెప్పదలిచారు.

బెల్లంకొండ నరసింహ చార్యులు రాసిన సియాసీ సభలు కథ వినూత్నమైనది. ఈ కథ ఆ నాటి సమకాలీన పరిస్థితులను అద్దంలో చూపిస్తుంది. సియాసీ సభలకు ఒక రాజకీయ నేపథ్యం ఉన్నది. ఆనాడు గస్తీ నిషాన్ తిర్పన్ అనే ఒక చట్టం వచ్చింది. ఈ చట్టాన్ని నిజాం ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారంగా, రాజకీయ సభలు నిర్వహించతలచుకున్న వారు పది రోజుల ముందుగా ఈ సభ యొక్క వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలి. హైదరాబాదులో ఉన్న పోలీస్ కమిషనర్ తో గాని లేదా జిల్లా కలెక్టర్లతో గాని పర్మిషన్ తీసుకోవాలి.

రాజకీయంగా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తే, సభలు జరగడానికి ముందుగానే ప్రభుత్వం ఆ సభ వివరాలతో పాటు, సభలో ప్రసంగించే వారి ఉపన్యాస సారాంశం కూడా ప్రభుత్వానికి సమర్పించబడిన వలసి వచ్చేది. ధరావతు చెల్లించవలసి వచ్చేది. ఇటువంటి చర్యలు ప్రజావ్యతిరేక మైనవి. అంతేకాకుండా మానవ హక్కులను ఉల్లంఘిస్తు న్నాయి. ఆ కారణంగా బెల్లంకొండ నరసింహాచార్యులు గారు సియాసి సభలు కథ రాశారు (మెతుకు కతలు; సియాసి సభలు, పేజి నెంబర్ 14 ).

ఈ కథకు కేంద్రం మెదక్ జిల్లా తూప్రాన్ వద్దగల పాములబండ గ్రామం. వడ్డేపల్లి సోదరులు తమ దేశ బంధు పత్రిక మీద తూప్రాన్ పేరును ప్రధానంగా పేర్కొనేవారు. ఈ కథ ప్రారంభం కూడా తూప్రాన్ పరిసర ప్రాంతం కావడం గమనించదగినది. ఈ కథలో వెట్టిచాకిరీ, భూస్వామ్య విధానం, సమకాల పరిస్థితుల వలన సమాజ చైతన్యం. వర్ణితమైంది. మెదక్ జిల్లాలో భాగమైన రంగంపేట, జోగిపేట, వోలు, టేక్మాల్, పొట్లచెరువు, ఖిక్క నూరు వంటి సంస్థానాల గ్రామాల ప్రస్తావన ఉన్నది.

కుల నిరసనలను కథ బయటపెట్టింది. "పుట్టుక మైల, చావు మైల, మట్టి మైల, మనం మనుషులము. మైల కాము. దేవుడు చెప్పింది ముక్తి. గజేంద్రుని ముసలి పట్టుకుంటే కాలు విదిలించి బయటకు లాగుతూ కోరినది. చివరకు చక్రము గల శ్రీకృష్ణుని పిలిచినది. కృష్ణుని చక్రాయుధము కదా ముక్తి కలిగించినది. మనమును అంతే. మనమునూ ముక్తి మార్గము చూసుకొనవలెను"

"ముక్తి అనగానేమి?" అని నర్సి నోరువిప్పినప్పుడు :

"అనగా ఇప్పుడున్న భయానక పరిస్థితులను తొల గించుకొని బయటపడుట ముక్తియే యనబడును." అనే

పాత్రల మధ్య సంభాషణ ఎంతో ఆదర్శనీయమైనది ఈ కథ ఆనాటి ప్రజలలో కలుగుతున్న చైతన్యాన్ని విశద పరుస్తుంది.

భూస్వాములు అధికారులు నవాబులు కోళ్లను గొర్రెలను తెమ్మని యెట్టి పనివారలను పంపినపుడు, ఎక్కడ కూడా ఆ జీవాలు దొరకలేదు. ఆనాటి గ్రంథాల యోద్యమ మరియు ఆంధ్ర మహాసభల కార్యకర్త అయిన శ్రీనివాసాచారి అనే గుడి పూజారి అయ్యవారి వద్ద కోళ్లు ఉండడం, ఆ పూజారి వెట్టి పని వారిని చైతన్యపరిచి కర్తవ్యోన్ముఖుడిని చేయడం కథలో ప్రధానాంశంగా ఉన్నది.

అదేవిధంగా వడ్డేపల్లి వెంకటాచార్యులు రాసిన కథ, భక్త విజయం పేర్కొనదగినది. ఈ కథలో రచయిత భక్తి పేరిట కలుపుతూఉన్న జననమీకరణను ఆనాటి నియంతృత్వ రాజ్య వ్యతిరేకతకు ఒక సోపానం చేశారు. ఆనాటి పాలకులు మనలో మనకు ఏ విధంగా గా కలహాలు సృష్టించి, అనైక్యతకు కారణమైనారో ఈ కథ తెలుపుతుంది. ఈ కథ సంఘాల ఐక్యత, కలిసికట్టు తనంగా ఉండవలసిన కాల సందర్భాన్ని ప్రబోధించింది.

ఆనాటి ఆంధ్ర మహాసభల ప్రభావంగా ఆర్యసమాజ ప్రభావంగా వడ్డేపల్లి సోదరులు కథలు రాశారు. కథకులు లేరు అన్న సమయంలో పత్రిక ద్వారా తాము కథలు రాస్తూ ఎందర్నో కథకులను ప్రోత్సహిస్తూ తెలంగాణ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. మెతుకు కతలు : సంపాదకులు వేముగంటి మురళీకృష్ణ, బెల్లంకొండ సంపత్ కుమార్
2. దేశబంధు పత్రికలు : సంపాదకులు బెల్లంకొండ నరసింహాచార్యులు, సహ సంపాదకులు బెల్లంకొండ వెంకటాచార్యులు
3. ముఖాముఖి బెల్లంకొండ సంపత్ కుమార్ గారు

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సంస్కృతం – వైజ్ఞానిక శాస్త్రానువాదాలు

– డా॥. బొశెట్టి లత, ప్రిన్సిపాల్ (F.A.C.), ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, కర్నూలు జిల్లా.

భవిష్యత్తు ఒక ఎడారి అనుకుంటే, అందులో ఫల వంతమైన క్షేత్రాలను చూడగలిగే శక్తి వైజ్ఞానిక శాస్త్రాల ప్రయోజనం ప్రకృతి రహస్యాలను వెలికి తీయడమే నిజానికి ఈ శాస్త్రాలన్నీ ప్రజాశ్రేయస్సు కోసం రచించ బడ్డాయి. ప్రత్యక్షానుభవం ద్వారా ప్రయోగాల పదార్థా లను గురించి మనం సంపాదించేది విజ్ఞానం, ఈ విజ్ఞానం రెండు రకాలు అవి.

1. మంచి, చెడు, న్యాయం, అన్యాయ, నీతి, అవినీతి వీటి అర్థాన్ని తెలియజేస్తుంది.
2. ఆత్మజ్ఞానం 'ఇక సాధించవల్సింది ఏదీ లేదు ' అనే పరిపూర్ణత దీనిలో ఎన్నడూ కన్పించదు. కాబట్టి వైజ్ఞానిక గ్రంథాలు ముఖ్యమైనవి.

## వైజ్ఞానిక శాస్త్రాల పరిచయం :

### అర్థశాస్త్రం :

'అర్థశాస్రం' అను రాజనీతి శాస్త్ర గ్రంథాన్ని కౌటిల్యుడు. ప్రస్తుతం లభ్యమౌతున్న రాజనీతి గ్రంథాల్లో 'అర్థశాస్త్రం' మొదటిది. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో ప్రాచీనమైన ఐదు నీతి శాస్త్రాలను బ్రహస్పతి, శుక్ర, మను, విశిష్ఠ, పారాశర్య పేర్కొన్నాడు. వాటితో పాటు అనేక అజ్ఞాత రచనల నుండి శ్లోకాల్ని ఉదహరించాడు. క్రీ.శ. 4వ శకం కి చెందిన చంద్రగుప్త మౌర్యునికి మంత్రి కౌటిల్యుడు.

అర్థశాస్త్రంలో చెప్పిన అర్థనీతి, రాజనీతి, దండనీతి, వ్యవహారనీతి మెదలగునవి ఈనాటి సమాజానికి మంచిని బోధించేవిగా ఉన్నాయి. ప్రధానంగా అర్థనీతి చెప్పినా ప్రసంగానుకూలంగా నీతి, సదాచరణ, దర్మాచరణ, వ్యవహారజ్ఞానం చాలా చోట్ల బోధించబడింది. అందుకే అర్థనీతికే కాకుండా లోక వ్యవహారనీతికి ప్రామాణికంగా నిలిచింది.

### అలంకారశాస్త్రం :

కావ్యానుశీలనం చేసే శాస్త్ర గ్రంథాలను అలంకార శాస్త్రాలని అంటారు. వీటిల్లో కావ్యసంబంధమైన చర్చలు ఉంటాయి. కాబట్టి కావ్య విమర్శనా గ్రంథాలనీ, లక్షణాలు మరియు లక్ష్య భూతంగా కావ్యాల సమీక్షలు ఉండటం చేత వీటిని లక్షణ గ్రంథాలనీ అంటారు. కావ్యాల సాధుత్వాసాధుత్వాలను నిర్ణయించడంలో ప్రథమస్థానం వీటికి ఉంది. కవిత్వదోషాలు, గుణాలంకార రసాలు, కవిప్రతిభాదులు, కావ్య ప్రయోజనాలు, అలంకారాల ప్రాముఖ్యం కావ్యభేదాలు, లక్షణాలు మొదలగునవి ఈ అలంకార శాస్త్రంలో చర్చించబడ్డాయి.

### జ్యోతిష్య శాస్త్రం :

అనుభవం, జ్ఞానం, నమ్మకాల ఆధారంగా రూపొందిన శాస్త్రం జ్యోతిష్య శాస్త్రం. సూర్యుడు మొదలగునవి నవ గ్రహాలకు అశ్విని నుండి రేవతి వరకు గల 27 నక్షత్రాలకు జ్యోతులని పేరు. వాటి స్థితి, చలనం అందువల్ల కలిగే మార్పులను తెలియజేస్తుంది. ఈ జ్యోతిశ్శాస్త్రం వేదాం గాలలో జ్యోతిష్యం ఒకటి.

జ్యోతిశ్శాస్త్రం ప్రధానంగా 3 భాగాలు అవి -

1. సిద్ధాంత భాగం, 2 జాతక (హెణ) భాగం 3). సంహిత భాగం

సిద్ధాంత భాగంలో గ్రహాల గణిత పద్ధతి, నవ మాసాలు, గ్రహణ సాధన మొదలగునవి తెలియజేస్తుంది. జాతక భాగం-జననకాలంలోని గ్రహాల స్థితి గతుల్ని, బట్టి రాశికుండలిని, జనన, మరణం, వివాహా, యోగాలు మొదలగునవి వాటి శుభాశుభాఫలాన్ని తెల్పుతుంది. సంహిత భాగం-సాముద్రికం, గోచారాది విషయము, దేశాల భవిష్యత్తు, భూకంపాల గురించి తెలియజేస్తుంది.

**ధర్మశాస్త్రం :**

వేదాలు, వేదాంగాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం మొదలగునవి చతుర్దశ విద్యలు ధర్మశాస్త్రం అంటే ధర్మాల్ని తెల్పునవి. ధర్మం అంటే ఏమిటి? అంటే వారు, వాళ్ళు చేయాల్సిన, నడచుకోవాల్సిన విధి. ఇందులో కొన్ని జన సామాన్య జనులకు కావాల్సినవి ఉదా- అహింస, సత్యం, అక్రోధం ఇవి సామాన్యములు, విశేషములు - బ్రహ్మచారి, గృహస్థుడు మొదలగువారికి ఉండాల్సినవి విశేషములు. కాటట్టి వీటని

1. వర్ణ ధర్మాలు
2. ఆశ్రమ ధర్మాలు
3. వర్ణాశ్రమ ధర్మాలు అని 3 రకాలుగా చెప్పారు.

ఇలాంటి ధర్మాలకు మూలం 'వేదం' వేదోధర్మమూలం అని గౌతమ మునీంద్రుడు ధర్మాన్ని వేదాల ఆధారంగా కలవి అని చెప్పారు.

**వేదాంతం :**

వేదాల సముదాయమే ధర్మానికి మూలం వేదాల యొక్క చివరి భాగం కాబట్టి 'వేదాంతాలని' ఉపనిషత్తులని పిలుస్తారు. వేదాల్లో కర్మకాండం, జ్ఞానకాండ అని రెండు భాగాలున్నాయి. కర్మకాండలో అభ్యుదయాన్ని కల్గించే జ్యోతిష్టోమాది కర్మల గురించి వివరించబడింది. జ్ఞానకాండలో మోక్షసాధనకు అవసరమైన అనేక మార్గాలు నిర్దేశించబడ్డాయి. 'జ్ఞానకాండనే' ఉపనిషత్కాండ అని అంటారు. 'ఉపనిషత్' శబ్దానికి, అజ్ఞాననాశనం, ఆత్మజ్ఞాన ప్రదాయకం అని అర్థం.

**నీతి శాస్త్రం :**

సూక్తి, సూక్తం, సదూక్తి, సుభాషితం మొదలగునవి అన్నీ పర్యాయపదాలే. ఇవన్నీ కూడా ఆచరించడానికి తగిన జ్ఞానాన్ని గొప్పదైన జీవితపు విలువల్ని తెలియజేసి, సమాజంలో ధర్మాన్ని పెంపొందిస్తూ ఉంటాయి.

**వైద్య శాస్త్రం :**

'వైద్యం తెలియనివాడు వానకు తడియనివాడు లేడు' అనే సామెత ఉంది. కారణం ఈ విశాల తెలుగు భూమిపై అనేక వైద్య సంస్థలు, వైద్యం పట్ల ఆదరణ చూపించారని తెలుస్తుంది.

ఉదా :- 1శతాబ్దికి చెందిన హాలుని 'గాథాసప్తశతి'లో మన సంప్రదాయ వైద్యాన్ని గూర్చి ఉంది. నాగార్జుని వైద్యరచనలు, అలాగే నాగార్జున కొండలోని శాసనాల్లో ఒక దానిలో 'జ్వరాలయం' అని పేర్కొనబడింది. తర్వాత కాలపు శాసనాల్లో 'ఆరోగ్యశాల' ప్రసూతి శాల మొదలగునవి వైద్య సంస్థలు స్థాపించినట్లు తెలుస్తుంది.

ఆయుర్వేద వైద్య రహస్యాలు బాలగేయాలుగాను, ఏల పాటల్లోను, పెండ్లి పాటల్లోను మరెన్నో సాహిత్య ప్రక్రియల్లో నేటికి వాడుకలో ఉండటం తెలిసిందే. ఆయుర్వేదం, వృక్షాయుర్వేదం, జ్యోతిర్వేదం, ప్రకృతి వైద్యం, గజాశ్వపశువైద్యం మొదలగునవి అనేక శాఖోపశాఖలుగా అల్లుకుపోయిన మహాజీవశాస్త్రం ఈ వైద్య శాస్త్రం. ఈ విధమైన వైజ్ఞానిక శాస్త్రాలన్నీ పునరుజ్జీవితమవడానికి మనమందరం శ్రద్ధ వహించాల్సిన అవసరం చాలా ఉంది.

## వైజ్ఞానిక శాస్త్రానువాదాలు :

**1. అర్థశాస్త్రం :**

- ఆంధ్ర అర్థశాస్త్ర చంద్రిక - గోవిందరాజు హరిశ్చంద్ర రావు - వచనం -
- అర్థశాస్త్ర చంద్రిక - కట్టమంచి రామలింగారెడ్డి - వచనం - 1914
- అర్థశాస్త్ర చంద్రిక - మామిడిపూడి వెంకట రంగయ్య - వచనం - 1920
- ధనార్జన సాధనం - రంగాభట్లఅ గున్నయ్యశాస్త్రి - వచనం - 1909

**2. అలంకార శాస్త్రం :**

- అలంకార శాస్త్రం - కందుకూరి వీరేశలింగం పంతులు - వచనం - 1903
- ఆంధ్రచంద్రాలోకం -
  1. అక్కిరాజు ఉమాకాంతం - వచనం - 1914

2. ఎస్.చలపతిరావు - వచనం - 1913.

- ఆంధ్రదశరూపకం - మల్లాది సూర్యనారాయణ శాస్త్రి - వచనం - 1917
- ఆంధ్రదశరూపక విమర్శనం - వావిలాల సదా శివశాస్త్రి - వచనం - 1917
- ఆంధ్రరసమంజరి - దుగ్గిరాల రామారావు
- ఆంధ్రసాహిత్య దర్పణం - వేదుల వెంకట రామశాస్త్రి

**3. కళలు :**

- అశ్వశాస్త్రం - మనుమంచిభట్టు - వైద్యం - పద్యం - 1998
- అశ్వలక్షణసార సంగ్రహం - అడవి సాంబశివరావు
- అశ్వవైద్యశాస్త్రం - పువ్వాడ సూర్యనారాయణ - వచనం
- ధనుశాస్త్రం - సి.రాజగోపాల రాజు - పద్యం - 1993
- పశుశాస్త్రం - తేకుమళ్ళ రాజగోపాలరావు- వచనం - 1912
- వృక్షశాస్త్రం - టి.సీతీరామయ్య
  టి. సాలమన్ రాజు - వచనం - 1913
  వేమూరి శ్రీనివాసరావు - వచనం - 1919
  సి.నారాయణమూర్తి - వచనం - 1913
- శారీర శాస్త్ర సంగ్రహము -
  టి.సాలమన్ రాజు - వచనం - 1915
  వేమూరి శ్రీనివాసరావు - వచనం -
  శృంగారకవి వేంకట్రామయ్య - వచనం - 1912
- తర్క సంగ్రహం - కందుకూరి వీరేశలింగం పంతులు

**4. గణితం :**

- పావులూరి మల్లన - సారసంగ్రహగణితం - పద్యం - 11వ శతాబ్ది
- అంకగణితము - ఎస్.పి.వి.రంగాచార్యులు - వచనం - 1986
- అద్భుత గణితం - గుత్తా వేంకటరామయ్య - వచనం
- అంకగణితము - మహాకాళి సుబ్బారాయుడు - వచనం - 1893

**5. పాకశాస్త్రం :**

- నలభీమపాకశాస్త్రం- టి.ఎస్.టి. గోపాలయ్య - వచనం - 1918

**6. జ్యోతిష్యం :**

- అదృష్ట దీపిక - రెంటాల వేంకటాసుబ్బారావు - వచనం - 1915
- ఆంధ్రకాలామృతం - ఎమ్.వెంకటశాస్త్రి - పద్యం - 1891
- జాతక చింతామణి - అలూరి ఏకామ్రదైవజ్ఞులు - వచనం
- కాలచక్రం - ఎ.ఏకాంబ్రజ్యోస్యులు - వచనం
- జాతకరత్నం - లంకాసంజీవరావు

**7. ధర్మశాస్త్రం :**

- విజ్ఞానేశ్వరీయం - మూలఘటికకేతన - 13వ శతాబ్ది
- ఆంధ్రధర్మసింధువు - కే.కామశాస్త్రి - వచనం - 13వ శతాబ్ది
- ఆంధ్ర మనుధర్మశాస్త్రం - ద్వారపురెడ్డి అప్పల్నా యుడు - వచనం - 1917 (స్మృతి)
- ఆంధ్ర పరాశర స్మృతి- ఆదిపూడి ప్రభాకర కవి - స్మృతి - వచనం - 1900
- శేషధర్మం - తిమ్మయకవి

**8. వాస్తుశాస్త్రం :**

- కృష్ణవాస్తు శాస్త్రం
  1) ఎన్.గురులింగశాస్త్రి - వచనం - 1898
  2) వేరు సోముల గణపయ్య - వచనం
- వాస్తు ఫలగ్రంథం - మాణిక్యం సుబ్బారాయుడు
- వాస్తు సార చంద్రిక - కిల్లంపల్లి తిమ్మదైవజ్ఞుడు

**9. నీతిశాస్త్రం :**

- చిన్నయ్యసూరి - నీతి చంద్రిక
- పంచతంత్రం - నోరిగురుమూర్తిశాస్త్రి - ప్రబంధ కథ - వచనం - 1884
- పంచతంత్రం - కొక్కొండపంతులు - ప్రబంధకథ - వచనం - 1874
- పంచతంత్రం - బైచరాజు వేంకటనాథుడు
- మొదటి కాకతి ప్రతాపరుద్రుడు - నీతిపాఠం

**10. వేదాంతం :**

- అద్వైతతత్త్వసారసంగ్రహం - ఎన్.నర్సింహం - పద్యం
- ఆంధ్రభవద్గీత -
  1) అమ్ము సోమయ్య - వచనం - 1915
  2) తాడూరి లక్ష్మినృసింహకవి - పద్యం
- ఆంధ్రవేదాంతద్వైతం - చింతామణి - వజ్జల నారాయణశాస్త్రి - వచనం - 1919
- ఆంధ్ర శ్రీ భాష్యం
  1) పరవస్తు శ్రీనివాస జగన్నాథం స్వామి - వచనం - 1889
  2) కందాడి శేషాచార్యులు - వచనం -1917
- ఆంధ్ర సూత్రభాష్యం- పురాణపండమల్లయ్య శాస్త్రి - వచనం - 1922
- యోగవాసిష్ఠసారం - కృష్ణగిరి కృష్ణ యార్యుడు - శ్లోకతార్పర్యాలు
- యోగవాసిష్ఠరత్నములు - కృష్ణగిరి కృష్ణ యార్యుడు - శ్లోకతార్పర్యాలు

**11. ఆయుర్వేదం :**

- ఆగస్త్యవైద్యం - పండిత డి.గోపాలాచార్యులు - వచనం - 1916
- ఆయుర్వేదం -

**12. వైద్యం :**

- ఆగస్త్యవైద్యం - పండిత డి.గోపాలాచార్యులు - వచనం - 1916
- ఆయుర్వేదం -

**13. వ్యవసాయ శాస్త్రం :**

- కృషిశాస్త్ర దీపిక - కె.వెంట్రామయ్య - వ్యవసాయం - వచనం
- కృషి చంద్రిక - పి.సూర్యనారాయణ - వచనం - 1894
- కృషిశాస్త్ర సార సంగ్రహం - పెనుమత్స రామ చంద్రరావు -
- ఉద్యానకృషి - గోటేటి జోగరాజు - వచనం - 1914

**14. సంగీతం :**

- సంకీర్తనాలక్షణం - చిన తిరుమలాచార్యులు - 16వ శతాబ్ది
- ఆంధ్రగీతా గోవిందం- మనికొండ వేంకటరమణ కవి
- సంగీత దర్పణం - కె.సీతారామానుజచారి
- సంగీత సుధా సంగ్రహం - నగరి మునుస్వామి నాయుడు - వచనం - 1908
- సంగీతాభవసార సంగ్రహం - వి.శ్రీ సావాసయ్య గారు - వచనం - 1913

**15. కామశాస్త్రం :**

- కొక్కోకం - కూచిరాజు ఎర్రన - 15 శతాబ్ది

**16. పురాణం :**

- మార్కండేయ పురాణం - మారన్న - 13వ శతాబ్ది
- విష్ణుపురాణం - పశుపతి నాగనాధకవి - 14వ శతాబ్ది - అలభ్యం
- విష్ణుపురాణం - వెన్నెలకంటి సూరన్న - 14వ శతాబ్ది
- విష్ణుపురాణం - కలిదిండిభావనారాయణ - 14వ శతాబ్ది
- విష్ణుపురాణం - తుపాకుల అనంత భూపాలుడు - వచనం

**ఉపయుక్త గ్రంథాలు :**

1. నాగేశ్వరరావు కాశీనాథుని - ఆంధ్రవాఙ్మయ సూచిక - ప్రాచీ పబ్లికేషన్స్, హైద్రాబాద్, 1929.
2. సుజాతరెడ్డి ముదిగంటి - సంస్కృత సాహిత్య చరిత్ర - పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్, 2007.
3. భారతీయ ఉజ్వల వైజ్ఞానిక పరంపర - సురేష్‌సోనీ - నవోదయ బుక్ పబ్లికేషన్స్.
4. ఆధునిక భాషా శాస్త్రం - ప్రొ.వెలమల సిమ్మన్న - దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం - 2014.
5. డా.ద్వా.నా.శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర - ప్రగతి పబ్లికేషన్స్, హైద్రాబాద్ - 2008.

# పాకుడురాళ్ళు నవల – మంజరి పాత్ర

– నక్కా శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాష్య విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగులో వెలువడిన ప్రప్రథమ "నేచురలిస్ట్ - నవల" గా పాకుడురాళ్ళు పేరు ప్రతిష్టలు గడించుకొంది. పాకుడు రాళ్ళు నవలలో ప్రధాన స్త్రీ పాత్ర మంజరి. నవల ప్రారంభంలోని మంగమ్మ తర్వాత మంజరిగా. మంజరి ఆయా పరిస్థితుల్లో తన అభిమాతానికి విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. తన మనసుపై తనకే అదుపులేని పరిస్థితు లను ఎదుర్కొటుంది. ఈమె నాగమణి వద్ద ఉన్నప్పటి కంటే నాటక సమాజంలో చేరిన తరువాత మానసిక తృప్తిని అనుభవిస్తుంది. రాజమణి, వసంతలను తన ఆత్మీయ బంధువులుగా భావించింది. చలపతి ఈమెను సినిమారంగానికి పరిచయం చేస్తానని మద్రాస్ తీసుకొని వెళ్తాడు.

రాతిని తెచ్చి రత్నాల సరసన ఉంచారని మాయా మర్మం, మోహం కప్పని స్వచ్ఛమైన అభిప్రాయాన్ని చలపతి వద్ద వెల్లడిస్తుంది. నీతి, నిజాయితీతో బ్రతకాలన్న బలమైన ఆకాంక్ష మంజరిలో బలీయంగా ఉంది. కానీ చలపతి చూపిన మార్గం అందుకు విరుద్ధంగా ఉంటుంది. రోజు కొకరితో పంచుకొనే జీవితం దుర్భరమైనదిగా భావించి, ఆమె తన మనసును చంపుకొని వేదనను అనుభవిం చింది. ఆ సమయంలో నాగమణి, వసంత, రామచంద్రం, మాధరావుల ఆత్మీయత కోసం ఆరాటపడే మనసు బహిర్గతమవుతుంది. సినిమా పరిశ్రమలో అడుగుపెట్టిన దగ్గర నుండి కృత్రిమమైన విలువకోసం ప్రాకులాడు తుంది. స్నేహమాధుర్యంతో కళ్యాణికి ఆప్తురాలవుతుంది. ఆమె ఆర్థిక స్తోమత పెరుగుతున్న దశలో విరాళాలు విరివిగా ఇచ్చింది. రెండు అనాథ శరణాలయాలు ఆమె పేరుతో నడుస్తున్నాయి. బ్రతికిన నాలుగు రోజులు డబ్బుతో వచ్చే, ఆనందాలను అనుభవించాలను కుంటుంది.

వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజన్, లాలారాం, పిళ్ళే, చందూలాల్, కిషన్‌దాస్, సక్సేనా, మొ॥ ఎందరో వ్యక్తుల పరిచయంతో ఆమె తన మనస్సు చంపుకొని చెయ్యరాని పనులు చేస్తుంది. తనకు కావలసిన ఇల్లు తనకు చెందడం కోసం సక్సేనా సహాయం అర్థించింది. ప్రతి ఫలంగా బ్లూఫిలింలో నటన, సక్సేనా బ్లాక్ మెయిలింగ్, వెంటనే మంజరి ఆత్మహత్యతో నవల ముగించటం జరిగింది.

మంజరి పాత్రలో నటి సావిత్రి, కాంచనమాల, మీనాకుమారి, మార్లిన్ మన్రోలు ఉండవచ్చు. ఈ నవల రాసిన తర్వాత కూడా సిల్క్‌స్మిత, దివ్యభారతి, సౌందర్య మొ॥ వారు మరణించారు. మంజరి అతి సామాన్య స్థితి నుండి ఒక మెట్టు తరువాత మరో మెట్టును అధిరోహిస్తూ ఇక ఆమె ఎక్కవలసిన మెట్టేలేదు అన్న స్థాయికి చేరింది. అయితే ఆమె ఎక్కిన మెట్లన్నీ 'పాకుడురాళ్ళు' అని ఆమెకు తెలియదు.

ఆకుపచ్చని కాశ్మీరపు తివాచీమీద మంజరి శరీరం వెల్లకిలాపడి ఉంది. పడక గదిలో ఉన్న కిటికీ పూర్తిగా తెరిచివుంది. టెలిఫోను కిందపడి ముక్కలై పోయింది. అల్లంత దూరంలో పసుపు పచ్చని మందు బిళ్ళలు చెల్లా చెదురుగా పడివున్నాయి. ఆమె సంపాదించిన కీర్తి ప్రతిష్టలు, సిరిసంపదలు, ఆమెనీ కొసకు తరముకొచ్చాయి. అనన్యమైన ప్రతిభా సంపదలున్న వ్యక్తిమీద జీవితం ఏదో రూపంలో కసితీర్చుకుంటుందంటారు. ఇది పాకుడు రాళ్ళు నవల ద్వారా డా॥ రావూరి భరద్వాజ గారందించిన సందేశం, రచయిత తీర్పు. సినీ పత్రికల్లో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో చలనచిత్ర రంగంలోని వెలుగు నీడలను, కష్టసుఖాలను ఒడిదుడుకులను మొత్తానికి సినిమా వెనుక గల సినిమా చరిత్రను గూర్చి చాలా దగ్గరగా చూశాను. అందుకే ఈ ఇతివృత్తం అన్నారాయన. ఆలపాటి వెంకట

రామయ్య గారు ఈ పుస్తకాన్ని గూర్చి రాస్తూ "పాకుడు రాళ్ళు" ఒక నవలగా నాకు నచ్చటానికి కారణం సినిమా వెనకగల సినిమా చరిత్రను రచయిత కళాత్మకంగా చిత్రించడమే కాదు, జరిగిన, జరుగుతున్న, జరగడానికి అవకాశాలున్న వేలాది సంఘటనల్ని తన రచనలో పొహళించడం కూడా కాదు. వీటన్నింటినీ మించి, వీటన్నింటి వెనక రచయిత పడుతున్న మనోవేదన, వీటిని మార్చి తీరాలన్న అతని ప్రగాఢ వాంఛ నన్ను కదిలించింది అంటారాయన. నిత్య కళ్యాణం పచ్చతోరణంగా భావిస్తూ, వేలాది మందిని తనవైపు ఆకర్షించే ఈరంగంలో పాతుకుపోయిన అవాంఛనీయమైన శక్తులను గురించి రచయిత మనకు కనువిప్పు కల్గిస్తున్నాడు. చిరునవ్వుల వెనుక అణిగిపోయే ఆత్మఘోష, తళుకు చూపులచాటున దాగిన కన్నీరు, తియ్యని మాటల మాటున పొంచియున్న విషజ్వాలలు, మనకు ఈ నవలలో ప్రత్యక్షమౌతాయి అంటారు వెంకటరామయ్య గారు.

ఈ సందర్భాన మాధవరావు చెప్పిన (పేజీ 606 తిరగేయండి) మంజరిగా మారిన మంగమ్మ రాసిన లేఖలోని కొన్ని పంక్తులు చూడండి. "ఈ ప్రపంచంలో ప్రాణాలున్నంత కాలమూ మనుషుల మధ్య సంబంధాలుంటాయన్న నమ్మకం నాకిప్పటికీ ఉంది. మిమ్మల్ని చూడాలని నేనెంత ఘోషిస్తున్నానో నాకు ఆ పరమాత్మకూ మాత్రమే తెలుసు. ప్రతిజాబు చివరనా సుఖంగా ఉన్నావు కదా? అంటారు" నేనెలా ఉన్నది ఒక్కసారి వచ్చి చూడండి. ఆప్తులకోసం నా ఆత్మ దశదిశలు అన్వేషిస్తుంది. ఎంతో ఎత్తుకు ఎదిగారని మీరు లోగడ జాబులో రాశారు. బహుశా అందువల్లనే కావచ్చు భూమిమీద కాళ్ళు నిలపలేక పోతున్నాను. ఒక్కోతరంగం మహోద్ధృతంగా వచ్చి నా కాళ్ళ కింద మట్టిని త్రవ్వి లాగి పారేస్తుంటే ఏమిచేయటానికి తోచక ఏడ్చినా వినే దిక్కులేక అల్లాడి పోతున్నాను అంటూ రాసింది. ఈ మహా సంక్షోభం నుండి రవంత బయటపడేందుకు కాస్తచల్లని వాతావరణంలో ప్రశాంతంగా బతికేందుకు నాకు అవకాశముంటే చాలు. ఇందులోని భావాలు, భావాలలోతులు, మంజరి మనోవేదనను, మానసిక క్షోభను, తేటతెల్లం చేస్తున్నాయి. ఇండియా మొత్తం మీద, ఏదో ఒక భాషలో, ఏదో ఒక ప్రాంతంలో ఆవిడున్న సినిమా ప్రతిరోజు ఆడుతుంది. ఇది ఆమె ఖ్యాతికి గుర్తు.

రామచంద్రం, మాధవరావును ముందు నీవుపద ఒక వారం రోజుల్లో నేనొస్తాను అన్నాడు. స్టేషన్ దగ్గరికి స్వయంగా కారు తీసుకొని వచ్చింది మంజరి. గుర్తుపట్టడం ఇబ్బంది అనిపించింది. ఆవిడే పలకరించింది. "బొమ్మలో ఉన్న దానికి, నీకూ ఎక్కడా పోలిక లేదు మంజరీ" అన్నాడు. సినిమాలో బాగున్నానంటారా? విడిగా బాగున్నానంటారా అన్నదావిడ.

సినీ బ్రతుకుల సొసగసులను వివరిస్తూ రచయిత - అతనోగ్లాసును కొద్దిగా వాసన చూసి మంజరికిచ్చాడు. ఆవిడ దానిని ఖాళీ చేసింది. ఆ తర్వాత చందూలాల్ కోరిన కోరిక ఆవిడకు చాలా విడ్డూరంగా తోచింది. అతగాడు మంజరిని జుట్టు విరబోసుకోమన్నాడు. అందమైన జాకెట్టును పీలికలు చేసుకోమన్నాడు. చీర కూడా చించుకోమన్నాడు. పిచ్చికేకలు వేస్తూ గదంతా తిరగమన్నాడు. తనకు దొరకవద్దని, దొరికినా కొట్టి రక్కి తప్పించుకోమన్నాడు. మంజరి 'నెవర్' అన్నది. "యు షుడ్ డూ ఇట్" అన్నాడు చందూలాల్, ఆమె కాదంటే తానే వేటకుక్కలా చేశాడు. వెరీగుడ్ వెరీగుడ్, ఐయామ్ వెరీహ్యాపీ అన్నాడు. ఇందులో సొగసులు కాదు సినీ జీవితం కనిపిస్తుంది.

సినీ జీవితంలో కళ్యాణి మాటల్ని కూడా ఇక్కడ మనం గమనించాలి. "ఏం బతుకులో మంజూ! మన జీవితాలకే అర్థం అంటూ లేకుండా పోతుంది. బతుకు ఎంత నీరసంగా నిస్తేజంగా ఉంటుందంటే హఠాత్తుగా ఏ రైలు కిందనోపడి ముక్కలు ముక్కలైపోవాలనిపిస్తుంది. మళ్ళీ ఆ బాధకూడా అనుభవంలోకి రావాలని ఉంటుంది. అయితే ఇవేవీ జరగవు. మనమిలా ఈ పంజరాల్లో ఉండాల్సిందే.

ఇలాంటి అనుభవాలు, వేదనలు సినీ జీవితం వెనక దాగున్నాయి. డబ్బుల లావాదేవీలు, దోపిడీలు, దాడులు, అప్పులు, అప్పుల ఎగవేతలు, ఐ.పీ.లు మొదలైన ఎన్నో ఎన్నో దృశ్యాలు సీన్ల వెనుక సీన్లు ఆ సినిమా ప్రపంచంలో కెళ్ళిన వాళ్ళకు మామూలు ప్రపంచం కనిపించదు. మామూలు మనుషులు మనుషులనిపించరు. పొయ్యి మీద కుండెక్కని వాళ్ళ బ్రతుకుల్లో కూడా ఈ సినీ జగత్తులో ఎన్నో మార్పులు వస్తాయి. ఔట్‌డోర్, ఇండోర్ షూటింగులుంటాయి. కాల్‌షీట్లు వస్తాయి. కళ్ళ నీళ్ళు వస్తాయి. అంటే ఇలాంటి అనుభవాలు ఎన్నో ఎన్నెన్నో అనుభవాలు కూడితేనే జీవితం, జీవితంలోని గాయాలే అనుభవాలు. మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. వంచనా ఉంటుంది, వేదనా ఉంటుంది, బ్యాంకర్లూ ఉంటారు, బేరగాళ్ళూ ఉంటారు. తాయారు మాటలకు లోనై ఇంతకన్నా మంచి జీవితం కావాలి, తన పేరు మీదున్న నాల్గు బ్యాంకుల్లో అకౌంట్లుండాలి, నాల్గు కార్లుండాలి, బ్రహ్మాండమైన ప్యాలెస్ ఉండాలి. నాలుగు టెలిఫోన్లు ఉండాలి. తనకో ప్రొడక్షన్ కంపెనీ ఉండాలి. చిన్న ఆర్టిస్టులు, పెద్ద ఆర్టిస్టులు తన గడపలో పడిగాపులు పడుతూ ఉండాలని కోర్కెలు కోరిన మంజరి కడకు ఏమయింది? దేనికోసం ఆరాటపడింది? జీవితం ఎలా ముగిసింది ? ఇదొక అనుభవాల సారం. భరద్వాజ తన అనుభవాల్ని ఆలోచనల్ని ముద్దగట్టి మూటగట్టి మన ముందుంచాడు. మాయాజలతారు పట్టు చీరలాగ ఒకనాగమణి, మంగమ్మ, కళ్యాణి, తాయారు, శంకరం, చందూలాల్ మరెందరో సినీ సొగసుల్లో వగరూ కాదు - పొగరూ, దానిలోని చీకటి, చీకటిలోని మర్మాలు చేదు అనుభవాలు తీపిముచ్చట్లు మనముందుంచారు.

జీవితానికి కావలసింది విలాసాలు భోగాలు దాన్ని చుట్టుకున్న విషరోగాలు కావు. ప్రేమ కావాలి. ఆత్మీయత కావాలి సగటు మనిషి జీవితం కావాలి అనే మానవతా సందేశం అందించారు. “జీవితంలో విషాదం డబ్బు లేక పోవడం కాదు. మనల్ని ప్రేమించే వాళ్ళు లేకపోవడం మనం ప్రేమించడానికి దొరక్కపోవడం” అని మంజరి చివరి ఘడియల్లో అన్న మాటలు ఆమె పడుతున్న మానసిక సంఘర్షణకి అద్దం పడుతున్నాయి. మంజరి భూమిపై పుట్టింది, ఆకాశానికెగిరింది. పాతాళంలోకి జారిపోయింది. ఈ నవలలోని పాత్రల బహిర్, అంతర సంఘర్షణల ఫలితమే ఈ నవల. వ్యక్తి యొక్క సామాజిక జీవితం వేరు, అంతరంగ చైతన్యం వైరు. వ్యక్తిలో స్వార్థ ప్రబోధం ఎక్కువైనపుడు అంతరంగంలోని మానవతను బహిర్ ప్రవృత్తి జయిస్తుంది. సినీ రంగంలో, సర్వ సాధారణంగా జరిగేది ఇదే.

సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం మంజరి పాత్రలో ఈడిపస్ కాంప్లెక్స్ అధికంగా ఉంది. స్టార్‌గా ఎదగాలన్న బలమైన కోరిక ఆమెను చెయ్యగూడని పనులు చేసేలా ప్రోత్సహించింది. ఆ బలమైన కోరికను నెరవేర్చుకోడానికి అందివచ్చిన అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంది. నీతి, నియమాలకు తిలోద కాలిచ్చింది. తన సౌందర్యంతో ప్రపంచంలో గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని, విశ్వసుందరిగా ఎదగాలని పగటి కలలు కనింది. గొప్ప ఐశ్వర్యవంతుల పొందుతో ఆమె అనతి కాలంలోనే గొప్ప స్టార్‌గా వెలిగింది. తన ఎదుగుదలకు ఏవైనా అవరోధాలు ఏర్పడితే ఆత్మ న్యూనతకు గురైంది.

స్టార్ అవ్వాలన్న కోరిక ఆమెను ‘ఆధిపత్యం’ కోసం ప్రాకులాడేలా చేసింది. విశ్వసుందరియైన మార్లిన్ మన్రోతో తనను పోల్చుకుంది. ఒక్కోమెట్టు ఎక్కుతూ ఉన్నత స్థానానికి చేరాలని కలలు కనింది. ఎంతో పోటీని ఎదుర్కొంది. శారీరకంగా, మానసికంగా సంఘర్షణకు గురైంది. మితి మీరిన ధన వ్యామోహంతో తన చుట్టూ ఉన్న పరిసరాలను, పరిస్థితుల్ని సంక్లిష్టం చేసుకుంది. ఒక స్థాయికి చేరుకున్న తరువాత నీతి నియమాలతో జీవించలేకపోయింది. తన ఇల్లు తనకు చెందక పోవటంతో బ్లూ ఫిలింలో నటించి ఆత్మన్యూనతకు

గురైంది. మానసికంగా ఎంతో సంఘర్షణకు గురైంది. ఆ సమయంలో ఆమెకు అండగా నిలబడే నా అనే వాళ్ళెవరూ లేరు. ఓదార్పు కోసం అర్రులు చాచింది. మానసిక సంఘర్షణ బద్దలై ఆత్మహత్య చేసుకుంది. ఆమె ప్రవర్తనలో ఆడ్లర్ సిద్ధాంతం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మంజరి కొన్ని సందర్భాల్లో ఆత్మ న్యూనతకు గురైంది, కొన్ని సందర్భాల్లో ఆధిపత్యాన్ని చెలాయించింది. కార్ల్‌యాంగ్ సిద్ధాంతీకరించిన ప్రకారం మంజరిలో రెండు రకాల ప్రవర్తనలున్నాయి. ఒక ప్రవర్తన బాహ్య ప్రవర్తన అనగా ఎక్స్‌ట్రావర్ట్ ప్రవర్తన. మరో ప్రవర్తన అంతర ప్రవర్తన అనగా ఇన్‌ట్రావర్ట్ ప్రవర్తన. ఎక్స్‌ట్రావర్ట్ ప్రవర్తన చేతన మనసుకు సంబంధించినది ఇది బహిరంగంగా పైకి కనిపించే ప్రవర్తన. ఇది ఒక వంతు మాత్రమే పైకి కనిపిస్తుంది. ఇన్‌ట్రావర్ట్ ప్రవర్తన అచేతన మనసుకు సంబంధించినది. ఇది మనసులోపలి పొరల్లో గూడుకట్టుకుని ఉండే ప్రవర్తన తొమ్మిది వంతులు అంతరంగంలో గూడుకట్టుకొని ఉంటుంది. మంజరిలో అగ్నిపర్వతంలా గూడుకట్టుకొన్నది అచేతన ప్రవర్తనే. మనిషి కోరుకున్న విధంగా జీవితం లేనప్పుడు ఆందోళన ఎక్కువై మానసిక సంఘర్షణకు గురౌతాడు. చివరకు మానసిక సంఘర్షణ ఎక్కువై ఆత్మహత్య చేసుకుంటాడు. అసమర్థుని జీవయాత్రలో కూడా సీతారామారావు మానసిక సంఘర్షణకు లోనై ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రమైన మానసిక సంఘర్షణకు గురైన ఏ వ్యక్తికైనా చివరకు ఆత్మహత్యే శరణ్యమవుతుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలంగాణ కథ ప్రత్యేకత : దావత్ 2017

- కొత్త అరుణ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సామాజిక జీవిత చిత్రణ చేసిన కథ నిజమైన కథ. మనిషి చుట్టూ ఎన్ని సంకెళ్ళు ఉన్నాయో, సామాన్య మానవుడు ఏ విధంగా నలిగిపోతున్నడో, ఎంతగా గాయ పడుతున్నడో అనేక పరిస్థితుల ప్రభావంగా మనిషి రాను రాను ఎంత కుంచించుకొని పోతున్నాడో అటువంటి మనిషి వైపు నిలబడి కళాత్మకంగా చెప్పటం సందర్భం. నడిచివచ్చిన దారిని ఒకసారి సరిచూసుకొని ఆ దారి అన్ని ఆటంకాలతో కూడుకొని ఉండదు పరిశీలించటం కూడా రచయిత చేయవలసిన పని. ఇటువంటి మంచిచెడ్డలను పరిశీలించిన రచయిత రేపటి రోజును సౌకర్యవంతం చేస్తాడు. ఆ చింతనతో "దావత్ 2017" తెలంగాణ కథా సంకలనం రూపుదిద్దుకున్నది.

ఈ కథా సంకలనానికి సంగిశెట్టి శ్రీనివాస్ గారు, డాక్టర్ వెల్దండి శ్రీధర్ గారు సంపాదకత్వం వహించారు. సింగిడి తెలంగాణ రచయితల సంఘం ఈ కథా సంకలనాన్ని ప్రచురించింది. ఈ కథా సంకలనం లో 13 కథలున్నాయి. ప్రతి కథ సమాజాన్ని లోతుగా పరిశీలించింది. తెలంగాణ జీవితాన్ని భాషను కథలు అనివార్యం చేసింది.

మేరెడ్డి యాదగిరి గారు 'పెద్ద నోట' కథ రాశారు. నోట్ల మార్పిడిపై ప్రజలు ఎంత కష్టపడ్డారో కథ ఆలోచింప జేస్తుంది. తెలుగు పడింది. నోట్ల మార్పిడి వలన సామా న్యునికి చెప్పరాని కష్టాలు ఎదురయ్యాయి. ఎటువంటి కష్టాలు ఏ రాజకీయ నాయకుడికి సినిమా నటులకు మరి సంపన్నులకు లేకపోవడం గమనించవచ్చు. ఓటేసి నాయకులను ఎన్నుకుంటాం. ప్రజలకు మేలు అయిన ప్రభుత్వం రావాలని మంచి జరగాలని కోరుకుంటాము కానీ అందుకు భిన్నంగా కష్టాలు వస్తున్న పరిస్థితి బాధాకరం అవుతున్నది. రూప్ కుమార్ డబ్బీకార్ గారు 'లక్ష్మీబాయ' కథలో తాగుడుకు బానిస అయిన భర్త, భార్య పడుతున్న కష్టాలు కళ్లకు కట్టబడ్డాయి. భార్య సంపాదించి పెట్టవలసిన పరిస్థితి. భార్య మాంసం ఎత్తుకొని రోడ్డు మీద నడుస్తుంటే అందరూ ఆమెను చూస్తున్నారన్న భయం, ఒకవైపు పాత బట్టలు మరొకవైపు బీదరికం వెక్కిరిస్తున్న దైన్యం కథలో వర్ణించబడింది.

హుమాయున్ సంధ్య గారు 'పచ్చశీర' కథ రాశారు. కథలో రియల్ ఎస్టేట్ ఏ విధంగా వ్యవసాయ రంగం యొక్క వేర్లను తెంపి వేస్తుందో చిత్రించారు. ఎక్కడ పంట పొలాలు కనిపిస్తే అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి వాలుతున్నారు. వజ్జీరు ప్రదీప్ గారు 'రంగుల గుడ్డు' కథ మరొక విభిన్నమైన ఇతివృత్తాన్ని కళ్ల ముందర ఉంచింది. ఆ కథ పేరు రంగుల గూడు .ప్రపంచీకరణ వలన కళాకారుల జీవితం చిన్నాభిన్నమైంది.గంగిరెద్దులు సింధు యక్షగానాలు కాకినాడ బుడిగె జంగం మిధుల కూన పులివంటి ఎన్నో తెగలు సంచార జాతులు ఆదరణ లేక కాలగర్భంలో కలిసిపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి అటువంటివారిని ప్రోత్సహించి ప్రభుత్వం వాళ్ళ జీవితా లను నిలబెట్టాలని ఈ కథ ఒక సందేశాన్ని ఇచ్చింది.

ఎందరో యువకులు రోడ్డు ప్రమాదాల వలన మరి ఇతర ప్రమాదాల వలన గాయాలపాలై అవయవాలు తగ్గిపోయి నరకయాతన అనుభవిస్తున్నారు. వారిలో ఎందరో చికిత్స జరుగుతుండగానే మరణించిన వారు ఉన్నారు. అటువంటి వారికి అన్నదానం కన్నా అవయవ దానం గొప్పగా పని చేస్తుందని కె.వి మనీ ప్రీతం గారు 'దానం' అనే కథను రాశారు. డాక్టర్ సరోజ బండ గారు 'బర్రెంక చెట్టు ... ఓ యాది' అనే కథలో ఆనాటి తెలంగాణ రజాకార్ల బీభత్సాన్ని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట

జ్ఞాపకాలని తెరమీద చిత్రించారు. స్త్రీవాద కోణంలో నుండి 'ద్వాలి' అనే కథ వచ్చింది. ఈ కథను సమ్మెట ఉమాదేవి గారు వ్రాశారు. ఇది రాజకీయ అవగాహన కలిగినటువంటి కథ. రాజకీయంగా ప్రజల ఓట్లతో గెలిచిన తర్వాత కూడా స్త్రీలకు పురుషాహంకారం పెత్తనం యొక్క బెడద పోవడం లేదు. భర్త చేసే శాసనాన్ని భార్య తిరస్కరించడం ఈ కథలో గొప్పగా వర్ణితమైంది. స్త్రీల కోణం లో నుండి రాసిన మరొక కథ 'పంచీ ఔర్ పింజ్రా' కథ. ఈ కథలో స్త్రీలు ఆకాశమే హద్దుగా ఎదగాలని సందేశం ఉంది. స్త్రీల జీవితాన్ని మగవాళ్ళు లీడ్ చేయాలని తలచడం, స్త్రీలను వస్తువుగా భావించడం స్వేచ్ఛకు ఆటంకం అని నిరూపిస్తుంది.

'తల్లి గారి ఇల్లు' కథను చందు తులసి గారు రాశారు. బతుకమ్మ పండుగ రాగానే తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఆనందంగా ఉంటారు. కొత్తగా పెండ్లి అయిన ఆడ పిల్లలు సైతం పుట్టింటికి చేరుకోవాలని తొందర పడుతుంటారు. కానీ తల్లిదండ్రులు లేని కూతురు వైపు నిలబడి చందుతులసి గారు తల్లి గారి ఇల్లు కథలో ఆర్ద్రతను పలికించారు.

దావత్ తెలంగాణ కథ 2017 లో రెండు ప్రేమ కథలు ఉన్నాయి. ఆ రెండు ప్రేమకథలో ఒకటి 'సముద్రం నిద్ర పోదు' అనే కథ. ఈ కథను కిరణ్ చర్ల గారు రాశారు. మరొక ప్రేమకథ 'బోర్లించిన చెప్పు'. ఈ కథను పూడూరి రాజిరెడ్డి గారు రాశారు. రెండు కథలు సైతం సమాజ జీవితాన్ని తెలియజేస్తున్నాయి. స్త్రీల వ్యక్తిగత విషయాలలో జోక్యం కలిగించుకొని ఇబ్బంది పెట్టడం ఎంత బాధా కరమో కూడా కథలు కళ్లకు కడుతున్నాయి. ఈ కథా సంకలనంలో 'నాలుగేళ్ల చదువు' అనే కథను ధీరజ్ కశ్యప్ వేముగంటి గారు రాశారు. కళాశాల విద్యలో ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఎన్నో ఆశలు పెట్టుకొని విద్యార్థిని చదివిస్తూ ఉంటె, చివరకు విద్యార్థి నేర్చుకున్నది ఏమిటి ? ఈ కళాశాలలు ఏమి నేర్పిస్తున్నాయని రచయిత ఆలోచింపజేసాడు. ఒక పరిపక్వత లభిస్తుందని, కాలం గడిచిన కొద్దీ ఏర్పడవలసిన పరిణతిలో మార్పు కలుగుతున్నదని రచయిత చెప్పదలిచాడు. 'ఊరి మీద ఉరితాడు' అనే కథను స్కైబాబా గారు రాశారు. ఈ కథలో తాగుడుకు బానిసైన సమాజం ఏ విధంగా మత్తులో నలిగి పోతున్నదో వర్ణితమైంది. ఇది సామాజికమైన కథ.

సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురించిన దావత్ కథ 2017 లో మన సమాజం ఎంత సంక్లిష్టంగా ఉన్నదో, కళ్లకు కట్టింది. మనిషి మారవలసిన పరిస్థితిని తెలియజేసింది. సమాజంలో ఉన్న లోటుపాట్లను బహిర్గత పరిచింది. ఈ కథా సంకలనంలో వస్తువైవిధ్యం ఉన్నది. సమాజంలో ఉన్న విభిన్న కోణాలను అర్థం చేసుకోవడానికి ఈ కథాసంకలనం ఎంతో ఉపకరిస్తుంది.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. సింగిడి కథా సంకలనాలు
2. రంది తెలంగాణ కథ 2013
3. తన్లాట తెలంగాణకథ 2014
4. అలుగు తెలంగాణ కథ 2015
5. కూరాడు తెలంగాణ కథ 2016
6. దావత్ తెలంగాణ కథ 2017

# ప్రవహించే ప్రతిఘటనే "నల్ల రక్తకణాలు"

- డా॥. ఎ. రవీంద్రబాబు

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో దళితవాదానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వీయ అస్తిత్వంతో ప్రారంభమైన దళితవాదం చైతన్యం, ప్రతిఘటనల మీదగా రాజ్యాధికారమే లక్ష్యంగా సాగింది. సాగుతుంది. ప్రపంచీకరణ మనిషిని, మానవత్వాన్ని వ్యాపారం చేసిన ప్రస్తుత పరిస్థితుల్లో దళితవాదం కొంత వెనక్కుతగ్గిందన్న మాట వినిపిస్తోంది. కానీ కొందరు కవులు మారుతున్న సామాజిక జీవన పార్శ్వాల్లోని మూలాలను తమదైన దళితకోణం నుంచి చూస్తున్నారు. వ్యక్తిగత అనుభవాలను, అనుభూతులను కవిత్వం చేస్తూ దళితవాదానికి ఊపిరి లూదుతున్నారు. అలాంటి కవే డా॥ మంథని శంకర్. అతని రెండో కవితాసంపుటే "నల్ల రక్తకణాలు". నల్లరంగును దళితులకు, దళిత జీవనానికి, బహుజనల శ్రమకు, చెమటకు, ప్రేమకు... ప్రతీక చేసి, సకల రంగుల సమాహారమే నలుపంటూ అభివర్ణించాడు శంకర్.

సూక్ష్మమైన సామాజిక పరిశీలన, చారిత్రక సాహిత్య అధ్యయనం, దళితబహుజన తాత్విక దృష్టి, పరిశోధ నాత్మక జ్ఞానం.. వీరి కవిత్వానికి భావాత్మక బీజాలు, స్వయం సంచలితాలు, గాఢతకు మూలకారకాలు. గతాన్ని వర్తమానంలోంచి దర్శించి, భవిష్యత్తుకు పునాధులు నిర్మించాలన్న కాంక్ష వీరి కవిత్వంలో బలంగా కనిపిస్తుంది. నిరాశ, నిస్పృహలకు తావులేకుండా చైతన్యవంతమై, దళితులను పోరాటంవైపు నిడిపే శక్తి శంకర్ ది. దళితులుగా పుట్టి అవమానాలు, హేళనలు అధిగమించి అత్యున్నతస్థాయికి ఎదిగి, ప్రపంచ గుర్తింపుపొంది మార్గదర్శకాలైన ప్రగతి రథసారధులను గుర్తు చేస్తూ...

"అబ్రహం లింకన్ / నెల్సన్ మండేలా ఒబామా
బాబా సాహెబ్ బాబూ జగజ్జీవన్ / ప్రపంచ పూదోటకు
పూచిన నల్లజాతి పువ్వులు"

అని నల్ల పుష్పాల పరిమళాలే నేటి యువతకు ఆదర్శాలంటాడు. వివిధరంగాలలో తామేంటో నిరూ పించి, దేశభక్తి చాటిన దళితులే నిజమైన నల్లరక్తకణా లంటూ, వారికి కవితాభివందనం చేస్తాడు. వారి దేశభక్తిని గుర్తించని సమాజాన్ని నిందిస్తూ, ప్రశ్నిస్తాడు.

"నిరుపేద కుటుంబంలో పుట్టిన / పరుగుల రాణి
పి.టి. ఉష
ఎవరెస్ట్ అధిరోహించిన మాలవత్ పూర్ణ / పరుగుల
లేడి పిల్ల హిమదాసు విజయాలు
విశ్వజనీన అభినందనల దృశ్యాలు / దేశభక్తి కాదా"

అంటూ దేశభక్తిపై కొనసాగుతున్న అగ్రకుల, మతాల ఆధిపత్యాన్ని నిలదీస్తాడు. అధికారం చేజిక్కించుకోవడమే దళిత బహుజనలు అంతిమలక్ష్యం. అధికారంపై అగ్ర కులాలు ఉన్నంత వరకు వీరికి సంపూర్ణ స్వేచ్ఛ లభిం చదు. అందుకోసం అందర్నీ సమాయత్తం చేయాలన్నదే దళిత కవిత్వ అంతిమలక్ష్యం. ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో శంకర్ కవిత్వం మరో ముందడుగు వేయించిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

"రేపే నీ హస్తినను చుట్టుముట్టుతం / శేషులమై
మోయం ఇక ఈ భూభారం
దింపుతం నీ అధికారం / రాబోయే నా రాజ్యం
నాగజాతి సామ్రాజ్యం"

అంటూ భారతావనిలోని వెనకబడిన జాతుల సమైక్యతను కాంక్షిస్తాడు. ప్రతిపోరాటనికి తాత్విక, సామాజిక నేపథ్యం ఉండాలి. దళిత రాజ్యాధికార ఉద్యమానికి అంబేద్కర్ సిద్ధాంతమే పునాది అని అంబేద్కర్ నిజమైన నల్లసూర్యుడని, హక్కులకోసం పోరా డటానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తని కవిత్వంతో చాటుతాడు కవి. చేతికర్ర అనేది పెత్తనానికి, పెత్తందారీ

తనానికి ప్రతీక దానిని లాక్కోవడమే ప్రస్తుతం దళితుల కార్యాచరణకు నినాదమంటాడు.

"బాబాసాహెబ్ బాటల / బతికే హక్కుకోసం కొట్లాడదాం
చేతికర్ర మనది మనం గుంజుకుందాం"

తెలుగులో దళిత ఉద్యమానికి ఇక్కడ జరిగిన అనేక సంఘటనలు ఊపిరులూదాయి. చండూరు, పదిరి కుప్పం, కారంచేడు లాంటి చోట్ల దళితులపై జరిగిన హత్యలు, దాడులు ప్రత్యక్షంగా ఉద్యమాన్ని, ఉద్యమ సాహిత్యాన్ని పదునెక్కించాయి. ఎందరోకవులు, రచయితలు, కళాకారులు వాటిని నిరసిస్తూ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. కవిత్వం నల్లరంగుపులుముకొని ఎరుపెక్కింది. కొత్త ప్రతీకలు, ఉపమానాలు, నిరసనల గళాలతో కలాలు ఉప్పెనలై తిరబడ్డాయి. సాహిత్య చరిత్రను దళితుల కోణం నుంచి తిరగరాసే ప్రయత్నాలూ జరిగాయి. చుండూరులో దళితుల ఊచకోతకు కారణ మైన వాళ్లకు శిక్షపడకపోవడాన్ని గుర్తు చేస్తూ, ఈ కవి మరో పోరాటానికి దళిత సమాధులే సాక్ష్యాలుగా సిద్ధ మవ్వాలని పిలుపునిస్తున్నాడు.

"నడవండి కోర్టుకు / శిక్షలు పడేదాకా
న్యాయం గావాలని / మృతసమాధుల సాక్ష్యంగా
పోరాటం సాగిద్దాం."

ఇంతేకాదు సమాజంలో దళితుల ఆత్మాభిమానానికి దెబ్బతగిలనప్పుడల్లా ఇతని హృదయం స్పందిస్తుంది. అక్షరాలను చైతన్య బీజాక్షరాలుగా శంకర్ కలం వెదజల్లు తుంది. హైదరాబాద్ లోని పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని కూలగొట్టినప్పుడు...

"అహింస ధర్మమే బౌద్ధధర్మం / దేశానికి మూలవాసి ధర్మం
భారతరత్న చూపుడువేలు"

ఈ దేశానికీ నిజమైన దిక్సూచి అని తరతరాల బహు జన వారసత్వ ధర్మానికి అంబేద్కర్ చూపుడువేలు ప్రతీకని చెప్తాడు. అలాంటి వేలు నేలపాలైనందుకు దుఃఖిస్తాడు. దళిత చైతన్యాన్ని చెప్పి భవిష్యత్తుపై ఆశను కల్పిస్తాడు కూడా...

ఎస్సీలకు ఇల్లు అద్దెకివ్వమన్న బోర్డు చూసి... ఇంకా ఈ అత్యాధునిక సమాజంలో కులం వేళ్లు ఎంత లోతుకు పాతుకుని ఉన్నాయో తెలుసుకొని కవిగా బాధను వెల్ల గక్కాడు. నగరాల్లో కులం మారిన తీరును గర్హిస్తూ...

"ఇతరదేశం బోతే / కులం చూసికాదు
మనిషి మొఖం చేసి పనిజూసి / ఇంటి అద్దె ఒప్పందం కుదుర్చుకోవచ్చు
వాళ్లు మనదేశంలోని కథ జూస్తే / ఎన్నారైలమనే వాళ్లంతా
ఆరుబయట సంసారాలు జెయ్యాలే...

అని ఇతరదేశాలకు ఎగబడి వలసలు పోతున్న అగ్రవర్ణాలకు చురక అంటిస్తాడు. మనదేశంలో కులం పోయిందంటున్న వాళ్లకు ఈ సాక్ష్యాన్ని చూపి కళ్లు తెరి పిస్తాడు. దళితులపై జరుగుతున్న దాడులకు, అమాన వీయ సంఘటనలకు న్యాయం జరిగేలా తీసుకొచ్చిన అట్రాసిటీ చట్టం నేటికీ వాటికి అడ్డుకట్ట వేయలేకుండా ఉంది. కొన్ని కేసులైతే న్యాయస్థానం వరకు వెళ్లకుండా పంచాయితీల్లోని పరిష్కారమయి దళితులకు అన్యాయం జరుగుతుంది. అలా నీరుగారిపోతున్న అట్రాసిటీ చట్టాన్ని

"కేసనే సరికి ఊళ్లో పంచాయితీ / ఇంత పైకం గట్టించి తప్పునొప్పుజేసి
కోర్టుల పెద్దగద్దలన్నీ / కేసులు తప్పియ్యవట్టె
కేసులు నీళ్ళమీద దెబ్బలాయే"

అని గ్రామాల్లో జరుగుతున్న అన్యాయదృశ్యాలను నీళ్లమీద దెబ్బలతో పోల్చి అద్భుతంగా చెప్పారు.

అగ్రవర్ణాల అష్టాదశ పురాణాలే గొప్పవిగా, అందులో సంగతులే ప్రామాణికాలుగా, ఆచరించదగినవిగా చెలా మణి అవుతున్న సమాజంలో కులపురాణాలు స్వీయ అస్తిత్వ పునాధుల నుంచి పుట్టాయి. సబాల్టర్న్ హిస్టరీకి,

సమాంతర సామాజిక జీవన సంస్కృతికి కావాల్సిన పరిశోధనాత్మక అంశాలు వీటిలో ఉన్నాయి. కవిగా శంకర్ కు వీటి వెనకున్న నేపథ్యం తెలుసు అందుకే మాదిగ కులపురాణంలో తమ డి.ఎన్.ఎ ను చూసుకున్నాడు. తమ వృత్తికి సంబంధించిన పురాకథలోనే అపురూపమైన ప్రేమ దాగి ఉందన్నాడు. అష్టాదశపురాణాలలో, రామాయణ, మహాభారతాల్లో అణిచివేతకు గురై, హత్యలు చేయబడ్డ తమ వారందరు తిరుగుబాటు బావుటా ఎగరేస్తారని కల్ప నాత్మక వాస్తవికతలోంచి మట్లాడతాడు.

'రేణుక ఎల్లమ్మ ఉరికి వచ్చి / నా పచ్చితోలు నాన బెట్టిన లందు తొట్టిలో
తనను దాచుకున్నదో / ప్రేమతో నా నల్లని హృదయంలో
నిన్ను నేను అలా దాచుకుంటూ"

అంటాడు. అంతేకాదు, ద్రవిడ శక్తి ముందు ఎవరూ నిలబడలేరని సవాల్ విసిరి, అగ్రవర్ణ ఆర్యులను తరిమేస్తారని చెప్తాడు.

"జాంబవుని డి.ఎన్.ఎ. కణాల కదలిక మొదలౌతుంది
అది ద్రవీభవించిన / వారసత్వ బీజాలు మొలుస్తాయి
ఇనుప చిగురుకు / ఉక్కుపూలు పూచి
దేశం నుండి తరిమే పౌరాణిక శక్తులుగా మారుతాయి
జరాసంధుడు సింహబలుడు / హిరణ్యకశ్యపుడు లేచి మిమ్మల్ని
ఈ దేశం నుండి / వెళ్లిపోయేదాకా తరుముతారు"

సమాజంలో నేటికీ కులం పేరిట, పరువు పేరిట జరిగే పరువు హత్యలను నిరసిస్తూ, వాటికి పురాణాంశాలతో ముడిపెట్టి వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తాడు శంకర్. తెలుగు నేలను కుదిపేసిన ప్రణయ్ హత్య వెనకున్న కులదురహం కారాన్ని ఖండిస్తూ, భార్యాభర్తల్లో భర్తను చంపేస్తే, భార్య పరిస్థితి ఎలా ఉంటుందో.. వాల్మీకి రామాయణం రాయ డానికి కారణం అయిన క్రౌంచపక్షుల కథని గుర్తుచేస్తూ... పురాణాలను గౌరవిస్తున్నాం అని చెప్పేవాళ్లలోని కుటిల త్వాన్ని ఎండగడతాడు.

"ప్రణయ్ హత్యకు ముడిపెట్టి / మా నిషాధ.... శ్లోకం చదవండి
ప్రణయ్ ని హత్య చేసిన వాళ్లు / ఏం అవుతారో
వాల్మీకి వాక్యాన్ని / రేపు టీవీల్లో పేపర్లో
మీ ప్రసంగాలు వినిపించండి."

ఇలా పురాణాంశాలకు, వర్తమానాంశాలకు బంధాన్ని ముడిపెట్టి కవిత్వం రాయడం దళితకవిత్వంలో ఎక్కువగా కనిపిస్తుంది. దీనినే మరికొంత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు ఈ సంపుటిలో శంకర్. ఆ క్రమంలో సందర్భం, నేపథ్యం, సారూప్యత, సహజత్వం, అర్థబోధ కతతో కూడిన ప్రయోగాలు ఉన్నాయి. లక్కఇల్లు, కాలు రాయికి తాకి మనిషైందో లేదో తెలియదు గానీ, హరిహర దేవరాయల / బంధించిన పౌలస్త్యుని / సింహాసనమే, అగ్ని ప్రవేశం చేసిన / అడవికి వెళ్లగొట్టే సమాజం, మత్స్యగంధ పరిమళం, కథనరంగంలో రుద్రమ దేవియై, భారతక్క భారతంలో అల్లిరాణి / మణికర్ణిక, గాయపడ్డ హంసను సిద్ధార్థుడు సంకన పెట్టుకున్నంత బద్రంగా, వీరబాహుడు / దళితపోలీసు... ఇలాంటి ఎన్నో పురా ణాంశాల ప్రస్తావన సందర్భాను సారంగా ఈ కవితల్లో కనిపిస్తాయి. కవికున్న లోతైన అధ్యయనానికి, సూక్ష్మ దృష్టికి, ప్రాచీన సాహిత్యం, చరిత్రపై ఉన్న పట్టుకు ఇవి ఉదాహరణలు. ఇంకా దళిత వారసత్వానికి సంబంధిం చిన శ్రీకృష్ణుని మాట, మనువు రాత, మనస్మృతి వ్యతిరేకత ఉంది. కర్ణునికి, ఏకలవ్యునికి వారసులుగా దళితులు చెప్పుకోవడం కూడా...

దసరా పండుగకు రావణదహనం చేయడం వెనకున్న ఆర్యుల కుట్ర స్వభావాన్ని అర్థం చేసుకోమని, రావణుడు ద్రావిడ రాజని, అతనిలోని భక్తిని, గొప్పతనాన్ని, మహిళా ప్రాధాన్యతను తెలియజేస్తాడు. శైవుల మూలాలు తెలుసుకుంటే ఆ పనిచేయరంటాడు. ఆ చక్రవర్తికి జరుగు తున్న అవమానాన్ని ఆపమంటాడు ఓ కవితలో శంకర్...

"ఆత్మగౌరవానికి / భారతంలో ద్రావిడ రాజ్యమొక్కటే
మహిళాసాధికారత సామ్రాజ్యం / దసరాకు

ద్రావిడరాజును దహనం చేసే
ధర్మాత్ముల్లారా పుణ్యాత్ములారా / మీరు కాల్చేది
దేవానదేవతలను గెలిచిన శివభక్తుడిని / శివభక్తులు
వీర్శైవులు వింటున్నారా
మీరు కాల్చేది / ద్రావిడ చక్రవర్తి పటాన్ని"

కవి తన జీవితంలో మనసును కలవరపెట్టిన, కలత పెట్టిన సన్నివేశాలను, సంఘటనలను కవి కవిత్వం చేస్తాడు. అది కవి స్వభావం. అక్షరాల్లో భావాలను పొదిగి ప్రపంచంపై వదిలి, దాని ప్రతిఫలాన్ని చూసి ఆనందిస్తాడు. ఈ స్వభావానికి చెందిన కవితలూ ఉన్నాయి. తెగిపోయిన చెప్పులో దాంపత్య బంధాన్ని దర్శిస్తూ.. "దాంపత్య బంధాలైనా / వీడనొచ్చేమో చెప్పులు చావైనా రేవైనా రెంటికి / ఒక చెప్పు తెగితే / రెండవ చెప్పుకు మరణమే" అని వాటి అనుబంధాన్ని, చెప్తూనే చెప్పులుకుట్టే వాళ్లు బ్రహ్మతో సమానమనడం గొప్ప ప్రతీక. చెట్టుకింద కూర్చొని చిలకజోస్యం చెప్పేవాని జీవితంలోని నిజాలను ఆర్ద్రంగా ఆవిష్కరించి, హృదయాల్లో కన్నీటిని కురిపిస్తాడు ఈ కవి. "జాతకం చెప్పే బతుకులపై / తనే జాలిపడుతూ / వెళ్లిపోయాడు" అన్నప్పుడు తిలక్ పోస్ట్ మ్యాన్ కవితలోని చివరి వాక్యాలు జ్ఞప్తికి వస్తాయి.

దళిత స్త్రీలను గ్రామాల్లోనే కాదు, నగరాల్లో, విద్యాలయాల్లో చిన్నచూపు చూడడం అగ్రకుల పురుషులకున్న అలవాటు. తాము అనుభవించడానికే ఆ స్త్రీలు ఉన్నట్లు, ఎదిరించే హక్కు వాళ్లకు లేనట్లు భావిస్తారు. ఎదురు తిరిగితే ప్రాణాలను, మానాలను సైతం తీసేస్తారు. కుల అహంకారంతో ధనం, అధికారం తమదేనన్న దర్పంతో వాళ్లు చేస్తున్న అకృత్యాలను దళిత స్త్రీ కోణం నుంచి చిత్రించిన కవిత"దళితపువ్వు"

"మా అందవిహీన మైన / పూరెమ్మల్ని చించడానికి
ఎందరో ఉత్సాహపడుతూ / రెమ్మల్ని పట్టి
చిదుముతుంటే
తిరగబడ్డ నల్లత్రాస్పై / ఎదురు తిరిగితే
పోతే ప్రాణం / మహా అయితే మానం".

దళిత స్త్రీవాదం ముందుకు తెచ్చిన అంశం ఇది. దళితవాదం దళిత స్త్రీ సమస్యలను అంతగా పట్టించుకోలేదు, దళితస్త్రీ స్వీయ అనుభవాల నుంచైతే గాఢతతో మాట్లాడగలదు, సహానుభూతికన్నా, స్వయం అనుభవం లోంచి వచ్చిన కవిత్వానికి పదునెక్కువ వంటి వాటిని శంకర్ ఈ కవితతో పూరించాడని చెప్పొచ్చు. భర్త చనిపోయిన స్త్రీని సాంస్కృతికంగా తక్కువగా చేయడం, అవమానించడం నేటికీ కనిపిస్తున్న ఓ మూఢత్వం. ఇది అగ్రవర్ణ పురాణ నీతుల నుంచి పుట్టిన ఎన్నో చెదల పుట్టల్లో ఒకటి. సతీసహగమనం, బాల్యవివాహాలు లాంటి వాటిని అధిగమించినా సమాజంలోంచి ఇది పూర్తిగా దూరం కాకపోవడమేంటని ఈ కవి సూటిగా, స్పష్టంగా ప్రశ్నిస్తాడు. తెలంగాణ ఆడపడుచుల బతుకు చిత్రం బతుకమ్మలో భాగస్వామ్యంగా ఆమెను చూడలంటాడు ఓ కవితలో..

"మనుషులంటే పురుషులే అన్నట్టు / చెప్పే పురాణ
పుణ్య నీతులు
ముళ్ల కంపల్ల నిన్ను / గుచ్చుకుంటూనే ఉంటాయి
..... ..... ..... ..... .....
సతి సహగమానాన్ని సజీవ దహనం చేసినట్టు
ఈ పితృసమాజాన్ని సమాధి చేయ్యాలి"

అంటూ బతుకమ్మ పాట పాడి ఆడాలంటాడు. దండోరా ఉద్యమంలో ప్రాణాలర్పించిన భారతక్కను గుర్తుచేస్తాడు. ఆవిడను రుద్రమదేవి, అల్లిరాణులతో పోల్చి, ఆమె త్యాగాన్ని కీర్తిస్తాడు. ఆ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను గుర్తు చేస్తాడు.

ఈ సంపుటిలో వస్తువును కవిత్వం చేయడంలోని టెక్నిక్స్ చాలా ఉన్నాయి. సరికొత్త పదచిత్రాలు, కొత్త అలంకారాలు, పాఠకుల మదిలో ముద్రపడేలా ఉన్నాయి. కేవలం మిథోపోయిని మాత్రమే కాదు, పూర్వ దళితకవుల ఉనికిని పట్టుకొనే కొత్త టెక్నిక్స్ దృశ్యరూపమై కనిపిస్తున్నాయి. ఆధునిక కవిత్వంలో ఆకలిని వర్ణించడం శ్రీశ్రీ ముందు నుంచి చూస్తున్నాం. కానీ ఇక్కడ అసాధారణ పోలికను సాధారణై...

"పొగలు కక్కుతున్న ఇడ్లీలా / పొడిచిన పొద్దు
కంచంలో అంబలిలా / ఆకాశంలో మేఘాలు"
నూతనంగా దర్శనమిస్తుంది

భౌతిక ప్రపంచ దృశ్యాన్ని, ఎన్నుకున్న భాషలో వస్తు సత్సంబంధించేలా చేయడం ఈ కవిత్వంలో ప్రత్యేకంగా కనిపిస్తుంది. చందమామను ముక్కలుగా కోసే ఊహాత్మక ప్రతిబింబాన్ని పెరుగుకు ఆరోపించడం కేవలం అలంకార ప్రాయంగా నిలిచిపోయే కవిత్వ నిర్మాణమే కాదు... అంతకు మించింది కూడా..

"పున్నమి చంద్రున్ని / చిన్నచిన్న ముక్కలుగా కోసి
త్రాచులో తూచి అమ్మినట్లుగా / కుమ్మరి చిప్పలోని
తెల్లని పెరుగు
అమ్ముతోంది రాజస్థానీ మగువ."

ఇంకా సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారుని తీరును తిక్కన కవితా శిల్పంలోని పాత్ర స్వభావంతో పాటు, చుట్టూ ఉన్న వాతావరణాన్నీ కళ్లకు బొమ్మ కట్టించాడు కవి ఓ కవితలో.

"సాగర హోరు / అలలపై అధికపీడనం
పవనాల దాటికి తెప్పలుగా ఇసుక రేణువులు
తీరంవైపు పరుగెడుతుంటే / ఈ సాగరపుత్రుడు
విజయపతాకం ఎత్తుకొని
ఎగసిన అలలపై ఎక్కి నిల్చుంటాడు"

అని అతడి విజయాన్ని గానం చేస్తానే, శ్రమ సౌందర్యంలోని మనోహరాన్ని వ్యక్తీకరిస్తాడు. మరోచోట ఆకాశాన్ని మానవీకరించి "ఆకాశం నిద్రలేక కన్ను నలుపుకుందేమో / ఎర్రబడ్డట్టు ఎండ మెరుస్తుంది" అని కవిత్వీకరణ పద్ధతుల రహస్యాన్ని విప్పుతాడు.

"మనసుకు నిర్వచనం" కవితలో... వస్తు శిల్పాల సంయోజనం ఎంత అందంగా ఉంటుందంటే...
నీ సంవృత పొరలలోని / రేఖా బిందువులు / నిన్ను
తరుముతుంటే
నీ అణుసంయోగ బంధాలు విచ్ఛిన్నమై / నీ వైపు
గమనం చేస్తుంటాయి
నా రంగులు స్థిరీకరిస్తాయి / నన్ను నీవు భాగించలేవు
నన్ను తరిమి తరిమి / నాలోనే కూడిక చేయ
బడతాయి"

అంటూ గణిత పరిభాషను ఉపయోగించి అగ్ర కులాలన్నీ కింది కులాలపై ఆధిపత్యం చెలాయించే ధోరణి ఎంతో కాలం సాగదని, ఏమీ చేయలేక కలిసిపోయి కాళ్ళదరికి రావాల్సిందేనని భవిష్యత్తను నొక్కి వక్కాణించడం ఇక్కడ ప్రధానం. "దోసెడంత మనిషి", "చెప్పు బతికింది", "చెట్టుకింద జోస్యం" వంటి కవితల్లో కథ కవిత్వంగా మారింది. "కురుక్షేత్రంలో భారతక్క" సంఘటనగా మారిన కవితా ఖండిక, "ఇంకా ఎన్నేండ్లు" సన్నివేశాల సమహార కవితా మాలిక. వస్తువును ఎన్నుకోవడంతోపాటు, అందుకు తగిన కవితా శిల్పాన్ని ఎన్నుకోవడంలోనూ పరిణతి శంకర్ లో కనిపిస్తుంది.

మొత్తంగా "నల్లరక్తకణాలు" కవితా సంపుటి మంథని శంకర్ లోని కవితాశక్తికి, దళిత బహుజన జీవన చిత్రణకు అద్దంపడుతుంది. అయితే ఈ కవి వచనమై తేలిపోకుండా వాక్యానికి గాఢతను అద్దడంలో, నిర్మాణ పద్ధతుల్లోని అంతర్గత రహస్యాలను చక్కగా, సూక్ష్మంగా పట్టుకోవడంలో మరింత ముందుకె వెళ్లాలి. ఆ ఉన్నతత్వానికి త్వరలోనే చేరతాడని ఈ పుస్తకం సాక్ష్యం ఇస్తుంది. ఎందుకంటే!? తెలంగాణలో ఇంటర్ ఫలితాలప్పుడు విద్యార్థుల ఆత్మహత్యలపై స్పందిస్తూ... "తల్లిదండ్రుల రోదన ఆర్పే / సాఫ్ట్ వేర్ ఎవరికైనా వుంటే చెప్పండి / వాళ్ల పాదాలపై పడివేడుకుంటా" లాంటి ఆర్ద్రమైన వాక్యాన్ని రాయడం శంకర్‌కే చెల్లు.. ఇలాంటి వాక్యాలెన్నో "నల్లరక్తకణాల" సంపుటిలో పాఠకుల మనసుకు తడిని అద్దుతాయి. మేధోమథనానికి, పరిశోధనకు, చర్చకు తావిచ్చే పుస్తకం.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భిన్న కోణాల్లో కాళోజీ

– డా॥. చింతల రాకేశ్ భవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్.

కాళోజీ కవి, రచయిత, అనువాదకుడు, ఉద్యమ కారుడు, చరిత్రనెరిగిన శాస్త్రజ్ఞుడు. నిర్భీతి, నిజాయితీ, స్వచ్ఛతలకు పర్యాయపదం. కాళోజీ ఎక్కడ ఉన్నా ఏం చేసినా ప్రజల మనిషి, ప్రజల గొడవలే కాళోజీ గొడవ. ప్రజల సమస్యలే కాళోజీని కవిగా పరికించినవి. ప్రజల భాషలో ప్రజల హృదయాలను ప్రదర్శించిన కవి కాళోజీ. విలక్షణ వ్యక్తిత్వం ఆయన సొంతం.

కాళోజీ వీర తెలంగాణవాది, ప్రజాస్వామ్యవాది, భాషా ప్రయోగి, మానవతావాది, మాతృభాషాభిమాని, కథకుడు, అనువాదకుడు, నిరసనకారుడు, ఈ కాలపు వేమన. సుదీర్ఘమైన ప్రజాజీవితం వలన కాళోజీని అనేక కోణాల్లో చూడవచ్చు.

## భాషా ప్రయోగిగా :

కాళోజీ తనకు ఏ భాషలోనూ సమగ్రంగా పరిజ్ఞానం లేదని వినయంగా చెప్పినా తన కవిత్వంలో ఆయనకు తెలుగుభాషపై ఎంత పట్టుందో తెలుస్తుంది. కావ్య భాషలో లేని అనేక పదాలను, పదబంధాలను కాళోజీ సృష్టించాడు. కాళోజీ భాషా ప్రయోగాలను పరిశీలిస్తే కాళోజీ ఇతర కవులెవ్వరికీ ఏ మాత్రం తీసిపోడని అర్థమవుతుంది.

### నూతన పదాలను పరిశీలించినట్లయితే..

'జీవిత్తము' - జీవించడానికి అవసరమైన విత్తము అనే అర్థంలో

'నేతాగిరి' - 'దాదాగిరి'వలె సృష్టించిన పదము

'నేతగాడు' - వస్త్రాలు నేసేవారు అనే అర్థంలో కాకుండా రాజకీయ నాయకులు అనే అర్థంలో వాడారు.

'హర్టిస్టు' - హృదయం కలవాడు అనే అర్థంలో వాడారు.

'డెమనాక్రసీ - రాక్షసుల పాలన అనే అర్థంలో ప్రయోగించాడు. ఇంకా రేఖకుడు, శిల్పకుడు, చిత్రకుడు, వాదకుడు, దీపకుడు ఇట్లా అనేక నూతన పదాలను ప్రయోగించాడు.

### నూతన పదబంధాలు :

పార్టీ వ్రత్యం (పాతివ్రత్యమునకు బదులు), పార్టీ వ్రత (పతివ్రతకు), స్వమేథయాగం, శ్వమేథయాగాలను (అశ్వమేథయాగంలో), పూర్వతప్తులు (గతాన్ని గూర్చి బాధ పడేవారు), సమస్యాపూర్ణం (సమస్యాపూర్వం బదులు) సమస్యలతో నిలదేటట్లు చేయటం, అసామ్యసంఘం (అసమ సమాజం అనే అర్థంలో), షండప్రచండులు (చండప్రచండులు), ట్యూబుబావి (బోర్‌వెల్), స్వాహాకార సంఘాలు (సహకార సంఘాలు), ప్రజాకీయాలు (ప్రజలు + రాజకీయాలను కలిపి), కుబేరాలు (కుబేరాల చెడబేరాలు) మొదలైనవి.

### ఆంగ్ల పదాలు :

లేబల్ ప్యాకింగ్, స్టేజుల సెట్టింగ్, వోటో, సెందికీయ, సివిల్‌రైట్

### ఆంగ్ల సమాసాలు :

కాక్‌టేలు, ఆటంబాంబు, నెర్వ్యహోల్ట్, సివిల్‌రైటు

### మిశ్రమ సమాసాలు :

ట్యూబుబావి (ఇంగ్లీషు-తెలుగు), ఓటుపోచ (ఇంగ్లీష్-తెలుగు)

### తెలంగాణ పదాలు :

తలుగు (పలుపుతాడు), దేవులాడక (అన్వేషించక), సుదూర (ఏమాత్రం), పెంక (పెనం), గడ్డ బలిసినదా? (కొవ్వెక్కిందా), ఈమల్క (ఈసారి), తట్టుండదు (నష్ట ముండదు), గోలెం (నీటి తొట్టి), ఠికాన (ఉండేచోటు), మాతానికి (మా దగ్గరికి).

**తెలంగాణ క్రియాపదాలు :**

తగ్గులూంది, మొగ్గులూంది, కరుస్తాంది, నడుస్తాను, పఱ్కలాండ్రు, ఊదులాను, అంటాంది, తాగుంది, బైటకొస్తాందట, పీలుస్తాంది.

## సామెతలు :

1. 'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రయింది' పార్టీ
2. 'అయ్యగారు లేకుంటే అమాసాగి పోయిందా'
3. దున్నపోతు ఈన్తే తను దొడ్లో కట్టివేస్తాడట

**ఉర్దూ పదాలు :**

కలేజా, సఖలాలు, సిర్దు, జమాబందీ, ఇస్లహాద్, సర్ఫేఖాసు, అతలూయి, దివానాగ, ఖుద్దు, సలామట్, నామ్‌కేవాస్తే, కాన్‌కిస్కా, మజా, తల మిళ్ళవి.

## మానవతావాదిగా :

"Humanism" అనే ఆంగ్లమాటకు తెలుగులో 'మానవతావాదం' అనే పదాన్ని సమానార్థకంగా వాడుతున్నారు. 'మనిషిని మనిషిగా చూడమని ఈ వాదం చెబుతోన్నది' ఈ వాదంలో మనిషికి స్వేచ్ఛ, గౌరవం, వ్యక్తిత్వానికి విలువ, సంక్షేమం, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రధానంగా కన్పిస్తాయి. ఈ వాదం ఐరోపా నుండి భారతదేశంలోకి ప్రవేశించింది. తెలుగులో గురజాడ, కృష్ణశాస్త్రి, భండారు అచ్చమాంబ మొదలైనవారు ఈ వాదం ప్రభావంతో రచనలు చేశారు.

కాళోజీ మానవతావాది. సార్ద్రహృదయుడు. సున్నిత మనస్కుడు. కొంచెం కష్టం కళ్లపడితే చాలు "చెమ్మగిలని కనుల బ్రతుకు కమ్మదనము చాటలేవు చెమ్మగిలని బ్రతుకు కమ్మదనము చూడలేము" అంటూ 'కనీటితో ఎన్నెన్నో కలవు - కన్నీటినీ గగన కన్నులు కలవు అని కంటతడి పెడతాడు. "చెమ్మగిల్లిన కన్నులకు కమ్మలెన్నో చదివినవాడు". కన్నీటినీ కవిత్వమయం చేసినవాడు కాళోజీ.

మానవవాదంలో ప్రధానాంశం అయిన 'స్వేచ్ఛ'ను గూర్చి కాళోజీ ఇట్లా తెలియజేశాడు.

"ఇచ్చయే నా ఈశ్వరుడని
ఖచ్చితముగా నమ్ముతాను
ఇచ్చ వచ్చినట్లు నేను
ఆచరించి తీరుతాను
లోకేశ్వరు నకును జడియను
లౌకికమని వెనుదీయును"

మానవతావాదంలో మనిషికి ప్రాధాన్యత ఉంటుంది. ప్రతివ్యక్తి తనదైన ఉనికి ఉండాలని ఈ వాదం చెబుతుంది. ఈ అంశాలను కాళోజీ ఇట్లా వ్యక్తీకరించాడు.

"ఏ గొర్రెదాటు వర్తించదు ఇద్దరికిని
వేరు వేరు వ్యక్తిత్వాలు
తీరు తీరు అస్తిత్వం
ప్రతివ్యక్తి మూలధనం"

## మాతృభాషాభిమానిగా :

హిందీ, ఉర్దూ, మరాఠి, ఇంగ్లీషు తదితర భాషల్లో ప్రవీణుడైన కాళోజీ జీవితమంతా తెలుగు ప్రజలతోనే మమేకమైంది. అందుకే ఆయనకు మాతృభాష మీద మక్కువ ఎక్కువ. భాషేతరుల భిన్నంగా తెలుగువాళ్ళు మాతృభాషను దూరం చేసికొని పరభాషా వ్యామోహితులు కావడం పట్ల కోపం, బాధ ఎక్కువ. తెలుగు భాష పట్ల చూపే నిరాదరణకు స్పందించి -

"ఏ భాషరా నీది ఏమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా?
తెలుగు బిడ్డవు తెల్గుతెల్వదంచును
సిగ్గులేకన్న ఇంక జెప్పుడెందుకురా."

అని హెచ్చరించారు. భావదాస్యాన్ని ఎండగట్టారు. స్వాభిమానాన్ని తట్టి లేపారు.

కాళోజీని "ప్లీజ్ ఆటోగ్రాఫ్" అని ఎంత నమ్రతగా, భక్తిగా అభిమానులు అడిగినా వెంటనే -

"అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా" అనే సందేశాన్ని వ్రాసి దాని కింద ధీమాగా సంతకం చేసి

చేతికిచ్చేవాడు. కాళోజీకి గల మాతృభాషాభిమానికి ఈ ఉదాహరణ ఒక్కటి చాలు.

**ప్రజాస్వామ్యవాదిగా :**

"అభ్యర్థులై ఓటులడిగేటి వారు
ఏమేమి జేసిరో ఎటువంటి వారో
పురుషులెవ్వారు? కాపురుషులెవ్వారు
గురించి ఓటులను గురింపవలయు
ప్రాణతుల్యము ప్రజాస్వామ్యమున ఓటు
..........................................
ఓటిచ్చినప్పుడే ఉండాలి బుద్ధి
ఎన్నుకొని తలబాదుకున్ననే మగును......."

కాళోజీ ఆకాంక్షించేది ప్రజాస్వామ్య రాజ్యము. ప్రజాస్వామ్యమంటే ప్రభుత్వాన్ని ఎన్నుకొనటానికి ప్రజలకు అధికారమున్న వ్యవస్థ. దీనికిగాను ప్రజలకున్న సాధనం ఓటు. ఈ ఓటు వేసే ప్రతి పౌరుడిని అవినీతిపరుల్ని రాజకీయాల్లో ఎన్నుకోవద్దని హెచ్చరిస్తున్నాడు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటు విలువను నొక్కి చెబుతూ నోటుకు అమ్ముడుపోవద్దని హెచ్చరిస్తున్న ధ్వని ఇందులో కన్పిస్తుంది. ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం, గౌరవం ఉన్న పౌరుడు కాబట్టే కాళోజీ కవిత్వమంతా ఓటును, పౌరులను, ప్రభుత్వాన్ని సంబోధిస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎట్లా ఉండాలో తెలియజేస్తూ-

ప్రజాస్వామ్యమంటేమిటి?
ప్రజారాజ్యమంటేమిటి?
.............................
మానవాళికి మనుగడ
దానవత్వానికి ఎదదడ
గుండాతనానికి దగడు
కూడుపుఠానికి బెగడు
సురక్షిత పౌరమతము
స్వాతంత్ర్యమునకు హితము
హక్కుల కాపాడు కోటి
మక్కువ వికసించు తోట.

అంటూ ప్రజాస్వామ్యమును గూర్చి ఇంతగా తపన పడిన కవి మరొకరు కనిపించరు.

**అనువాదకుడిగా :**

కాళోజీ అనువాద రచనలను నాలుగు భాగాల కింద వర్గీకరించవచ్చును. అవి-

1. అఖండకావ్యం - 'జీవనగీత'
2. గేయఖండిక - 'నా గొడవ'
3. యాత్రానుభవం - 'నా భారతదేశ యాత్ర'
4. కథలు

**అఖండ కావ్యం -జీవనగీత :**

ఖలీల్ జిబ్రాన్ రచించిన "ది ప్రాఫెట్"ను కాళోజీ జీవనగీతగా అనువదించాడు. ఈ కావ్యాన్ని అఖండ కావ్యంగా చెప్పవచ్చు. ఎందుకనగా కవిత ప్రారంభం అయినప్పటి నుండి చివరిదాకా ఎట్లాంటి శీర్షికలు లేవు. ఇందులోని కవిత ధారావాహికంగా సాగుతుంది. జీవనగీతలో ప్రస్తావించబడ్డ విషయాలు ప్రధానంగా ప్రేమ, వివాహబంధం, దానం, తినడం-త్రాగడం, కాయ కష్టం, సంతోషం-దుఃఖం, నేరము -శిక్ష, వివేకం-ఆవేశం, వేదన, తన్నుతాను తెల్సుకోవటం, విద్యాబోధనం, మైత్రి, సంభాషణం, కాలం, మంచి-చెడు, ప్రార్థన, సుఖం, ధర్మం, సౌందర్యం, మృత్యువు మొదలైనవి.

**గేయఖండికలు - నా గొడవ :**

కాళోజీ 'నా గొడవ' అనే కవితా సంపుటిలో ఖలీల్ జిబ్రాన్ సానె గురుజీ మరాఠీ కవితల్ని, ఫిరాక్ గోరక్‌పురి రచించిన ఉర్దూ కవితల్ని, సజ్జద్ జహీర్, సర్దార్ జాఫ్రీ రాసిన కవితల్ని, ఇతర కవితల్ని తెలుగులోకి అనువదించాడు.

ఇందులో నేను ప్రస్తుతాన్ని, అశ్రువులు, కాలం మీద ఎద, బ్రతుకు, నిజము, భాగ్యం, అశాంతి, ఎడబాటు, నివేదన, వసంతం, ఆవేదన, దాస్యజీవనం, విరహము, ఎదురుచూపు, నిరీక్షణ మొదలైన కవితలు ఉన్నాయి.

**యాత్రానుభవం - నా భారతదేశ యాత్ర :**

సుమారు 70 సంవత్సరాల క్రింద హెచ్.ఎన్. బ్రెయల్స్

ఫోర్ట్ అనే బ్రిటిష్ పాత్రికేయుడు భారతదేశాన్ని సందర్శించి ఆనాటి రాజకీయాల్ని విశ్లేషిస్తూ 1931లో 'రెబల్ ఇండియా' అనే గ్రంథాన్ని రాశాడు. కాళోజీ దీనిని 1941లో 'నా భారతదేశ యాత్ర' పేరుతో అనువదించాడు. ఇందులోని భాష సరళ గ్రాంథికంగా ఉంది.

**కథలు :**

'రెండు గింజలు', 'అనుభవం లేని ఆందోళన' అనే రెండు కథలను మరాఠీ కథలకు అనుసరణగా, వ్యక్తిగా మరాఠి మూలకథకు అనువాదంగా 'జాజితీగ' అనే కథను, ఆంగ్లానువాదంతో కూడిన 'అపోహ' అనే కథను కూడా కాళోజీ అనువదించాడు.

**కథకుడిగా :**

తొలితరం తెలంగాణ కథకులలో కాళోజీ ఒకరు. సమకాలీన సంఘటనలకు, ఆలోచనలకు అక్షర రూపాలే కాళోజీ కథలు. అనువాదాలకు ఎన్నుకున్న కథల్లో కూడా ఈ తీవ్రమైన ఆలోచన కన్పిస్తుంది. కాళోజీ కథలో సామాజిక చైతన్యం, విశ్లేషణ, రాజకీయాలపై విమర్శ ఉంటుంది. భాష నిరాడంబరంగా, సరళంగా ఉండి కథనం చాలా సహజంగా సాగిపోతుంది.

కాళోజీ తెలుగులో స్వతంత్రంగా రచించిన మూడు కథలను ''కాళోజీ కథలు'' పేరుతో 1943లో 'అణా గ్రంథమాల' వారు ప్రచురించారు. వీటిలో మొదటి కథ మనమే నయం.

**మనమే నయం :**

జీవకారుణ్యం పేరిట కొన్ని కాలక్షేప సంస్థల బూటకాన్ని ఈ కథ ఎండగడుతుంది. పౌరాణిక వాతావరణంలో నడిచిన ఈ కథ వర్ణవ్యవస్థ మీద వ్యంగ్య రచనగా నిలుస్తుంది.

తెలియక ప్రేమ తెలిసి ద్వేషం: మనుషుల మధ్య కుల, మత, వర్ణ, వర్గ ప్రాంతాలకు సంబంధించిన భేదాలు లేనప్పుడు ఉండే ప్రేమ అవి కల్గినప్పుడు మానవత్వం నశించి అనేక విద్వేషాలు పెంచుకుని కలతలతో జీవిస్తారని ఈ కథ ద్వారా కాళోజీ తెలియజేశారు.

విభూతి/ఫేస్ పౌడర్: సత్యభామ-శ్రీకృష్ణుడు, పార్వతి-శంకరులు వంటి పౌరాణిక పాత్రలను తీసుకొని శంకరుడు పూసుకునే విబూదిని 'ఫేస్ పౌడర్'తో పోలుస్తూ వ్యంగ్యంగా ఆధునిక అలంకారాల మీద స్త్రీలకు ఉండే మోజును ఇందులో విమర్శించాడు.

ఇవే కాకుండా 'లంకా పునరుద్ధరణ' అనే కథలో సమకాలీన రాజకీయ సంఘటనలను రాముడు, విభీషణుడు మొదలైన పాత్రల ద్వారా తెలంగాణలోని మిలటరీ ప్రభుత్వంలో జరిగిన ఆగడాలను వర్ణించాడు. పైకి లంకరాసుల కథగా కన్పించినా నిజానికి ఇది తెలంగాణ వాసుల కథ. లంకాపునరుద్ధరణ నిమిత్తంగా కాళోజీ తెలంగాణ పునరుద్ధరణను గూర్చి ఇందులో కథనం చేయడం జరిగింది.

''ఆగస్టు-పదిహేను' అనే కథలో స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ అవకాశవాదుల, స్వార్థపరుల కూటమితో తయారయిందని భావించిన గాంధీజీ కాంగ్రెస్‌ను రద్దు పరచమని సలహా ఇవ్వగా నెహ్రూ ప్రభుత్వం దానిని తిరస్కరిస్తుంది. గాంధీ రద్దు చేయమన్న కాంగ్రెస్ ఆ తర్వాత ఎట్లా కొనసాగిందో బలంగా చెప్పారు ఈ కథలో.

'భూతదయ' అనే కథను వెల్దుర్తి మాణిక్యరావు, వి.ఆర్. అవధానిలతో కలిసి కాళోజీ రాశాడు. ఇందులో మానవత్వం అంటే ఏమిటి, మతం మానవుడిని ఏ విధంగా అంధుడిగా చేస్తుందో చిత్రించారు.

కాళోజీ కథల్లో పౌరాణిక అంశాలను, పాత్రలను తీసుకున్నా ఎక్కడా చెప్పదలచుకున్న విషయం మరుగున పడిపోకుండా తీసుకొన్న పౌరాణికాంశాలలో విషయాన్ని పాఠకులకు చక్కగా అర్థమయ్యేలా అందించాడు. చెప్పదల్చుకున్న విషయాన్ని, వస్తువును సూటిగా, అశువుగా చెప్పారు.

**తెలంగాణ వాదిగా :**

కాళోజీ కేవలం కవి మాత్రమే కాదు. ఆయన

ఉద్యమకారుడు. స్వాతంత్ర్యానికి పూర్వం ఆయన నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసి అనేక జైలుకెళ్లిన త్యాగధనుడు.

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో ప్రజా కవి కాళోజీ స్పందించిన తీరు నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఇటీవలి కాలంలో ఉద్యమకారులకు గొప్ప ఉద్యమస్ఫూర్తిని ఉత్తేజాన్ని కలిగించింది.

"ప్రత్యేక తెలంగాణా అంటే
పక్కలిరగ తన్నేందుకు
ఆం.ప్ర. రాష్ట్ర ప్రభుత్వానికి
అధికారం ఎక్కడిది?"
"దోపిడి చేసే ప్రాంతేతరులను
దూరం దాకా తన్ని తీరుతం
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాణంతోనే పాతర వేస్తం"

అని ఆనాడే హెచ్చరించాడు కాళోజీ.

తెలంగాణ అంటే కాళోజీకి ఎనలేని అభిమానం. అనుక్షణం ఆయన కలంలో, గళంలో తెలంగాణ ప్రజల గుండె చప్పుళ్ళు వినబడతాయి.

"వీర తెలంగాణ నాది
వేరు తెలంగాణ నాది
వేరై కూడా తెలంగాణ
వీర తెలంగాణ ముమ్మాటికీ
తెలంగాణ వేరై నిలిచి
భారతాన వెలయు ముమ్మాటికీ"

అంటూ ఆనాడే వీరతెలంగాణ కోసం చైతన్య దీప్తిని నింపిన మేటి ఘనుడు కాళోజీ.

కాళోజీ జీవితం తెలంగాణ సమాజ పరిణామ క్రమంలో జరిగిన ఆయన సంఘటనల్లోకి, ఉద్యమాల్లో భాగంగా రూపొందింది. పీడిత, తాడిత ప్రజల వేదనలు, రోదనలూ తనవిగా పలవరించి సమాజంలోని అవినీతి, అసమానతలు, దోపిడీ, దౌర్జన్యాలను నిరసించిన ప్రజాకవి ఆయన. జీవితాంతం ప్రజల హక్కుల కొరకు పోరాడిన కాళోజీని ఎన్ని భిన్న కోణాల్లో పరిశీలించినా ఇంకా ఆయనలో కనిపించని కోణాలు ఎన్నో ఉంటాయి.

**ఆధార గ్రంథాలు :**

1. కాళోజీ నాగొడవ (కవితలు) - కాళోజీ ఫౌండేషన్
2. శ్రీ కాళోజీ సాహిత్య సమాలోచన - డా॥ తూర్పు మల్లారెడ్డి
3. ఇదీ నా గొడవ కాళోజీ (ఆత్మకథ) - కాళోజీ ఫౌండేషన్

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# డా॥. పి. కేశవరెడ్డి నవలల్లో సామాజిక జీవన చిత్రణ

- **డా॥. జి. పార్వతి,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక తెలుగు సాహిత్యం సామాజిక జీవన ప్రతి బింబం. ఆధునిక తెలుగుసాహిత్యం కందుకూరి వీరేశలింగం పంతులతో ఆరంభమయింది. ఆనాటి నుండి తెలుగు సాహిత్యం రాజవీధుల్లో నుండి పురవీధుల్లోకి, అవతార పురుషుల ఆరాధన నుండి ఆర్తనాదాలు విని పిస్తున్న ఆన్నార్తుల జీవితాల్లోకి వచ్చింది. సంస్కృత వాసనను వదిలి సామాన్యప్రజల భాషను సాహిత్య భాషగా చేసింది. పామరుల మాండలికానికీ, వారి యాసకు సాహిత్యంలో స్థానం కల్పించింది. అదే పాత్రోచిత భాష అని ప్రతి రచయిత ముందుకు తీసుకెళ్ళాడు. కథ, నవల వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలు నిర్మాణంలోను, కథన శక్తిలోను విస్తృతినీ, వైవిధ్యాన్ని సాధించాయి. మార్పును కోరుకునే రచయిత చేతుల్లో సాహిత్యం పరఢ విల్లింది. తెలుగు సమాజాన్ని సమగ్రంగా చిత్రించాలనే దృక్పథంతో తమ రచనలను చేస్తూ, సమాజంలో చలనాన్ని తీసుకొచ్చారు. 'చలనం'లో ఉన్న మన సమాజ అభివృద్ధి, క్షీణతల వెలుగు నీడల చైతన్య రూపమే సాహిత్యం' అంటాడు ప్రఖ్యాత విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు. ఆయన మాటలు ముమ్మాటికి వాస్తవాలు. ఈ దృక్పథంతో తెలుగుసాహిత్యం ప్రయాణిం చిన దూరం తెలుగు సమాజం ప్రయాణించిన దూరంగా మనం భావించాలి. ఆ సమాజ ప్రగతికి దోహదం చసే విధంగా రచనలు చేసిన ప్రతి రచయిత కూడా ధన్యుడే. అలాంటి రచయితల్లో ఒకరు డా॥ పెనుమూరు కేశవరెడ్డి.

డా॥. కేశవరెడ్డి గురించి సాహిత్యాభిమానులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని ఆధునిక రచయిత. చిత్తూరు జిల్లా, తలపుల పల్లె గ్రామానికి చెందిన ఈయన వృత్తిరీత్యా వైద్యునిగా నిజామాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన వృత్తిరీత్యా వైద్యుడు అయినా ప్రవృత్తిరీత్యా రచయిత అని అనడానికి వీలులేదు. ఎందుకంటే ఆయన సరదా కోసమో, కాలక్షేపం కోసమో రచనలు చేసే వ్యక్తి కాదు. మానవాభ్యుదయం కోసం ఆయన రచనలు అన్నది సుస్పష్టం. అగ్రవర్ణంలో పుట్టినా అన్నార్తుల గురించే ఆయన ఆలోచన. దళిత, పీడిత జన పక్షపాతిగా, రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణే ఇతివృత్తంగా రచనలు చేస్తున్న గొప్ప మానవతా మూర్తి ఈయన.

డా॥. కేశవరెడ్డి వ్యక్తిగతంగా కూడా చాలా సూటిగా మాట్లాడుతాడు. దానికంటే పదునుగా రచనల్లో తన ఆలోచనలను వ్యక్తీకరిస్తాడు. ఆధునిక మానవ సమాజం నిరంతర పోరాటాల కూపం అంటాడు ఆయన. ఈ పోరాటం ఎందుకో ఆయన మాటల్లోనే "నేనేకాదు, సమాజంలో ప్రతిఒక్కరూ ఏదో ఒక విధమైన పోరాటంలో మెడడాకా కూరుకుపోయి ఉండటం గమనించాను. కొందరు జానెడు పొట్ట కోసం, కొందరు బ్యాంకులు నింపడం కోసం, కొందరు పదవి కోసం, కొందరు కీర్తికోసం, మరికొందరు ఆడవాళ్ళ కోసం వివిధ స్థాయిల్లో పోరాటం సాగిస్తున్నారు" (అతడు అడవిని జయించాడు) అంటాడు. ప్రతి మానవుడు దుఃఖం ఉంది కాబట్టే దాన్ని కాదనుకొని సంతోషం కోసం వెదుకుతున్నాడు. మరణం ఉంది కాబట్టే జీవితాన్ని ప్రేమిస్తున్నాడు. స్పర్థ లేకుంటే జీవితం స్తబ్దతతో నిండిపోతుందనేది కేశవరెడ్డి వాదన. దీన్నిబట్టి మానవజీవితంలో పోరాటం అనేది ఒక అవసరం అంటాడు ఆయన. 'అతడు అడవిని జయించాడు'లోని ముసలివాడు జీవన పోరాటంలో గడచిన అనుభవాల నుంచి సామాజికులక అందించిన పాఠాలు మరువరానివి. ఈ నవలలో ముసలివాడు సామాజిక జీవనంలో అన్యాయ పరంపర ఆటవిక న్యాయాన్ని ఎదుర్కొంటూ ఎలా బతుకుతాడో ఆధునికులకు ఆదర్శప్రాయం. పరిశ

రాలు, పరిస్థితులకు అలవాటు పడాలన్న తాత్వికతను ఈ నవల ద్వారా రచయిత మన కందించాడు. ఆధునిక సమాజంలో జయాపజయాల సమన్వయమే జీవితం అనే గొప్ప సామాజిక సూత్రాన్ని డా॥ కేశవరెడ్డి తాత్వికరిస్తాడు.

రాయలసీమ ప్రాంత సాంఘిక చరిత్ర, సమాజ నిర్మాణం, గ్రామీణ జీవితంలో ప్రతిఫలించే హింసాత్మక ధోరణి గురించి డా॥ కేశవరెడ్డి చిత్తూరు జిల్లా యాసతో రాసిన నవలలన్నీ పాఠకులకు చదివేకొద్దీ ఎంతో ఉత్కంఠను రేకెత్తిస్తాయి. ముఖ్యంగా హరిజన సమస్య గురించి స్పందించిన ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు నవలలు. అనాది కాలంగా మర్యాదకు, మన్ననకు, గౌరవానికి దూరమై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మాభిమానాన్ని అగ్రవర్ణాల దగ్గర తాకట్టు పెట్టి బలైపోతున్న బడుగు జీవితాల గురించి ఈ రెండు నవలలు కూడా బాగా వివరించాయి. ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు నవలలు ఇంచు మించు ఒకే కాలంలో 1979లో అచ్చయ్యాయి. ఒకే వస్తువు రెండు నవలల్లోను కథయింది.

ఇన్‌క్రెడిబుల్ గాడెస్ కథ అగ్రహారం అనే గ్రామంలో జరుగుతుంది. గ్రామ పెద్ద భూస్వామి పెద్దరెడ్డికి 450 ఎకరాలు. అతని మీద ఆధారపడిన హరిజనుల్లో సంఘర్షణ కథావస్తువు. పెద్దరెడ్డి తరుపున దొరగా సాక్ష్యం చెప్పడానికి నిరాకరించిన రామచంద్రుడు ఆ భూస్వామి ఆగ్రహానికే గాక తన కులం వాళ్ళ ఆగ్రహానికి కూడా గురవ్వడం ఇందులో ఆలోచించదగ్గ అంశం. భూస్వామి కోపానికి గురైతే అది సహజం. కానీ తనతోటి కులపోల్ల దగ్గర కూడా నిరాదరణకు గురికావడానికి కారణం అంతర్గత సమస్య. అన్ని కులాల్లో, ఉపకులాలు ఉన్నట్లే, రంపాల, రెడ్డిభూములు, మాలదాసరి, అరవ లాంటివి కొన్ని. ఒక తెగను చూస్తే మరొక తెగకు కాదు. రామచంద్రుడు రంపాల తెగకు చెందినవాడు. తక్కిన వాళ్ళు పాకనాటి మాలలు. అదీ కారణం. ఈ అంతర్గత సమస్యవల్లనే హరిజనులు ఐకమత్యాన్ని కోల్పోయి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారనేది వాస్తవం. వారి సామాజిక జీవన చైతన్యానికి ప్రోత్సాహకంగా ఎన్ని రచనలు వచ్చినా వారిలో ఐక్యత భావం లేనప్పుడు అవన్నీ వ్యర్థాలే.

అగ్రహారం గ్రామంలో రామచంద్రుడిని వెలివేస్తారు. సామాజిక బహిష్కరణ ఎంత దురన్యాయమో ఎంతటి రాజ్యాంగ విరుద్ధమో అప్పట్లో బడుగు బలహీనవర్గాల్లో అవగాహన లేకపోవడంతో ఊరిపెద్దలు ఎంత సాఫీగా ఇలాంటి తీర్మానాలు చేసేవారో ఈ కథ ద్వారా అర్థమవుతుంది. 'వెలి'కి గురైన రామచంద్రుడు తనకున్న 20 పందుల్ని, ఎనిమిదేళ్ళ కొడుకు, భార్యను తీసుకొని వేరే ఊరు వెళ్ళి అక్కడైనా బాగా బతుకు దామనుకుంటే ఆ ఒక్క రోజులోనే అతని ఆశలన్నీ భగ్నమైపోతాయి. ఆ ఊరి మనసబు పొలంలో ఎరువులు తినేసాయన్న కారణంతో మనసబు గారి హరిజన పాలేరు పందుల్ని కొట్టి చంపేస్తాడు. కొబ్బరి తోటల్లో రక్షణ కోసం పెట్టిన బ్లేడ్లుకు కొడుకు బలైపోతాడు. ఆ గ్రామం కూడా మరో గ్రామానికి తరళి వెళ్తాడు రామచంద్రుడు. ఆ గ్రామంలో అగ్రవర్ణ బ్రహ్మచారి రైతు రామచంద్రునికి ఆశ్రయమిస్తాడు ఫలితంగా ఆ రైతు ఇంటికి పై కులస్తులు నిప్పు పెట్టి చంపుతారు. రామచంద్రుడు, అతని భార్య ఆశ్చర్య పోతారు.

కుల సమస్య ఏ ఊరు వెళ్ళినా ఉంది. ఎక్కడికి వెళ్ళినా రూపాయికి పదహారు అణాలైనట్లు కుల సమస్య సామాజికంగా నిమ్నవర్గాలను అణగదొక్కుతోంది.

స్మశానం దున్నేరు నవల కూడా ఇదే అగ్రహారంలో జరుగుతుంది. అదే పెద్దరెడ్డి గ్రామపెద్ద. మాలపల్లిలో 30 మాలకుటుంబాలు నివసిస్తుంటాయి. వాళ్ళంతా పెద్దరెడ్డి మీదే ఆధారపడి జీవిస్తుంటారు. దళితుల స్మశాన వాటికలో 5 ఎకరాలు సాగులోకి తెద్దామని పెద్దరెడ్డి ఆదేశిస్తే బాధపడాల్సిన దళితులు మరింత పనిదొరికిందని సంతోషించడం వారి అమాయకత్వానికి, అజ్ఞానానికి కారణం. ఆ స్మశానంలో దున్నుతుంటే వాళ్ళకు బంగారు కాసులకుండ దొరుకుతుంది. ఆసాగు చేస్తున్న

వారిలో..... తెగకు చెందిన వీరభద్రునికి మిగిలిన మాలవారికి తగువైనప్పుడు వీరభద్రుడు సాంఘిక బహిస్కరణకు గురికావడం జరుగుతుంది. వీరభద్రుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న నెపంతో అతని భార్య కూతురుని బలాత్కరించడమే గాకుండా అతని ఇంటిపై దాడి చేసి అతణ్ణి చితక్కొట్టుతారు. పోలీసులు కేసు కట్టి కోర్టులో కేసు నడుస్తుంటే పెద్దరెడ్డి తనకు కాసుల వ్యవహారం ఏమి తెలియదని తప్పించుకొంటాడు. హరిజనులు పదేళ్ళు జైలుశిక్ష అనుభవిస్తారు.

ఇంతక ముందు ఏ రాయలసీమ గ్రామంలోనైనా మొత్తం గ్రామం ముఖ్యంగా హరిజనులు ఒక పెద్ద భూస్వామిపై ఆధారపడటం సాధారణంగా కనిపించే విషయం. ఈ రెండు నవలల్లోను చిత్తూరు జిల్లా సాంఘిక జీవితం, అణచివేత ధోరణి, అణచివేతకు గురి కాబడు తున్న మాలవాళ్ళలో విభజన కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈరకం గ్రామీణ నిర్మాణంలో ప్రభుత్వ యంత్రాంగం, ఉద్యోగుల ప్రవర్తన ఎలా ఉంటాయో కూడా ఈ రెండు నవలల్లో మనకు బాగా కనిపిస్తుంది. "మా గోడు మీ యట్టా... పట్టకపోతే ఇంగెవరు వింటారు సామి.

కలిగినోళ్ళు మమ్మల్ని నమ్మించి నమ్మించి మా గొంతులు కోస్తా వుంటే మేమెవర్తో చెప్పుకోవాల సామీ" అనే రామచంద్రుడి ఆర్తనాదానికి వచ్చిన ఆఫీసర్ల సమాధానం "ఆ సోదలన్నీ చెప్పి మాకు తలనొప్పి పెట్టద్దు... ఏ గ్రామానికి పోయినా యీ కథలే ఎవరిని కదిలించినా ఈ ఏడుపులే. ఆ ఏడుపులన్నీ వినడానికి మేమిప్పుడు రాలేదు" (ఇన్‌క్రెడిబుల్ గాడెన్). ఏ గ్రామంలో అయినా ఆఫీసర్లు మరోలా ఉండరనికూడా ఇక్కడి సూచన. అలాగే ఈ రెండు నవలల్లోనూ ప్రజల చూసే సత్యానికి కోర్టు తీర్పుకి మధ్య ఉన్న అంతరానికి అద్దం పట్టిన సన్నివేశాలు చాలా కనిపిస్తాయి.

తెలుగు సాహిత్యంలో జానపద ఇతివృత్తంతో సంచ లనం సృష్టించిన నవల మునెమ్మ. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి చేత ఉత్తమ నవల బహుమతి పొందిన ఈ నవలికలో ఒక స్త్రీ పాత్రను కేంద్రంగా చేసి భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న మహిళల జీవితాలను సృష్టించారు. స్త్రీలను అర్థం చేసు కోవడంలో పురుషులు ఏ విధంగా వైఫల్యం చెందు తున్నారో ఈ నవల ఆవిష్కరిస్తుంది. ఈ నవల అంతా మాతృస్వామ్యంపై పితృస్వామ్యం పెత్తనం చెలాయించే వికృత స్వరూపాన్ని వివరించారు.

మునెమ్మ జయరామిరెడ్డి భార్యా భర్తలు వారిద్దరు ఆరుయేండ్లు కాపురం చేసారు. వాళ్ళు ఒక రోజు పొలంలో పనిచేస్తున్నప్పుడు బొల్లిగిత్త తన రెండు కాళ్ళు పైకెత్తి మునెమ్మ పైకి వస్తుంది. అది గమనించిన భర్త బొల్లిగిత్తను కక్షతీరా కొట్టి దాన్ని అమ్మెయాలనుకుంటాడు. అమ్మడా నికి పశువుల సంతకి వెల్లిన జయరామిరెడ్డి హత్యకు గురికాబడుతాడు. ఆయన హత్యకు కారణమైన వాళ్ళను మునెమ్మ వెతికి బొల్లిగిత్త సహాయంతో చంపడం కథలోని ఇతివృత్తం. మహిళా చైతన్యానికి ప్రతిరూపం ఈ మునెమ్మ నవల అని చెప్పవచ్చు.

ఆయన రాసిన 'మూగవాని పిల్ళిన గ్రోవి' రైతుకు భూమికి మధ్య ఉండే అవిచ్ఛిన్న అనుబంధ నాదాన్ని వినిపించిన రచన. ఆయన రాసిన 'చివరి గుడిసె' నవలలో యానాదులంతా పేదలు, భలహీనులు భూముల్ని అన్యాయంగా పోగొట్టుకున్నవారు. ఇంతగా దగా పడిన వారి జీవితంలో ఎవరూ ఉండరు. కాని వారిని దొంగల జాతిగా ముద్రవేసి రికార్డుల్లోకి ఎక్కించిన సర్కారు దాష్టికాన్ని ప్రశ్నిస్తాడు కేశవరెడ్డి.

కులవృత్తులు ద్వంసం అయిపోతున్న... 'రాముడుం డాడు... రాజ్యం వుండాది' నవలలో కేశవరెడ్డి పతన మవుతున్న కులాలు మాత్రం నాశనం అవుతున్న దాకలాలు లేవని ఈ నవల వివరిస్తుంది.

**ముగింపు :**

కేశవరెడ్డి ప్రతి నవలలోనూ సామాన్యుల జీవితాన్ని సామాజిక స్పృహతో రచనలు చేసిన రచయిత. అందుకే

ప్రఖ్యాత కథా రచయిత గోపిని కరుణాకర్ "కేశవరెడ్డి గారు మాములు రచయిత కాదు పాఠకుల్ని వెలిగించే రచయిత" అని చమత్కరిస్తాడు. అయిన రచనలు చదివితే మన చుట్టూ ఉండే సమాజం కనిపిస్తుంది. మన జీవితాన్ని మనం తవ్వుకోవడాన్ని ప్రారంభిస్తాం. అయిన నవలలు చదివన, మాట్లాడిన, ఆలోచించిన తెలుగు సాహిత్యంలో రాయలసీమ ముఖ్యంగా చిత్తూరు జిల్లా గ్రామీణ నేపథ్యం సంస్కృతి కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. అతడు అడవిని జయించాడు - డా॥ పి. కేశవరెడ్డి
2. ఇన్‌క్రెడిబుల్ గాడెస్ - డా॥ పి. కేశవరెడ్డి
3. స్మశానం దున్నేరు - డా॥ పి. కేశవరెడ్డి
4. మునెమ్మ - డా॥ పి. కేశవరెడ్డి
5. రాముడుండాడు - రాజ్జివుండాది - డా॥ పి. కేశవరెడ్డి
6. చివరిగుడిసె - డా॥ పి. కేశవరెడ్డి
7. ప్రతిభావైజయంతి - ప్రత్యేక సంచిక
8. విభాత సంధ్యలు - డా॥ సి.వి. సుబ్బారావు

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# అడవి బాపిరాజు "నారాయణరావు" నవల పరిశీలన

- డా॥. ఎస్.కె.ఎల్. సునీత, తెలుగు అధ్యాపకురాలు, సి.హెచ్.ఎస్.డి సెయింట్ థెరిస్సా, మహిళా డిగ్రీ కళాశాల, ఏలూరు.

అడవి బాపిరాజు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. బాపిరాజు గారి మహత్తరమైన లేఖిని నుండి వెలువడిన నవల "నారాయణరావు". ఈ నవల సాంఘికమైన గొప్పచారిత్రక నవల అనుకోవడంలో సందేహమేమీ లేదు. అటువంటి గొప్ప నవలను అందించిన బాపిరాజు గారి గురించి రెండు మాటలు. బాపిరాజు గారు మన్మధనామ సంవత్సరం 1895 అక్టోబర్ 8వ తేదీన భీమవరానికి సమీపంలో ఒక పల్లెలో జన్మించారు. ఈయన తల్లి దండ్రులు కృష్ణయ్య, సుబ్బమ్మ. ఈయన రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో, మద్రాసులో కళాశాలలో చదువు సాగించారు. బి.ఏ పట్టా పొంది భీమవరంలో కొంతకాలం ప్లీడర్‌గా పనిచేసారు. ఆ తరువాత ఆంధ్రజాతీయ కళాశాల ప్రస్తుతం ఇప్పుడు పిలువబడే కృష్ణా యూనివర్శిటీలో 1935 నుండి 1939 వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసారు. సాహిత్య విశేషాలు పంచుకునే త్రివేణి, మీ జాన్పత్రికకు సంపాదకులుగా పని చేసారు. బాపిరాజు గారు ఎక్కడ ఉంటే అక్కడ ఒక కళాపీఠం, ఎక్కడ మాట్లాడితే అక్కడ సాహిత్యనందనం వెలిసేవి. ఆయన ఉపన్యాసాల్లో మాట...పాట.. ఆట.. ఈ మూడు పెనవేసేకుని ప్రేక్షకులకు గొప్ప ఆనందాన్ని ఇచ్చేవి.

ఈయన జాతీయోద్యమంలో పాల్గొన్నారు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని 'కడలూరు' జైలులో ఒక సంవత్సరం ఉన్నారు. జైలు బాధ అనుభ వించారు. ఆవిధంగా జైల్లో ఉన్నప్పుడు 'తొలకరి' అనే నవల రచించారు. జైలు జీవితాన్ని నవలగా రాశారు. బాపిరాజు గారు స్వతహాగా కవి, చిత్రకారుడు. అందువల్ల బాపిరాజు గారిని ఆంధ్రరవీంద్రుడు అంటారు. తెలుగు దేశమంతా విస్తృత ప్రచారంలో ఉన్నటువంటి "బావా బవాపన్నీరు" అనే పాట ఈయన కలం నుండి వెలువడినదే.

అందుకనే స్నేహితులు, సమకాలీన సాహితీవేత్తలు ఈయన్ని ముద్దుగా 'బాపిబావ' అని పిలుచుకునేవారు. అటువంటి బాపిబావ చిత్రాలు కూడా చాలా సుందరంగా చిత్రించారు. ప్రసిద్ధి పొందిన రెండు చిత్రాలు 'సముద్ర గుప్తుడు', 'తిక్కన'. ఈయన విశ్వనాధ సత్యనారాయణ గారి "కిన్నెరసాని" గేయ సంపుటికి చిత్రాలు చేకూర్చారు. బాపిరాజు గారి నవలలు అనేకం. రచనలు అనేకం. అవన్నీ చారిత్రకం మరియు సాంఘికమైనవే. ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రజల యొక్క జీవిత విశేషాలను తెలిపేవి. అటువంటి నవలలో గొప్ప నవల "నారాయణరావు". వ్యక్తుల జీవితాలను ప్రధానంగా తీసుకుని సామాజిక జీవితాన్ని స్ఫూరింపజేసే సాహిత్య ప్రక్రియ. నవల నవల చరిత్ర కాకపోయినా సమకాలీన జీవితాన్ని గూర్చి తెలిపే చారిత్రక ప్రక్రియ నవల. ఈ నవల 1934 సం॥ నాటిది నారాయణ రావు నవల.

బాపిరాజు గారు ఈ నవలలో ఆంధ్రుల గుణశీలాలు, విజ్ఞానం, అభిరుచులు, సాంఘిక వ్యవస్థలు, గ్రామీణ జీవితాలు, స్థలపురాణాలు, రాజ్యాంగ వ్యవస్థలు, విదేశాల విశేషాలు, వివిధ శాస్త్రాలకు లోనయ్యే విశేషాలు మొదలైనటువంటి అనేక విషయాలను ఈ నవలలో ఆయన చూపించారు. నారాయణరావు నవలలో బాపి రాజు గారు మరియు అతని స్నేహితులు పాత్రధారులుగా మనకు కనిపిస్తారు. నారాయణరావు నవలలోని ఘట్టాలు చాలా వరకు నిజంగా జరిగినవే. ఈ నవల ప్రథమలో ఆంధ్ర పత్రికలో ప్రచురించబడింది. ఆ తరువాత ఆంధ్ర చెన్నపురి విశ్వవిద్యాలయంలో పాఠ్యగ్రంధంగా నిర్ణయించ బడింది. అటువంటి గొప్ప నవల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ముందుగా ఈ నవలలోని పాత్రలు నారాయణరావు. ఈ పాత్ర నారాయణరావు గారు బాపిరాజు గారు ఈ

పాత్ర. సమీందారు ఈ పాత్ర ముందుచూపు గల మనిషి నారాయణరావు పాత్రకు మామ గారు అవుతారు. రామ చంద్రరావు ఇంట్లో చెప్పకుండా చదువులకు అమెరికా వెళ్లిన వ్యక్తి. పరమేశ్వర మూర్తి తన భార్య తను అర్థం చేసుకోలేదని బాధపడి కుమిలిపోయే పాత్ర. విద్యా వంతురాలైన రోహిణి అనే పాత్రను ప్రేమించి ధర్మం కాదని దూరంగా ఉండిపోయిన పాత్ర పరమేశ్వరరావు మూర్తి పాత్ర. శారద అహం వలన సంసార జీవితాన్ని పాడుచేసుకుని పశ్చాత్తాప పడిన పాత్ర శారద. రాజేశ్వర రావు ప్రయణ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని పుష్ప లీలని ప్రేమించి లేవతీసుకుని వెళ్ళిపోతాడు. కొన్ని రోజులకు ఆ పుష్పలీల మహమ్మదీయ వ్యక్తిని ప్రేమించిం దని తెలుసుకొని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటాడు.

తిరుపతిరావు విదేశీయులతో చర్చలు చేసేటటువంటి గొప్ప వ్యక్తి. లాయర్ సుబ్బయ్య శాస్త్రి ఈ పాత్ర ద్వారా నియమాలను మార్చి తనకు అనుగుణంగా తీర్పులు తెచ్చే ఎటువంటి లాయర్లకు ఎన్ని కష్టాలు వస్తాయో ఆ కష్టాలను ఈ నవలలో ఆ పాత్ర ద్వారా చెప్పాడు. శారద, శ్యామసుందరిదేవి ఈ రెండు పాత్రల ద్వారా స్త్రీకి చదువు ఎంత ముఖ్యమైనదో, విశిష్టమైనదో ఈ నారాయణరావు నవల ద్వారా బాపిరాజు గారు చెప్పారు. శారద బాల్య వివాహం చేసుకుంటుంది. శ్యామలసుందరి దేవి వయసు వచ్చిన తరువాత వివాహం చేసుకుంటుంది. ఇటువంటి గొప్ప పాత్రలు ఉన్న నారాయణరావు నవల ఏ విధంగా మొదలవుతుందో తెలుసుకుందాం. ఇందులో ప్రథమ భాగము నీకు పెండ్లి అయినదా? అనే శీర్షికతో మొదలవుతుంది. ఈ నవల నాలుగు అధ్యాయాలుగా 90 అంతర్వి భాగాలుగా విభజించి రచించారు. ఈ నవలలో శీర్షికకు ప్రేక్షకులకు అనేక విషయాలు అందిస్తాయి.

శారద శీర్షికలో అతి లలితమైన తేట తెలుగు పదాలు ఈ రచనకు వన్నె తెచ్చాయి. బాపిరాజు గారి బాల్యం గోదావరితీరంలో నడిచింది. ఈయన రచనలలో పాపి కొండలు యొక్క సోయగం, పట్టిసీమ యొక్క అందాలు, వర్ణన, గోదావరి సదస్సులు పొంగిపొర్లుతున్నాయి. గౌతమి అనేక శీర్షికలో రమణీయమైన వర్ణన చేసారు. ఆ తరువాత శోభనమందిరం, ఆంధ్ర నవ కవి సమితి అనే శీర్షికలో బాపిరాజు తన చిత్రకళను గురించి తెలియజేసారు. "ఆకు మళ్ళు" శీర్షికలో జానపదుల జీవితాలపై ఉన్న మక్కువను చూపించారు. వారు పాడుకునే పాటలను వివరించారు. 'పొలం' శీర్షికలో ఉద్రేకపరిచే కథలను చిత్రీకరించారు. పాత్రోచిత వర్ణనలకు ఆయన పెట్టింది పేరు. రాయభారం శీర్షికలో ఆయుర్వేదం, అలోపతులను గురించి వివరిం చారు. ఈ విధంగా ఎన్నో అంశాలు ఈ నవలలో చోటు చేసుకున్నాయి. ప్రాపంచిక బాధలు బాపిరాజు గారు ఏమీ చేయలేక కథా వస్తువులుగా మారాయి. కవితాహృదయం ఉన్న ప్రతి ఒక్కరిని బాపిరాజు గారి నవలలు చదివేలా చేస్తాయి. కొన్ని వందల పేజీలు ఉన్న ఈ నవలలు విసుగూ కలిగించవు. ఆనాటి సాంఘిక, రాజకీయ ఈ పరిస్థితుల్లో పరిచయం చేసుకున్నట్లుగా ఉంటాయి. ఈనాడు బాపి రాజు గారు లేరు కానీ వారి వర్ణనలు చదువుతుంటే ఆయన కళ్లెదుటే నిలుస్తారు. భావితరాల వారికి ఈ నవల ఆయన అందించినటువంటి గొప్ప ఆణిముత్యం అని చెప్పవచ్చు.

## ఆధార గ్రంథాలు :

1. అడవి బాపిరాజు నారాయణ నవల

# సంస్కృత విభక్తులు – కారకాలు

- డా॥. వి. పళని, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు సంస్కృత భాషలు రెండూ రెండు విభిన్న భాషా కుటుంబాలకు చెందిన భాషలు. రెండు భాషల నిర్మాణాలు కూడా విభిన్నమైనవి. సర్ విలియం జోన్స్ సంస్కృతంతో పాశ్చాత్యభాషలకుగల సంబంధాన్ని నిరూపిస్తే, కాల్డ్‌వెల్ పండితుడు సంస్కృతానికి ద్రావిడభాషలతోగల వైరుధ్యాలను నిరూపించాడు. జనని సంస్కృతంబు సకల భాషలకు అన్న అభిప్రాయం మన పండితుల్లో బలంగా ఉన్నందువల్ల నన్నయ నుండి చిన్నయ వరకు తెలుగు భాషను సంస్కృత వ్యాకరణ చట్రంలో బిగించే ప్రయత్నం గట్టిగా నడిచింది.

సూటిగా, అందంగా ఉండే తెలుగు భాష సంస్కృతం నుండి దిగుమతి చేసుకున్న 'కర్మ' వల్ల యొక్క, బడు ప్రయోగాలతో కొంత కృతకంగా మారిందని చెప్పడానికి సందేహించాల్సిన పని లేదు. నిజానికి ఇది వేరే చర్చ. అయితే, తెలుగు మాతృభాషా వ్యవహర్తలకు సంస్కృత విభక్తి కారకాలు అర్థం కావడానికి ఈ చర్చ ఇక్కడ కొంత అవసరం.

సంస్కృతంలో పదార్థ వాచకాలయిన నామవాచకాలకు పుంలింగ, స్త్రీలింగ, నపుంసకములనే మూడు లింగాలు, ఏకవచన, ద్వివచన, బహువచనాలనే మూడు వచనాలు ఉంటాయి. తెలుగులో పురుష బోధకాలన్నీ మహత్ వాచకాలుగాను, స్త్రీ బోధకాలన్నీ మహతీ వాచకాలుగాను, నపుంసక బోధకాలన్నీ అమహత్ వాచకాలుగాను ఉంటాయి. కానీ సంస్కృతంలో లింగం అర్థాన్ని బట్టి కాకుండా శబ్దాన్ని బట్టి ఉంటుంది. ఉదాహరణకు,

| | | |
|---|---|---|
| దారః | - | wife |
| భార్యా | - | wife |
| కళత్రం | - | wife |

ఈ మూడు పదాలకు సంస్కృతంలో అర్థం ఒకటే. కానీ దారః అన్న శబ్దం పుంలింగం. భార్యా శబ్దం స్త్రీలింగం. కళత్ర శబ్దం నపుంసకలింగం. అంటే సంస్కృతంలో లింగం అర్థాన్ని బట్టి కాకుండా శబ్దాన్ని బట్టి ఏర్పడుతుందని గ్రహించాలి.

అలాగే తెలుగులో ఏకవచన, బహువచనాలు రెండు మాత్రమే ఉంటాయి. కానీ సంస్కృతంలో వచనాలు ఏక వచనం, ద్వివచనం, బహువచనం అని మూడు వచనాలు ఉంటాయి. ఒకటిని తెలిపేది ఏక వచనం. రెంటిని తెలిపేది ద్వివచనం. రెండు కంటే ఎక్కువ వాటిని తెలిపేది బహువచనం.

మరొక ముఖ్యమైన వైరుధ్యం సంస్కృతంలో విశేషణం అంటే గుణవాచకం, విశేష్యానికి అంటే నామవాచకానికి ఉన్న లింగ వచన విభక్తులనే పొందడం.

"యల్లింగం యద్వచనం యాచ విభక్తిషు విశేషస్య
తల్లింగం తద్వచనం సాచ విభక్తిషు విశేషణస్యా-పి"

అంటే నామవాచకం ఏ లింగ వచన విభక్తుల్లో ఉంటుందో, దాని గుణవాచకం కూడా అదే లింగ వచన విభక్తుల్లో ఉంటుందని,

**ఉదాహరణకు...**

నీలకంఠాయ దయామయాయ శివాయ నమః
నీలకంఠుడు దయామయుడు అయిన శివుని కొరకు నమస్కారం అని అర్థం.

ఇక్కడ శివ శబ్దం అకారాంత పుంలింగం. శివాయ అన్నది చతుర్థీ విభక్తి ఏక వచనం. శివునికి విశేషణాలయిన నీలకంఠ, దయామయ శబ్దాలు కూడా పుంలింగ, చతుర్థి విభక్తి ఏకవచనంలో నీలకంఠాయ దయామయాయ అనే రూపాలను పొందుతున్నాయి.

అలాగే, విభక్తులను ప్రయోగించడంలో కూడా తెలుగు, సంస్కృత భాషలకు చాలా వైరుధ్యం. కని

పిస్తుంది. తెలుగులో షష్ఠీ విభక్తిని వాడే చోట సంస్కృతంలో కొన్నిచోట్ల ద్వితీయా విభక్తి, కొన్ని చోట్ల చతుర్థి విభక్తి, మరికొన్ని చోట్ల సప్తమీ విభక్తి ఉపయోగించటం కనిపిస్తుంది.

**ఉదాహరణకు ..**

- అహం తిరుపతిం గచ్ఛామి - నేను తిరుపతిని గూర్చి పోవుచున్నాను అని ద్వితీయా విభక్తిలో చెప్తారు. ఇదే అభిప్రాయాన్ని తెలుగులో, నేను తిరుపతికి పోతున్నాను అని షష్ఠీ విభక్తిలో చెప్తాం.
- శివాయ నమః - శివుని కొరకు నమస్కారము అని నమస్కారాన్ని చతుర్థి విభక్తిలో చెబుతారు. తెలుగులో శివునికి నమస్కారం అని షష్ఠీ విభక్తిలో చెప్తాం.
- కలశే జలం అస్తి - చెంబు నందు నీరు కలదు అని సప్తమీ విభక్తి లో చేప్తారు. దీన్ని మనం తెలుగులో చెంబులో నీళ్లు ఉన్నాయి అని షష్ఠీ విభక్తిలో చెప్తాం.

కాబట్టి విభక్తిని ఉపయోగించడంలో తెలుగు సంస్కృత భాషలకు చాలా వైరుధ్యం ఉందని గ్రహించాలి.

సంస్కృతంలో పదాలు రెండు విధాలు. అవి సుబంతాలు, తంఙ్గంతాలు, 'సుప్తిఙ్గంతం పదమ్' అని పాణిని మహర్షి స్పష్టం చేశాడు. సుప్ ప్రత్యయాలు, తిఙ్ ప్రత్యయాలు అంతంలో ఉన్న పదాలు. ప్రతి వాక్యంలోనూ తప్పనిసరిగా కొన్ని సుబంత పదాలు, కనీసం ఒక్కటైనా తఙ్గంత పదం ఉంటుంది. ఇవి లేకుంటే వాక్యం ఏర్పడదు. ఉదాహరణకు,

| సుబంత పదాలు (నామవాచక) | తిఙ్గంతపదం (క్రియ) |
|---|---|
| రామః గ్రామం | గచ్ఛతి |
| రాముడు గ్రామానికి | వెళ్తున్నాడు. |

భాషలో అత్యధిక భాగం సుబంత పదాలే ఉంటాయి. సంస్కృతంలో పదం ఏర్పడ్డానికి రెండు అంశాలు సహకరిస్తాయి. అవి ప్రకృతి, ప్రత్యయం. ప్రకృతి అనేది మౌలిక శబ్దం. ఈ ప్రకృతినే ప్రాతిపదికలని, కొన్నిచోట్ల ధాతువు అని కూడా అంటారు. ఈ మౌలిక శబ్దాలకు పక్కన చేర్చబడే శబ్దాలు ప్రత్యయాలు. ఈ ప్రత్యయాలను స్థూలంగా ఆరు విధాలుగా చెప్పుకోవచ్చు. అవి, కృత్ ప్రత్యయాలు, తద్ధిత ప్రత్యయాలు, స్త్రీ ప్రత్యయాలు, సుప్ ప్రత్యయాలు, తిఙ్ ప్రత్యయాలు, వికరణ ప్రత్యయాలు.

వీటిలో కృత్ ప్రత్యయాలు చేర్చినప్పుడు భావక, పఠన వంటి ప్రాతిపదికలు ఏర్పడతాయి. తద్ధిత ప్రత్యయాలు చేర్చినప్పుడు స్త్రైణ, పౌంస్న వంటి ప్రాతిపదికలు ఏర్పడతాయి. స్త్రీ ప్రత్యయాలు చేర్చినప్పుడు గంగా గౌరీ వంటి ప్రాతిపదికలు ఏర్పడతాయి. ఇవే ప్రకృతులు. వీటికి సుప్ ప్రత్యయాలను సర్వనామాలను చేర్చినప్పుడు సుబంత పదాలు ఏర్పడతాయి. ఈ సుబంత పదాలు నామవాచక, గుణవాచకాలు, సర్వనామాలు, సంఖ్యావాచకాలు ఇలా విస్తారంగా ఉంటాయి.

సుబంత ప్రత్యయాలు ఏడు విభక్తుల్లో మూడు వచనాలు కలుపుకుని మొత్తం ఇరవై ఒక్క ప్రత్యయాలు ఉన్నాయి. వీటినే విభక్తి ప్రత్యయాలు అంటారు. ప్రకృతి అర్థాన్ని వివరించేది విభక్తి.

## విభక్తి కారకాలు :

విభక్తులు క్రియతో అన్వయిస్తాయి. 'క్రియాన్వయత్వం కారకత్వం' అనే నియమం ప్రకారం క్రియా పదంతో అన్వయించినప్పుడు విభక్తికి కారకత్వం సిద్ధిస్తుంది. 'కరోతీతి కారకం' అంటే క్రియను జనింపచేసేది లేదా అనుసరించేది కారకం.

కర్తా కర్మా చ కరణం సంప్రదానం తదైవ చ
అపానాధికరణే ఇత్యాహుః కారకాణి షట్

కర్తృకారకం కర్మకారకం, కరణకారకం, సంప్రదాన కారకం, అపాదానకారకం, అధికరణకారకం అని కారకాలు ఆరు విధాలు.

## వివిధ కారకాలు :

ప్రథమా - కర్తృ కారకం

| | | |
|---|---|---|
| ద్వితీయా | - | కర్మ కారం |
| తృతీయా | - | కరణ కారకం |
| చతుర్థీ | - | సంప్రదాన కారకం |
| పంచమీ | - | అపాదాన కారకం |
| సప్తమీ | - | అధికరణ కారకం |

షష్ఠీ విభక్తి కేవలం సంబంధాన్ని మాత్రమే సూచిస్తుంది కాబట్టి దానికి కారకత్వం లేదు.

**ప్రథమా - కర్తృ కారం :**

**సూత్రం :** ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచన మాత్రే ప్రథమా (పాణిని అష్టాధ్యాయి: 2-3-46)

**వృత్తి :** నియతోపస్థితికః ప్రాతిపదికార్థ......

ప్రాతిపదిక అర్థంతో బాటు లింగము మాత్రమే అధికంగా భాసించినప్పుడు, వచనము మాత్రమే అధికంగా బాసించినప్పుడు, పరిమాణము మాత్రమే అధికంగా భావించినప్పుడు, సంఖ్యా మాత్రంలోనూ ప్రథమా విభక్తి వస్తుంది.

ప్రాతిపదికార్థం అంటే ప్రాతిపదికను ఉచ్చరించగానే స్ఫురించే అర్థం. ఉదాహరణకు 'రామ' అనే ప్రాతిపదికను పలకగానే ఏ అర్థం స్ఫురిస్తుందో అది రామ అనే ప్రాతిపదికకు అర్థం. అంటే ప్రాతిపదికను పలుకగానే జాతి, వ్యక్తి, లింగ, సంఖ్య, కారక అనే ఐదు అర్థాలు స్ఫురిస్తాయి. ప్రాతిపదికను పలకగానే మొదటగా స్ఫురించేవి జాతి, వ్యక్తి రూపములు. తర్వాత స్ఫురించేవి లింగ, పరిమాణ అర్థాలు, కాబట్టి, ప్రథమావిభక్తిలో ప్రాతిపదిక అర్థం నియతంగా స్ఫురణకు వస్తుంది. దానితోబాటుగా లింగ వచన పరిమాణములు కూడా అధికంగా భాసిస్తాయని గుర్తించాలి.

ఉచ్చైః, నీచైః అన్నవి అవ్యయాలు. అలాగే కృష్ణ, శ్రీ అన్నవి నియతలింగ శబ్దాలు 'ప్రాతిపదికార్థమాత్రే' అన్నదానికి అవి ఉదాహరణలు. ఇక,

| | | |
|---|---|---|
| తటః | - | స్త్రీ లింగం: |
| తటీ | - | స్త్రీలింగం |
| తటమ్ | - | నపుంసక లింగం |

ఇక్కడ ప్రాతిపదిక అర్థంతో బాటుగా లింగం కూడా స్పష్టంగా భాసిస్తున్నది.

| | | |
|---|---|---|
| రామః | - | ఏక వచనం |
| రామా | - | ద్వి వచనం |
| రామాః | - | బహువచనం |

ఇక్కడ వచనం స్పష్టంగా భాసిస్తున్నది..

ద్రోణః వ్రీహిః - తూము దాన్యం

ఇక్కడ పరిమాణం భాసిస్తున్నది.

**సూత్రం :** సంబోధనే (పాణిని అష్టాధ్యాయి: 2-3-47)

సంబోధనలో కూడా ప్రథమా విభక్తి వర్తల్లుతుంది. సంబోధన అంటే ఎదుటివారిని పిలవడం.

హె రామ (ఓ రామ!)

సంబోధన ప్రథమా విభక్తిలో భాగమే కానీ ప్రత్యేక మైంది కాదు.

**ద్వితీయా కర్మ కారకం :**

**సూత్రం :** కర్మణి ద్వితీయా (పాణిని అష్టాధ్యాయి: 2-3-2)

**వృత్తి :** అనుక్తే కర్మణి ద్వితీయా స్యాత్ - హరిం భజతి

కర్మ యందు ద్వితీయా విభక్తి వస్తుంది. కర్మ చెప్పబడనప్పుడు కూడా ద్వితీయా విభక్తి వస్తుంది.

కర్తురీప్సితమమ్ కర్మ - అంటే కర్త పొందదలచిన ఫలాన్ని సూచించేది కర్మ. కర్త దేనినైనా పొందాలని ఎక్కువగా అభిలాషిస్తాడో దానిని సూచించేది కర్మ కారకం. దాతువుకు వ్యాపారము, ఫలము అని రెండు అర్థాలు. వ్యాపారాన్ని ఆశ్రయించిన వాడు కర్త. ఫలాన్ని ఆశ్రయించింది కర్మ. కర్త యందు ఉండే వ్యాపారం చేత లభించే ఫలంతో దేనికి సంబందం ఉంటుందో అది కర్మ సంజ్ఞ.

తండులాన్ పచతి - బియ్యమును వండుచున్నాడు.

బియ్యాన్ని గిన్నెలో వేయడం, నీళ్లు పోయడం, మంట పెట్టడం ఇవన్నీ వ్యాపారాలు. ఇవి కర్తను ఆశ్రయించి

ఉంటాయి. ఈ వ్యాపారంవల్ల బియ్యం ఉడికి అన్నం అవుతుంది. అన్నంగా మారినవి బియ్యం. అంటే కర్త వ్యాపారం చేత లభించే ఫలంతో ఇక్కడ సంబంధం కలిగినవి బియ్యం. కాబట్టి అవి కర్మ సంజ్ఞకాలు.

క్రియారూపం కర్మను సూచించనప్పుడు కూడా ద్వితీయా విభక్తి వస్తుంది.

**ఉదాహరణకు ..**

హరిం భజతి - హరిని భజించు చున్నాడు

ఇక్కడ క్రియారూపం భజతి (భజించుచున్నాడు) అన్నది. ఇది ఎవరిని భజించుచున్నారో చెప్తున్నది గాని, ఎవరు భజిస్తున్నారో చెప్పడంలేదు. అంటే కర్తను చెప్పడంలేదు. ఇటువంటి సందర్భంలో కర్మ సంజ్ఞకంపై ద్వితీయా విభక్తి చేరుతుందని సూత్రార్థం. ఇక్కడ భజింపబడుతున్నది హరి, కాబట్టి హరి కర్మ సంజ్ఞకం. దానిపై ద్వితీయా విభక్తి చేరి 'హరిం' అయినది.

క్రియా రూపం కర్మను సూచిస్తే అక్కడ ప్రథమా విభక్తి వస్తుందని ముందే చెప్పుకున్నాం.

హరిః సేవ్యతే - హరి సేవింపబడుచున్నాడు.

ఇక్కడ క్రియారూపమైన సేవ్యతే అన్నది ఎవరు సేవిస్తున్నారో చెప్పడం లేదు. అంటే కర్తను సూచించడం లేదు. ఎవరు సేవింపబడుతున్నారో చెప్తున్నది. అంటే కర్మను సూచిస్తున్నది. కాబట్టి హరిః అనే ప్రథమా విభక్తి రూపమే ఉంటుంది. మొత్తంగా మనం క్రియా రూపం కర్మను సూచించని చోట ద్వితీయా విభక్తి వస్తుందని అర్థం చేసుకోవాలి.

**తృతీయా - కరణ కారకం :**

**సూత్రం** : కర్తృకరణయోస్తృతీయా (పాణిని అష్టాధ్యాయి: 2-3-18)

**వృత్తి** : అనభిహితే కర్తరి కరణేచ తృతీయా స్యాత్ రామేణ బాణేన హతో వాలీ

(రాముని బాణం చేత వాలి చంపబడి నాడు)

క్రియకు కరణం అన్నది ప్రధాన సాధనం. ఇక్కడ కరణము బాణము. క్రియాపదం కర్త కరణాలను చెప్పినప్పుడు కర్త కరణాలకు తృతీయా విభక్తి చేరుతుంది.

ఇక్కడ క్రియా రూపం హతః (చంపబడి నాడు) అన్నది కర్మను మాత్రమే సూచిస్తోంది. అంటే చంపబడిన వాలిని మాత్రమే సూచిస్తోంది. ఎవరు చంపారు అంటే కర్తను, దేనితో చంపారు అంటే కరణాన్ని సూచించడం లేదు. ఇటువంటి సందర్భంలో కర్త కరణాలకు తృతీయా విభక్తి చేరుతుంది.

**చతుర్థీ - సంప్రదాన కారకం :**

**సూత్రం** : చతుర్థీ సంప్రదానే (పాణిని అష్టాధ్యాయి : 2-3-13)

**వృత్తి** : విప్రాయ గాం దదాతి (బ్రాహ్మణుని కొరకు గోవు ఈయబడినది)

సంప్రదానం అంటే 'దానస్య కర్మణా యమభితిప్రైతి స సంప్రదాన సంజ్ఞః స్యాత్'

దేనిని ఉద్దేశించి ఒక వస్తువు ఈయబడినదో అది సంప్రదానం. ఇక్కడ గోవు ఎవని కొరకు ఈయబడినదో అతడు అంటే, బ్రాహ్మణుడు సంప్రదాన సంజ్ఞ అవుతున్నాడు. సూత్రం ప్రకారం సంప్రదాన సంజ్ఞ పై చతుర్థీ విభక్తి చేరి విప్రాయ అయినది.

అంతేకాకుండా చతుర్థీ విభక్తి ఇంకా కొన్ని చోట్ల చేరుతుంది.

**సూత్రం** : 'నమః స్వస్తి స్వాహా స్వధా అలం వషడ్యోగాచ్చ' (పాణిని అష్టాధ్యాయి: 2-3-16)

నమస్, స్వస్తి, స్వాహా, స్వదా. అలం, వషట్ అనే శబ్దాలు వచ్చినప్పుడు, వీటితో సంబంధం కలిగిన శబ్దాలపై కూడా చతుర్ది విభక్తి చేరుతుంది.

రామాయ నమః - రాముని కొరకు నమస్కారము:
ప్రజాభ్యః స్వస్తి - ప్రజల కొరకు క్షేమమగు గాక
అగ్నయే స్వాహా - అగ్ని కొరకు సమర్పించుచున్నాను

పితృభ్యః స్వదా - పితృదేవతల కొరకు సమర్పించు చున్నాను

ఇంద్రాయ వషట్ - ఇంద్రుని కొరకు హవిస్సు దానము

పై ఉదాహరణల్లో నమః, స్వస్తి, స్వాహా, స్వదా, వషట్ అనే శబ్దాలతో సంబంధం కలిగి ఉండటం వల్ల రామ, ప్రజా, అగ్ని, పితృ, ఇంద్ర శబ్దాలకు చతుర్థీ విభక్తి చేరుతున్నది.

అలం (చాలును, సరిపోవును) అనే శబ్దం పర్యాప్తి అర్థకం. అంటే సరిపోతుందని చెప్తున్నది. ఈ శబ్దంతో సంబంధమున్న శబ్దానికి కూడా చతుర్థీ విభక్తి చేరుతుంది.

దైత్యేభ్యః హరిః అలం - దైత్యులకు విష్ణువు చాలును.

అంటే రాక్షసులను సంహరించడానికి విష్ణువు సరి పోతాడని ఇంకెవ్వరూ అవసరం లేదని అర్థం.

**పంచమీ – అపాదాన కారకం :**

**సూత్రం** : అపాదానే పంచమీ (పాణిని అష్టాధ్యాయి: 2-3-28)

**వృత్తి** : గ్రామాదాయాతి, ధావతో-శ్వాత్ పతతి

అపాదాన సంజ్ఞక శబ్దం పై పంచమీ విభక్తి చేరుతుంది. అపాదానం అంటే

'ధ్రువమపాయే-పాదానమ్' (ప్రాణిని అష్టాధ్యాయి: 1-4-24)

ధ్రువం అనే మాటకు సామాన్యమైన అర్థం స్థిరమైనది అని. కానీ ఇక్కడ స్థిరం అనే అర్థాన్ని కాకుండా అవధి అంటే ఆశ్రయము లేదా ఆధారము అనే అర్థాన్ని గ్రహించాలి. మొత్తంగా ఆధారమైన దాన్ని విడిచిపెట్టిన చోట పంచమీ విభక్తి చేరుతుందని అర్థం.

**ఉదాహరణకు..**

వృక్షాత్ వర్ణం పతతి - చెట్టు నుండి ఆకు రాలు తున్నది.

ఇక్కడ తనకు ఆధారమైన చెట్టు నుండి ఆకు వీడి పడుతున్నది. విడివడుతున్న ఆకుకు అవధి వృక్షం కాబట్టి దానికి పంచమీ విభక్తి చేరుతుంది.

అదేవిధంగా...

గ్రామాదాయాతి - గ్రామాత్ ఆయాతి - గ్రామము నుండి వచ్చు చున్నాడు.

దావతో-శ్వాత్ పతతి - ధావతః అశ్వాత్ పతతి - పరుగెత్తుతున్న గుర్రం నుండి పడుచున్నాడు.

**షష్ఠీ విభక్తి :**

క్రియా పదంతో అన్వయించి నప్పుడే కారకత్వం సిద్ధిస్తుంది. షష్ఠీ విభక్తి క్రియాపదంతో అన్వయించకుండా కేవలం సంబంధాన్ని మాత్రమే సూచిస్తుంది. కాబట్టి షష్ఠీ విభక్తికి కారకత్వం లేదు.

**సూత్రం** : షష్ఠీశేషి (పాణిని అష్టాధ్యాయి: 2-3-50)

శేషే శబ్దానికి మిగిలినవి అని అర్థం. 'కారక ప్రాతి పదికార్థ వ్యతిరిక్తః'. అంటే కర్త కర్మ మొదలైన కారకములు, ప్రాతిపదికార్థములు కాకుండా మిగిలిన వాటికి షష్ఠీ విభక్తి చేరుతుందని అర్థం.

అవి, స్వస్వామి భావము, జన్య జనక భావము.

స్వస్వామి భావం - యజమానికి సేవకునికి గల సంబంధం వంటిది.

జన్య జనక భావం - తండ్రికి కొడుకునకు గల సంబంధం వంటిది.

ఇటువంటి సంబంధాలన్నింటిలోనూ విశేషణ వాచ కాలపై షష్ఠీ విభక్తి చేరుతుందని అర్థం.

**ఉదాహరణకు..**

రాజ్ఞః పురుషః (రాజు యొక్క పురుషుడు)

ఇక్కడ రాజుకు పురుషునకు స్వస్వామి భావ సంబంధం ఉంది. అందువల్ల పురుష శబ్దానికి విశేషణంగా ఉన్న రాజన్ శబ్దానికి షష్ఠీ విభక్తి చేరుతుంది. అదేవిధంగా

జనకస్య సుతా (జనకుని యొక్క కుమార్తె)

అలాగే, కర్మ మొదలైన కారకాలకు సంబంధాన్ని మాత్రమే చెప్పిన చోట కూడా షష్ఠీ విభక్తి చేరుతుంది.

సతాం గతమ్ (సత్పురుషుల యొక్క అనుసరణ)

మాతుః స్మరతి (మాత యొక్క స్మరణము చేయు చున్నాడు)

భజే శంభోశ్చరణయా (అందుని యొక్క చరణము లను భజించుచున్నాడు)

**సప్తమీ - అధికరణ కారకం :**

**సూత్రం :** ఆధారో-ధికరణమ్ (పాణిని అష్టాధ్యాయి: 1-4-45)

కర్మకు ఆధారమైన కర్తను సూచించేది అధికరణం. అంటే అధికరణం ఆధారాన్ని సూచించేదని అర్థం. ఈ ఆధారం ఔపశ్లేషికము, వైషయికము, అభివ్యాపకము అని మూడు విధాలు. ఔపశ్లేషికము అంటే, ఆధార ఆదాయముల ఏకదేశ సంబంధం. ఇది సంయోగ రూపంలోనూ వుంటుంది.

ఘటి జలం అస్తి - కుండ యందు నీరు ఉన్నది.

ఇక్కడ అనేక నీటి బిందువుల సంయోగ రూపమైన జలానికి ఘటము ఆధారంగా ఉంది. వైషయికము అంటే లక్ష్యంగా చేసుకున్న విషయానికి ఆధారంగా ఉండేది.

మోక్షే ఇచ్ఛా అస్తి - మోక్షము నందు కోరిక ఉన్నది.

ఇక్కడ కోరికకు లక్ష్యంగా చేసుకున్న మోక్షం అనే విషయము ఆధారంగా ఉంది. అభివ్యాపకము అంటే అన్నింటి యందు వ్యాపించి ఉండి వస్తువులకు ఆధార మైంది.

సర్వస్మిన్ పరమాత్మా అస్తి- అన్నింటి యందును పరమాత్మ ఉన్నాడు.

ఇక్కడ ఆ వ్యాపించిన పరమాత్మకు 'అన్ని' అన్నవి ఆధారంగా ఉన్నాయి.

సంస్కృతంలో విభక్తి ప్రత్యయాలను సూత్రబద్ధం చేసి 'స్వౌజసమౌట్ఛష్టాభ్యాంభిస్ జ్ఞేభ్యాంభ్యస్ ఙ్ఙసోసాంఙ్యోస్సుప్ ఇత్యేతాః క్రమాత్ విభక్తయః అని చెప్పారు. మొత్తం మీద సంస్కృతంలో విభక్తి కారకాలను జాగ్రత్తగా పరిశీలిస్తే విభక్తి ప్రయోగంలో తెలుగు సంస్కృత భాషల మధ్య ఉన్న వైరుధ్యం మరింత స్పష్టమవుతున్నది. ఈ రెండు భాషల విభక్తుల్ని తులనాత్మకంగా పరిశీలిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. సంస్కృత మార్గదర్శి - నీలంరాజు
2. ఆంధ్ర సంస్కృత వ్యాకరణం - వేదం సూర్యనారాయణ శాస్త్రి
3. సంస్కృత వ్యాకరణము - చేతనభట్ల విశ్వనాథము
4. సంస్కృత వ్యాకరణ సంగ్రహము - కనిగిరి కృష్ణమాచార్యులు, చలమచర్ల వెంకట శేషాచార్యులు
5. లఘు సిద్ధాంత కౌముది - ఆర్. శ్రీహరి
6. పాణినీయ గ్రహీత అష్టాధ్యాయీ - సంపాదకుడు వాడిబోయిన వెంకటరమణ.

# మథుర బంజారాల సంస్కృతి – కళలు

– మంత్రి శ్రీనివాస్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భారతదేశం అనేక జాతులకు, తెగలకు, సంస్కృతులకు, కళలకు ఆలవాలమైంది. అట్టి భారతదేశంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న వారు గిరిజనులు. పురాణాలలో, ఇతిహాసాలలో గిరిజనుల అస్తిత్వం మనకు అనేక చోట్ల కనబడుతుంది. ఏకలవ్యుడు, కిరాతుడు, శబరి, వాల్మీకి, హిడింబి వంటివారు గిరిజనుల ఉనికిని తెలుపుతారు. గిరిజనులు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నారు. వనాలనే వారి జీవన స్థావరాలుగా చేసుకొని విభిన్న తెగల రూపంలో వారి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో 35 రకాల తెగలుండగా, తెలంగాణ రాష్ట్రంలో 13 తెగల గిరిజనులు నివాసం చేస్తున్నారు. వారిలో బంజారాలు, గోండు, కొలామి, ఎరుకల, నాయక్పోడ్ వంటి గిరిజన తెగలలో బంజారాలు అత్యంత ప్రాముఖ్యత గల్గిన గిరిజనులు. వీరి భాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, అత్యంత సుందరంగా ఉండి హృదయాన్ని ఆకట్టుకుంటాయి.

అట్టి బంజారాల్లోని ఒక ఉపశాఖ మథుర బంజారాలు. వీరి బంజారాల వలేనే ఉన్నా కొంత భేదం కల్గి ఒక కొత్త జీవన విధానాన్ని మన ముందు నిల్పుతారు. వీరు బంజరాలనే అనుకరించినా, చారిత్రక పరిణామాల దృష్ట్యా తమ మాతృకలైన బంజరాలకు దూరమై ఆయా ప్రాంతాలలో జీవనం కొనసాగించడంవల్ల వీరి జీవన విధానంలో, సంస్కృతి, సంప్రదాయాలలో మార్పు లకు కారణమయ్యారు. ఈ మార్పులే బంజారాలలో వీరిని ప్రత్యేక తెగగా నిలబెట్టాయి.

రాజపుత్రులు ఉత్తర, పశ్చిమ మధ్య భారతదేశాలను పరిపాలన చేసిన యోధులు. వీరు నాడు ఆఫ్ఘనిస్తాన్ నుండి మొదలు అర్ధ భారతదేశాన్ని పాలించినట్టు చరిత్ర చెబుతున్నది. అరవ శతాబ్దం నిండి పన్నెండవ శతాబ్దం వరకు చౌహాన్, సోలంకి, పార్మర్, ప్రతిహార్, ఖండేల, గాహద్వాల , చాంద్ , కటోచ్, బుందేల్ , తోమార్ , పతానియా , రాథోడ్ , భాటి ,రాణా మొదలైన వంశాలు వాయువ్యం నుండి మధ్య భారతదేశంలోని బిహార్ వరకు పాలన్ సాగించారు. అనంతరం మ్లేచ్ఛుల ఆక్రమణలతో వీరి జీవనంలో కలకలం రేగి ధన, మాన, ప్రాణ రక్షణకు గాను వనాలలోకి వెళ్ళిపోయి సమూహాలు, సమూహాలుగా దేశమంతా వ్యాపించారు. అందుకే వారిని వన్ చర్, బన్ చర్, బంజారాలు అంటున్నారు. వీరు రాజులకు ఖాద్య సామాగ్రి, ఉప్పు మొదలైన వస్తువుల ఎగుమతి దిగుమతులకు తమ పశు సంపదను ఉపయోగిస్తూ తమ జీవనం సాగించేవారు. ఆ విధంగా మథురను చేరిన వీరు మథుర వనాలలో నివాసముంటూ అక్కడి సంస్కృతీ, సంప్రదాయాలను, కళలను, భాషను వారి జీవనంలో ఇముడ్చుకున్నారు.

నాటి రాజకీయ పరిస్థితులు, మత సంస్కరణలు వీరిని గురుగోవింద్ సింగ్ అనుయాయులుగా చేసింది. ఈ క్రమంలో సుమారు 1708 లో గురుగోవింద్ సింగ్ సైన్యంలో భాగమై మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి తరలివచ్చారు. కొన్ని సమూహాలు పశుపోషణ నిమిత్తం గడ్డి భూములను అన్వేషిస్తూ సుమారు 300 ఏళ్లక్రితం ఉత్తరప్రదేశ్, బిహార్, చత్తీస్ ఘడ్ ప్రాంతాలను దాటి మహారాష్ట్ర, కర్నాటక, తలంగాణ ప్రాంతాలకు తరలివచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. పేదరికం, పశుపోషణతో కూడిన జీవన పరిణామాలు మథుర ప్రాంతంలో ఉన్న బంజారాలను దక్షిణాపథానికి తరలించాయని చెప్పవచ్చు. అందుకే వీరిని మథుర బంజరాలని, మథుర లబాన్ లని అంటారు.

ఊర్లకు దూరంగా వనాలను ఆనుకొని పశుపోషణ చేయడమే కాకుండా చింతపండు, కరక్కాయలు, బంక, తేనె, తునికాకు, కుంకుడుకాయలు, మందుల తయారికి

కావాల్సిన అటవీ ఉత్పత్తులను మైదాన ప్రాంతాలలో అమ్మి జీవనం సాగిస్తారు. పూర్వం వీళ్ళు బంజారాల వలెనే లదణీ వ్యాపారం చేసేవారు. కలప, ధాన్యం, ఉప్పు వంటివి ఒకచోటు నుండి మరోచోటికి తరలించేవారు. ఈ విధంగా వలసవచ్చి తమ అస్తిత్వాన్ని నిలుపుకున్న వీరు తెలంగాణలోని ఆదిలాబాదు జిల్లా బోథ్, సొనాల, బజార్ హత్నూర్, గుడి హత్నూర్ , ఇచ్చోడ, నేరెడిగొండ ప్రాంతాల్లో తండాలు నిర్మించుకోగా, కొందరు నిజామాబాద్ జిల్లా గాంధారి, చద్మల్ ప్రాంతాల్లో, మెదక్ జిల్లాలోని కంగ్టి మండలంలో తండాలు నిర్మించుకొని జీవనం వ్యతీతం చేస్తున్నారు. వీరి వేషధారణను బట్టి వీరిని కాయతి లంబాడాలని, కొప్పు లంబడాలని, జుట్టు లంబాడాలని పిలుస్తారు.

## మథుర (లబాన్) బంజారాల సంస్కృతి :

బంజారాలలో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ మథుర బంజారాలు తమదైన శైలిలో జీవనాన్ని సాగిస్తున్నారు. బంజారా ఉపశాఖ అయిన ఈ తెగ తన వస్త్రధారణ, మత విశ్వాసాలు, ఆభరణములు, పండుగలు, జాతరలు, వివాహ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, కళారూపాలతో బంజారాలకు భిన్నంగా కనిపిస్తారు. ఇందుకు కారణం వీరు మథుర మొదలైన ప్రాంతాలవైపు తరలివచ్చి అచటి సంప్రదాయాలను, భాషను, పండుగలతో పాటు తమ జీవన విధానం మథుర ప్రాంతాల ప్రజల వలెనే మార్చుకోవడం వలన వీరు ఈ భిన్నత్వాన్ని సంపాదించుకున్నారు.

## తండా నిర్మాణం :

వీరు వీరి తండాలను మైదాన ప్రాంతాలకు దూరంగా నిర్మించు కుంటారు. అడవుల్లో దొరికే కలపతో (దుంగలతో) ఇళ్ళ గోడలు కట్టుకొని,పై కప్పుగా అడవి గడ్డిని కప్పుతారు. నేటికాలంలో పెంకుటిల్లు, రేకుల ఇళ్ళు, నిర్మించుకుంటున్నారు. ఈ ఇంటిని పేడతో అలికి నిర్మలం చేసుకుంటారు. పశువులకు ఇళ్లపక్కనే కొట్టాలను నిర్మించుకుంటారు.

## కుటుంబ వ్యవస్థ :

మథుర బంజారాలలో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు కనిపిస్తాయి. కుటుంబంలో తండ్రి ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. కుటుంబంలో స్త్రీలకు అంట ప్రాముఖ్యం ఇవ్వరు. వీరిని కుటుంబ పనులకు, వ్యవసాయ పనులకే పరిమితం చేస్తారు. నేటి కాలంలో కొందరు చదువుకుంటున్నారు. అదికూడా హైస్కులు విద్య వరకు మాత్రమే. కుటుంబాలపై నాయక్ అధికారం మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అయన చేసే న్యాయమే చివరిది.

### వస్త్రధారణ :

మథుర బంజారాల వస్త్రధారణ ముఖ్య బంజారాల కంటే భిన్నంగా ఉంటుంది. ఈ వస్త్రధారణ, కేశాలంకరణలే వీరిని ప్రత్యేకంగా మార్చాయి. స్త్రీలు అల్లికలు అల్లిన కాళీ (రవిక) ని తొడుగుతారు. ఈ కాళీ అనే రవిక నడుం వరకు గల శరీరాన్ని కప్పి ఉంచుతుంది. ఫేట్యా (లంగా) మోకాళ్ళ కింది వరకు కప్పి ఉంచుతుంది. ఈ ఫేట్యా పై నుండి కాటన్ వస్త్రం(పైట) ఒకటి మొత్తం శరీరాన్ని కప్పి ఉంచుతుంది. తల వెంట్రుకలన్ని నున్నగా దువ్వి వాటిని జడలాగ అల్లి ఒక నిలువైనకొప్పును పెట్టుకుంటారు. ఈ నిలువుకొప్పు ఏర్పడడానికి రాలిన తమ పాత వెంట్రుకలను జమచేసి నిలువుగా పేర్చి ఒక కొలబద్దలా తయారు చేసుకుంటారు. దానిని తలపై ఉంచి దానిపైకి అల్లిన జడను అనుసంధానిస్తారు. అలా నిలువు కొప్పు ఏర్పడుతుంది. ఈ నిలువు కొప్పును 'చుండై' అంటారు.

ఆదిలాబాదు వంటి ప్రాంతాలలో ఒక చిన్న కొయ్య దుంగనొకదానిని తలపై నిలబెట్టి దానిపైనుండి జడను అల్లుతారు. ఈ చుండైని కదలకుండా పైటవస్త్రం చుట్టబడి చెదరకుండా కాపాడుతుంది. ఈ చుండై దాన్ని కప్పి ఉండే పైటవస్త్రంతో కూడిన ఈ వస్త్రధారణను చూస్తే అలనాటి గోపికలు గుర్తుకొస్తారు. మగవారు తలకు పగిడి(తలపాగ)తలోపేటి, దండ, డోకా, ధోతి, కంగ్రీ,

రుమాల్ అని పిలవబడే వస్త్రాభూషణదులను ధరిస్తారు. పెళ్ళికాని ఆడపిల్లలు లెహంగా(లంగా) కాచులీ (జాకెట్టు) ధరిస్తారు. మగవారు ధరించే ధోతిని బారకషి అని, జుబ్బాను జహంగల అంటారు.

**ఆహారపు అలవాట్లు :**

మథుర బంజారాలు ఎక్కువగా తీసుకునే ఆహారం రోటి మరియు బాటి (జొన్నరొట్టె). వీటితో పాటు మొక్కజొన్న, శనగలు, మినపపప్పు, కంద గడ్డల పాయసం తీసుకుంటారు. పండగల సమయంలో తీపి పదార్థాలు ఎక్కువగా వండుకుంటారు. నెయ్యి, పెరుగు, పాల పదార్థాలు వీరి నిత్య ఆహారంలో భాగంగా ఉంటుంది. పశుపోషణ అధికం కాబట్టి పాల పదార్థాలకుకొదువ వీరికి ఉండదు.

**ఆర్థిక స్థితిగతులు :**

వీరి జీవనం అధికంగా పశుపోషణపైనే ఆధారపడి బ్రతుకుతున్నారు. పాడి ఉత్పత్తులపై వచ్చే ఆదాయం వీరికి ఆసరా అని చెప్పవచ్చు. వీరిలో కొందరు వ్యవసాయం చేస్తుంటే, కొందరు కౌలుదారులుగా, వ్యవసాయ కూలీలుగా కాలం గడుపుతున్నారు. ఇళ్ళలో కనీస సౌకర్యాలు తక్కువే. తమ పనుల్లో సంప్రదాయబద్ధమైన వస్తువులనే నేటికి వాడుతున్నారు. సామాజికంగా ఉమ్మడి రాష్ట్రంలో భాగంగా వీరు 'బిసి'లుగా గుర్తించబడ్డారు. నాటి నుండి నేటి వరకు వీరు అభివృద్ధి ఫలాలకు చాల దూరంగా ఉన్నారు. దారిద్ర్య రేఖకు అత్యంత దిగువన వీరు కనబడతారు. ఉమ్మడి కుటుంబాలు ఉన్నా కారణంగా కుటుంబ నియంత్రణకు దూరంగా ఉండి కుటుంబ భారాన్ని మోయలేని స్థితిలో వీరున్నారు. చదువుకు దూరం కాబడ్డ యువత ఎక్కువగా ఉండి నిరుద్యోగం అధికంగా కనబడుతుంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ప్రభుత్వం వీరిని 'ఎస్టీ' లలో కలుపుతామని హామిలనిచ్చింది. అవి నెరవేరే ప్రయత్నం చేస్తున్నది ప్రభుత్వం.

**ఆభరణములు :**

మథుర బంజారాల ఆభరణములు కూడా ముఖ్య బంజారాల కంటే బిన్నంగా ఉంటాయి. ఇవన్నీ వెండి, ఇత్తడి, కంచుతో తయారు చేయబడి ఉంటాయి. స్త్రీల చెవుల పైభాగం నుండి కాసుల రూపంలో ఉన్నా వెండి ఆభరణాలు చెవిని కప్పుతున్నాయా అన్నట్టుగా కనబడతాయి. చెవి పైభాగాన్ని చీల్చుకువస్తున్న కాసుతో కూడిన తీగ వ్రేలాడుతూ కనిపిస్తుంది. అలాగే ప్రక్క భాగాన్ని వెండి గొలుసుల లాంటి ఆభరణాలు పెట్టుకుంటారు. ఇక చెవి క్రిందిభాగం రెండు వైపులా 'మర్కిలు' అని పిలవబడే ఇరువైపులా రంధ్రాలు గల్గి మద్యలో సన్నగా ఉండి రంధ్రాల నుండి అందంగా అల్లిన పూసలు అందమైన ముడులతో కలవి వ్రేలాడదీయబడి ఉంటాయి. కొందరు దారాలతో అల్లిన అల్లికల జడలంటిది వ్రేలాడదీసుకుంటారు.

మథుర బంజారా స్త్రీలు ముక్కు పోగులను ధరించరు. చిన్న ముక్కు పుడకను ధరిస్తారు. కంఠానికి పసుపు, ఎరుపు పుసాలను వరుసలుగా అల్లి వాటన్నింటిని ఒక పెద్ద పూసకు అనుసంధానించబడిన 'గరణి' అనే ఆభరణాన్ని ధరిస్తారు. భుజాలకు దండ వంకీలు వెండితో చేసినవి, కాళ్ళకు వంకీలుగా ఉన్న కంచు, ఇత్తడి, వెండి ఆభరణాలు, కాలి మడమకు పై భాగంలో అందమైన అచ్చులు గలిగిన గుండ్రటి ఇత్తడి కడియాలు, వాటిమీద ఎర్రటి గాజులు, కాలి బొటన వ్రేలుకు ఉంగరాలు ధరిస్తారు. మగవారికి ఆభరణ సంపద అంతగా లేకున్నా చేతులకు మాత్రం కడియాలు ధరిస్తారు.

**కుట్లు అల్లికలు :**

కుట్లు, అల్లికలు వీరికి వెన్నతో పెట్టిన విద్య అని చెప్పవచ్చు. వీరు వీరి ఆభరణాలను స్వయంగా పూసలతో అల్లుకుంటారు. నల్లని, పసుపు పచ్చని, బెల్లంరంగు పూసలు ఈ హారాలకు అందానిస్తాయి. వస్త్రాలు కూడా అందమైన ఎంబ్రాయిడరీతో స్వయంగా కుట్టుకుంటారు. ఈ విద్యలో వీరి నైపుణ్యం అపురూపమైనది. వస్త్రాలపై

పూసలు, అద్దాలు, ఊలు గుత్తులు అల్లి అందమైన, స్వచ్ఛమైన వారి మనసును వస్త్రం మీద ఆవిష్కరిస్తారు.

**మత విశ్వాసాలు :**

మథుర బంజారాలు శ్రీకృష్ణుని మథుర ప్రాంతం నుండి వలనవచ్చిన కారణంగా వీరిని మథుర బంజారాలు, మథుర లబాన్ లు అంటున్నారు. వీరు శ్రీ కృష్ణుని తమ ఆరాధ్యదైవంగా భావిస్తారు. శ్రావణ మాస గోకులాష్టమి నుండి మొదలుకొని మాసమంతా భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుని ఆరాధిస్తారు. అంతేకాదు తమను శ్రీకృష్ణుని వారసులుగా భావిస్తారు. మగవారు జంధ్యాన్ని తమను తాము రాజపుత్ర అగ్నికుల క్షత్రీయులమని చాటి చెప్పుకుంటారు. వీరి కులదైవాలు మారెమ్మ (మేరామా) దుర్గా, జగదాంబ, భవానిలను కొలుస్తారు. వీరేకాక జ్వాలాముఖి మాత, కాలుబాబ, రాంసింగ్ మహారాజ్, మన్ సింగ్ బాబా, సంత్ సేవాలాల్ మహారాజ్, గురు గోవింద్ సింగ్ లను భక్తి పూర్వకంగా కొలుస్తారు.

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ఎడ్లరేగడి తండాలో ఉన్నా జ్వాలాముఖి అమ్మవారిని, ఆమె భక్తుడైన కాలు బాబాల మందిరాల వద్ద సంవత్సరానికి ఒకసారి దసరా పండుగనాటి నుండి ముడురోజుల పాటు గొప్ప జాతర జరుగుతుంది. పరళీ వైద్యనాథ్ ప్రాంతంనుండి సంచారం చేస్తూ వచ్చిన కాలుబాబ ఇక్కడే సమాధి చెందారు. ఈయన జ్వాలాముఖి దేవి భక్తుడు. ఈ జాతరకు ఆదిలాబాద్, నిర్మల్, వర్ణి, గాంధారి, కామారెడ్డి, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి మథుర లబాన్ లు తరలి వచ్చి వారి సంప్రదాయ నృత్య కళలను ప్రదర్శిస్తారు. 'బిచ్చం నాయక్' కామారెడ్డి జిల్లా గాంధారి తాలుకా వారు ఈ జాతర సందర్భంగా ఇక్కడి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ "ఇక్కడికొస్తే మాకు మంచిగైతది, ఇక్కడ మంచిగా నంగార గొడతారు. మాకు ఏదైనా బేమారి వస్తే పోతది" అంటారు. ఈయన మాటల్లో కాలుబాబ మీద ఉన్న ఉన్నతమైన భక్తి విశ్వాసాలు కనబడతాయి.

**పండుగలు :**

మథురా కన్యలు మంచి భర్తలు రావాలని 'తీజ్' పండుగను జరుపుకుంటారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పుట్ట మన్నును తెచ్చి కన్నయ్య ప్రతిమలను తయారు చేసి వాటికి తమ ఆభరణాలను ధరింపజేస్తారు. వాటిని పూజించి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. ఈ సందర్భంగా వీరు అలనాడు కన్నయ్యతో ఆడిపాడిన గోపికలా అనిపిస్తారు. అన్నా చెల్లెళ్ళ రక్షకు ప్రతిరూపమైన రాఖీ పండుగను, పోలాల అమావాస్యను,దీపావళి, పాడవా అని పిలువబడే ఉగాది, అకాడి అనిపిలువబడే తొలి ఏకాదశి, మరియు జోహార వంటి పండుగలను జరుపుకుంటారు. హెూలీ వీరు జరుపుకునే పండుగలలో అత్యంత ముఖ్యమైనది. ఈ పండుగను మూడురోజులు జరుపుకుంటారు వీరు. ఇందులో మొదటిరోజు 'ధూళ్' (కామదహనం), రెండవరోజు 'ధులండి' (హోలీ), మూడవరోజు 'బాహుబీజ్' (అన్నదమ్ములకు అక్కచెల్లెల్లు మంచంపై కూర్చోబెట్టి స్నానం చేయించే క్రతువు) మొదలైన ఘట్టలుంటాయి.

**వివాహ సంప్రదాయాలు :**

మథుర బంజారాలలో 11 గోత్రాలున్నాయి. అవి నాయక్, బామన్, బాద్రియా, కిత్రియా, లేల్యా, మాంద్య, బర్దావల్, తిత్రియా, పెళ్యా, సాబ్ల్యా, భట్. 'నాయక్' ఇందులో అనడ్రికంటే పెద్ద సామాజిక హెూదాను కలిగి ఉంటాడు. ఈ నాయక్ ఆధ్వర్యంలోనే 'భట్' సహకారంతో పెళ్లి జరుగుతుంది. పెళ్ళికి ముందు అందర్ని పిలవడానికి తమలపాకు పోకలు ఇచ్చి నిమంత్రణం చేసుకునేవారు. నేడు పత్రికలు పంచుకుంటున్నారు.

పెళ్ళికూతురుకు పెళ్లి సందర్భంగా కాళీపాట్ (నల్ల పూసల హారం), నల్లపూసలతో కూడిన పుస్తె, రక్షడి (పైటవస్త్రం), కాఖడి(జుట్టును జడకు అనుసంధానం చేసేది), గూటీ(ఉంగరం), బిడ్(చెవులకు అలంకరించే నగలు) ఇస్తారు. వీరిలో ద్వితీయ వివాహం అంతగా కనిపించదు. ఓలీ సంప్రదాయం లేదు. పెళ్ళికూతురుకు

వివాహ కట్నంగా 11 రూపాయలు ఇచ్చే సంప్రదాయం ఉన్నది. వీరిలో మేనరికాలు అధికంగా ఉంటాయి. నేటికి ఇక్కడ కూడా అన్న చనిపోతే వదినను మరిది వివాహం చేసుకునే ఆచారం ఉంది. అదే తమ్ముని భార్యను అన్న చేసుకోవడానికి అనుమతి లేదు. పెళ్లితంతు మూడు రోజులు సాగుతుంది. పెళ్ళిలో ఘాగర్ కర్వో, ఫేరా, డావలో అనేవి ముఖ్యమైన ఘట్టాలు.

**మథుర బంజారాల భాష :**

మథుర బంజారాల బాష నిజ బంజరాలకు పూర్తిగా దగ్గరగావున్నా కొంత మార్పు కలిగి ఉంటుంది. దీనికి కారణం వీరి సంచార జీవనంలో భాగంగా చేసుకున్న ఆదాన ప్రదానాలు అని చెప్పవచ్చు. వీరు మథుర, బిహార్, చత్తీస్ ఘడ్, మహారాష్ట్రలను దాటివచ్చారు కావున ఆయా ప్రాంతాల పదసంపద వారి భాషలో మిళితమైంది. బంజారాల గోర్బోలిని 1969లో అత్యధికంగా వ్యవహారంలో ఉన్న భాషగా బంజారా స్టడీ సర్కిల్ టీం గుర్తించింది. గోర్ బోలీలు బారతదేశంలో 17 రాష్ట్రాల్లో వ్యాపించి ఉన్నట్లు ఈ సంస్థ గుర్తించడం విశేషం. మథురాల భాష బిహారీ, మరాఠి, బ్రజ్ భాషలకు దగ్గరగా కనిపిస్తుంది.

**మచ్చుకు కొన్ని పదాలను చూసినట్లైతే.......**

1. రాం రాం - వందనానికి ఆధ్యాత్మరూపం
2. యా - అమ్మ
3. బాయి (మరాఠి) /జీజీ (బిహారీ) - అక్క
4. కచలి - జాకెట్టు
5. బ్యాహ - పెళ్లి (బిహారీ)
6. కాళిపాట్ - నల్లపూసల మంగళసూత్రం.
7. డోక్ర - ముసలోడు (మరాఠి)
8. నపోలి - ముక్కుపుడక
9. టిక్కి - బొట్టు (మరాఠి)
10. గోట్ - గాజులు (మరాఠి) మొదలైన పదసంపద వీరి భాషలో లభించి ఒక గుభాలింపును కలిగిస్తుంది.
12. కచులి - లంగా
13. చూడా - కాలీ వంక
14. బీచ్యా - కాలి ఉంగరం

**మథుర లబాన్ ల కళలు :**

మథుర బంజారాల వేషధారణ, భాష మాదిరిగానే కళల విషయంలోనూ వీరికి ప్రత్యేక స్థానమున్నది. వీరి కళల్లో గానకళ, నృత్యకళ ముఖ్యమైనవి. వీరు నిర్వహించుకునే పండుగల సందర్భంగా ఈ కళలు ప్రదర్శిత మవుతాయి.

**గానకళ :**

మథురాల ఇంట పుట్టుకనుండి మొదలుకుని వివాహం, చావు, జాతరలు, పండుగలు, దైవ భజనలు మొదలైన సందర్భాలలో వీరు విభిన్నమైన పాటలు పాడుతారు. శ్రావణమాసంలో వచ్చె గోకులాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణునిపై పాటలు పాడుకుంటారు. ఈ పాటల్లో బిహారీ,బ్రజ్, మరాఠి,హిందీ పదాలు వీరి బోలిని అందంగా చేస్తాయి.

"జాగర్ లాగో హెూ కనయ్య / కళో హెూ మారో గిరిధారి
ఘర్ ఘర్ హెూ బాగ్ బాగిచా / ఘర్ ఘర్ హి పూల్ వాడి
గలిగలి నారేళి తేరా / జాగర్ లాగో హెూ కనయ్యా"

అంటూ గోకులాష్టమి సందర్భంగా ఈ పాటను పాడుకుంటారు. ఓ కన్నయ్యా నిద్రలే నిద్రలే!నల్లని మా గోవర్ధన గిరిధర నిద్రలే. ప్రతీ ఇల్లు నీకోసం అందమైన పూల వనంలా మార్చాము. ప్రతీ వీధి కొబ్బరికాయలతో కూడిన హారతి పళ్లేలతో నీకు స్వాగతం పలుకుతున్నది అంటూ భక్తిగా పాడుతారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఒకచోట కూడి కూర్చొని ఒక్కసారిగా పాడే తీరు రమ్యంగా అనిపిస్తుంది.

అదేవిధంగా 'తీజ్' పండుగను వీరు 'జోహార' పండుగ అనే పేరుతో జరుపుకుంటారు.ఈ సందర్భంగా నాగుల పంచమి దాటిన మూడురోజులకు అడవినుండి మట్టిని పుట్టమట్టిని తెచ్చుకొని ఆ మట్టిలో గోధుమ,శనగ గింజలను నాటుతారు. మొలకెత్తిన నారునే వీరు 'జోహార' అంటారు. మొలకెత్తిన బుట్టలకు రోజు పూజలు చేస్తారు.

రాఖీ పౌర్ణమి దాటిన తర్వాత వచ్చే 'తీజ్' పర్వదినాన కన్నయ్యను పూజించి, నైవేద్యం సమర్పించి పాటలు పాడుకుంటారు. ఈ సందర్భంగా నృత్యం కూడా చోటు చేసుకుంటుంది.

''కోనేరీ మేళీ మేరి గూంగే /ఆరే కోన సఖూ నసమేరిమా
కోనసఖూ మేరిమే జూ0డో రేమే /కిలారే కేనదీ యేసేయి దేనియో....''

అంటూ వనితలంతా ప్రధాన గాయికను అనుసరిస్తూ పాడుతూ తాళానికి అనుగుణంగా ఆడతారు.

**నృత్యకళ :**

మధురాల జీవనంలో పాటతో పాటు నృత్యం తన సహవాసాన్ని పంచుకుంటుంది. వీరు నిర్వహించుకునే సామూహిక ఉత్సవాలలో, జాతరలలో పాటకు తగ్గట్టు నృత్యాన్ని చేయడం గమనించవచ్చు. వీరు మేరామా పండుగ సందర్భంగా గుండ్రంగా తిరుగుతూ కోలాటం ఆడుతుంటారు. కాళ్ళకు గజ్జెలు కట్టుకొని పాదాలను వెనుకకు ముందుకు కదుపుతూ పక్కకు కదిలి పోతుంటారు. మధ్యమధ్యలో గుండ్రంగా తిరుగుతూ చేతులకు ధరించిన ఉలన్ గొండలను (బంతులు) తిప్పుతూ ఆడుతారు. వీరి నృత్యం కాలి అందెల చప్పుళ్ళతో, సంప్రదాయ వాద్యాల హోరులో ఆద్యంతం అందంగా, కన్నుల పండుగగా కనిపిస్తుంది. ఈ నృత్యానికి వీరి సంప్రదాయ గేయాలు కూడా తమ సహకారాన్ని అందిస్తాయి.

**వాద్యాలు :**

మధుర బంజారాలు ముఖ్యంగా మూడు వాద్యాలను అధికంగా వాయిస్తారు. అవి నంగారా, బాజా, గిల్ల. వీటికి ఉప వాద్యాలుగా గజ్జెలు, కోలలు ఉంటాయి. ఈ వాద్యాలలో నంగారా ముఖ్యమైనది. ఈ నంగారాను వీరి జీవన నాదంగా, గుండెలయగా భావిస్తారు. అందుకే ''మారో నంగారా జాగో లభానా'' అన్న నినాదాన్ని సృష్టించుకున్నారు.

**నంగారా :**

ఈ నంగారాను ఇత్తడి, కంచు లోహాలతో కూడి బోలుగా ఉన్నా అర్ధ చంద్రాకార గిన్నెలాంటి పెద్ద నిర్మాణం చేసి దాని ఎద్దుతోలుతో, లేదా దున్నపోతు తోలుతో కప్పుతారు. తోలును బిగుతుగా ఉంచడానికి, ఊడిపోకుండ ఉండడానికి అటవి బంకను, లక్కను రాస్తారు. నంగారా మంచి ధ్వనిని అందించేందుకు చిన్నపాటి నూలు తాళ్ళను, పగ్గాన్ని చుట్టుతా కడతారు. దీనిని వాయించడానికి రెండు వెదురు కర్రలను వాడతారు. ఈ నంగారా ముఖ్యంగా వివాహాలు, జాతరలు, పండుగల సమయంలో వాయిస్తారు. కాలుబాబ జాతర, జ్వాలాముఖి మాత జాతర, దసరా, హెూలీ, నాగుల పంచమి, తీజ్ పండుగలు ఈ నంగార ధ్వనితో మార్మోగుతాయి. నంగార ధ్వనికి అనుగుణంగా అడుగులో అడుగు కలుపుతూ వెనక్కి ముందుకు కదులుతూ వృత్తాకారంగా వీరి నృత్యం సాగుతుంది.

**బాజాలు :**

నంగార శబ్దాన్ని సుస్వర రమ్యంగా చ్సేవి బాజాలు. ఈ బాజాలు ఇత్తడితో తయారుచేస్తారు. దీనికున్న పీక (పత్తి) ఆకులతో తయారుచేస్తారు. ఈ బాజాల స్వరంలో బంజారా గీతాల్ని ఆలపిస్తుంటే అతి రమ్యంగా ఉంటుంది.

**గిల్ల :**

ఈ గిల్ల ముఖ్యంగా వెదురు బొంగులతో తయారు చేసిన చిన్న కోలాటపు కర్ర వంటిది. దీన్ని నంగార బాజాల కనుగునంగావాయిస్తుంటారు. ఈ మూడు వాద్యాల కలయిక వల్ల ఒక రసరమ్యమైన సంగీత, సాంస్కృతిక వాతావరణం స్థాపితమవుతుంది.

నేటి ప్రపంచీకరణ వీరి జీవనంపై భారీ ప్రభావాన్ని చూపుతున్నది. పాలు, పాల పదార్థాలు, అటవీ ఉత్పత్తులు అమ్మి జీవనం సాగించే వీరిపై ఒక్క వేటువేసి అధ:పాతాళానికి అణగదొక్కింది ప్రపంచీకరణ.

మార్కెట్లలోకి పాలు, పాల పదార్థాల ఉత్పాదక సంస్థలు, కాస్మోటిక్స్, వస్త్ర ఉత్పత్తి వంటివి వీరి సహజ ఉత్పత్తులపై వేటు వేశాయి. నేటి కల్తీ ఉత్పత్తులకు బదులుగా వీరి సహజ ఉత్పత్తులను ప్రోత్సహించి మార్కెట్ కల్పించాల్సిన ఆవశ్యకత ఉన్నది. అత్యంత వెనకబాటుకు గురైన వీరు 'బిసి' సామాజిక వర్గంలో ఉండి వారు పొందాల్సిన ప్రయోజనాలను పొంద లేకున్నారు. ఈ స్థితి నుండి అత్యంత త్వరగా వీరిని వీరి స్వజాతికి దగ్గరచేసి 'ఎస్టి'లలో చేర్చవలసిన అవసరం తక్షణం చేయాల్సి ఉన్నది.

# ప్రజాకవి సుంకర సత్యనారాయణ సాహిత్యోద్యమం

– **పాత శ్రీనివాసరావు**, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సుంకర సత్యనారాయణ ప్రజాకవిగా పేరుగాంచారు. సాహిత్య పరంగా వీరు ప్రజలమధ్య ఉంటూ చేసిన రచనల వల్లనే ఈయన ప్రజాకవి అన్పించుకోగలిగారు. చిన్ననాడే పద్యాలు రాయడం మొదలు పెట్టారు. నూజివీడు జమీందారీ విధానానికి వ్యతిరేకంగా పద్యాలు రాశారు.

"కన్ను విప్పి చూడుమటు
కానగవచ్చె తాళవృక్షముల్
కన్య రజస్వల అయినదని
కారణము గనపర్చి
తాటియాకన్నది తేగల
హక్కులేదుగ..." ఈ పద్యం ఈ విధంగా సాగుతుంది.

అలాగే పార్టీలో కొన్ని కోలాటపు పాటలు కూడా రాసి విద్యార్థుల చేత వేయించేవారు. వాటిలో ఒకదానిని చూడండి.

"సాధుమూర్తులకు ప్రజలకు నెప్పుడు
చాకిరి చేసెదము / దేశ సేవకులమయ్యెదము
దేశ చరిత్రను చాటెదము / నీ నా భేదము
లేక నిచ్చట నెప్పుడు మెలిగెదము....." అనే కోలాటం పాట కొణతమాత్మకూరులో భూకామందులకు కంట గింపైనది. సత్యనారాయణను ఊరినుండి పంపించి వెయ్యాలని వారు నిర్ణయించారు కూడా అయినప్పటికీ అది సాధ్యం కాలేదు. తునికిపాడులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దానికి విరాళాలు సేకరించేందుకు 'కష్టజీవి' అనే బుర్రకథ రాసి ప్రదర్శించారు. బుర్రకథ లంటే ఆయనకు చాలా ఇష్టం.

"పాలబుగ్గలా బంగారు బిడ్డడు తందాన తాన
గద్ద తన్నిన కోడిపిల్లవలె.. తందాన తాన
గిలగిల లాడుచు కెవ్వున ఏడ్చుచు .... తందాన తాన
అమ్మా... అమ్మా... అమ్మాయని అల్లాడసాగెనండీ...
తందాన...
ఆ పసివాణ్ణి గుడాల్ కత్తితో పొడిచి చంపాడు
తల నరికిన ఒక పక్షి చందమున - గిలగిల కొట్టుకొని
అయ్యో కొడుకా పోయితివా నన్నన్యాయం చేసి
అన్నెం పుణ్యం ఎరుగని నిన్నీ అధములు చంపారు.
దేవుడ నీవే ఉంటే తీర్పు చెప్పవేరా..."

ఇలా సాగుతుంది అల్లూరి సీతారామరాజు బుర్ర కథలోని ఒక ఘట్టం.

ఆ తర్వాత విజయవాడ వచ్చినప్పుడు 'ఓ సాయి బన్నయ'... 'ఓ మిట్టిపడే హిట్లరయ్యా' 'సెల్యూట్... సెల్యూట్' అనే పాటలు రాశారు. ఈ పాటలు ఆనాడు ప్రతి కష్టజీవి నోట విన్పించేవి. ఆ సమయంలోనే వీరులపాడు వాస్తవ్యులు వాసిరెడ్డి భాస్కరరావు గారితో కలిసి 'ముందడుగు', 'మా భూమి' అనే నాటకాలు రాశారు. గెరిల్లా నాటకం కూడా గొప్ప ప్రదర్శన. అవి తెలంగాణ పోరాటపు రోజులు, ఆనాడు తెలంగాణా రైతాంగం ఈ పాటలను పాడి నాటికలను ప్రదర్శించే వారు.

తెలంగాణ పోరాటాన్ని ప్రతిబింబించే ముందడుగు, అపనింద, మా భూమి అనే నాటకాలు అనేక వందల సార్లు ప్రదర్శించారు. వీటితో పాటుగా ఐక్యత అనే నాటికను కూడా కొన్ని వందల సార్లు ప్రదర్శించారు. ఒకేరోజు ఒకే నాటికను రెండుసార్లు ప్రదర్శించిన ఘనత వీరికే దక్కింది. సుంకర సత్యనారాయణ సందర్భాన్ని బట్టి అనేక గేయాలను రచించగా వాటిని అన్నింటినీ ప్రజాశక్తి పత్రిక ప్రచురించింది. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆ గేయాలను వీనుల విందుగా పాడేవారు. వాటిని తరువాత 'జయగీతి' అనే పేరుతో ప్రచురించారు.

అల్లూరి సీతారామరాజు చరిత్రను వెలికితీశారు. సంవత్సరం పాటు మన్యంలో పొన్నలూరి రాధాకృష్ణ మూర్తితో తిరిగి ఆయన చరిత్రను ప్రపంచానికి తెలిపారు. అల్లూరి సీతారామరాజు బుర్రకథను తెలుగువారికి అందించారు. ఆయన రచించిన బుర్రకథ ఈనాటికీ ఆంధ్రదేశంలో నిలిచి ఉన్నది. ఈ బుర్రకథే కాకుండా వీరేశలింగం, రైతువిజయం,తెలంగాణా, రుద్రమదేవి, అమరజీవి, కర్ణుడు, కుమ్మరిమొల్ల, అమరయోధులు, రైతు శిక్షణ యాత్ర, నవయుగం, లెనిన్, పల్లవ చక్రవర్తులు వంటి బుర్రకథలను రచించారు. 'భూమికోసం' 'కోతల రాయుడు' వంటి నాటకాలను వ్రాశారు. అంతేగాకుండా తన నాటకాలలో తనూ పాత్ర పోషణ చేశారు. ఇక నాటకాల విషయానికి వస్తే సమాజంలోని లంచగొండి తనానికి అద్దంపట్టే 'నూరు కాకుల్లో' అనే నాటకాన్ని రచించారు.

భూమికోసం నాటకాన్ని గుంటూరు జిల్లా కారంచేడుకు చెందిన వెంకన్న చౌదరిగారు సినిమా తీసేందుకు ఒప్పుకున్నారు. అందుచేత ఆ సినిమా కోసం 1957లో సుంకర మరల తన మకాంను మద్రాసుకు మార్చారు. 'మా భూమి' నాటకానికి రెండవ భాగం ప్రవాయాలనేది ఆయన చిరకాల వాంఛ. చివరకు 'మా భూమి' నాటకానికి న్యాయం చేకూర్చడానికి 'గెరిల్లా' నాటకాన్ని రూపొం దించారు. దీని ప్రదర్శనకు భీమడోలు వాస్తవ్యులు సుంకర చంద్రమౌళేశ్వరరావు పూర్తి సహకారం అందించారు. ఆ తర్వాత మద్రాసులో ఉంటూ డైరెక్టర్ తిలక్‌గారి నిర్మాణంలో శ్రీశ్రీ సుంకర కలసి వ్రాసిన భూమికోసం సినిమాకు కథ, మాటలు వ్రాశారు. దానితోపాటు సినిమాలో నాయకుని తండ్రి పాత్రను పోషించారు. భూమికోసం సినిమా విడుదలైన తర్వాత మరలా సుంకర 'గెరిల్లా' నాటకాన్ని ప్రదర్శించారు.

సుంకర జమీందారి విధానాలకు, నిరంకుశ విధానా లకు వ్యతిరేకంగా తన రచనలను చేశారు. అప్పటికి అణగారి ఉన్న వ్యవసాయ కార్మికులు వెట్టిచాకిరి లోనై అణగారి ఉన్న వారిని ఆకర్షించి వాగితోడ్పాడుతో వెట్టికి వ్యతిరేకంగా హరిజన వ్యవసాయ కార్మికులను జాగృత పరిచారు. వెట్టికి స్వస్తి పలికారు. అంతేగాక త్రాగుడు, జూదం మున్నగు దుర్వ్యసనాలు, దుష్ఫలితాలపై నాటికల్ని వ్రాసి తన విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. అయితే ఆయన వ్రాసిన ఎన్నో నాటికలు అచ్చుకాలేదు. రాత ప్రతులు కూడా లేకుండా పోయాయి. పొన్నలూరి రాధాకృష్ణమూర్తి మన్యంలో తిరిగి సీతారామరాజు పోరాటానికి ఉత్తేజితులై, ఏమైనా సరే ఆ వీరుని గాథను గ్రంథస్త చేయాలనే కోరికతో సీతారామరాజు తిరిగిన ప్రదేశాలు, బంధువుల ఇళ్లు, మొదలైన వాటిని సంద ర్శించి అక్కడి వారి సహాయంతో ఎన్నో వివరాలను సేక రించి సీతారామరాజు నవలను పొన్నలూరి రాధాకృష్ణ మూర్తి గారిచే రచింపచేశారు. పట్టుదలతో సుంకర తన వాటాకు వచ్చిన రెండెకరాల భూమిని అమ్మి ఆ డబ్బుతో దాన్ని అచ్చువేయించారు. అయితే దాన్ని పసిగట్టిన బ్రిటీష్ ప్రభుత్వం దానిపై నిషేధాన్ని విధించింది. ఆయన స్థావరాలపై దాడులు చేయించింది. సుంకర సోదరుడు వీరభద్రరావు ఆయనకు అండగా ఉండేవాడు. 1946 ఎన్నికల అనంతరం మద్రాసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు బహిరంగంగానే ప్రజాశక్తి ప్రెస్‌లో 'మన్యంలో విప్లవం' అనే పేరుతో ఆ గ్రంథాన్ని నవలగా ముద్రించారు. ఆ నవలే సుంకరవారికి 'అల్లూరి సీతా రామరాజు' బుర్రకథగా ఉపయోగపడింది.

సుంకర రాసిన బుర్రకథలు చాలా ఉన్నాయి. వాటిలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ ఒకటి. ఇంకా సుంకర రచించిన బుర్రకథలు.... తెలంగాణా కథ, వీరేశలింగం బుర్రకథ, రుద్రమదేవి బుర్రకథ, కుమ్మరి మొల్ల బుర్ర కథ.... ఇలా చెప్పుకోవచ్చు వీటిలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ ఒకటి వీటిలో.. ఆనాడు మన్యప్రాంతంలో ఉ న్న సంఘటనలను గమనించవచ్చు...

''మన్యవాసులకు తగవులు పెట్టుచు - మనల దోచుకొనిరి

అన్యాయపు ఈ పద్ధతులన్నీ - అంతరించకున్నా
శాంతి లేదు ఈ దేశానికి - విశ్రాంతి లేదు మనకు"

దేశంలో జరిగే విషయాలు...మన్య ప్రాంతంలో జరిగే సంఘటనలు చెప్తున్నారు.

"అగ్నిపర్వతము పగిలె - గుభిల్లున ఆ మన్యములోన
ధణ ధణ ధణ మ్రోగించండి - రణభేరి అపుడు
ఘనుడా సీతారామరాజు - తన ఖడ్గమును దూసె
రక్షక భటులె గాము సోదరులు - రయమున నిల్చారు
సాయుధులై స్త్రీ పురుష సమూహము - సాగె రాజు తోడ'

అల్లూరి సీతారామరాజు తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. దాన్ని గురించి...

"రాజురయించెను సూర్యుడు గృంకని - రాజ్యమస్త మించె
రాజు కొలువుదీరెను - పోలీసుల రాజ్యమంతరించె"

అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తారు.

వీరేశలింగం బుర్రకథ... నుండి కొంత భాగం చూడండి...

"వేదంబులు మనుధర్మ శాస్త్రమును వెదకి
చూచినాను.

ఈ దరిద్రమగు దుష్టాచారములెచ్చట కనపడవు". అంటారు పంతులుగారు. దీన్ని పండితలోకం ఎలా తిడ్తుందో చూడండి.

"మతము జెరచు ఈ మహాద్రోహినీ
జాతిని తిట్టిన నీతిహీనుపీ
నిపుణుల పెద్దల నిరసించినా ఈ
కులద్రోహినీ మనమందరము వెలివెయ్యాలి."

అంటారు పంతులుగారికి ఎంతటి అవాంతరాలు కలిగినా తను అనుకున్నది నెరవేరేదాకా విశ్రమించలేదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రెండో తెలుగు జ్ఞానపీఠ బోధించిన మానవవాదం

- ప్రవీణ్ యజ్జల, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం.

"మనిషి నశించినా నశించదు మానవత్వ
అదే ఈ లోకానికి మణి సోపానం
అనంతం వైపు దాని ప్రస్థానం"

(మరోహరివిల్లు. పుట: 23)

తెలుగులో రెండో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత మహాకవి డా సి. నారాయణ రెడ్డి. రెండో జ్ఞానపీఠ అన్నాను కనుక మొదట జ్ఞానపీఠను తలుచుకోవచం ధర్మం.! "ఒక రచయిత సాహిత్యాభిరుచి, దృక్పథం విలువలు ఆ రచయిత ఎంచుకునే సాహిత్య ప్రక్రియలోనే స్పష్టపడుతుంది". అని హెర్మ్ అనే ప్రక్రియా శాస్త్రవేత్త అంటాడు. హెర్మ్ ప్రకారం విశ్వనాథ పద్య ప్రక్రియ అయితే, సినారె కవిత్వమని చెప్పవచ్చు.! అదేమిటీ విశ్వనాథ నవలలు కూడా రాశారు కదా? అని మనకు అనిపించవచ్చు.! మరి అలా చూసుకుంటే సినారె కూడా పద్యకావ్యాలు రాశారు. కానీ రచయితల సాహిత్యాభిరుచి, దృక్పథం మనకు కొన్ని ప్రక్రియల్లోనే బయటపడుతుంది. దానితోనే వాళ్ళు గుర్తింపు పొందుతారు.! "విశ్వంభర ఆధునిక తెలుగు సాహిత్యంలోని నియోక్లాసిక్గా రూపొందింది. విశ్వనాథ కల్పవృక్షం మోడ్రన్ కాలంలోని క్లాసిక్ అయితే, సినారె విశ్వంభర నియోక్లాసిక్ అవుతుంది.! తెలుగులో తొలి జ్ఞానపీఠ విజేత నవీన కాలంలోని క్లాసిసిస్టు. మలి విజేత నవ్యక్లాసిసిస్టు". అని ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ ఆయన వ్యాస సంపుటి 'ఆధునికత %--% సమకాలికత'లో పుట:63 లో పేర్కొన్నారు. ఈ రెండు రచనల్లో వస్తుపరంగా చూసినా మనకు ఈ తేడా కనిపిస్తుంది. సినారె కావ్యాల్లో మానవవాద దృక్పథం అంతటా అంతస్సూత్రంగా నిక్షిప్తమై ఉంటుంది.! 'విశ్వగీతి' (1954) మొదలు 'విశ్వంభర' (1980) దాకా ఏ కవితా వస్తువును మనం పరిశీలించినా దాని అంతిమ గమ్యమైన మానవ స్పర్శ పరిపూర్ణంగా తగులుతుంది.! అది విశ్వంభరతో ఆగకుండా సినారె చివరి రచన 'నా కలం అలిగింది' (2017) వరకూ కొనసాగింది.! 12 జూన్ 2017 సినారె అమరులైయ్యారు.!

మానవవాదం అంటే ఏమిటి? సమాజ శాస్త్రజ్ఞులు ఇచ్చే నిర్వచనమేమిటనుకుంటే"కుల, మత, లింగ, వయో భేదాలను ఆర్థిక బలాన్ని దృష్టిలో ఉంచుకోకుండా సర్వజనుల సంక్షేమానికి పాటు పడటమే, మానవుడుగా మనడమే మానవత.! ఈ మానవతలో సమత్వము, లౌకికీకరణము అనే విలువలు కూడా ఇమిడి ఉన్నాయి". దీని బట్టి సర్వమానవ సమానత్వం, కులవర్ణ, వర్గ నిర్మూలనం, ఒక విషయాన్ని మూఢ విశ్వాసాలతోనూ, మత పరంగానూ ఆలోచించక హేతుబుద్ధితో యదార్థంగా ఆలోచించడం, స్వార్థ దృష్టి లేకుండా విశ్వమానవ సంక్షేమ దృక్పథాన్ని కలిగి ఉండడం ప్రగతిశీల మానవదృష్టికి, పుష్టిని చేకూర్చే అంగాలుగా మనం భావించవచ్చు.! ఇవి సినారె కవిత్వంలో ఎలా ఉన్నాయో చూద్దాం.!

సహనం, త్యాగం, అహింస: సినారె కవిత్వంలో ప్రాథమిక వ్యక్తిగత విలువలైన స్నేహం, సౌజన్యం, సహనం, త్యాగం, నీతి మొదలుగా సమిష్టి విలువలైన సమైక్యత, అహింస, శాంతి, సర్వమానవ సౌభ్రాతృత్వం వంటి ప్రపంచ వ్యాప్త విలువల దాకా వ్యక్తం చేశారు.! ఈనాటి సమాజంలో మనం అలవరచుకోవలసిన త్యాగం, సహనం, అహింస వంటి గుణాలను ఆధారం చేసుకుని ఒక వ్యక్తి తాలూకా సంస్కారానికి వెలకట్టవచ్చునని చెబుతూ 'సహనంబీ త్యాగంబీ అహింసబీ గురించి ఇలా చెప్తారు.!

"ఎట్టివానికి వాని సహనము
బట్టి విలువలు రెమ్మ వేయును
సహనమే సంస్కృతియటన్నవ
చస్సు అక్షర లక్ష సేయును"

(సమదర్శనం. పుట: 10)

"త్యాగులకు సంతృప్తిలోకహి
తమ్ముకై బలి యగుటలోనే
కప్పురమునకు దైవసన్నిధి
కరగిపోవుటలోనే ధన్యత"

(సమదర్శనం. పుట: 14)

"కతి యొకటే వీరచిహ్నము
కాదుసుమ్మీ ధర్మ వీరుని
గుండె ముందర పెనుతుపాకీ
గుండు సైతము బెండపోవును"

(సమదర్శనం. పుట: 13)

అయితే మానవతా దృక్పథంగల ఒక వ్యక్తి ఎంత సంస్కారవంతుడైనా, ఎన్ని విలువలను అంటి పెట్టుకొని జీవించినా, కేవలం తన కోసం మాత్రమే తాను జీవించ లేడు.! తను ఆలవరచుకున్న సంస్కార ప్రమాణాన్ని అనుసరించి కొన్ని సామూహిక మానవతా విలువల కోసం, ఆశయాల కోసం తపన పడుతూ ఉంటాడు. అలాంటి సందర్భాల్లో అతనికి కావలసిన నైతిక బలం సంఘమే సమకూరుస్తుందని ఈ కింది కవితలో కవి కట్టిగా చెప్తాడు.

"నీతి కొరకు నిజం కొరకు
నిలిచే వ్యక్తిని మంచిని
కొలిచే శక్తిని సంఘం
కోటి గొంతులెత్తి అభినుతిస్తుంది
కొండంత బలమ్మును అందిస్తుంది."

(భూమిక. పుట: 55)

ఏ విప్లవాగ్నులు ఎగసినా మానవతను అణచడానికి చేసిన ప్రయత్న పరిణామాలని మనం తెలుసుకుంటాం.! అమెరికన్ విప్లవం, ఫ్రెంచి విప్లవం, రష్యన్ విప్లవం ప్రపంచ యుద్ధాలు మన జాతీయ స్వాతంత్రోద్యమం, ఇవన్నీ మానవ పరిరక్షణ మహాప్రస్థానంలో మైలురాళ్ళు, ప్రగతిశీల కవితా రచనకు ఇవి ముడిసరుకులు.!

"నరభోక్తలు మానవతను
నంజుకు తింటున్నప్పుడు
పరశక్తులు స్వజాతిపై
విరుచుకు పడుతున్నప్పుడు
కత్తులతోపాటు పైకి
సుత్తె లెత్తి పట్టించే
అడుగులతో పాటు పదును
కొడవళ్ళను కదలించే
నాగళ్ళను రోకళ్ళను నడిపించే
నౌకర్లను పాలేర్లను ఉరిమించే
తిరుగుబాటులో కవితా
స్వరముద్రిక లున్నవి"

(భూమిక. పుట: 36)

చరిత్రలో ప్రజల తిరుగుబాట్లను క్రూరంగా అణచ డానికి ప్రయత్నించిన లూయాలూ, జార్లూ, ఫాసిస్టు హిట్లర్, సామ్రాజ్య వాదులైన అంగ్లేయులు, నిరంకుశ నిజాం వీళ్ళంతా నరభోక్తలే.! మానవత్వాన్ని నంజుకుతినే నరరూప రాక్షసులే.! అయితే ఒక బంతిని ఎంత బలంతో నేల కేసి కొడితే అంత ఉవ్వెత్తున పైకిలేస్తుంది.! ఉద్యమాల స్వభావం కూడా అలాంటిదే అనుకోవచ్చు.!

## వర్గ సంఘర్షణ :

సినారెకి మార్క్సు పైన ఆయన సిద్ధాంతాల పైనా ఆచంచలమైన విశ్వాసమున్నది.! తుచ్ఛమైన సంకుచిత భావాల ఊబి నుండి మనిషిని వెలికి తీసి అతనిలో మానవత్వాన్ని మేల్కొల్పడం మార్క్సిజం ధ్యేయం.! అయితే ఈ ధ్యేయం వర్గపోరాటాన్ని ఆధారం చేసు కుంటుంది.! పెట్టు బడిదారీ వ్యవస్థ కూడా ప్రపంచ చరిత్ర క్రమపరిణామంలో ఒక దశ.! ఈ విధానం మొదట ఒక అభ్యుదయకరమైన పాత్ర నిర్వహించినా, క్రమంగా అది స్వార్థపూరితమై లాభాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉం టుంది. తద్వారా సమాజాన్ని అవినీతిపాలు చేస్తుంది.!

"మంచు ముద్దల్లో
మార్తాండ బింబాలు ఉదయిస్తే
గులాబీ తీగల్లో
ప్రళయానల జ్వాలలు ప్రసరిస్తే
పిల్లగాలిలో

కల్లోల ఝుంఝులు ప్రసరిస్తే
పిల్లన గ్రోవిలో
విప్లవ శంఖాలు వినిపిస్తే
అది వికృతి కాదు
అనలైన ప్రకృతి".

(తేజస్సు నా తపస్సు. పుట: 16)

ఇందులో మంచు ముద్దలు, మార్తాండబింబాలు, గులాబీ తీగెలు, ప్రళయానం జ్వాలలు, పిల్లగాలులు, కల్లోల ఝుంఝులు, పిల్లన గ్రోవులు, విప్లవ శంఖాలు, ఇవి పరస్పర విరుద్ధమైన భౌతిక శక్తులు.! మూల భౌతిక శక్తిని కూల్చి మరో భౌతిక శక్తి పెల్లుబకడం ప్రకృతి స్వభావం.! మంచు ముద్దలు, గులాబీ తీగలు, పిల్ల గాలులు, పిల్లన గ్రోవులు ఇవి పెట్టుబడిదారీ సంస్కృతికి ప్రతీకలు.! మార్తాండ బింబాలు, ప్రళయానల జ్వాలలు, కల్లోల ఝుంఝులు, విప్లవ శంఖాలు ఇవి తిరుగు బాటుకు సిద్ధమైన శ్రామికులకు ప్రతీకలు.! ఇది వర్గ స్వభావం.! పరస్పర వర్గ సంఘర్షణలో పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోవడం చరిత్ర నిర్ణయించిన వాస్తవం. ఇదే సహజ పరిణామం.! కొన్ని ఖండికలు సినారెని శ్రమైకజీవి పక్షపాతి అని చెప్పకనే చెప్తున్నాయి.!

"శ్రమజీవి చెమట బిందువులో
ఆణిముత్యమూ ఉంది
అగ్ని గోళమూ ఉంది"

(మంటలూ మానవుడు. పుట: 21)

అని శ్రమ జీవనంలో ఒక సౌందర్యాన్ని దర్శిస్తూనే సామ్యవాదతత్వ అంచులను సందర్శింపజేశారు. శ్రీశ్రీ ప్రతిజ్ఞలో"త్రిలోకాలలో, త్రికాలాలలో/ శ్రమైక జీవన సౌందర్యానికి/ సమానమైనది లేనే లేదని" (మహాప్రస్థానం. పుట:61) అన్న ఖండిక ద్వారా సమాజం సుశిక్షితమైన 'గతి'లోనే సౌందర్యం ఇమిడి ఉన్నదని, ఆ గతి శ్రమ వల్లనే సాధ్యమౌతుంది.! అన్న శ్రీశ్రీ సిద్ధాంతానికి మరో మెట్టు పైకెక్కి ఆ క్రమబద్ధమైన గతిని నిరోధిస్తే ఆ గతి చితిగా మారి అగ్ని గోళాల రూపంలో బూర్జువా సమాజాన్ని ధ్వంసం చేస్తుందన్న హెచ్చరిక సినారె చేస్తున్నట్లుగా మనం అర్థం చేసుకోవచ్చు.!

**శాంతి ప్రియత్వం :**

కవి శాంతి ప్రియుడు.! మానవవాద పునాదుల పైనే ప్రపంచ శాంతి సౌధం నిర్మితమౌతుందని ఆయన నమ్మకం. వసుధైక కుటుంబ భావనే ఆ సౌధానికి శిఖరం అంటారు.!

"సమత నా తల్లి
సౌహార్దం నా తండ్రి
అనాది నా జననం
అనంతం నా పయనం
విశ్వం నా ఊరు
శాంతి నా పేరు"

(తేజస్సు నా తపస్సు. పుట: 12)

స్వార్థం, సామ్రాజ్యదాహం, యుద్ధపిపాస, ద్వేషం, మతమౌఢ్యం, వర్ణ, వర్గతారతమ్యం ఇవి శాంతికపోతిని కబళించే దుష్ట శక్తుల్ని ఈ ఖండికలో చూడవచ్చు.!

"నలుపు తెలుపు రంగులతో
నరులకు వెలకట్టినపుడు
మతమౌఢ్యం తక్కెడలో
మతుల విలువ తూచినపుడు
అణు బాంబుల పిడికిట్లో
అఖిలావని నదిమినపుడు
శ్రమజీవులు మేధావులు సంఘటించి
సమవాదులు యువ యోధులు ప్రతిఘటించి
సాగించే గమనంలో
శాంతి ప్రియ సమరంలో
మానవతావాది కవిత
మహోద్యమ స్పృహ ఉన్నది".

(భూమిక. పుట: 36)

ప్రపంచ ఉద్యమాల చరిత్రను పుక్కిట పట్టింది. మొదటి రెండు పంక్తుల ద్వారా దక్షిణాఫ్రికా, అమెరికాలోని నల్లజాతుల తిరుగుబాటునూ, తరువాత రెండు పంక్తులు

మతం పేరిట ప్రపంచమంతటా జరుగుతున్న మారణ హోమాన్నీ, కవి మనకు స్ఫురింపజేసున్నాడు. తరువాతి పంకులు 1945 లో జపాన్ పై అమెరికా వేసిన ఆటం బాంబువల్ల జరిగిన ప్రాణ నష్టానికి ప్రతి స్పందించిన ప్రపంచ శ్రామికవర్గం, మేధావివర్గం యువత కలిసి ఒక బ్రహ్మాండమైన ఉద్యమరూపంలో నిరసన పూర్వకంగా జరిపిన శాంతి సమర చారిత్రక ఘట్టాన్ని మన ముందు నిలుపుతున్నాయి.! అలాంటి శాంతి ప్రియ సమరమే తన కవితా మహోద్యమానికి ఊపిరి అంటున్నాడు కవి.! అంతేకాదు క్రమంగా ప్రపంచంలో శాంతిప్రియుల కృషి ఫలితంగా యుద్ధోన్మాద విషజ్వాలలు విరిసిపోయి విశ్వశాంతి వ్యాపిస్తుంది.! ఇలా శాంతి పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్ట వలసిన ఆవశ్యకత ఎంతయినా ఉందనీ లేకపోతే ప్రపంచ పురోగతి కుంటుపడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ మానవ పరిరక్షణ కోసం చేపట్టే ఏ ఉద్యమమయినా అత్యంత బలీయమైనదనీ, దాన్ని అడ్డుకునే శక్తి ఏదీ లేదని ఇక్కడ కవి స్పష్టం చేశారు.

"పరిమళాలనెవడాపును?
పెరగాలినెవడాపును?
ఎవడాపును మానవతా
రవి రుక్కును కవి వాక్కును"

(అక్షరాల గవాక్షాలు. పుట: 3)

నిత్యం ప్రసరించే పరిమళాన్నీ, పెరగాలినీ, రవి రుక్కునూ కవి వాక్కునూ ఉపమానాలుగా చెప్పడం వల్ల ఉద్యమ స్వరూప స్వభావాలు మనకు బాగా అవగత మౌతున్నాయి. ఇలా మానవుడిలో చైతన్యం పెరిగిననాడు "జడమైనా నడుస్తుందట!" (మరో హరివిల్లు. పు. 38) కవి కలానికి అంతటి శక్తి ఉందంటారు. మానవుడు సాధించిన చైతన్య సంస్కృతులు విశ్వంభరలో మనశ్శక్తు లుగా రూపొంది వ్యక్తమౌతాయి.! 'భూమిక'లో ప్రారంభ మైన వ్యక్తి ప్రాధాన్యం 'విశ్వంభర'లో శక్తి ప్రాధాన్యంగా విజృంభించింది.! ఒక్క మాటలో చెప్పాలంటే 'మాని షాద'తో ప్రారంభమైన మానవతా ప్రస్థానం విశ్వతత్త్వాన్ని గుప్పిట్లో బిగించే వరకు అవిశ్రాంతంగా కొనసాగింది.!

"శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి
నిరాశ నుంచి ఆశాశిఖరానికి"

(మార్పు నా తీర్పు. పుట: 2)

నడిపించే మార్పు తప్పకుండా వస్తుందంటారు సినారె.! తన కలాన్ని ఒక 'ఉలి'గా మార్చి విశ్వమానవ మందిరానికి నగిషీలు చెక్కారు.! అందులో తన ఆశలకూ, విశ్వాసాలకూ ప్రతి రూపమైన మానవుణ్ణి ప్రతిష్ఠించారు.! ఇలా మానవ మహోద్యమానికి తన కలాన్ని అంకితం చేసిన ఈ మహాకవి మన జాతికి ఒక గర్వకారణం అనడంలో సందేహం లేదు.!

"తెలుపు నలుపుల కొలమానాలలో కూరుకొని పోతున్నాడు./ మల్లె పువ్వుకూ నల్ల కలువకూ ఎల్లలు పెడుతున్నాడు./ కుల, మత అంతరాల జ్వాలల్ని సృష్టించి మానవతను సమిధగా వ్రేలుస్తున్నాడు./ పక్కవాడిపై విషం కక్కుతున్నాడు./ తలకాయలతో పాటు అనుబంధా లను తెంచుతున్నాడు./ దీనికి కారణం ఒకటే. అంత రంగపు అట్టడుగు పొరల్లో అంతరాత్మలాంటి మానవతను బంధించి పెట్టడం." ఇక్కడ సినారె ఆశించేది ఒక్కటే. ఆ మానవత జలయంత్రంలా పైకి చిమ్ముకొని రావాలి.! విలువల మంచి చెడ్డల్ని విజ్ఞాన శాస్త్రపు వెలుగులో రూపొందించుకోవాలి.! చైతన్యవంతమైన నిర్ణయాలు చెయ్యాలి.! ఆ నిర్ణయాల అనుగుణంగా సమాజం పురోగమించాలి.! ఇలా సినారె సాహిత్యమంతా మానవ వాదం అల్లుకుని ఉంటుంది. 1931 జూలై 29 ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆ జ్ఞానపీఠ కవిని తలుచుకుని, ఆయన బోధించిన మానవవాదాన్ని మరింత ముందుకు తీసుకుపోదాం.!

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునికాంధ్రకవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు. డా. సి. నారాయణరెడ్డి. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1989.
2. అనుశీలన (వ్యాస సంకలనం), జి.వి. సుబ్రమణ్యం సం. ఎల్లూరి శివారెడ్డి, షష్టిపూర్తి ప్రచురణలు, హైదరాబాదు, 1996.
3. ఆధునికత -- సమకాలికత. (వ్యాస సంపుటి) ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ. చినుకు పబ్లికేషన్స్ గాంధీనగర్, విజయవాడ, 2016
4. డా. సి.నారాయణరెడ్డి. సమగ్ర సాహిత్యం (1 నుండి 18 వరకు) డా. సి.నారాయణరెడ్డి. విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2003.
5. నారాయణరెడ్డి కవిత్వం సంప్రదాయము - ప్రయోగము. డా. జి.గోవర్ధన్ (పిహెచ్.డి.) పద్మశ్రీ గ్రాఫిక్స్ గాంధీనగర్, విజయవాడ 1995.
6. సాహితీ మూర్తులు -- స్ఫూర్తులు (వ్యాససంపుటి) ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు. ప్ర. సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాద్ 2015.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# శ్రీశ్రీ, సినారె పాటలు... సామాజిక దృక్పథం

- సాయికృష్ణ రంగ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నన్నయతో తెలుగు సాహిత్యం ప్రారంభం అయిందన్న అధికారతను తెలుగు సాహిత్య చరిత్ర తెలియజేస్తే హాలునిగాథాసప్తశతి కాలానికే పాటలు ఉన్నట్లు చారిత్రకాధారాలు తెలియజేశాయి.

పాట గురించి లోతుగా చెప్పవలసి వస్తే పాట సృజనాత్మకత ప్రక్రియ. ఇది మౌఖికంగా ఆవిర్భావమై లిఖితంగా స్థిరపడిందని చెప్పవచ్చు. ఏ దేశచరిత్ర విఖ్యాతికైనా ఇతర కళల మాట ఎలా వున్నా దానికంటే ముందు పుట్టిన పాట ఆ శిష్ట వ్మాయం కంటే పై మెట్టులో నిల్చి ఆయా దేశాల సంస్కృతిని సుసంపన్నం చేసింది.

అలాగని శిష్ట సాహిత్యంలో పాటల ప్రస్తావన అసలు లేదని మాత్రం చెప్పలేము. నన్నయ తన భారతంలో పాట ప్రస్తావన ఎక్కడా చేయనప్పటికీ, నన్నెచోడుడు తన కుమార సంభవంలో 'ఉవిదిలింపు మిగుల నూయల పాటలు పాడ' అంటాడు (1. నన్నెచోడుని కుమార సంభవం 1952 వావిళ్ళవారి ప్రచురణ 3 ఆశ్వాసం. పుట.127) అలాగే పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణంలో 'మేటియై చను భక్తి కూటువలందు పాటలుగా గట్టి పాడెడు వారు' అని ప్రస్తావించారు (2. బసవపురాణం పి.ఎస్.ఆర్.టి.యు ప్రచురణ 1993. పుట.76).

నాచన సోముని పేరున వచ్చిన కావ్యం (నేడది అలభ్యం) 'వసంత విలాసం'లో 'వీణాగనం వెన్నెల తేటరాణ మీరగా రమణులపాట' (తెలుగు సినిమా పాట పైడిపాల వ్యాసం 2004 ఆంధ్రప్రభ డైలి. సాహితీ గవాక్షం 26.12.2004) శ్రీనాథుని భీమ ఖండంలో కూడా పాటల ప్రస్తావన వుంది. 'మేడల మీదటన్ గనక వీణలు మీటుచు చాడిరచ్చరల్' (3. తెలుగు సాహిత్య చరిత్ర, పింగళి లక్ష్మీ కాంతం, విశాలాంధ్ర ప్రచురణ 1998 శ్రీనాథ యుగం) అలాగే ప్రబంధయుగంలో మనుచరిత్ర కర్త పెద్దన తన ప్రబంధం మనుచరిత్ర 5 ఆశ్వాసం 71 పద్యంలో

'వేల్పుగాణులు పాడుబాడు లక్ష్మీనారాయణుల/ కళ్యాణం పుబాటలం/ దీటుకొను తిన్న నివరంబులుంగలసి/ బలిసి కొనుకోలా హలము' అని తెలియజేశాడు.

అలాగే పద కవితా పితామహునిగా ప్రసిద్ధిపొందిన అన్నమయ్య తనపద సంకీర్తనల్లో జాజరలు, ఉయ్యాలలు, జోలలు, ఆలాలలు అసంఖ్యాకంగా కన్పిస్తాయి.

ఆధునిక కాలంలో అంటే 19, 20 శతాబ్దాల కాలంలో ఎందరో రచయితలు వారి ప్రతిభ మేరకు వెలుగు చేసిన సాహిత్యంలో విశ్వనాథవారు కిన్నెరసాని పాటలు రాశారు. నండూరి సుబ్బారావ్ గారు ఎంకి పాటలు వ్రాశారు. ఏల్పూరి సుబ్బారావ్ గారు 'బంగారి మామ పాటలు' రాశారు. గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ మొదలైన వాళ్ళు పాటల ద్వారా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులయ్యారు.

అలాగే ప్రజా సాహిత్యం పేరుతో సుబ్బారావ్ ప్రాణిగ్రాహి, గద్దర్, వంగపండు తదితరులు జనం పాటలు వ్రాసి ప్రసిద్ధులయ్యారు. ఇది పాట యొక్క ప్రాథమిక విషయం .

ఇక ఆధునిక కాలంలో 100 సం.ఎల ప్రపంచ సినిమా చరిత్రలో 85 సం.ఎలుగా తన వాణిని బాణితో జతకలిపి ప్రతిధ్వనింప చేస్తున్న సినిమా పాట గురించి అవలోకిస్తే. సినిమా ఒక వినోదం. ఒక విజ్ఞానం, ఒక సామాజిక విజయం, నిరంతర సామాజిక జీవనంలో ప్రపంచ వ్యాప్తంగా జన హృదయాలను రంజింప చేసింది. రజింప చేస్తోంది. రంజింప చేస్తూనే వుండేది సినిమా పాట ఇది 'నిరంతర ప్రక్రియ'.

అంతర్జాతీయంగా పరిశీలిస్తే 'పాల్ డ్రెస్సర్' రచన స్వరకల్పనలో 'జాజ్ సింగర్' చిత్రంలో బాల్సన్ గళంలో తొలిపాట పుట్టింది.

1931 సం॥లో వచ్చి తొలి టాకి తెలుగు చిత్రం 'భక్తప్రహ్లాద' తొలి గీతం 'పరితాప భారంబు భరియంప తరమా' ఈ పాటకర్త చందాల కేశవదాసు. తెలుగు సినిమా పాటకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

1936 నుండి తెలుగు సినిమా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ స్వాంతంత్ర్యోద్యమ ప్రభావంతో సినిమాలు నిర్మించి తనవంతు సేవను అందించింది. 1938లో సాంఘిక సమస్యలపై విల్లు ఎక్కుపెట్టిన తెలుగు సినిమా 'మాల పిల్ల', రైతు బిడ్డ వంటి చిత్రాలనందించింది. (రైతు బిడ్డ చిత్రం ద్వారా ప్రఖ్యాత జానపద సినిమా రచయిత కొసరాజు రాఘవయ్య చౌదరిగారు పాటల రచయితగా సిని ప్రవేశం చేశారు).

1930-35 మధ్య కాలంలో మహా ప్రస్థానం ద్వారా అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడైన శ్రీరంగం శ్రీనివాసరావు గారు 1950లో 'ఆహుతి' డబ్బింగ్ సినిమా ద్వారా మాటలు పాటల రచయితగా సినీరంగ ప్రవేశం చేశారు. పదప్రయోగాలతో ఉర్రూతలూగించే అభ్యుదయ భావాలతో సామాజిక స్పృహకు పెద్దపీట వేసి చలచిత్రాల్లో పాటలు వ్రాసి ప్రజలను ఉర్రూతలూగించారు. సమాజంలో ప్రతి అంశాన్ని ప్రతి అసాంఘిక అంశాన్ని విమర్శిస్తూ పరిష్కారాలు సూచిస్తూ ఎన్నో పాటలు వ్రాశారు. వారి సామాజిక దృక్పథానికి మచ్చు తునకలుగా అలరారిన కొన్ని పాటల పల్లవులను ఇక్కడ పొందుపరచడం జరిగింది.

1. వీర మాతలారా సుతులకు చందన గంధం పూయండి
   బానిస తనమున బ్రతికెకన్నా చావే మేలని తలచండి. జై జవాన్.
2. నీతులు బాగా చెబుతారు నెత్తిన చేతులుపెడతారు - కన్యాదానం.
3. నేడె ఈనాడే ప్రజాయుద్ధ సంరంభం ఈనాడు.
4. ఎవరో వస్తానరని ఏదో చేస్తారని భూమి కోసం
5. పతితలార భ్రష్టులారా బాధ సర్పదష్టులారా (దేశమంటే మనుషులోయ్)
6. అరుణ పతాకం ఎగిరింది, కార్మికలోకం గెలిచింది మనుషులు మారాలి.
7. సమరానికి నేడె ప్రారంభం యమరాజుకు మూడెను ప్రారబ్ధం యమగోల.

ఇలా ఎన్నో శ్రీశ్రీ పాటల్లో సామాజిక దృక్పథానికి సంబంధించిన అంశాలు కన్పిస్తాయి.

అలాగే 1961లో 'గులేబకావళి కథ' చిత్రం ద్వారా సినిరంగానికి పరిచయం అయిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు. చలనచిత్రాల్లో ఎన్నో వేల పాటలందించారు.

వీరు చలనచిత్రాల్లో జానపద, సాంఘిక, చారిత్రాత్మక, పౌరాణికాల్లో పాటలనందించారు. ఏకవీర, అక్బర్ సలీం అనార్కలి చిత్రాలకు సంభాషణలందించారు. విశ్వ విఖ్యాతమైన సాహితీ మూర్తిగా వీరు అందిరికి సుపరిచితులే.

వీరు ఆచార్యులై విశ్వవిద్యాలయ ఆచార్యులుగా, అధికార భాషా సంఘం, అధ్యక్షులుగా, రాజ్యసభ సభ్యునిగా, డా. బి.ఆర్. అంబేద్కర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యలతలు నిర్వహించి ఆ పదవులకే వన్నె తెచ్చారు.

వీరు చలనచిత్రాల్లో సామాజిక దృక్పథంతో వ్రాసిన పాటల్లో కొన్ని పల్లవులను పరిచయ మాత్రంగా ఇక్కడ పొందు పరచడం జరుగుతోంది.

1. పదరా పదరా మంచి రోజులొచ్చాయి 'ఆత్మీయులు'.
2. పరీక్ష రోజులు ముంచుకు రాగ తిరుపతి ముడుపులు కడతారు.
3. రింజిం రింజిం హైదరాబాద్ 'మట్టిలో మాణిక్యం'.
4. అల్లా అల్లా యా అల్లా అల్లా 'మహమద్ బిన్ తుగ్లక్'.

5. ఎవరు వీరు ఎవరు వీరు 'మానవుడు దానవుడు'.
6. హరిజనులు గిరజనలు
అందరు నేడు పురజనులే వున్న వారికే చదువులనే
ఆ నమ్మకాలు ఇక చెల్లవులే 'డబ్బుకు లోకం దాసోహం'
7. దేవుడు సృష్టించాడు లోకాలు
ఈ మనిషే కల్పించాడు భేదాలు 'ఎన్టీఆర్ రైతుబిడ్డ'.
8. దీపానికి కిరణం ఆభరణం
రూపానికి సుగుణం ఆభరణం 'చదువు సంస్కారం'.

ఈ విధంగా ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి గారి కొన్ని పాటల పల్లవులను (సామాజిక దృక్పథం తెలియజేసే వాటిని) సూచన ప్రాయంగా తెలిపాను.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తొలి తెలుగు ప్రబంధము స్వారోచిష మనుసంభవము

– డా॥. బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగము, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

తెలుగు సాహిత్య చరిత్రను కొన్ని యుగాలుగా విభజించారు సాహిత్యకారులు. ఆయుగ విభజనలో ప్రముఖంగా చెప్పబడేది ప్రబంధ యుగం. ప్రబంధ యుగానికి బీజం వేసింది అల్లసాని పెద్దనే అని చెప్పవచ్చు. ఈయన రచించిన 'మనుచరిత్రము' తొలి ప్రబంధంగా చెప్పవచ్చు. తెలుగులో ఈ రచన తరువాతే ప్రబంధ యుగము మొదలైంది. తరువాత ప్రబంధాలన్నీ 'మనుచరిత్ర' స్ఫూర్తితోనే రచింపబడినవి. ఆరు ఆశ్వాసాల ఈ ప్రబంధం తెలుగు పంచమహాకావ్యాలలో మొదటిగా చెబుతారు. ఈ ప్రబంధానికే 'స్వారోచిషమను సంభవము' అనే పేరు కూడా కలదు.

## ఇతివృత్తం :

కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడైన అల్లసాని పెద్దన మారన రాసిన మార్కండేయ పురాణంలోని 150 పద్యాలలో చెప్పిన వరూధినీ, ప్రవ రాఖ్యుల ప్రేమ కథను ఇతివృత్తంగా చేసుకొని ఆరు ఆశ్వా సాల అద్భుత ప్రబంధంగా తీర్చిదిద్దాడు. వరూధినీ ప్రవ రాఖ్యుల ప్రేమ కథతో మొదలై స్వారోచిషునితో ముగు స్తుంది. కాశీ నగరం దగ్గర ప్రవరుడనే పరమ నిష్టాగరిష్ఠు డైన బ్రాహ్మణుడు అతిథులను ఎంతగానో ఆదరించే వాడు. ఒకనాడు ఆ ప్రవరుని ఇంటికి వచ్చిన సిద్ధుడు మహిమాన్వితమైన పసరును ప్రవరునికి ఇవ్వగా ఆ పసరను పూసుకున్న ప్రవరుడు దివ్య ప్రభావం వలన హిమాలయ పర్వతాలకు వెళ్ళి అక్కడి సుందర దృశ్యా లను చూసి ఆనందిస్తాడు. అయితే ఎండ వేడికి కాలికున్న పసరు మంచులో కరిగిపోయింది. పసరు పోసేవారికి దివ్యశక్తి నశించి తిరిగి వెళ్ళే ఉపాయం తోచక అక్కడే తిరుగుచున్న ప్రవరుడ్ని చూసి వరూధిని అనే అప్సరస మనసు పడింది. అయినప్పటికీ ప్రవరుడు ఆమెను తిరస్క రించి వెళ్ళిపోయాడు. కామ విరహంతో ఉన్న ఒక గంధర్వుడు ప్రవరుని వేషంలో ఆమెను చేరి తన కోరికను తీర్చుకున్నాడు. వారికి జన్మించిన స్వరోచి ఒక దేశానికి రాజయ్యాడు. ఆ స్వరోచి ఒకసారి వేటకు వెళ్ళి మనోరమ అనే యువతిని పెళ్ళాడాడు. వారికి కలిగిన సంతానమే స్వారోచిష మనువు.

## రచనా వైభవం :

మనుచరిత్రలో పెద్దన కథను కౌశలం, వర్ణనా చాతుర్యం పండితుల ప్రశంసలందుకొన్నాయి. పెద్దనను సమకాలికులు అనంతర కవులు కూడా అనుసరించారు. మనుచరిత్రలోని కవితాశిల్పం అద్వితీయం. మను చరిత్రలో అనేక ఇతివృత్తాలున్నప్పటికీ అందరినీ అలరించి పెద్దనకు కీర్తి తెచ్చిపెట్టినది. వరూధినీ ప్రవరాఖ్యుల ఘట్టమే. హిమాలయ పర్వత వర్ణన, ఆరవ ఆశ్వాసంలోని ఋతు వర్ణనలు, యుద్ధ వర్ణనలు వంటి అనేక అద్భుత వర్ణనలున్నాయి. ప్రబంధంలో ఉండవలసిన అష్టాదశ వర్ణనలన్నీ ఇంచుమించుగా మనుచరిత్రలో కనబడతాయి. పెద్దన వర్ణనా నైపుణ్యానికి చిన్న ఉదాహరణగా క్రింది పద్యాన్ని చెప్పొచ్చు.

''అటజని కాంచె భూమిసురం జంబర చూచి
శిరస్సరజ్ఝరీ
పటల మహుర్ముహుర్లురదభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిపుల్ల కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్''

ఇటువంటి అనేక పద్యాలు పెద్దన రచనా వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపెట్టుతాయి.

## పాత్ర పోషణ :

వరూధినీ ప్రవరులు ఈ నాటికీ మన సంభాషణలలో చోటు చేసుకోవడం పెద్దన పాత్ర పోషణలోని నైపుణ్యానికి

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిహ్నం. ప్రతీ పాత్ర కూడా సజీవంగా పాఠకుల ముందు కదలాడుతున్నట్లు చిత్రించిన పెద్దన పాత్ర చిత్రణకు పాఠకులు దాసోహమవడం ఖాయం. ఆదర్శ నడవడికకు చిహ్నంగా ప్రవరుడి పాత్రను తీర్చిదిద్ది, ఇన్ని వందల యేండ్లు అయినప్పటికీ నేటికీ మనందరిదీ స్ఫూర్తి దాయకంగా నిలిచివున్నది.

**రసపోషణ :**

శృంగార, శాంతం, ధర్మం, అద్భుతం, బీభత్సం వంటి అనేక రసాలు ఆయా వృత్తాంతాలలో పాత్రలకు తగిన ఔచిత్యంతో పెద్దన పోషించాడు. పాత్రలకు, సన్నివేశాలకు, రసానికి అనుగుణంగా అలంకారాలను ప్రయోగించాడు.

**కవితాశైలి :**

"అల్లసాని వారి అల్లిక బిగిబిగి" అనే నానుడి ఉంది. "జిగి" అంటే కాంతి. 'బిగి' అంటే కూర్పు, పట్టు. అంటే పదాల ఎంపికలోనూ, సమాసాల కూర్పులోను, పద్యాల ఎత్తుగడలోను చక్కదనం, చిక్కదనం ఉంటాయన్న మాట. మార్కండేయ పురాణంలోని ఒక చిన్న కథను తీసుకొని దాన్ని విస్తరించి ఒక అపూర్వ కళాఖండాన్ని శిల్పించాడు పెద్దన. ఇది నిజంగా అపూర్వమే. పెద్దనకు పూర్వం తెలుగులో అంత కచ్చితమైన ప్రమాణాలతో రచించబడిన కావ్యం లేదు. పెద్దన తర్వాతి కవులలో కూడా మనుచరిత్రను అనుకరించి రాయబడిన కావ్యాలే ఎక్కువ.

అరుణాస్పదపురంలో ప్రవరుని గైహిక జీవనం, హిమాలయ ప్రాంతాల ప్రకృతి వర్ణన, వరూధినీ ప్రవరుల వాదోపవాదాలు గానీ, ఆమె దిగులు, ఆ తర్వాత ప్రకృతి వర్ణన, స్వరోచి మృగయా వినోదం గానీ, ఎవరు ఎంతగా వర్ణించి చెప్పినా, రసజ్ఞుడైన పాఠకుడు, స్వయంగా చదివి అనుభవించే ఆనందం ముందు దిగదుడుపే.

తొలి తెలుగు ప్రబంధంగా ఖ్యాతికెక్కిన మనుచరిత్ర నీతినీ, ధర్మాన్నీ, భర్తిని బోధించడం అంతకుముందు వచ్చిన తెలుగు రచనలు గమ్యం అయితే పెద్దన తన మనుచరిత్రతో తెలుగు సాహిత్యాన్నంతటినీ ఓ మలుపు తిప్పాడు. వాల్మీకి శోకం శ్లోకం ఐతే పెద్దన ఆనందం ప్రబంధమైంది.

సామాజిక స్థితిగతులు అసంతృప్తికరంగా ఉన్నప్పుడు, జీవితం దుఃఖభాజనంగా కనిపించినప్పుడు "సాహిత్య ప్రయోజనం సమాజ శ్రేయస్సు" అన్న దృష్టి సాహితీ కారులకు కలగడం చూశాం, ఇప్పుడు కూడా చూస్తున్నాం.

సుఖసంతోషాల్తో సౌభాగ్యంతో ఆకాశమంత ఆత్మ విశ్వాసంతో వున్న సమాజపు జీవనదృష్టిని ప్రతిబింబించేవి తొలితరం ప్రబంధాలు. వాటిలో మొట్టమొదటిది, ఉన్నతమైనదీ మనుచరిత్ర.

"వరణాద్వీపవతి తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం
బరమై సౌధసుధాప్రభా ధవళిత ప్రాలేయరుఙ్మండలీ
హరిణంబై అరుణాస్పందంబనగ ఆర్యావర్తదేశంబునన్
పురమొప్పున్ మహికంధహార తరళ స్ఫూర్తిన్ విడంబింపుచున్"

"ఆపురి బాయకుండు మకర్ధాక శశాంక మనోజ్ఞమూర్తి భా
షాపర శేషబోగి వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీ
క్షాపర తంత్రు జంబురుహ గర్భ కులాభరణం బనారత్లా
ధ్యాపన తప్పరుండు ప్రవరాఖ్యుడలేఖ్య తనూచి లాసుడై"

వంటి అనేక పద్యాలు మనుచరిత్ర ప్రాశస్యానికి పెద్దన కవితా శైలి నిదర్శనంగా పేర్కొనవచ్చును.

కావ్యారంభంలోనే పెద్దనగారు మనకు ప్రవరుని వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తారు. ప్రవరుని ఎంత అందగాడో, ఎంత ఐశ్వర్యవంతుడో అంతటి నిష్టా గరిష్టుడు. వేదవేదాంగ పురాణ సకలశాస్త్ర కోవిదుడు. మహా దాత. అన్నిటికీ మించి సంపూర్ణంగా వైరాగ్యాన్ని వంట పట్టించుకున్న గృహస్తు. ఇంక హిమాచలమో? సమస్త పౌరాణిక సంఘటనలకు ఆలవాలం. మహామహిమాన్వితు లైన మహర్షుల నివాసస్థలం. ప్రకృతి సౌందర్య నిలయం. వైరాగియైన ప్రవరునికి అవకాశం దొరకగానే అటువంటి ప్రదేశానికి వెళ్లాలనిపించడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

మరొక కారణం ఏమంటే "బుద్ధికర్మానుసారిణి మన ఆలోచనలు, ప్రవర్తన పరోక్షంగా మనకర్మను బట్టి వస్తాయి. ప్రవరుడు పరోక్షంగా మను వంశ సంభవానికి కారకుడయ్యాడు. అతని కోరిన వచ్చిన వరూధిని ప్రవరునిపై విరహం చేత మాయారూపంలో వచ్చిన గంధర్వునిచే స్వరోచిని కుమారునిగా పొందింది. ఈ స్వరోచికే మన కథానాయకుడు రెండవ మనువు అయిన స్వారోచిషుడు జన్మించాడు. ఇంత కథ జరగాలంటే ప్రవరుడు హిమాలయ వరాలకు వెళ్లక తప్పదు. విధిరాతను ఎవరూ తప్పించలేరు.

"స్వారోచిష మనుసంభవము" అనే ప్రబంధం ద్వారా తెలుగు భాషమతల్లి మకుటంలో కల్కితురాయిగా నిలిచాడు అల్లసాని పెద్దన. పెద్దనామాత్యుడు "మనుచరిత్రము"నే కాకుండా "హరికథాసారము" అనే ప్రబంధాన్ని కూడా రచించి తన గురువైన శఠకోపయతికి అంకితం చేశాడు. మార్కండేయ పురాణంలో ఉన్న "స్వారోచిష మనుసంభవం" అన్న కథను రాయాలవారే పెద్దనకు సూచించారు. "..... శవచ్ఛతుర రచన కనుకూలంబున్" ... "నీ రచనా స్వభావానికి ఈ కథ అనుకూలంగా ఉంటుంది" అని రాయాల సూచన. "మనుసంభవ మరయ రసమంచిత కథలన్ విననింపు" అనేది పై సూచనకి హేతువు. రసవంచిత్ కథలు ఉన్నాయి. నీది సరవద్రచన. కాబట్టి అనుకూలిస్తుంది అని రాయలవారి ప్రోత్సాహం. పెద్దన గారి ప్రత్యేకతలని చెబుతూ రాయలవారే -

"హితుడవు చతురవచోనిది
వతుల పురాణాగమేత హాస
కథార్థ స్మృతియుతుడ వాంధ్ర కవితా
పితా మహుడ వెవ్వరీడు పేర్కొన నీకున్
(మనుచరిత్ర - పీఠిక)

ఈ విధంగా పెద్దన గారి గూర్చి ఎంత చెప్పినా అతిశయోక్తి అనిపించకపోవడానికి ప్రధాన కారణం. అతని రచనా వైవిధ్యమే. పెద్దనకు పూర్వం తెలుగులో అంత ఖచ్చితమైన ప్రమాణాలతో రచింపబడిన కావ్యం లేదు. ప్రబంధ నియమాలన్నింటినీ పాటించి, రచించి, విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకున్న మొదటి ప్రబంధం మనుచరిత్రము. పెద్దన తర్వాత కవుల్లో కూడా మనుచరిత్రమును అనుకరించి రాయబడిన కావ్యాలే ఎక్కువ. అందుకే వాటి పిల్ల మనుచరిత్రలుగా పిలవడం మొదలైంది. మనచరిత్రను అనేకులు ఆదర్శంగా తీసుకొని రచించినప్పటికీ అందరూ పెద్దనను అనుకరించినవారే. మనుచరిత్రమును పెద్దన గారి "సకలోహ వైభవ సనాథము" అనవలసిందే.

కొద్దోగొప్పో సాహిత్యజ్ఞానం ఉన్నవారికి మనుచరిత్రంలోని చాలా పద్యాలు కథంతా ఉంటాయనేది అతిశయోక్తి కాదు. కథా సవిధానంలో గాని, పాత్ర చిత్రణలోగాని పద్యనిర్వహణలో గాని దీనికి సాటి ఐన గ్రంథం లేదని చెప్పడంలో కూడా అతిశయోక్తి లేదు. నభూతో నభవిష్యతి అనీ అనిపించుకున్న కావ్యం ఈ మనుచరిత్రము. ఇందులోని విశేషణాలన్నింటినీ ఎవరు ఎంతగా వర్ణించి, వివరించి చెప్పినా, రసజ్ఞుడైన పాఠకుడు స్వయంగా చదివి అనుభవించే ఆనందం ముందు దిగదుడుపే.

# జానపద కళారూపాలు – ప్రార్థన గీతాలు

- డా॥. శ్రీమంతుల దామోదర్, ప్రాజెక్టు అసిస్టెంట్, జానపద గిరిజన విజ్ఞాన పీఠం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్ కేంద్రం.

తెలుగు సంస్కృతి సంప్రదాయాలు జానపద కళా రూపాల మీదనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఇవన్నీ పురాణ, ఇతిహాసాలను నేపథ్యంగా తీసుకొని తమకు అనుగుణంగా, సామాజిక పరిస్థితులను బట్టి కళా రూపాలను మూలకథకు భంగం కల్గకుండా మార్పు చేసుకుంటూ జానపద కళారూపాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాయి.

ప్రతి కళారూపం ఆధ్యాత్మిక భావనలతోను, విజ్ఞాన వినోదాలతోను ప్రేక్షకుల్లా ఆనందానుభూతిలోకి తీసుకు వెళ్ళడవే వీటి ముఖ్యోద్దేశం. అలాంటి జానపద కళారూపాలు, సంప్రదాయ పరమైనవి, ఆశ్రిత పరమైనవి, వినోదపరమైనవి, మరియు ఇంద్రజాలపరమైనటువంటి వైవిధ్యభరితమైన అంశాలతో మనముందు ప్రదర్శిస్తారు. ప్రతి కళారూపం ప్రదర్శనకు ముందు దైవస్తుతిలో ప్రారంభమై మంగళహారతితో ముగింపు పలకడం వీరి భక్తి భావనకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఇలాంటి జానపద కళారూపాలు తెలుగు రాష్ట్రాల్లో నూటయాభైకి పైగా ఉన్నాయి. వీటిలో తెలంగాణా రాష్ట్రంలో ఆశ్రిత కళారూపాల సంఖ్య ఎక్కువ. ఇవన్నీ ధాతృకులం యొక్క కులపురాణాలను మాత్రమే ప్రదర్శిస్తారు. ఆ కులాల యొక్క సహాయ సహకారాలతో మనుగడ సాగిస్తున్నాయి. మరికొన్ని సంప్రదాయా కళారూపాలు అన్ని కులాలవారికి రామాయణ - భారత కథలను ప్రదర్శిస్తారు.

ఒగ్గుకథను కురుమ కులస్థులకు కాటమరాజు కథలతోపాటు ముప్పయి కథలను ప్రదర్శిస్తారు. వీరు ఒగ్గుడోలు, నపేరా, తాళాలు, కాళ్లగజ్జెలు, మద్దెల, హారోమనియం వంటి వాద్యాలను ఉపయోగిస్తారు. వేషధారణతో మగవారు స్త్రీ పాత్రలు పోషిస్తారు. ఈ కథకులు కథ ప్రారంభంలో

శరణు శరణు మాయంభారాణీ
శాంభావి రాణి శాంబావిరాణి (2)
కరుణచూడు కన్న తల్లీ గంగాభవానీ
గంగాభవానీ (2)
ముందు మాయాదులకు మూల దేవత
మూల దేవత
మందలోన నెలకొన్న మందచౌడమ్మ దేవి చౌదమ్మ
॥శరణు॥
గంగా వచ్చె చూడరమ్మా గాలి మేఘనా గాలి మేఘనా
తనువంత ముత్యాల పేరు బళ్ళంత మెరువా బళ్ళంత మెరువా
॥శరణు॥
అంబా.. గంగనిన్ను గొలిచేటి గణులెవ్వరమ్మా
గణులెవ్వరమ్మా
గణమైన మట్టివాడ గణుడు చెలికాడు
కాటమరాజు
॥ శరణు ॥

అంటూ గంగాదేవిని ప్రార్థిస్తారు.

గంగ అందరిని కరుణిస్తేనే లోకం సుభిక్షంగా ఉటుందనే నేపథ్యమే ఈ ప్రార్థన గీతం. వీరు కుల కథలతో పాటు ఇతర కథలు చెపుతారు.

గొల్లవారికి ఆశ్రితులుగా ఉంటూ కాటమరాజు కథలతోపాటు ముప్పయికి పైగా కథలను ప్రదర్శించే మందెచ్చులవారు. వీరినే "పొడపాత్రపు వారని" కూడ పిలుస్తారు. వీరు తెలంగాణలో వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నారు.

ఈ మందెచ్చుల కళాకారులు డోలు, నీపేరా, చేతికర్ర, మద్దెల, హార్మోనియం, కాళ్ళ గజ్జెలు, వాద్యాలు, మెడలో వెండి దండలు, చేతి పోంచి ధరించి ఉంటారు. వీరు కథలను నకాశి వారి చేత తయారు చేసిన బొమ్మలను చూపిస్తూ కథలను చెపుతారు.

కథ ప్రారంభంలో గంగ భవానీని స్తుతిస్తారు.

శరణు శరను మా కన్న తల్లి శంభావి రాణి
శంభావి రాణి
శరణు చూడు మాకన్నతల్లి గంగభవానీ
దేవి శబానీ

అంటూ కథను మొదలుపెడతారు.

పెద్దేవరను కొలిచే పూజారిగా వ్యవహరించే "దుబ్బుల వారు" అన్ని కులాలకు పెద్దేవరను (కనకదుర్గ) పూజిస్తారు. వీరి కొలుపును వారివారి ఇండ్లల్లో చేస్తారు. ప్రారంభంలో..

ధనం దాన్యం తల్లి బహుపుత్రలాభం
ముట్టింది ముత్యం తల్లి ఎములాడ రాజన్న
కొండగట్టు అంజన్న తిరుపతి ఎంకన్న
యాదగిరి నర్సింహస్వామి కనకదుర్గమ్మ
(.......... దబ్బుశబ్దం)
ఐలోని మల్లన్న ఊరి పోచమ్మ
ఏమ్మక్క సారలమ్మ.... (దుబ్బు శబ్దం)

అంటూ దేవతలందరిని స్తుతిస్తూ ఇంటివారిని చల్లగా చూడమని వేడుకుంటారు.

ఈ కళారూపం దుబ్బు వాద్యం, కాళ్లగజ్జెలతో ఒకరు, ఇద్దరు మాత్రమే ప్రదర్శన ఇస్తారు. దుబ్బు వాద్యం 'డమరకం' లాగా పెద్ద ఆకారంలో ఉంటుంది. దీనికి గజ్జెలు కట్టి పాదం మీద పెట్టుకొని వాయిస్తారు.

గౌడ జెట్టీలు - గౌండ్ల వారికి ఆశ్రితులుగా ఉంటూ గౌడ పురాణాన్ని పటం ఆధారంగా కథ చెపుతారు. వీరి చెప్పే కథ ప్రారంభంలో

"రక్షించు జనని మహంకాళీ
నీకు సేవ చేసెద గుణశాలీ ॥ రక్షించు ॥
జగదాంబ మమ్మేలు రావా
తల్లి జగములు సంవరించలేవా
జగదాంబ రక్షించు - జననీ నీ సత్కాల
భగవతీ నీపాటి .. బాలచెంద్రుడు లేడు ॥జగదాంబ॥

అంటూ జగదాంబను వేడుకుంటారు. వీరితో పాటు "ఏనోటి" వారు కూడా గౌడ వారికి పటం ద్వారా కుల పురాణాన్ని ప్రదర్శిస్తారు. వీరు కథ ప్రారంభంలో గణపతి స్తుతిస్తారు.

శుక్లాం భరధరం విష్ణుంశశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వధనం ద్యాయే సర్వవిగ్నాప శాంతయే
ఆగజానన పద్మార్కాం గజానన మహర్నిషం
అనేక దంతం భక్తానాం ఏకదంత ముపాశ్మాయ్
ఏకదంత ముపాశ్మాయే

అని విఘ్నాలు తొలిగే వినాయకుడిని ముందుగా తలచి కథను మొదలుపెడతారు. ఈ కళాకారులు నాటకం రూపంలో కూడా ఈ కథ చెపుతారు. దీనితో ప్రేక్షకుల ఆధారణ పెరిగిందని కళాకారులు సంతోషం వెలిబుచ్చుతున్నారు.

బేడ బుడిగె జంగం కులస్తులు చెప్పే 'శారదకథ'లో ప్రధాన కథకుడు 'శారద' అనే వాద్యాన్ని వాయిస్తూ కథ చెప్తుంటే ఇరువైపుల ఒక్కొక్కరు బుర్ర వాయిస్తూ వంత పాడుతారు. వీరు చారిత్రక కథలు, బొబ్బిలి పులి, బల్గురు కొండయ్య కథ, సర్వాయి పాప్న కథలతోపాటు దేవతల కథలను చెపుతారు. వీరు కథ ప్రారంభంలో సరస్వతి దేవిని స్తుతిస్తూ

అంబా పరాకు దేవి పరాకు
మమ్మెలు శారద పరాకు.
అంబా మమ్ము బ్రోలు చక్కని శారదాంబ పరాకు
హరి రామ రామయ్య రామరామయ్యా ॥రామా రామా॥

అంటూ పాడే కథలు, దినకార్యాలకు, వివిధ సందర్భాలలో కథలు చెపుతారు. వీరికి బహు భార్యత్వంతో ఇద్దరు భార్యలు భర్త కలిసి ఒక బృందంగా ఉంటారు.

పూర్వం ఈత ఆకులతో చాపలు అల్లుఉంటూ ఊరురు, ఇల్లిల్లు తిరుగుకుంటూ పాటలు పాడుతుండేవారు.

బైండ్ల కళారూపం గ్రామదేవతల ఉత్సవాల్లో ప్రతిష్టలో వీర ప్రదర్శన ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. వీరు కథలో అమ్మవారిని స్తుతించే విధానం ...

"తల్లి నిన్ను కొలిచి దండములు పెట్టి కరమెత్తి మొక్కెదా
నా కన్నతల్లి అవని లోపల జనుల అంబవే తల్లి
భవనీల పాలిట ఓ కల్పవల్లి
గవ్వదర్శనాలు ఘనంగా ధరియించి
ముప్పొద్దు పూజలు చేసేము తల్లీ
గుగ్గిలము మైసూచి కుప్పగా పొగలేపి
తలిచితిమి మదిలోన తల్లి మాయమ్మ
సుతులు జమిడికాలు సుందరముగా వాయింయి
కాళ్ల గజ్జెలు కట్టి ఘల్లున మోగించి
ఆడితి నీ ముందు అంబవో తల్లీ
ఇల్లిల్లు నీ పూజ ఇష్టంగా చేసి
జగన్మాత నిన్ను జగమెల్ల గొలిచేరు
కోపగించకు తల్లి ఓ పజాలమ్మ
బగ్గుబగ్గున మండి బొబ్బలు లేపి
కష్టపెకు మమ్ము ఓకన్న తల్లి
కొత్త కుండల కల్లు సాకలు నీకు
గడపగడపకు నీకు కలివేపరిల్లలు
ఆపదలు బాపేటి అమ్మలకు అమ్మ
శాంతింపు మా తల్లి జగమేలే తల్లి
కోపగించేడి వేళ కోడి పుంజులు బలిబలి
గొర్రె పోతులు బలిబలి
శాంతింపు శాంతింపు ఓ జగన్మాత
బవనీల ఇలవేల్పు భార్గవి అంబా
దండాలు దండాలు చండికా"

అంటూ ఎంతో ఆవేశంతో దేవత యొక్క మొక్కు బడులు, దేవతను శాంతింపచేసే చర్యలు ఈ ప్రార్థనలో కనబడుతుంది.

వీరు జమిడిక అనే వాద్యం వాయిస్తూ కథ చెపుతుంటే వంతలు ఒకరు లేదా ఇద్దరు ఉంటారు.

తోటి గిరిజనులు గిరిజన ప్రాంతమైన ఆదిలాబాద్ నుండి వరంగల్, కరీంనగర్ వలస వచ్చిన వీరు నాయక పోడు గిరిజనులకు పద్మనాయక వృత్తాంతం అనే కథను ప్రదర్శించేటప్పుడు కథ ప్రారంభంలో..

'గణేశ నిన్ను వేడితిమి
గణింపకు మాదు దోషముల్
పార్వతి తనయుడ వనుచూ
ప్రార్థనల్ బాగుగా చేసితిమి ॥గణేషా॥
ఉండ్రాళ్ళను బ్రోలినటువంటి
ఉండ్రాళ్లను చేసి పెటితిమి ॥గణేషా॥
మూషికా వాహనుడవయ్యా
ముందుగా ఇటుకు రావయ్యా ॥గణేషా॥
ఏనుగు తొండము నెత్తి
వేగమే దీవనలోసగుమా ॥గణేషా॥

అంటూ వినాయకుడిని స్తుతించి కథ ప్రారంభిస్తారు. వీరు పటం ఆధారంగా కథ చెప్తారు. దీనితోపాటు రామాయణ భారత కథలను కోకిరి (బుర్ర) వాద్యంలో కథలు చెప్పడంలో కూడా వీరు నేర్పరులు.

"చిరుతల రామాయణం" తెలంగాణ గ్రామగ్రామాన వెలసిన భజన సంప్రదాయానికి చెందిన కళారూపం. ఇందులో పదిహేను మందికి తక్కువ కాకుండా, దొతి, అంగి, నడుముకు తువ్వాల నెత్తికి రుమాలు, చుట్టుకొని చిరుతలు పట్టుకొని కాళ్లకు గజ్జెలతో, ఒక రకమైన లయతో అడుగులు వేస్తూ గుండ్రంగా నిలబడి రామాయణాన్ని ఆలపిస్తారు. ఏ పాత్రకు అనుగుణంగా ఆ పాత్రధారి వేషధారణతో మధ్యలో నిలబడి తన పాత్రను పోషించడం కన్నులకు ఆనందాన్ని ఇస్తాయి. ఈ ప్రాంతంలో ఆయా పాత్రలు ధరించేవారు. సమాజంలో పాత్రల పేర్లతో వారిని పిలువడం అంటే ఆ పాత్రలో ఎలా జీవించారో మనకు అర్థం అవుతుంది.

Bhavaveena
Vol. 18, Issue. 7, July - 2021.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
Under Arts and Humanities Category

# శ్రీ మహాభాగవతం - సింగన అర్థాలంకార సౌందర్యం

**డా. జి. శ్రీనివాసరావు,** ఎం.ఏ, ఎం.ఫిల్, పిహెచ్.డి. అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా.

**1. ఉపోద్ఘాతం :** ఏర్చూరి సింగన గారు శ్రీమహాభాగవతంలోని షష్ఠస్కంధాన్ని రచించారు. 529 గద్యపద్యాలలో వీలైనంత వరకూ తరచుగానే అలంకారాలను ప్రయోగించడం జరిగింది. సంఖ్యలో తక్కువైనా అత్యంత చక్కని అలంకారాలను సృజించడం చూడవచ్చు.

**2. విషయ వివరణ :** ఏర్చూరి సింగనగారు భాగవతం షష్ఠ స్కంధంలో కథా సందర్భానికి అనుగుణంగా చక్కటి అర్థాలంకారాలను ప్రయోగించారు. వాటిని సమీక్షించుదాం.

**1. ఉపమ**

**ఆరయ వీర్యవంతమగు నౌషధమెట్లు యదృచ్ఛ గొన్నద**
**చ్చారు గుణంబు రోగములు జయ్యను బాపిన మాడ్కి బుణ్య వి**
**స్ఫారుని నంబుజోదరుని బామరు డజ్ఞుడవజ్ఞ బల్కినన్**
**వారక తత్‌ప్రభావము ధ్రువంబుగ నాత్మ గుణంబు జూపదే!** (భాగ. 6-125)

శక్తివంతమైన ఔషధమును తెలిసి త్రాగినా, తెలియక త్రాగినా అది తత్సంబంధమైన రోగమును మాన్పినట్లు శ్రీమన్నారాయణుని స్మరణను తెలిసి చేసినా తెలియక చేసినా దాని ప్రభావాన్ని చూపుతుంది. (పాపాలను తొలగిస్తుంది.)

అజామిళుడు జీవితాంతం అసంఖ్యాక పాపకృత్యములు ఆచరించినా మరణ సమయంలో చిన్నకొడుకు మీది ప్రేమతో 'నారాయణ' నామాన్ని మూడు మార్లు పలికినంతనే జీవితంలో చేసిన పాపాలన్నీ తొలగి వైకుంఠానికి తీసుకుపోబడునంతటి పుణ్యాన్ని సంపాదించినట్లయ్యెను. ఈ నారాయణ నామ స్మరణ ప్రభావాన్ని ఔషధ ప్రభావంతో పోల్చి చెప్పడం రమణీయంగా ఉంది. ఔషధం గూర్చి వివరాలు తెలియక పోయినా అది దాని ప్రభావాన్నిచూపినట్లు నారాయణ నామ మహిమ తెలియక పోయినా ఉచ్చరిస్తే అది చేయాల్సిన పని చేస్తుంది.

చక్కని ఉపమానం ద్వారా విషయాన్ని అందంగా సులభంగా అర్థం చేసుకొనేలాగా చెప్పారు సింగనగారు.

**సదృశోపమ**

ఉపమేయాన్ని ఒక ప్రత్యేక ఉపమానంతోనే పోల్చదగును అని చెపబడితే అది సదృశోపమ.

సింగన గారు వారి తల్లిని గూర్చి చెబుతూ

**ఆడదు భర్తమాటకెదురాడదు వచ్చినవారి వీడగా**
**నాడదు పెక్కు భాషలెడనాడదు వాకిలి వెళ్ళి కల్లమా**
**టాడదు మిన్నలేని సుగుణావళికిందిరగాక సాటి యే**
**చేడియ లేదు చూరికుల శేఖరుకన్నయ ముమ్మడమ్మకున్** (భాగ. 6-27)

ముమ్మడమ్మకు ఇందిరగాక సాటి యే చేడియ లేదని ఆమెను ఒక్క లక్ష్మీదేవితోనే పోల్చాలి. ఎంకెవ్వరితోను పోల్చకూడదు అనడం సదృశోపమ.

ముమ్మడమ్మ (తల్లి) లక్షణాలని చెప్పకుండానే సింగన తల్లిని లక్ష్మీదేవితో పోల్చడం వల్ల లక్ష్మీదేవికున్న శుభలక్షణాలన్నీ తన తల్లికున్నట్లు చెప్పినట్లయినది.

**మాలోపమ**

**మెఱయ యంత్రమయంబైన మృగము భంగి**

**దారు నిర్మితమైనట్టి తరుణి పోల్కి**
**శక్ర యెఱుగుము ఈ భూతజాలమెల్ల**
**దళిత పంకేరుహాక్షు తంత్రంబు గాగ**
(భాగ. 6-415)

వత్రాసురుడు తనతో యుద్ధం చేస్తున్న ఇంద్రునితో అంటున్న మాటలివి. యంత్రం దాన్ని నడిపే వ్యక్తి ఎలా పని చేయిస్తే అలాగే పని చేస్తుంది. చెక్కతో చేసిన బొమ్మ ఎలా కదిపితే అలా కదులుతుంది. అలాగే శ్రీమహావిష్ణువు ఎలా నడిపిస్తే ఈ ప్రాణులన్నీ అలా నడుస్తాయి. విష్ణువు సంకల్పం మేరకు ప్రాణులన్నీ పనిచేయడం ఉపమేయం. దీనికి యంత్రం, చెక్కబొమ్మ అనే రెండు ఉపమానాలు చెప్పబడ్డాయి కావున ఇది మాలోపమ.

**2.ఉత్ప్రేక్ష**

**భర్మాచలేంద్రప్రపాత ద్వయంబును**
**గలిగిన నీలంపు గనులనంగ**
**మొనసి తార్క్ష్యుని యిరు మూపుపై**
**నిడినట్టి పదముల కాంతులు పరిఢవింప....**
(భాగ. 6-218)

శ్రీమహావిష్ణువు పాదాలు నీలంపు గనులేమో అనునట్లుగా ఉన్నాయనడం ఉత్ప్రేక్ష. శ్రీహరి పాదాలు మరింత నీలంగా ఉన్నాయని దీని ద్వారా తెలుస్తుంది.

**3.రూపకం**

**వరయోగి మానసాంత:**
**కరణ సుధాంభోధి భావ కల్లోల లస**
**త్పరతత్త్వ శేషశాయికి**
**జిరదాయికి సకలభక్త చింతామణికిన్**
(భాగ. 6-36)

శ్రీకృష్ణునికి ఏర్చూరి సింగన తన భాగవత షష్ఠస్కంధ భాగాన్ని అంకితమిస్తూ చెప్పిన పద్యమిది.

కృష్ణుడు యోగి హృదయమనే పాల కడలిలో పరతత్త్వభావములనే ఆదిశేషునిపై శయనించే వాడని అంటాడు. ఇక్కడ యోగి హృదయానికి, పాల సముద్రానికి మరియు పరతత్త్వభావాలకు ఆదిశేషునికి అభేదం చెప్పబడింది కనుక ఇది రూపకం.

శ్రీకృష్ణుడు వైకుంఠంలో కన్నా భక్తుల హృదయాలలోనే ఉంటాడనడానికి ఇది ప్రబల తార్కాణం.

**మాలారూపకం**

**బ్రహ్మహత్యానేక పాపాటవులకగ్ని**
**కీలలు హరినామ కీర్తనములు**
**గురుతల్ప కల్మష క్రూర సర్పములకు**
**గేకులు హరినామ కీర్తనములు.**
**తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య**
**కిరణముల్ హరినామ కీర్తనములు**
**మధుపాన కిల్బిష మదనాగ సమితికి**
**గేసరుల్ హరినామ కీర్తనములు**
**మహిత యోగోగ్ర నిత్య సమాధి విధుల**
**నలరు బ్రహ్మాది సురులకు నందరాని**
**భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య**
**ఖేలనంబులు హరినామ కీర్తనములు**
(భాగ. 6-117)

శ్రీహరి నామకీర్తనములు ఎంత మహిమ కలవో ఈ మాలారూపకాలంకారం ద్వారా తెలుస్తుంది. హరినామ కీర్తనములు అనేవి బ్రహ్మ హత్యాది పాపాలు అనే అడవులకు అగ్ని జ్వాలలు కల్మషములనే క్రూరసర్పములకు నెమళ్ళు, చౌర్యమనే చీకటికి సూర్యకిరణాలు, మధుపానమనే ఏనుగులకు సింహాలు అని చెప్పబడింది కాబట్టి ఇది మాలా రూపకం.

**4. స్వభావోక్తి**

**కుంకుమ రాగ రమ్యకుచ కుంభములన్ గడు కజ్జలంబుతో**
**బంకిలమైన బాష్పములు బాల్పడ**
**మజ్జనమాచరింపుచున్**
**కంకణ పాణి పల్లవ యుగంబున వక్షము**
**మోదికొంచు నా పంకరుహాక్షి యేడ్చె బరిభావిత**
**పంచమ సుస్వరంబునన్** (భాగ. 6-451)

చిత్రకేతుని భార్య అయిన కృతద్యుతి తన కొడుకు మరణించినపుడు ఏడుస్తున్న దృశ్యాన్ని వర్ణించిన పద్యమిది. కన్నీరు కంటికాటుకతో కలసి, కుంకుమ రాగ శోభితమైన పాలిండ్లను తడువుచుండగా, కంకణములు మ్రోయుచుండగా... చేతులతో వక్షస్థలాన్ని బాదుకొంటూ ఆమె పంచమ స్వరంలో ఏడ్చిందని వర్ణించడం సింగనగారి ఊహా శక్తికి చక్కని నిదర్శనం. కృతద్యుతి సహజస్థితిని మనోహరంగా వర్ణించడం చేత ఇది స్వభావోక్తి.

అల్లసాని వారి వరూధిని, తిమ్మనగారి సత్యభామ, రామరాజ భూషణుని గిరిక, ఏర్చూరి సింగన గారి కృతద్యుతి ఏడ్పును అనుకరించారేమో అనిపిస్తుంది.

**5. అతిశయోక్తి**

**కూడె జగంబులన్నియును గ్రుంకిరి సూర్య సుధాంశులద్రులూ**
**టాడె నభస్థ్సలం బగిలె నంబుధులింకె నుడుగ్రహాళి ప**
**ట్టూడెవడిం దిశల్వగిలె నుర్వర గ్రుంగె నజాండ ఖాండ మ**
**ల్లాడె విధాత బెగ్గడిలె నార్చుచు వృత్రుడు బొబ్బ వెట్టినన్** (భాగ. 6-384)

దేవదానవ యుద్ధం జరిగేటప్పుడు వృత్రాసురుడు కేకపెడితే లోకాలన్నీ కలిశాయి, సూర్యచంద్రులు క్రుంకిరి, ఆకాశం పగిలింది, సముద్రాలు ఇంకిపోయాయి, గ్రహరాశులు స్థితి తప్పాయి, దిక్కులు పగిలాయి, భూమి క్రుంగింది, బ్రహ్మాండము అల్లాడింది. బ్రహ్మ భయపడ్డాడు. అనే వర్ణన వృత్రుని శక్తిని అతిశయించి చెప్పినట్లుంది కావున ఇది అతిశయోక్తి.

**6. అర్థాంతరన్యాస**

**అఖిలమెఱిగిన కశ్యపునంతవాని**
**హితవు తలకెక్కురతుల సంగతుల చేత**
**నవశు గావించె వ్రేల్మిడి నబ్జవదన**
**పతుల భ్రమియింప నేరని సతులు గలరె?**

(భాగ. 6-511)

నిత్యం తపమాచరించు కశ్యపప్రజాపతిని గూడా తన భార్య స్థితి మోహింపజేసి హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను పుత్రులుగా పొందినది. ఇది విశేషం. దీనిని భర్తలను భ్రమింపచేయనేరని భార్యలుంటారా అనే సామాన్య విషయంతో సమర్థించడం జరిగింది కావున ఇది అర్థాంతర న్యాసం.

**7. దీపక**

**కూలినచోటు గొట్టుపడి కుందినచోట, మహాజ్వరాదులం**
**బ్రేలిన చోట, సర్పముఖ పీడల నందినచోట, నార్తులై**
**తూలిన చోట విష్ణు భవదూరుని బేర్కొనిరేని మీద న**
**క్కాలునియాతనా వితతు గానరు పూనరు దుఃఖభావముల్** (భాగ. 6-122)

అజామిళుడు నారాయణ నామాన్ని మరణ సమయంలో స్మరించాడు. నారాయణ నామస్మరణ ముందు యముడు కూడా తలవంచక తప్పలేదు. ఇది ప్రకృత కథా సందర్భం. నారాయణ నామస్మరణ మహిమను ధ్రువ పరచుటకు మరికొన్ని అప్రకృత విషయాలు చెప్పబడ్డాయి. అవి కూలిన చోట, కొట్టుపడి కుందిన చోట, మహాజ్వరాలతో ప్రేలినచోట, సర్పముఖ పీడల నందినచోట కూడా నారాయణ నామస్మరణ వలన యమబాధలు ఎవరూ పడరు. ప్రకృతానికి అప్రకృతానికి ఏకాన్వయం చేయబడింది కావున ఇది దీపకం. ఈ దీపకం ద్వారా ఒక్క అజామిళుడి సమస్యకే కాదు నారాయణ నామస్మరణ అనేక సమస్యలకు ఔషధం అని తెలుస్తుంది.

**8. నిదర్శనం**

**.......కృపాస్పదుని గురుని**
**మాని యన్యుని సేవింప బూనునట్టి**
**కపటశీలుని నతి పాపకర్మబుద్ధి**
**శునక వాలంబు పట్టుక ఘనతరాబ్ధి**
**దరి జూచుట గాదె! తా దామసమున**

(భాగ 6-327)

వృత్రాసురునికి భయపడి దేవతలు వైకుంఠానికి వెళ్ళి విష్ణుని ప్రార్థించే పద్యమిది.

భగవంతుని మాని అన్యుని సేవించడం కుక్కతోక పట్టుకొని సముద్రాన్ని దాటటం వంటిది. నిదర్శనంలో రెండు వాక్యాలు పరస్పరం సాపేక్షములై బింబ ప్రతిబింబ భావంతో ఉంటాయి. కావున ఈ పద్యములో ఉన్నది నిదర్శనం. భగంతునిపై నమ్మకం లేకుండా ఇతరుల్ని ఆశ్రయించడం వలన లక్ష్యాన్ని చేరలేక ప్రమాదంలో పడతారనడానికి ఈ పద్యం చక్కని ఉదాహరణ..

**9.సహోక్తి**

**అరయమాతేజములతోడ నాయుధములు**
**మ్రింగి భువనత్రయంబును మ్రింగుచున్న**
**భీకరాకారు వృత్రుని బిచమణుచి**
**యెల్ల భంగుల మాభంగ మీుగు మభవ**

(భాగ. 6-341)

దేవతలు వృత్రాసురుని గూర్చి చెబుతు అతడు దేవతల తేజాలతో పాటు ఆయుధములను మరియు త్రిభువనములను మ్రింగుచున్నాడని చెప్పబడింది. రెండుగాని అంతకంటే ఎక్కువగాని ప్రకృత విషయాలు ఏక కాలంలో జరగడం సహోక్తి. కావున ఈ పద్యంలో ఉన్నది సహోక్తి,

**10.సార**

**ఉర్వరు గల రేణువుల కన్న దట్టమై**
**కడునొప్పు జీవ సంఘములు గలవు**
**ఆ జీవములలోన నరయ ధర్మాయత**
**మతివసించిన వారు మనుజ జాతి**
**యా మనుష్యులలోను గామంబు లెడబాసి**
**మోక్షార్థులగువారు మొదల నరిది**
**మోక్షమార్గంబాత్మమూలంబుగానుండు**
**వారిలో ముక్తులు లేరు తఱచు**
**ముక్తులైనట్టి వారిలో యుక్తి దలుప**
**జాల దుర్లభుడమిత ప్రశాంతిపరుడు.**
**పరమ సుజ్ఞానినిరతుండు భద్రగుణుడు**
**రమణ శ్రీవాసుదేవ పరాయణుండు**

(భాగ 6-441)

మట్టి రేణువులకన్న జీవులు, జీవులలో మనుష్యులు, మనుష్యులలో మోక్షార్థులు, వీరందరికన్నా విష్ణుభక్తులు గొప్పవారని ఒకరికంటే ఒక ఉత్కర్ష చెప్పబడింది. కావున ఇది సారాలంకారము. అందరికన్న విష్ణుభక్తుడు గొప్పవాడనేది సారాంశం.

**3. ముగింపు :** ఏర్చూరి సింగనగారు భాగవతములోని ఆరవ స్కంధాన్ని మాత్రమే తెనిగించినప్పటికీ తాను ప్రయోగించిన అలంకారాలు కథా సందర్భానికి మనోహరమైన శోభను చేకూర్చుతున్నాయి.

**ఆధార గ్రంథాలు**

1. భాగవతవైజయంతిక. 1983. కరుణశ్రీ (సంపాదకుడు)
2. శ్రీమహాభాగవతము. 1994. బమ్మెర పోతన (ఏడవ ముద్రణ)

★★★

BHAVAVEENA
Vol. 18, Issue. 7, July 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Temples in the Social Formation of A Settlement - Case Study

*- Dr. Sebastian Joseph & - Nisha Ann Jacob*

**Abstract :**

